

'సామాన్యులకు వైద్యం
ఏనాడూ ఖరీదుగా ఉండకూడదు.
అందుకే అందరికీ ఆరోగ్యశ్రీ'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 | వెల: ₹ 5.50 | సంపుటి: 15 | సంచిక: 345

మంగళవారం 7-3-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



రైతమ్మలకు జేజేలు

రసాయనాల్లేని ఆహారమే ఆరోగ్యమని నమ్మిన మహిళా రైతులు -11లో



మేమే మా ధైర్యం

ముంబైలోని స్కూళ్లలో ఆడపిల్లలకు ఆత్మరక్షణ విద్యలు నేర్పుతున్న ఇపితా. -11లో



మా నాన్న పెళ్లి ఆపండి

తమ తండ్రి రెండో పెళ్లి చేసుకుంటున్నాడని, తామంతా దిక్కులేనివారమవుతామని బిహార్‌లో ఓ బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

వివరాలు 6లో ▸



బాలికల విద్యపై విషం

ఇరాన్‌లో 50కి పైగా స్కూళ్లలో విద్యార్థినులను లక్ష్యంగా చేసుకొని విష వాయువులు ప్రయోగించడం కలకలం రేపింది.

వివరాలు 6లో ▸



తండ్రే లైంగికంగా వేధించాడు

తనకు ఎనిమిదేళ్ల వయసు ఉన్నప్పుడు కన్నతండ్రే తనను లైంగిక వేధింపులకు గురిచేశాడని సినీ నటి ఖుష్బూ తెలిపారు.

వివరాలు 6లో ▸

మహిళలకు వడ్డీ లేని రుణాలు

మహిళా స్వయంసహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల నిమిత్తం 750 కోట్లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది.

వివరాలు 14లో ▸



న్యూస్‌రీల్

ముందు మా ప్రాజెక్టులకు అనుమతివ్వండి!



తెలంగాణలో నిర్మిస్తున్న పెండింగ్ ప్రాజెక్టులకు ముందుగా అనుమతులు జారీ చేయాలని, ఆ తర్వాత మిగులు జలాల ఆధారంగా గోదావరి–కావేరి నదుల అనుసంధానం ప్రాజెక్టును చేపట్టాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరింది.

- వివరాలు 14లో▶

నలుగురికి గుండెపోటు



రాష్ట్రంలో గుండెపోటు మరణాలు బెంబేలెత్తిస్తున్నాయి. సోమవారం నిజామాబాద్, మెదక్, కామారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో నలుగురు గుండెపోటుతో మరణించారు.

- వివరాలు 3లో▶

నాలుగు నెలలని.. వారంలోనే ముగింపా?

ఈపీఎఫ్ఓ అధిక పెన్షన్ దరఖాస్తు ప్రక్రియపై సీనియర్ల తీవ్ర ఆగ్రహం

వారంలోనే స్వీకరణ ఆపేయడంపై మండిపడుతున్న పెన్షనర్లు

- వివరాలు 2లో▶

వేధిస్తే ఉక్కుపాదమే!

విద్యార్థులను వేధించే కాలేజీలు, లెక్చరర్లపై కఠిన చర్యలు ఉంటాయని ప్రభుత్వం హెచ్చరిక

- నార్సింగి శ్రీచైతన్య కాలేజీ గుర్తింపు రద్దు.. ఇక కొత్త అడ్మిషన్లు బంద్
- అలాంటి లెక్చరర్లు రాష్ట్రంలో ఎక్కడా బోధించకుండా వేటు
- సాత్విక్ ఆత్మహత్యే చివరిది కావాలి.. మళ్లీ ఇలాంటివి జరిగితే సహించం
- వ్యాపార ధోరణే లేకుంటే ఈ పరిస్థితి వచ్చేదా?.. ఇకపై కాలేజీలు ఇచ్చే ప్రకటనలపైనా పరిశీలన.. స్టడీ అవర్స్ పేరిట వేధించే విధానాలకు స్వస్తి..
- త్వరలో మార్గదర్శకాలు ఇస్తామన్న కాలేజీ విద్య కమిషనర్ నవీన్ మిత్తల్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యార్థులను వేధింపులకు గురిచేసే ప్రైవేటు కాలేజీలు, అధ్యాపకులపై ఉక్కుపాదం మోపుతామని ప్రభుత్వం హెచ్చరించింది. విద్యార్థుల పట్ల అసభ్యంగా, అవమానకరంగా ప్రవర్తించడం, శారీరకంగా హింసించడం వంటివి చేసే లెక్చరర్‌ను రాష్ట్రంలోని ఏ కాలేజీలోనూ బోధించకుండా అనర్హుడిగా ప్రకటిస్తామని స్పష్టం చేసింది. రాష్ట్రంలో ఇటీవల జరిగిన విద్యార్థుల ఆత్మహత్య ఘటనల నేపథ్యంలో.. సోమవారం ప్రైవేటు జూనియర్ కాలేజీల యాజమాన్యాలతో విద్యాశాఖ ఉన్నతాధికారులు సమీక్షించారు. కాలేజీ విద్య కమిషనర్ నవీన్ మిత్తల్, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, తెలంగాణ ప్రైవేటు జూనియర్ కాలేజీల యాజమాన్య సంఘం అధ్యక్షుడు గౌరీ సతీశ్‌తోపాటు 14 కాలేజీల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు

మిగతా 2వ పేజీలో ▶

గీత దాటితే వేటే..

ప్రైవేటు కాలేజీలకు నిబంధనల ఉల్లంఘన అలవాటుగా మారిందని.. విద్యార్థుల ప్రవేశాలు ఒకచోట, వారి బోధన వేరేచోట ఉండటం ఏమిటని నవీన్ మిత్తల్ ప్రశ్నించారు. ఇక మీద ఇలా చేస్తే ట్రెస్‌పాస్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతి కాలేజీలో బయోమెట్రిక్ హాజరు అమలు చేయాల్సిందేనని, కాలేజీల్లో బోధించే అధ్యాపకుల నాణ్యత ఏమిటో దీనితో తెలుస్తుందని పేర్కొన్నారు. ఇంటర్ బోర్డు పనీపాటా లేకుండా సమావేశాలు పెడుతుందనే భ్రమల నుంచి కార్పొరేట్ కాలేజీలు బయటపడాలని.. ఇక మీద ఎప్పుడు మీటింగ్‌కు పిలిచినా కాలేజీల ప్రిన్సిపాళ్లు మాత్రమే సమావేశానికి రావాలని తేల్చిచెప్పారు. విద్యార్థులను ఆకట్టుకునేందుకు ప్రైవేటు కాలేజీలు ఇస్తున్న ప్రకటనలపైనా ఇక నుంచి పరిశీలన ఉంటుందని తెలిపారు. ర్యాంకు వచ్చిన విద్యార్థిని మూడు చోట్ల చూపించి గొప్పలు చెప్పుకునే విధానాలకు స్వస్తి పలికేలా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

ఇక యాజమాన్యాలదే బాధ్యత

విద్యార్థుల ఆత్మహత్యల అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. చదువు కోసం వచ్చే పిల్లలు తనువు చాలిస్తుంటే తప్పెవరిది? వ్యాపార ధోరణే ధ్యేయంగా పనిచేసే సంస్థలు విద్యార్థులను పట్టించుకుంటే ఈ పరిస్థితి వచ్చేదా? ఏ ఒక్క విద్యార్థి ఒత్తిడికి గురై ప్రాణాలు కోల్పోయినా ఊరుకోవద్దని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనికి యాజమాన్యాలే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

- నవీన్ మిత్తల్, కాలేజీ విద్య కమిషనర్

తరగతి గదిలోనే ఉరివేసుకుని..

- గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న నాగిళ్ల బుచ్చి రాములు కూతురు నిఖిత(12) క్లాస్ రూమ్‌లోనే ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది.

- వివరాలు 2లో▶

అసలేం జరిగిందో చెప్పాలి?

- రక్తం శుద్ధి చేశాకే రక్తనమూనాలు తీసుకున్నారు
- అందుకే అందులో విషం లేదని రిపోర్టులు వస్తున్నాయి.. మా కూతురిది ముమ్మాటికీ హత్యే
- మీడియాతో వైద్య విద్యార్థిని ప్రీతి తల్లిదండ్రులు
- శాంతిభద్రతల అదనపు డీజీ సంజయ్ జైన్‌ను కలసి వినతిపత్రం అందజేత -3లో▶



ప్రీతి కేసు ఎటువైపు?

- ఎఫ్ఎస్ఎల్ నివేదిక వస్తేనే స్పష్టత -3లో

కొంగర కలాన్‌లోనే 'ఫాక్స్‌కాన్'

సీఎం కేసీఆర్‌కు ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్ ల్యూ లేఖ

- సాధ్యమైనంత త్వరగా తయారీ కేంద్రం పనులు ప్రారంభిస్తాం
- మీ పూర్తి సహాయ సహకారాలు కోరుతున్నా
- రాష్ట్ర పర్యటనలో తమకు అద్భుత ఆతిథ్యం లభించిందని కితాబు
- తన వ్యక్తిగత అతిథిగా తైవాన్‌ను సందర్శించాలని ఆహ్వానం



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల సంస్థ ఫాక్స్‌కాన్ టెక్నాలజీ గ్రూప్ తన తయారీ కేంద్రాన్ని హైదరాబాద్‌లోని కొంగరకలాన్‌లోనే ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ చైర్మన్ యంగ్ ల్యూ స్వయంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు లేఖ రాశారు. దీంతో రాష్ట్రంలో ఆ పరిశ్రమ ఏర్పాటుపై తలెత్తిన అనుమానాలకు తెరపడింది. ఈ నెల 2న ఫాక్స్‌కాన్ చైర్మన్ యంగ్ ల్యూ బృందం ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌తోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులతో భేటీ అయ్యారు. ఆ తరువాత బెంగళూరు వెళ్లి కర్ణాటక సీఎం బస్వరాజ్ బొమ్మైని సైతం కలిశారు. అనంతరం లక్ష ఉద్యోగాలు కల్పించేలా ఫాక్స్‌కాన్ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో రాష్ట్రంలో ఆ సంస్థ ఏర్పాటుపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే వాటికి సమాధానంగా అన్నట్లు ఫాక్స్‌కాన్ చైర్మన్ ముఖ్యమంత్రికి లేఖ రాశారు.

మీ సంపూర్ణ మద్దతు కోరుతున్నా..

'మేము వీలైనంత త్వరలో కొంగరకలాన్‌లో మా సంస్థ ఉత్పత్తిని ప్రారంభిస్తాం. అందుకు మీ సంపూర్ణ మద్దతు కోరుతున్నా. హైదరాబాద్ పర్యటనలో అద్భుతమైన సమయాన్ని గడిపాం. మీ ఆతిథ్యం మమ్మల్ని బాగా ఆకట్టుకుంది. నా పుట్టిన రోజున స్వదస్తూరితో మీరు గ్రీటింగ్ కార్డు ఇవ్వడం వ్యక్తిగతంగా

మిగతా 2వ పేజీలో ▶

ప్రియురాలు, స్నేహితుడు తోడుగానే!

ఇంజనీరింగ్ విద్యార్థి నవీన్ హత్య కేసులో కొత్త కోణం

నిందితుడు హరిహరకృష్ణకు సహకరించిన నిహారిక, హసన్ అరెస్టు

- హత్య జరిగిన స్థలానికి వెళ్లి చూసిన నిహారిక
- ఖర్చుల కోసం నిందితుడికి రూ.1,500 ట్రాన్స్‌ఫర్ చేసిన తీరు
- శరీర భాగాలు, ఇతర ఆధారాలను కాల్చేయడానికి హసన్ తోడ్పాటు
- ఘటన తర్వాత ఆ ఇద్దరి ఇళ్లకూ వెళ్లిన హరిహరకృష్ణ.. అంతా కలిసి వాట్సాప్ చాటింగ్.. లొంగిపోయే ముందు మొత్తం డిలీట్
- పోలీసులకు లొంగిపోయినా కోర్టులో నేరం రుజువుకాకుండా ప్లాన్
- ఓ సినిమా, యూట్యూబ్ వీడియోలు చూసి ఆధారాల ధ్వంసం
- కేసు దర్యాప్తులో సంచలన అంశాలను గుర్తించిన పోలీసులు



పోలీసుల అదుపులో నిందితురాలు నిహారిక

- వివరాలు 3లో▶

హిందూ, ముస్లింల మధ్య పంచాయితీకి కుట్ర

ఆరునెలలు అప్రమత్తంగా ఉండాలన్న కేటీఆర్


- ఆ ట్రాప్‌లో ఎవరూ పడొద్దని విజ్ఞప్తి
- సిరిసిల్ల జిల్లాలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి



సిరిసిల్ల: హిందూ, ముస్లింల మధ్య పంచాయితీ పెట్టేందుకు కుట్రలు జరుగుతున్నాయని, ఆ ట్రాప్‌లో ఎవరూ పడొద్దని, రానున్న ఆరు నుంచి తొమ్మిది నెలలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్ శాఖల మంత్రి కె.తారకరామారావు అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో మంత్రి సోమవారం పర్యటించారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో పల్లె దవాఖానా, స్కూల్‌లో సైన్స్ ల్యాబ్, డిజిటల్ తరగతిని మంత్రి ప్రారంభించారు. సిరిసిల్ల రగుడు జంక్షన్‌లో రూ.7.70 కోట్లతో సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో రూ.1.10 కోట్లతో నిర్మించిన షాదీఖానాను ప్రారంభించిన అనంతరం కేటీఆర్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఎనిమిదిన్నర ఏళ్లుగా రాష్ట్రంలో కుల, మతభేదాలులేని పాలనను అందిస్తున్నారని, పేదరికాన్ని తొలగించే నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలో లేని సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయని వివరించారు. గతంలో ముస్లిం ఆడపిల్లలు చదువుకు దూరంగా ఉన్నారని, ఇప్పుడు ఆ పరిస్థితి మారిందని అన్నారు. రాష్ట్రంలో ఏటా రూ.6 వేల కోట్లు వెచ్చిస్తూ గురుకులాల్లో

మిగతా 2వ పేజీలో ▶

పూటకో అత్యాచారం... రోజుకో హత్య



రాష్ట్రంలో ఇదీ పరిస్థితి: సంజయ్

- డెడ్ బాడీని ఎత్తుకెళ్లే వాళ్లను కేసీఆర్ ప్రభుత్వంలోనే చూస్తున్నం
- ప్రీతి ఎంజీఎంలోనే చనిపోయినా డెడ్ బాడీని నిమ్స్‌కు తరలించి ట్రీట్‌మెంట్ ఇచ్చినట్టు డ్రామా
- తప్పు లేకపోతే సిట్టింగ్ జడ్జితో విచారణ ఎందుకు జరిపించడం లేదు
- బీజేపీ దీక్షలో బండి సంజయ్ తీవ్ర ఆరోపణలు -3లో

రాష్ట్రంపై మరింత ఫోకస్

- ఎన్నికలే లక్ష్యంగా వ్యూహాల అమలుకు ఆరుగురు సభ్యులతో బీజేపీ కమిటీ
- కమిటీలో సునీల్ బన్సల్, తరుణ్ ఛుగ్, వినోద్‌తావ్డే, నరేశ్ బన్సల్ తదితరులు 2లో

క్లుప్తంగా...

'వన్ నేషన్.. వన్ ఫ్రెండ్'
శ్రీలంకలో అదానీ ప్రాజెక్టుపై కేటీఆర్ వ్యంగ్యంగా ట్వీట్



సాక్షి, హైదరాబాద్: శ్రీలంకలో అదానీ ప్రాజెక్టుపై రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు ట్విట్టర్‌లో వ్యంగ్యంగా స్పందించారు. అదానీ ప్రాజెక్టును 'ప్రభుత్వానికి, ప్రభుత్వానికి మధ్య కుదిరిన ఒప్పందం'గా శ్రీలంక ప్రభుత్వం చెబుతోందని వ్యాఖ్యానించారు. ఈ మేరకు సోమవారం ఉదయం ట్వీట్ చేశారు. అదానీకి ప్రాజెక్టు కట్టబెట్టాలంటూ ప్రధాని మోదీ తమను బలవంత పెట్టారని గతంలో శ్రీలంక చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. 'వన్ నేషన్.. వన్ ఫ్రెండ్'అనేది 'ఎ మిత్ర్ కాల్'లో కొత్త పథకమని ఎద్దేవా చేశారు.

మేం అధికారంలోకి వస్తే సీపీఎస్ రద్దు చేస్తాం: ఉత్తమ్
టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో హర్షవర్ధన్‌రెడ్డిని గెలిపించండి



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను రద్దు చేస్తామని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పింఛన్ విధానాన్ని అమలు చేస్తామని టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ బలపరిచిన టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తదితరులతో కలిసి ఉత్తమ్ మాట్లాడారు. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ జిల్లాల్లోని ఉపాధ్యాయులంతా హర్షవర్ధన్‌రెడ్డికి ఓట్లేసి గెలిపించాలని విజ్ఞప్తిచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

హాథ్ సే హాథ్ జోడో యాత్రలకు విశేష స్పందన
టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన హాథ్ సే హాథ్ జోడో యాత్రలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే తమ కష్టాలు తొలగుతాయనే భావనలో రాష్ట్ర ప్రజానీకం ఉందని హాథ్ సే హాథ్ జోడో యాత్రల సందర్భంగా తమకు అర్థమవుతోందని తెలిపారు. సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు కిరణ్‌రెడ్డి, హర్కర వేణుగోపాల్ తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న భ్రమలు తొలగిపోతున్నాయన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రల్లో భాగంగా ఈనెల 9న కరీంనగర్‌లో నిర్వహించే భారీ బహిరంగసభకు ముఖ్య అతిథిగా ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్ హాజరవుతారని వెల్లడించారు. టీపీసీసీ నేత చెరకు సుధాకర్‌పై ఎంపీ కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యల విషయాన్ని ఏఐసీసీ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

'వైఎస్సార్ పాలన తెస్తా' అని రేవంత్ అనడం హాస్యాస్పదం
ట్విట్టర్ వేదికగా షర్మిల ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: మహానేత వైఎస్సార్ పాలన తెస్తానని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అనడం హాస్యాస్పదమని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల అన్నారు. ఓటుకు కోట్లు దొంగ కొత్త జపం ఇదని విమర్శించారు. సోమవారం ఆమె ట్విట్టర్ వేదికగా రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే రేవంత్‌కు వైఎస్సార్ గురించి మాట్లాడే నైతిక హక్కులేదన్నారు. మహానేత మరణిస్తే పావురాలగుట్టలో పావురం అంటూ హేళన చేసింది ఈ దగాకోరు కాదా? అని ప్రశ్నించారు. అద్దెకు తెచ్చుకున్న ఉద్దెర లీడర్ రేవంత్‌రెడ్డి అని ఎద్దేవాచేశారు. వైఎస్సార్ సంక్షేమ పాలన కోసం పెట్టిన ఏకైక పార్టీ వైఎస్సార్‌టీపీ మాత్రమేనన్నారు.

ఇదండీ సంగతి



..వాళ్లూ అదే అంటున్నార్సార్!!

నాలుగు నెలలని.. వారంలోనే ముగింపా?

ఈపీఎఫ్‌ఓ అధిక పెన్షన్ దరఖాస్తు ప్రక్రియపై సీనియర్ల తీవ్ర ఆగ్రహం

- సెప్టెంబర్ 1, 2014కు ముందు రిటైరైన వారికి ఈ నెల 3న ముగిసిన దరఖాస్తు గడువు
- సర్క్యులర్ ఇచ్చింది గత నెల 20న.. దరఖాస్తు లింకును తెచ్చింది 25న..
- సుప్రీంతీర్పు మేరకు ఇవ్వాల్సిన గడువు నాలుగు నెలలు
- వారంలోనే దరఖాస్తుల స్వీకరణ ఆపేయడంపై మండిపడుతున్న పెన్షనర్లు
- దేశవ్యాప్తంగా నమోదు చేసుకున్నవారు 91,258 మంది మాత్రమే..

సాక్షి, హైదరాబాద్: అధిక పెన్షన్ల విషయంలో 'ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌ఓ)'తీరుపై పెన్షనర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి సంబంధించిన దరఖాస్తులు, ఆప్షన్ నమోదులో గందరగోళం, త్వరగా గడువును ముగించడంపై మండిపడుతున్నారు. ముఖ్యంగా 2014 సెప్టెంబర్ 1 కంటే ముందు పదవీ విరమణ పొందినవారు దరఖాస్తు చేసుకోలేక నష్టపోయామని వాపోతున్నారు. ఈపీఎఫ్‌ఓ తాత్సారం, సర్వర్ సమస్యతోపాటు నమోదు విషయంలో అవగాహన లోపంతో జాయింట్ ఆప్షన్ ఇవ్వలేకపోయామని అంటున్నారు. తమకు అవకాశం ఇవ్వాలంటూ ఈపీఎఫ్‌ఓ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. తాము చేసేదేమీ లేదంటూ అధికారులు చేతులెత్తేస్తున్నారు.

> సిరిపురం మాధవరావు ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేసి.. 2013 మేలో పదవీ విరమణ పొందారు. ఆయన సర్వీసులో ఉన్నప్పుడే అధిక పెన్షన్ కోసం ఉమ్మడి ఆప్షన్ ఇచ్చారు. అయితే ఈపీఎఫ్‌ఓ అధికారులు దానిని తిరస్కరించడంతో సాధారణ పెన్షన్ పొందుతున్నారు. కానీ ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో తిరిగి అధిక పెన్షన్ కోసం ఉమ్మడి ఆప్షన్ ఇచ్చేందుకు ప్రయత్నించారు. కానీ వెబ్‌సైట్ ఓపెన్ కాకపోవడం, కొన్నిసార్లు ఓపెన్ అయినా వివరాలు నమోదు చేసేటప్పుడు స్తంభించిపోవడం ఆ ప్రక్రియ పూర్తి చేయలేదు. ఇంతలో గడువు ముగిసింది. దీంతో ఈపీఎఫ్‌ఓ కార్యాలయం చుట్టూ తిరుగుతూ అధికారుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంతకీ ఏం జరిగింది?

ఈపీఎఫ్‌ఓ చందాదారులు, పెన్షనర్లకు సంబంధించి అధిక పెన్షన్ అమలుపై సుప్రీంకోర్టు గతేడాది నవంబర్ 4న తీర్పు ఇచ్చింది. ఆ రోజు నుంచి నాలుగు నెలల పాటు దరఖాస్తులకు గడువు ఇవ్వాలని ఆదేశించింది. 2023 మార్చి 3వ తేదీ వరకు గడువును నిర్దేశించింది. సుప్రీం ఆదేశాల మేరకు చర్యలు చేపట్టిన ఈపీఎఫ్‌ఓ.. చాలా తాత్సారం చేసి ఈ ఏడాది ఫిబ్రవరి 20న దీనిపై ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. అంతే కాదు దరఖాస్తులు, జాయింట్ ఆప్షన్‌కు సంబంధించిన లింకును మరో ఐదురోజులు ఆలస్యంగా 25వ తేదీన అందుబాటులోకి తెచ్చింది. మార్చి 3వ తేదీతో గడువు ముగియనుండగా.. కేవలం వారం రోజుల ముందు మాత్రమే లింకును అందుబాటులోకి తేవడం గమనార్హం. అయితే 2014 సెప్టెంబర్ 1 తర్వాత పదవీవిరమణ పొందినవారు, ప్రస్తుతం సర్వీసులో ఉన్నవారు దరఖాస్తు చేసుకునేందుకు ఈపీఎఫ్‌ఓ మరో రెండునెలల పాటు అవకాశం కల్పించింది. వారు మే 3 నాటికల్లా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. కానీ 2014 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు రిటైరైన వారికి మాత్రం అవకాశం ఇవ్వలేదు. దీనితో వారిలో చాలా మంది అధిక పెన్షన్‌కు దూరమయ్యారు.

దేశవ్యాప్తంగా 91,258 దరఖాస్తులే..

2014 సెప్టెంబర్ 1వ తేదీకి ముందు రిటైరైనవారిలో దేశవ్యాప్తంగా కేవలం 91,258 మంది మాత్రమే అధిక పెన్షన్ కోసం జాయింట్ ఆప్షన్ ఇవ్వగలిగారు. పేరుకు నాలుగు నెలలు అవకాశం ఇచ్చినా.. సర్క్యులర్ జారీ, ఆన్‌లైన్ లింకు అందుబాటులోకి తేవడంలో ఈపీఎఫ్‌ఓ జాప్యం చేసిందని సీనియర్ పెన్షనర్లు మండిపడుతున్నారు. తమకు మరో అవకాశం కల్పించాలంటూ ఈపీఎఫ్‌ఓకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆ ఆత్మహత్యలకు కారణమైనవారిని వదలం!

- విద్యార్థులపై ర్యాగింగ్, వేధింపుల నియంత్రణ కోసం కఠిన చర్యలు: సబితా ఇంద్రారెడ్డి
- సాత్విక్, ప్రీతి ఘటనలు దురదృష్టకరమని వ్యాఖ్య
- రాష్ట్రంలో టీచర్ పోస్టుల భర్తీ, రేషనలైజేషన్‌పై కసరత్తు చేస్తున్నట్టు వెల్లడి
- ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలను ఇంటర్, డిగ్రీ స్థాయికి అప్‌గ్రేడ్ చేస్తామని ప్రకటన



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఇంటర్ విద్యార్థి సాత్విక్, మెడికల్ పీజీ విద్యార్థిని ప్రీతి ఘటనలు దురదృష్టకరమని.. ఇంటర్మీడియట్, ఇతర వృత్తి విద్యా కాలేజీల్లో ర్యాగింగ్, వేధింపుల నియంత్రణ కోసం ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటుందని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమైన వ్యక్తులను, కాలేజీలను వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి గురవుతుంటారని, ఇప్పటికే ఇంటర్ బోర్డులో నలుగురు కౌన్సిలర్లను నియమించి ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 11 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సన్నాహాలు చేస్తున్నామని.. బదిలీలు, పదోన్నతుల అంశం తేలిన తర్వాత ఈ ప్రక్రియ చేపడతామని ప్రకటించారు. సోమవారం రంగారెడ్డి జిల్లా జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నిష్పత్తి మేరకు ఉపాధ్యాయులను నియమించనున్నట్టు తెలిపారు. ఇందుకోసం స్కూళ్లు, టీచర్ల రేషనలైజేషన్ ప్రక్రియను కూడా చేపడతామన్నారు. ఇకపై విద్యా సంవత్సరానికి ముందే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు సరఫరా చేస్తామని వివరించారు.

గురుకులాల్లో సీట్లు భర్తీ చేయాలి

ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలను అప్‌గ్రేడ్ చేసి.. ఇంటర్, డిగ్రీ కోర్సులను కూడా అందజేస్తామని మంత్రి సబిత తెలిపారు. ఆయా గురుకులాల్లోని సీట్లను భర్తీ చేయాల్సిన బాధ్యతను స్థానిక ప్రజాప్రతినిధులు తీసుకోవాలని సూచించారు. ఏ గురుకులంలో, ఏ కోర్సులో, ఎన్ని సీట్లు ఖాళీగా ఉన్నాయో తెలుసుకుని స్థానిక పేద విద్యార్థులను వాటిలో చేర్పించాలని కోరారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రభుత్వ స్కూళ్లను బాగు చేసుకున్నామని చెప్పారు.

రేవంత్‌కు భద్రత పెంచండి
పోలీసులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: హాథ్ సే హాథ్ జోడో యాత్ర కొనసాగే వరకు ఎంపీ, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డికి భద్రత పెంచాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. రాత్రి బసచేసే ప్రాంతాల్లోనూ భద్రత కట్టుదిట్టంగా ఉండాలని స్పష్టం చేసింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తన యాత్రకు పోలీసులు తగిన స్థాయిలో భద్రత కల్పించడం లేదని, భద్రత పెంచేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ రేవంత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఫిబ్రవరి 6 నుంచి పాదయాత్ర ప్రారంభమైందని, అసెంబ్లీ ఎన్నికల వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్ రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరఫున జీపీ రూపేందర్, పిటిషనర్ తరఫున తేరా రజినీకాంత్‌రెడ్డి వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పైవిధంగా ఆదేశాలు జారీ చేశారు.

వేధిస్తే ఉక్కుపాదమే!

▶ మొదటి పేజీ తరువాయి

మానసిక స్థైర్యం కోల్పోవడానికి కారణాలు, ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల్లో నిబంధనల ఉల్లంఘనలు, విద్యార్థులపై పెరుగుతున్న మానసిక ఒత్తిడిపై చర్చించారు. వీటి అదుపునకు అనుసరిస్తున్న చర్యలపై కాలేజీల యాజమాన్యాలను అధికారులు ప్రశ్నించారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం..

మళ్లీ ఆత్మహత్య ఘటనలు జరగొద్దు..

సమీక్ష సందర్భంగా ప్రైవేటు కాలేజీల తీరుపై నవీన్ మిత్తల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వ అభిప్రాయాన్ని, ఆదేశాలను కాలేజీల ప్రతినిధులకు వివరించారు. 'విద్యార్థుల ఆత్మహత్యల అంశాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. సాత్విక్ ఘటనే ఆఖరిది కావాలి. ఇది పునరావృతమైతే చర్యలు తీవ్రంగా ఉంటాయి. చదువు కోసం వచ్చే పిల్లలు తనువు చాలిస్తుంటే తప్పెవరిది? దీనికి యాజమాన్యాలే బాధ్యత వహించాలి. ఈ పరిస్థితిని మీరే పరిష్కరించుకుంటారా? లేకపోతే 33 జిల్లాల అధికారులను రంగంలోకి దించాలంటారా? అధికారులు రంగంలోకి దిగితే పరిస్థితి మరోలా ఉంటుంది' అని నవీన్ మిత్తల్ హెచ్చరించారు. ఏ ఒక్క విద్యార్థి ఒత్తిడికి గురై ప్రాణాలు కోల్పోయినా ఊరుకోవద్దని ప్రభుత్వం స్పష్టం చేసిందని వివరించారు. ఈ సందర్భంగా కాలేజీల్లో విద్యార్థులకు కౌన్సెలింగ్ చేస్తున్నామంటూ యాజమాన్య ప్రతినిధులు చెప్పడాన్ని మిత్తల్ తోసిపుచ్చారని.. వ్యాపార ధోరణే ధ్యేయంగా పనిచేసే సంస్థలు విద్యార్థులను పట్టించుకుంటే ఈ పరిస్థితి వచ్చేదా? అని నిలదీశారని తెలిసింది. కాగా, కార్పొరేట్ కాలేజీల్లో విద్యార్థులు ఆత్మహత్య చేసుకుంటే.. కాలేజీల యాజమాన్యాలను అరెస్టు చేయకుండా, చర్చలెలా జరుపుతారంటూ పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం నేతలు ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ వద్ద నిరసనకు దిగారు.

చైతన్య గుర్తింపు రద్దు: నవీన్ మిత్తల్

సమావేశం అనంతరం నవీన్ మిత్తల్ 'సాక్షి'తో మాట్లాడారు. విద్యార్థి ఆత్మహత్యకు కారణమైన శ్రీచైతన్య నార్సింగి బ్రాంచి అనుబంధ గుర్తింపు రద్దు చేస్తున్నామని.. దీనిపై మంగళవారం ఉత్తర్వులు ఇస్తామని తెలిపారు. విద్యార్థులను దూషించే, హింసించే లెక్చరర్లపై కాలేజీల యాజమాన్యాలు చర్యలు తీసుకోవాలని.. తమ దృష్టికి వస్తే సదరు లెక్చరర్లను డీబార్ చేస్తామని చెప్పారు. స్టడీ అవర్స్ పేరిట వేధించే విధానాలకు స్వస్తి చెప్పాలన్నారు. దీనికి సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేస్తామని వెల్లడించారు. మనోవేదనతో ఉన్న విద్యార్థులను ముందే గుర్తించి కౌన్సెలింగ్ ఇవ్వాలని కాలేజీలకు సూచించామన్నారు. విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించేందుకు యోగా, క్రీడలను ప్రోత్సహించేలా ఒక కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రైవేటు కాలేజీల ఆగడాలను ఇకపై ఉపేక్షించబోమన్నారు. గ్రేడింగ్ విధానంపైనా ఆలోచిస్తున్నామని చెప్పారు.

రెండు శ్రీచైతన్య స్కూళ్ల అనుమతి రద్దు

వికారాబాద్ అర్బన్: తాండూరు, వికారాబాద్‌లలోని శ్రీచైతన్య పాఠశాలల అనుమతిని రద్దు చేసినట్టు జిల్లా విద్యాధికారి రేణుకాదేవి తెలిపారు. రీజనల్ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ఈ స్కూళ్లకు ప్రస్తుత విద్యా సంవత్సరం 2022-23 వరకు మాత్రమే పర్మిషన్ ఉందని.. వచ్చే విద్యా సంవత్సరం (2023-24) కొనసాగేందుకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

రాష్ట్రంపై మరింత ఫోకస్..!

- ఎన్నికల వ్యూహాల అమలుకు ఆరుగురితో బీజేపీ కమిటీ
- కమిటీలో సునీల్ బన్సల్, తరుణ్‌ఛుగ్, వినోద్ తావ్డే, నరేశ్ బన్సల్, హరీశ ద్వివేది, జే పాండా
- తెలంగాణ సహా 160 పార్లమెంట్ స్థానాలపై దృష్టి

సాక్షి, న్యూఢిల్లీ: రానున్న తెలంగాణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే విస్తృత కార్యాచరణ మొదలు పెట్టిన బీజేపీ హైకమాండ్ గెలుపే లక్ష్యంగా వ్యూహాల అమలుకు సీనియర్ నేతలతో ఎన్నికల కమిటీని నియమించింది. తెలంగాణ ఇంచార్జీలుగా ఉన్న సునీల్ బన్సల్, తరుణ్‌ఛుగ్‌లు సహా మరో నలుగురిని కమిటీలో సభ్యులుగా చేర్చింది. తెలంగాణ సహా ఒడిశా, పశ్చిమబెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, హరియాణా వంటి రాష్ట్రాల్లో గుర్తించిన 160 లోక్‌సభ పార్లమెంట్ స్థానాల్లో పార్టీ విస్తరణ, నిర్దేశిత కార్యక్రమాల అమలును పర్యవేక్షించే బాధ్యతలను కమిటీ చూడనుంది.


బూత్‌స్థాయి నేతలే లక్ష్యంగా చేరికలు..

వచ్చే డిసెంబర్‌లో జరిగే ఎన్నికల్లో పార్టీని ఎలాగైనా అధికారంలోకి తేవాలని గట్టి పట్టుదలతో ఉన్న బీజేపీ ఇప్పటికే రాష్ట్ర నాయకత్వానికి మార్గనిర్దేశం చేసిన విషయం తెలిసిందే. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సహా ఇతర పెద్దలంతా రాష్ట్ర నేతలతో మాట్లాడి మార్చి నుంచి సెప్టెంబర్ వరకు వరుసగా నియోజకవర్గ స్థాయి మొదలు రాష్ట్ర స్థాయి వరకు చేపట్టాల్సిన కార్యక్రమాలు, బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రజా ఉద్యమాలపై పలు సూచనలు చేశారు. ఈ భేటీకి కొనసాగింపుగా పార్టీ కార్యక్రమాల అమలును పర్యవేక్షించేందుకు వీలుగా ఆరుగురు సభ్యుల కమిటీని పార్టీ నియమించింది. ఇందులో సునీల్ బన్సల్, తరుణ్‌ఛుగ్‌తో పాటు పార్టీ ముఖ్య నేతలు వినోద్ తావ్డే, నరేశ్ బన్సల్, హరీశ ద్వివేది, జే పాండా సభ్యులుగా ఉండనున్నారు. వీరంతా తెలంగాణతో పాటు గుర్తించిన 160 లోక్‌సభ నియోజకవర్గాలపై దృష్టి సారించనున్నారు. ఈ నియోజకవర్గాల్లో బూత్‌స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడం, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై పోరాటాలు వంటి అంశాలను పర్యవేక్షించనున్నారు. తెలంగాణలో చాలా నియోజకవర్గాల్లో కొత్త, పాత నేతల మధ్య అంతర్గత విభేదాలున్నాయని, ముఖ్యంగా ఇతర పార్టీల నేతల చేరిక విషయంలో అభిప్రాయ భేదాలు పార్టీకి నష్టం చేస్తున్నాయని గుర్తించిన నేపథ్యంలో వాటిని సరిదిద్దే బాధ్యతలను కమిటీ చూసుకుంటుందని పార్టీ నేతలు చెబుతున్నారు.

చేరికలపై సమాలోచనలు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంతో పాటు ఇతర పార్టీల నుంచి చేరికలను వేగవంతం చేయడంపై బీజేపీ దృష్టి సారించింది. జిల్లాల వారీగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి ఎవరెవరు చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారనే అంశాలను పరిశీలిస్తున్నారు. ఇప్పటికే పార్టీ రాష్ట్ర ముఖ్యనేతల నుంచి పలు జిల్లాల నుంచి పార్టీలో చేరేందుకు మొగ్గు చూపుతున్న వారి జాబితాను జాతీయ నాయకత్వం సేకరించింది. ఈనెల 12న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాష్ట్రానికి వస్తున్న నేపథ్యంలో చేరికల అంశంపై చర్చించే అవకాశాలున్నాయి. 'బూత్ సశక్తికరణ్ అభియాన్'కార్యక్రమం ఏర్పాట్లపై, నాయకులకు ఇవ్వాల్సిన శిక్షణపైనా పార్టీ నేతలు సమాలోచనలు జరుపుతున్నారు. సోమవారం రాత్రి పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్, పార్టీ జాతీయ సంస్థాగత సహ ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ కె.లక్ష్మణ్, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పాల్గొన్నారు.

'బ్రహ్మ కన్ను' శాపం!



ఇది కోహినూర్‌ను మించిన కథ

కోహినూర్.. ప్రపంచంలోనే ఫేమస్ వజ్రం. బ్రిటన్ రాణి కిరీటంలో ఉన్న ఈ వజ్రం మనకు తిరిగిచ్చేయాలన్న డిమాండ్లు ఎప్పటికప్పుడు వస్తూనే ఉంటాయి. ఆ మధ్య రాణి చనిపోయినప్పుడు కూడా ఇవి వెల్లువెత్తాయి. ఇదే తరహాలో మన దేశం నుంచి తరలిపోయిన మరో పెద్ద వజ్రం 'బ్రహ్మ కన్ను (ఐ ఆఫ్ బ్రహ్మ)' గురించి మీకు తెలుసా? అది ఇచ్చిన 'శాపం' గురించి మీరెప్పుడైనా విన్నారా? లేదా.. అయితే.. ఈ వివరాలు మీ కోసమే..

మీకు తెలుసా?



పుదుచ్చేరిలోని ఆలయం నుంచి..

అది అరుదైన నలుపు రంగు వజ్రం. 'ది బ్లాక్ ఓర్లోవ్ డైమండ్'గా పిలుస్తున్న దీని బరువు 67.69 క్యారెట్లు. ప్రపంచంలోని నలుపు రంగులోని అతిపెద్ద వజ్రాల్లో దీనిది ఏడో స్థానం. పాండిచ్చేరి (ప్రస్తుతం పుదుచ్చేరి)లోని ఉన్న ఓ ఆలయంలో ఉన్న బ్రహ్మ దేవుడి విగ్రహం నుదుటిపై ఈ వజ్రం ఉండేదట. అందుకే దీనిని 'బ్రహ్మ కన్ను'గా పిలిచేవారు. ఆ ప్రాంతం మీదుగా ప్రయాణిస్తున్న ఓ సన్యాసి బ్రహ్మ దేవుడి విగ్రహం నుంచి ఈ వజ్రాన్ని పెకలించి, దొంగిలించుకెళ్లాడు. దీనితో ఈ వజ్రం ఎవరివద్ద ఉంటే వారికి కీడు జరిగేలా బ్రహ్మ దేవుడు శపించాడన్నది అప్పటి కథనం. ఈ క్రమంలోనే వజ్రాన్ని దొంగిలించిన సన్యాసి కొంతకాలానికే హత్యకు గురయ్యాడని.. క్రమంగా ఇది రష్యాకు చేరిందని చెబుతారు.

ముగ్గురి ఆత్మహత్యలతో..


ఓర్లోవ్

భారతదేశం నుంచి రష్యాకు చేరిన 'బ్రహ్మ కన్ను' వజ్రం చేతులు మారుతూ యూరప్‌కు చేరుకుంది. 1932లో యూరోపియన్ వజ్రాల డీలర్ జేడబ్ల్యూ పారిస్ ఈ వజ్రాన్ని కొని అమెరికాకు తీసుకెళ్లాడు. కొద్దిరోజులకే ఓ పెద్ద భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. దాదాపు పదిహేనేళ్ల తర్వాత రష్యా నుంచి ఫ్రాన్స్‌లోని పారిస్‌కు వచ్చి తలదాచుకుంటున్న రష్యా రాజకుమార్తెలు లియోనిలా బరియటిన్‌స్కీ, నదియా వ్యేగిన్ ఓర్లోవ్‌ల చేతికి ఈ వజ్రం చేరింది. ఈ ఇద్దరూ కూడా ఆత్మహత్య చేసుకున్నారు. వజ్రాన్ని చివరిగా ధరించిన రాజకుమార్తె పేరిటే దీనికి 'బ్లాక్ ఓర్లోవ్' అని పేరువచ్చింది. అది శాపగ్రస్తమైనదిగా ప్రచారమైంది.

శాపం పోతుందని ముక్కలు చేసి

1950వ దశకంలో చార్లెస్ విల్సన్ అనే వ్యక్తి ఈ వజ్రాన్ని కొనుగోలు చేశాడు. అసలైన 'బ్రహ్మ కన్ను' వజ్రం బరువు ఏకంగా 195 క్యారెట్లు. అయితే దీనికి ఉన్న శాపం పోతుందన్న ఉద్దేశంతో.. మూడు ముక్కలు చేయించాడు. అందులో పెద్ద ముక్క ఇప్పుడు 'బ్లాక్ ఓర్లోవ్' (67.69 క్యారెట్లు)గా చలామణీ అవుతోంది. మిగతా రెండు ముక్కలు ఏమయ్యాయో ఎవరికీ తెలియదు.

భయంతో 'రేటు' మారుతూ..

'బ్లాక్ ఓర్లోవ్' వజ్రం శాపగ్రస్తమైనదన్న ప్రచారంతో దాని విలువ పెరుగుతూ తగ్గుతూ వచ్చింది. విల్సన్ 1969లో 'బ్లాక్ ఓర్లోవ్' వజ్రాన్ని గుర్తు తెలియని వ్యక్తికి రూ.2.45 కోట్లకు అమ్మాడు. తర్వాత చాలాకాలం ఎవరి కంటా పడ లేదు. 1990లో ఈ వజ్రం సదబీజ్ సంస్థలో వేలానికి వచ్చినప్పుడు రూ.80 లక్షలే పలికింది. కానీ 1995లో జరిగిన వేలంలో ఏకంగా రూ.12.25 కోట్లకు అమ్ముడైంది. ఆ వ్యక్తి నుంచి 2004లో అమెరికన్ ధనవంతుడు డెన్నిస్ పెటిమెజాస్ ఈ వజ్రాన్ని కొన్నా ధర ఎంతో బయటికి రాలేదు. 2006లో ఆయన దీనిని రూ.2.9 కోట్లకు అమ్మేశాడు. ఇటీవలే ఈ వజ్రాన్ని న్యూయార్క్, లండన్‌లలో జరిగిన నేచురల్ హిస్టరీ ఎగ్జిబిషన్లలో ప్రదర్శించారు. అయితే, భారత్‌లో ఇప్పటి వరకూ నల్ల వజ్రాలు దొరకనందున.. 'బ్లాక్ ఓర్లోవ్'వజ్రం ఇక్కడిది కాదనే వాదనా ఉంది. వజ్రాల వ్యాపారంలో ఉన్న వారు మాత్రం ఇది భారత్ నుంచే వచ్చిందని చెబుతున్నారు. ఆ శాపమూ వాస్తవమే అని అంటున్నారు.

నిజానిజాలు ఆ బ్రహ్మదేవుడికే ఎరుక!

\- సాక్షి సెంట్రల్ డెస్క్

జూనియర్లపై సీనియర్ విద్యార్థుల దాడి

అచ్చంపేట రూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట సాంఘిక సంక్షేమ ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాలలో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులపై దాడికి దిగిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం రాత్రి 10 గంటల సమయంలో ఆరో తరగతి విద్యార్థులు ఇద్దరిపై.. అదే గురుకులంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు దాడి చేశారు. ఆదివారం సాయంత్రం 6, 7, 8 తరగతులకు చెందిన మరో 20 మంది విద్యార్థులను సదరు ఇంటర్ విద్యార్థులు రక్త గాయాలయ్యేలా కొట్టారు. రెండ్రోజులుగా విద్యార్థులను గదిలో బంధించి చితకబాదారు. దీనిపై సోమవారం తెల్లవారుజామున గాయపడిన విద్యార్థులు తల్లిదండ్రులకు ఫోన్‌లో తెలిపారు. కళాశాలకు వెళ్లిన మీడియా ప్రతినిధులపై ఓ ఉపాధ్యాయుడు మండిపడ్డారు. ఆర్‌సీవో వనజ పాఠశాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. దాడికి పాల్పడిన విద్యార్థులకు టీసీలిస్తామని ప్రిన్సిపల్ లోకరాములు తెలిపారు.

తరగతి గదిలోనే ఉరివేసుకుని..

గురుకుల పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థిని ఆత్మహత్య


నిఖిత (ఫైల్)

మన్ననూర్: గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న ఓ బాలిక క్లాస్ రూమ్‌లోనే ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. నాగర్‌కర్నూలు జిల్లా వంకేశ్వరం గ్రామానికి చెందిన నాగిళ్ల బుచ్చిరాములు కూతురు నిఖిత (12) స్థానిక సంక్షేమ గురుకుల(బాలికల) పాఠశాలలో 7వ తరగతి చదువుతోంది. సోమవారం సాయంత్రం స్నాక్స్ తీసుకున్న తర్వాత తోటి విద్యార్థులంతా ఆడుకోవడానికి గ్రౌండ్‌కు వెళ్లారు. అక్కడ పీఈటీ హాజరు తీసుకుంటుండగా నిఖిత రాలేదని గుర్తించారు. దీంతో హాస్టల్‌లో చూడాలని తోటి విద్యార్థిని పంపించగా.. తరగతి గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించింది. డీఎస్పీ కృష్ణకిషోర్ వచ్చి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. ఘటనకు గల కారణాలు తెలియరాలేదు.

తల్లిదండ్రుల ఆందోళన

నిఖిత తల్లిదండ్రులు, బంధువులు పాఠశాల వద్దకు రాగా.. సిబ్బంది లోపలికి రానివ్వకుండా అడ్డుకున్నారు. దీంతో వారంతా తమ బిడ్డ మృతికి కారణాలు చెప్పాలని, న్యాయం చేయాలని బైఠాయించారు. వివిధ విద్యార్థి సంఘాలు, పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. దీంతో ఆందోళనకారులపై పోలీసులు స్వల్ప లాఠీచార్జీ చేశారు. కుటుంబంలో ఒకరికి కాంట్రాక్టు ఉద్యోగం ఇస్తామని, ఎక్స్‌గ్రేషియా చెల్లిస్తామని, గ్రామంలో భూమి ఇస్తామని ఆర్డీఓ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

హిందూ, ముస్లింల మధ్య పంచాయితీకి కుట్ర

▶ మొదటి పేజీ తరువాయి

విద్యనందిస్తున్నామని తెలిపారు. విదేశీ చదువులకు 7 వేల మందికి రూ.20 లక్షల చొప్పున అందించామని వివరించారు.

సర్కారు వైద్యంపై పెరిగిన నమ్మకం

ఒకప్పుడు 'నేను రాను తల్లో..'సర్కారు దవాఖానాకు అని పాటలు పాడుకునేవారని, ఇప్పుడు సర్కారు వైద్యంపై నమ్మకం పెరిగిందని కేటీఆర్ అన్నారు. సర్కారు ఆస్పత్రిలో 30 శాతం ఉన్న ప్రసూతి సేవలు ఇప్పుడు 62 శాతానికి పెరిగాయన్నారు. మెడికల్ కాలేజీ, పల్లె, బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తూ సర్కారు వైద్యంపై నమ్మకాన్ని పెంచామన్నారు. ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్ కంటే ఆశ వర్కర్లకు ఎక్కువ జీతాలు ఇస్తున్నామని చెప్పారు. పొద్దస్తమానం కొందరు సీఎం కేసీఆర్‌ను తిడుతున్నారని, అలా తిడితే ఓట్లు రావని అన్నారు. ఎంపీగా బండి సంజయ్ ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లెల్లలో రైతుల నిరసన

మంత్రి కేటీఆర్ పర్యటనలో జిల్లెల్ల వద్ద రైతులు నిరసన తెలిపారు. నీరు రాక పొలాలు ఎండిపోతున్నాయని పర్శరాములు అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పొలాల వద్ద కల్లాలు నిర్మించుకుంటే బిల్లులు రావడం లేదని లింగారెడ్డి అనే రైతు తెలిపారు. ఈ అంశంపై రైతులు కేకలు వేయడంతో మంత్రి కేటీఆర్ వారితో మాట్లాడారు. పొలాలు చూసి మాట్లాడాలని రైతులు కేకలు వేయడంతో పోలీసులు వారిని పక్కకు తీసుకెళ్లారు. మంత్రి కేటీఆర్ పర్యటనలో రైతులు నిరసన వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది.

కొంగరకలాన్‌లోనే 'ఫాక్స్‌కాన్'

▶ మొదటి పేజీ తరువాయి

అమితానందాన్ని కలిగించింది'అని లేఖలో యంగ్ ల్యూ పేర్కొన్నారు.

భారత్‌లో నాకు కొత్త స్నేహితుడు..

'తెలంగాణ అభివృద్ధికి మీరు చేస్తున్న కృషి, కనబరుస్తున్న దార్శనికత నుంచి స్ఫూర్తి పొందా. నాకు ఇప్పుడు భారత్‌లో కొత్త స్నేహితుడు ఉన్నారు. భవిష్యత్తులో మీతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నా. తైపీలో మీకు ఆతిథ్యం ఇవ్వడాన్ని గౌరవంగా భావిస్తా. త్వరలోనే మిమ్మల్ని కలవడానికి ఎదురుచూస్తున్నా'అని యంగ్ ల్యూ లేఖలో తెలిపారు.

రాష్ట్రానికి గొప్ప విజయం: సీఎంవో

తెలంగాణలో తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఫాక్స్‌కాన్ టెక్నాలజీ గ్రూప్ చైర్మన్ యంగ్ ల్యూ సీఎం కేసీఆర్‌కు లేఖ రాయడం పారిశ్రామిక రంగంలో రాష్ట్రానికి దక్కిన గొప్ప విజయంగా భావిస్తున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది.

మిద్దె.. ముచ్చట..



ఆ ఊరికి కొత్తగా వెళ్లినవారు, ఆ ఊరి మీదుగా ఇతర గ్రామాలకు వెళ్లేవారు అక్కడి ఇళ్లను చూసి ఆశ్చర్యపోతారు. కొద్దిసేపు అలాగే చూస్తుండిపోతారు. ప్రస్తుతం ఆధునిక ఇళ్లను నిర్మించుకుంటున్న కాలంలోనూ ఆ ఊళ్లో ఇప్పటికీ మిద్దె భవంతులే ఎక్కువగా ఉండడం గమనార్హం. వీటిని స్థానికంగా మిద్దె భవంతులని, మిద్దె ఇళ్లని, హవేలి బాలంగి అని, బంగళా అని పిలుస్తారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఆ ఇళ్లను యజమానులు అలాగే కాపాడుకుంటున్నారు. చిన్నచిన్న మరమ్మతులు చేయించుకుంటూ, ఆధునిక హంగులు సమకూర్చుకుంటూ ఆ ఇళ్లలోనే మూడు నాలుగు తరాలుగా నివసిస్తున్నారు.

పేట్ సంగం గ్రామంలోని మిద్దె భవంతులు

కాలం మారుతున్నా తగ్గని కళ

- వారసత్వాన్ని కాపాడుకుంటున్న పల్లెజనం
- తరతరాలుగా ఆ ఇళ్లల్లోనే నివాసం
- కామారెడ్డి జిల్లా పేట్‌సంగం ప్రత్యేకత

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి జిల్లా గాంధారి మండలంలోని మారుమూల గ్రామమైన పేట్‌సంగంలో అడుగు పెట్టగానే రోడ్డుకు ఇరువైపులా మిద్దె భవంతులు (రెండంతస్తులు) కనిపిస్తాయి. ఈ గ్రామంలోని మొత్తం నివాస భవనాల్లో దాదాపు సగం మిద్దె ఇళ్లే. ఊళ్లో మూడు వందల పైచిలుకు కుటుంబాలు నివసిస్తుండగా.. ఆయా కుటుంబాల్లో చాలావరకు తమ తాతల కాలం నుంచి మిద్దె ఇళ్లల్లోనే ఉంటున్నాయి. కొన్ని కుటుంబాల్లోనైతే మూడు, నాలుగు తరాలవారు జీవిస్తున్నారు. కాగా వందల ఏళ్ల క్రితం నిర్మించిన భవనాలు కూడా ఇక్కడ ఉన్నాయి. గ్రామంలో పురాతన 'శ్రీ సంగమేశ్వర దేవాలయం' ఉంది. దీంతో గ్రామంలోనే కాకుండా చుట్టుపక్కల గ్రామాల్లో చాలామంది పేర్లు సంగయ్య, సంగవ్వ అని ఉంటాయి.

తరతరాలుగా ఉంటున్నాం..



మా తాతలు, తండ్రులు, మేము అందరం మిద్దె ఇళ్లల్లోనే పెరిగాం. మా పిల్లలు కూడా ఈ ఇళ్లల్లోనే ఉంటున్నారు. ఊళ్లో చాలామందికి మిద్దె ఇళ్లు ఉన్నాయి.
– కూచి హన్మాండ్లు, పేట్‌సంగం

అప్పటి మిద్దె ఇళ్లే ఇప్పటి డూప్లెక్స్‌లు

ఈ పాత కాలం నాటి మిద్దె ఇళ్లకు లోపలి నుంచే (డూప్లెక్స్ మాదిరి) మెట్లు ఉంటాయి. ఇంటి గోడలు నిర్మించిన తర్వాత పెద్దపెద్ద దూలాలు ఏర్పాటు చేసి వాటిపై చెక్కలను కప్పి స్లాబ్‌కన్నా బలంగా తయారు చేశారు. దానిపైన మళ్లీ గోడలు నిర్మించి గదులు నిర్మించుకున్నారు. చాలా ఇళ్లల్లో కర్ర లేదా మట్టితో కట్టిన మెట్లు ఉన్నాయి. పూర్వ కాలంలో రైతులు పంట ఉత్పత్తులను మిద్దె పైన నిల్వ చేసేవారు. నివాసం కూడా ఉండేవారు. పై నుంచి కిందకు చిన్న రంధ్రం ఉండేది. అందులోంచి వడ్లు, మక్కలు, ఇతర పంట ఉత్పత్తులను కిందికి జారవిడిచేవారు. పంట ఉత్పత్తులే కాకుండా, ఇతర వస్తువుల్ని కూడా మిద్దె మీద దాచుకునేవారు. తర్వాతి కాలంలో అంటే ఆరేడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఇళ్లకు మాత్రం ముందు భాగం స్లాబ్ వేసి, బయటి నుంచి మెట్లు ఇచ్చారు. పేట్‌సంగంలో నిర్మించిన మిద్దె ఇళ్ల ఎక్కువగా తూర్పు ముఖంతో నిర్మించగా, కొన్ని ఉత్తర(గంగ) ముఖంతో నిర్మించారు. పడమర, దక్షిణ ముఖంతో ఒక్క ఇల్లూ కనిపించదు.



చల్లగా.. వెచ్చగా..!

మా నాన్న కట్టిన మిద్దె ఇంట్లోనే పుట్టి, పెరిగినం. మిద్దె ఇల్లు కావడం వల్ల వానాకాలం, చలి కాలంలో వెచ్చగా, ఎండాకాలంలో చల్లగా ఉంటుంది. ఎండలు ఎంత తీవ్రంగా ఉన్నా ఇబ్బంది ఉండదు. ఇళ్లకు మంచి రంగులు వేయించుకుని కొత్తదనం తీసుకువచ్చాం.
– అన్నారం సంగాగౌడ్, పేట్‌సంగం

క్లుప్తంగా...

ఇంటర్ హాల్‌టికెట్లు డౌన్‌లోడ్‌కు సిద్ధం

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ విద్యార్థుల హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించినట్టు ఇంటర్ బోర్డ్ కార్యదర్శి నవీన్ మిత్తల్ ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు వీటిని డౌన్‌లోడ్ చేసి, విద్యార్థులకు అందజేయాలని సూచించారు. హాల్ టికెట్‌పై ఫొటో, పేరు, మీడియం ఇతర వివరాలన్నీ కచ్చితంగా ఉన్నాయా? లేదా? పరిశీలించాలని కోరారు. తప్పులుంటే తక్షణమే ప్రిన్సిపాళ్లు లేదా జిల్లా ఇంటర్ అధికారుల ద్వారా సరిచేసుకోవాలని సూచించారు.

'మనూ'లో సీయూఈటీ ద్వారా యూజీ ప్రవేశాలు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో 2023–24 అకడమిక్ సెషన్ కోసం కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్(సీయూఈటీ)–2023 ద్వారా అండర్ గ్రాడ్యుయేట్ రెగ్యులర్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోందని 'మనూ' డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొ.ఎం.వనజ సోమవారం తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, దరఖాస్తులను సమర్పించడానికి మార్చి 12 వరకు అవకాశం కల్పించినట్టు పేర్కొన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులను అందుబాటులో ఉంచామని తెలిపారు. 'మనూ' రెగ్యులర్ పీజీ బీటెక్, బీఈడీ, డిప్లొమో ఇన్ ఇంజనీరింగ్, డీఈఐ. ఈడీ అన్ని సర్టిఫికెట్, పరిశోధన ప్రోగ్రామ్‌ల ప్రవేశాలను విడిగా తెలియజేస్తుందన్నారు.

వీఆర్‌ఏల డిమాండ్లను నెరవేర్చండి: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏ) సమస్యలను వెంటనే పరిష్కరించాలని, వెంటనే వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. వీఆర్‌ఏలకు పేస్కేల్ వర్తింపజేయాలని, 10వ తరగతి పాసైనవారికి రూ.26 వేల జీతం ఇవ్వాలని, అర్హులైనవారికి పదోన్నతులు కల్పించాలని, సమ్మె కాలపు వేతనాలను చెల్లించాలని, చనిపోయిన వీఆర్‌ఏల వారసులకు ఉద్యోగాలివ్వాలని లేఖలో విజ్ఞప్తి చేశారు.

గొంతుకోసుకుని వైద్యురాలి ఆత్మహత్యాయత్నం

నిర్మల్‌టౌన్: గొంతుకోసుకుని ఓ వైద్యురాలు ఆత్మహత్యకు యత్నించిన ఘటన నిర్మల్ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగింది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి చెందిన డాక్టర్ మీనా(36) నిర్మల్‌లో ఆరునెలలుగా ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తోంది. ఎన్‌రెడ్డి కాలనీలో ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో కుటుంబ కలహాల కారణంగా సోమవారం ఉదయం ఇంట్లో ఆమె గొంతుకోసుకుంది. తర్వాత ఆమెనే స్వయంగా ఆసుపత్రి సిబ్బందికి ఫోన్ చేసి విషయం చెప్పింది. దీంతో వైద్యురాలి ఇంటికి చేరుకున్న సిబ్బంది వెంటనే అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు నిర్మల్ సీఐ మల్లేశ్ తెలిపారు.

పూటకో అత్యాచారం... రోజుకో హత్య

రాష్ట్రంలో ఇదీ పరిస్థితి

- డెడ్ బాడీని ఎత్తికెళ్లే వాళ్లను కేసీఆర్ ప్రభుత్వంలోనే చూస్తున్నం...
- బీజేపీ దీక్షలో బండి సంజయ్



దీక్షలో బండి సంజయ్, బూర నర్సయ్యగౌడ్, ప్రభాకర్, విజయశాంతి, ఈటల రాజేందర్ తదితరులు

సాక్షి, హైదరాబాద్ : 'పూటకో అత్యాచారం... రోజుకో హత్య.. రాష్ట్రంలో ఇదీ శాంతి భద్రతల పరిస్థితి... దేశంలో బంగారం, డబ్బును ఎత్తికెళ్లే దొంగలను చూసినం. కానీ డెడ్ బాడీని ఎత్తికెళ్లే నీచమైన వాళ్లను కేసీఆర్ ప్రభుత్వంలోనే చూస్తున్నం.'' అని బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మహిళలపై జరుగుతున్న అఘాయి త్యా లకు నిరసనగా సోమవారం బీజేపీ కార్యాల యంలో బండి సంజయ్ ఆధ్వర్యంలో నిరసన దీక్ష నిర్వ హించారు. సభలో సంజయ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పూటకో అత్యాచారం ...రోజుకో హత్య జరుగు తున్నా కేసీఆర్ నోరు విప్పడం లేదని ధ్వజమెత్తారు. 'మెడికో ప్రీతి ఎంజీఎంలోనే చనిపోయినా డెడ్ బాడీని నిమ్స్ కు తరలించి నాలుగు రోజులు ట్రీట్ మెంట్ చేసినట్టు డ్రామా ఆడిన దుర్మార్గుడు కేసీఆర్.. నేను వరంగల్‌లో పర్యటిస్తున్నానని తెలిసి డెడ్ బాడీని నిమ్స్ కు తరలించారు. ప్రీతి డెడ్ బాడీని చివరికి తల్లి దండ్రులకు కూడా ఇవ్వలేదు. బంధువులకు ఆఖరి చూపు చూడకుండానే ఆదర బాదరగా తీసుకెళ్లి ఖననం చేశారు' అని ఆరోపించారు. కేసీఆర్...మీ తప్పు లేకుంటే సిట్టింగ్ జడ్జితో ఎందుకు విచారణ జరిపించలేదని ప్రశ్నించారు. ''ప్రీతి చనిపోయాక ఆమె వేలిముద్రతో సెల్‌ఫోన్ ఓపెన్ చేసి ఆధారాలన్నీ ధ్వంసం చేశారని ఆరోపించారు. నేటికీ ఆమె ఎలా చనిపోయిందో ప్రభుత్వం స్పష్టతనివ్వలేదన్నారు. సీఎం బిడ్డ చేతి గడియారం విలువ రూ. 20 లక్షలైతే... మెడికో విద్యార్థి ప్రీతి చనిపోతే రూ. 10 లక్షల పరిహారం ఇస్తాననడం సిగ్గు చేటని విమర్శించారు. 'కేసీఆర్ బిడ్డను చూసి సిగ్గుతో తలొంచుకుంటున్నరు. దొంగ సారా దందా చేయ డాన్ని అసహ్యించుకుంటున్నరు. కేసీఆర్ కొడుకు ట్విట్టర్ టిల్లు... డ్రగ్స్ తీసుకునే ట్విట్టర్ అయినా.. రోడ్ సైడ్ తిరిగే రోమియో అయినా తాము వదిలి పెట్టే ప్రసక్తే లేదు' అని సంజయ్ వ్యాఖ్యానించారు.

"సీఎంఓ నుండి వచ్చిన ఆదేశాలతోనే ప్రీతి కేసును నీరుగారుస్తున్నారు"

'ప్రీతి హత్య కేసును ప్రభుత్వం ప్లాన్ ప్రకారం నీరుగారుస్తోంది. సీఎంఓ నుండి వచ్చిన ఆదేశాలతోనే ఈ కేసును నిర్వీర్యం చేస్తున్నారు.. ర్యాగింగ్ పై ప్రీతి సహా కుటుంబ సభ్యులు పోలీసులకు, కాలేజీలో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.. రాత్రి పూట నవ్వుతూ మాట్లాడిన ప్రీతి తెల్లవారగానే ఆత్మహత్య చేసుకున్నదంటే ఎట్లా నమ్మేది? నిందితుడిని హీరోగా చూపే ప్రయత్నం చేస్తున్నారు' అని సంజయ్ ధ్వజమెత్తారు. పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ మాట్లాడుతూ ట్విట్టర్‌లో ప్రతీదానికి స్పందించే ట్విట్టర్ టిల్లు కేటీఆర్ ప్రీతి విషయంలో ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. కేసీఆర్ కు మహిళలంటే గౌరవం లేదని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ మండిపడ్డారు. కేసీఆర్‌కు నిజంగా మహిళల మీద ప్రేమ ఉంటే బెల్ట్ షాపులను వెంటనే రద్దు చేయాలని జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ సహ ఇన్‌చార్జి జాతీయ కార్యదర్శి అరవింద్ మీనన్, తమిళనాడు సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్ రెడ్డి, పార్టీ నేతలు నల్లుఇంద్రసేనారెడ్డి, వివేక్ వెంకటస్వామి, విజయశాంతి, గరికపాటి మోహన్ రావు, డా.విజయరామారావు, బూర నర్సయ్యగౌడ్, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, డాక్టర్ జి.మనోహర్ రెడ్డి, ఎన్వీ ఎస్ఎస్ ప్రభాకర్, సీహెచ్.విఠల్, ఎన్వీ సుభాష్, రాణీ రుద్రమదేవి దీక్షలో పాల్గొన్నారు.

మోదీకి రాసిన లేఖపై సంతకాలేవీ ?: సంజయ్

వివిధ పార్టీల నేతలు, సీఎంల సంతకాలు లేకుండానే ప్రధాని మోదీకి లేఖ పంపినట్లుగా సీఎం కేసీఆర్ మీడియాకు విడుదల చేయడం హాస్యాస్పదమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఎద్దేవా చేశారు. లిక్కర్ కేసులో తన బిడ్డ పాత్రపై ఇంతవరకు నోరు మెదపని కేసీఆర్... అదే కేసులో సిసోడియా అరెస్ట్ ను ఖండించడం వెనుక కుట్ర దాగి ఉందన్నారు. 'సీఎం స్థాయి వ్యక్తి సంతకాల్లేకుండా పత్రికలకు ఎట్లా రిలీజ్ చేశారో కేసీఆర్ చెప్పాలి. ఇంతగా దిగజారడం బాధాకరం' అన్నారు. సోమవారం రాత్రి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ఆ లేఖలో సంబంధిత నాయకుల సంతకాలే లేవు. వాళ్లకు అసలు ఈ లేఖ సంగతి తెలుసో తెలియదో న రు. 'కేసీ ఆర్ కు ఇట్లాంటివి వెన్నతో పెట్టిన విద్య. దీనిని ఆయనే తయారు చేశారు. లిక్కర్ దందాలో భాగస్వాములుగా ఉన్న ఆప్ పార్టీ, కేసీఆర్ పార్టీ తప్ప ఎవరూ దీనిపై స్పందించలేదు' అని మండిపడ్డారు. 'మేం నీ అవినీతి, అక్రమాలపై త్వరలో కోటి మందితో సంతకాలు చేయించి రాష్ట్రపతిని కలిసే అంశాన్ని పరిశీలిస్తున్నాం' అని చెప్పారు.

ప్రియురాలు, స్నేహితుడు తోడుగానే!

- ఇంజనీరింగ్ విద్యార్థి నవీన్ హత్య కేసులో కొత్త కోణం
- నిందితుడు హరిహరకృష్ణకు సహకరించిన నిహారిక, హసన్ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ సాయిశ్రీ

సాక్షి, హైదరాబాద్/నాగోల్: ఇంజనీరింగ్ విద్యార్థి నేనావత్ నవీన్ దారుణ హత్య కేసులో సంచలన విషయాలు బయటికి వస్తున్నాయి. తనతో కలిసి చదువుకున్న స్నేహితుడు నవీన్‌ను దారుణంగా హత్యచేసిన హరిహరకృష్ణకు అతడి ప్రియురాలు కట్టా నిహారిక (20), మరో స్నేహితుడు పి.హసన్ (21) సహకరించినట్టు పోలీసులు గుర్తించారు. నిహారిక హరిహరకృష్ణతో కలిసి వెళ్లి నవీన్‌ను హత్య చేసిన ప్రాంతాన్ని చూడటంతోపాటు అతడికి ఖర్చుల కోసం డబ్బులు కూడా ఇచ్చినట్టు తేల్చారు. మృతుడి శరీర భాగాలను కాల్చేయడం, ఇతర ఆధారాలను ధ్వంసం చేయడంలో హసన్ సహకరించాడని గుర్తించారు. నేరం తర్వాత వీరందరి మధ్య వాట్సాప్ చాటింగ్‌లు జరిగాయని, పోలీసులకు లొంగిపోయినా కోర్టులో నేరం రుజువుకాకుండా ప్లాన్ చేశారని తేల్చారు. ఈ మేరకు నిహారిక, హసన్‌లను సోమవారం అరెస్టు చేశారు. ఎల్బీ నగర్ డీసీపీ సాయిశ్రీ ఈ వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం తమ కస్టడీలో ఉన్న హరిహరకృష్ణను వివిధ కోణాల్లో ప్రశ్నిస్తున్నామని తెలిపారు.

తన ప్రేయసికి మళ్లీ దగ్గరవుతున్నాడనే..

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హరిహరకృష్ణ, నవీన్, హసన్, నిహారిక దిల్‌సుఖ్‌నగర్‌లోని ఓ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివారు. అప్పట్లో నిహారిక, నవీన్ ప్రేమించుకున్నారు. తర్వాత హరిహరకృష్ణ పీర్జాదిగూడలోని ఓ కాలేజీలో, నవీన్ నార్కట్‌పల్లిలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో బీటెక్‌లో చేరారు. అయితే కొన్నాళ్లుగా నిహారిక హరిహరకృష్ణతో సన్నిహితంగా ఉంటోంది. ఈ విషయం తెలిసిన నవీన్ పదేపదే ఆమెను ప్రశ్నించాడు. నవీన్ మళ్లీ నిహారికకు దగ్గరవుతున్నాడని భావించిన హరిహరకృష్ణ అతడిని అంతం చేయాలని పథకం వేశాడు. ఇందులో భాగంగానే గత నెల 17న గెట్ టు గెదర్ పేరుతో నవీన్‌ను రప్పించి.. తన బైక్‌పై అబ్దుల్లాపూర్‌మెట్ పరిధిలోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకువెళ్లి హత్య చేశాడు. అక్కడి నుంచే మృతదేహం, ముక్కలు చేసిన శరీర భాగాల ఫొటోలను నిహారికకు వాట్సాప్ ద్వారా పంపాడు.

శరీర భాగాలను బ్యాగ్‌లో వేసుకొని..

నవీన్ గుండె, తల, ఇతర శరీర భాగాలను ఓ బ్యాగ్‌లో వేసుకున్న హరిహరకృష్ణ.. తుర్కయాంజాల్ జేఎన్‌యూఆర్‌ఆర్‌ఎం కాలనీలో ఉండే హసన్‌కు ఫోన్ చేసి హత్య విషయం చెప్పి వెంటనే అబ్దుల్లాపూర్‌మెట్ రావాలని కోరాడు. కానీ, హరిహరకృష్ణనే తన ఇంటికి రావాలని హసన్ సూచించాడు. అర్ధరాత్రి 12:30 గంటలకు హసన్ ఇంటికి వెళ్లాడు. ఇద్దరూ కలసి మన్నెగూడ వరకు వెళ్లి శరీర భాగాలతో కూడిన బ్యాగ్‌ను పారేసి వచ్చారు. ఆ రాత్రి హసన్ ఇంట్లోనే ఉన్న హరిహరకృష్ణ.. అక్కడే స్నానం చేసి, రక్తపు మరకలతో ఉన్న వస్త్రాలు విడిచి హసన్ ఇచ్చిన బట్టలు వేసుకున్నాడు. రక్తపు మరకలున్న బట్టలను మరుసటిరోజు ఓ చెత్త కుండీలో పడేశాడు.

ప్రేయసికి హత్యాస్థలాన్ని చూపి..

తర్వాతి రోజు నిహారిక వద్దకు వెళ్లిన హరిహరకృష్ణ.. ఖర్చుల కోసం రూ.1,500 ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నాడు. అనంతరం ఇద్దరి మధ్య వాట్సాప్ చాటింగ్ కొనసాగింది. నవీన్‌ను చంపిన చోటిని చూపాలని నిహారిక కోరడంతో గత నెల 20న సాయంత్రం ఆమెను బైక్‌పై అబ్దుల్లాపూర్‌మెట్‌కు తీసుకెళ్లాడు. కొంతదూరం నుంచి హత్యస్థలాన్ని చూపించాడు. తిరిగి వస్తూ ఓ హోటల్‌లో కలిసి భోజనం చేశారు. ఆమెను హస్తినాపురంలో దింపి వెళ్లిపోయాడు.

ప్లాన్ ప్రకారం ఆధారాలు నాశనం

గత నెల 24న పోలీసులకు లొంగిపోవాలని భావించిన హరిహరకృష్ణ తొలుత హత్య ఆనవాళ్లు నాశనం చేయడానికి సిద్ధమయ్యాడు. అతడి కోరిక మేరకు హసన్ మన్నెగూడకు వెళ్లి నవీన్ తలను ఓ బ్యాగ్‌లో తెచ్చి ఇచ్చాడు. మిగతా శరీరభాగాలనూ తెచ్చి హత్య చేసిన చోటే మృతదేహంతోసహా కాల్చేయాలని సూచించాడు. హసన్ సూచన మేరకు అన్ని శరీరభాగాలతోపాటు బ్యాగ్‌నూ కాల్చేశాడు. ఆపై హరిహరకృష్ణ, హసన్, నిహారిక ముగ్గురూ తమ వాట్సాప్ సంభాషణలు, ఫొటోలు, ఫోన్ కాల్స్‌ను డిలీట్ చేశారు. హరిహరకృష్ణ అదే రోజున నిహారిక ఇంటికి వెళ్లాడు. ఎవరూ లేకపోవడంతో అక్కడే స్నానంచేసి, సాయంత్రం దాకా ఉన్నాడు. తర్వాత అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. ప్రధాన నిందితుడికి సహకరించడం, హత్య విషయం తెలిసినా ఎవరికీ చెప్పకపోవడం, ఆధారాలు ధ్వంసం చేయడానికి సహకరించడం ఆరోపణలపై హసన్, నిహారికలను అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ప్రస్తుతం హరిహరకృష్ణ పోలీసు కస్టడీలో ఉన్నాడు. అతడి ఫోన్‌ను, హత్యకు వినియోగించిన కత్తిని స్వాధీనం చేసుకోవడం, ఇతర ఆధారాలు సేకరించడంపై పోలీసులు దృష్టి పెట్టారు. కత్తిని ఓ చెరువులో విసిరేసినట్టు నిందితుడు చెప్పడంతో.. చెరువులో గాలించాలని నిర్ణయించారు.

ఓ సినిమా, యూట్యూబ్ వీడియోలు చూసి..

ఈ కేసులో తాను లొంగిపోయి అరెస్టు అయినా కోర్టులో నేరం నిరూపణ కాకుండా ఉండాలనే శరీర భాగాలతోపాటు ఇతర ఆధారాలను హరిహరకృష్ణ నాశనం చేశాడని పోలీసులు తెలిపారు. ఇటీవలి విక్రమ్ సినిమాలోని పలు సన్నివేశాలతోపాటు యూట్యూబ్‌లోని అటాప్సీ వీడియోలను చూసి ప్రేరణ పొందాడని పేర్కొన్నారు.

ప్రీతి కేసు ఎటువైపు?

- ఆమె ఆత్మహత్య చేసుకుందా? ఇంకేమైనా జరిగిందా?
- ఎఫ్ఎస్ఎల్ నివేదిక వస్తేనే స్పష్టత
- టాక్సికాలజీ రిపోర్టులో ఏం లేదనే విషయాలు చక్కర్లు
- మళ్లీ సైఫ్ కస్టడీ కోరుతూ మట్టెవాడ పోలీసుల పిటిషన్



సాక్షి, వరంగల్: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కాకతీయ మెడికల్ కాలేజీ(కేఎంసీ) అనస్తీషియా విభాగం పీజీ వైద్యవిద్యార్థిని ప్రీతి మృతి ఆత్మహత్యనా ఇతరత్రా ఏమైనా జరిగిందా? అనే అనుమానంపై ఇంకా స్పష్టత రావట్లేదు. ఓ వైపు ప్రీతిది హత్యేనంటూ ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తుండగా, ఇంకోవైపు టాక్సికాలజీ రిపోర్టు అధికారికంగా వెల్లడించకపోవడం, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టు వస్తేనే స్పష్టమైన కారణాలు తెలుస్తాయని పోలీసులు భావిస్తుండటంతో కేసు చిక్కుముడి వీడేందుకు ఇంకెన్ని రోజులు పడుతుందో అంతుబట్టడంలేదు. నిందితుడైన ఎం.ఎ.సైఫ్‌ను నాలుగు రోజులు కస్టడీలో విచారించిన మట్టెవాడ పోలీసులు.. మరో రెండు రోజులు కస్టడీకి ఇవ్వాలంటూ కోర్టులో సోమవారం పిటిషన్ వేశా రు. దీనిపై విచారణను కోర్టు మంగళవారానికి వాయిదా వేయడంతో నిందితుడిని ఖమ్మం జైలుకు తరలించారు.

ఇంకా క్లారిటీ రాలేదా?

ప్రీతితో గొడవకు దారితీసిన పరిస్థితులతోపాటు ఆమెను వేధించడానికి ఎవరెవరి సహాయాన్ని తీసుకున్నాడన్న దానిపై నిందితుడు సైఫ్‌ను పోలీసులు ప్రశ్నించారు. అదే సమయంలో పోలీసులకు లభించిన టెక్నికల్ డేటాను కూడా సైఫ్ ముందుంచి వివరాలు రాబట్టినట్లు తెలిసింది. విష రసాయనాలు ఏమీ తీసుకోలేదని టాక్సికాలజీ రిపోర్టు చెబుతోందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలోనే సైఫ్‌ను మరో రెండు రోజులు కస్టడీకి ఇవ్వాలని కోర్టులో పిటిషన్ వేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నాలుగు రోజుల కస్టడీలోనూ సైఫ్ పోలీసులకు చెప్పిన సమాచారం అసమగ్రంగా ఉండటంతో మళ్లీ కస్టడీకి కోరినట్లు తెలుస్తోంది.

కీలకంగా ఎఫ్ఎస్ఎల్ రిపోర్ట్

ప్రీతి కేసులో వేధింపులు, ర్యాగింగ్ జరిగినట్లు పోలీసులు నిర్ధారించినా ఇప్పటికి త్రిసభ్య కమిటీ సమర్పించిన నివేదికలోని అంశాలను ఎక్కడా ప్రస్తావించలేదు. తాజాగా టాక్సికాలజీ రిపోర్టులో ఏ విష రసాయనం తీసుకున్నట్టు లేదని నివేదిక వచ్చిందని చక్కర్లు కొడుతున్న వార్తలతో అసలు ప్రీతిది ఆత్మ హత్య కాదా...మరేమైనా జరిగిందా అనే దిశగా పోలీసు విచా రణ మారినట్టు తెలిసింది. ప్రీతి ఆత్మ హత్య కేసును కాస్త అనుమానాస్పద మృతిగా మార్చే అవకాశం కూడా లేకపోలేదు. ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎల్ఎస్) ఇచ్చే నివేదిక కీలకం కానుందని పోలీస్ వర్గాలు అంటున్నాయి.

సైఫ్‌నే కాదు...ఇంకొంత మంది?

ప్రీతి ఆత్మహత్య ఘటన వెనుక ఒక్క ఎంఏ సైఫ్‌నే కాదా.. మరికొంత మంది ఉన్నారన్న కోణంలో మట్టెవాడ పోలీసుల విచారణ సాగుతోంది. కొంతమంది సీనియర్ విద్యార్థులంతా ఒక గ్రూప్‌గా ఏర్పడి వేధింపులకు గురిచేసినట్టుగా ఓ లీడ్ దొరికిందని, ఇది తెలుసుకోవాలంటే నిందితుడు సైఫ్ కస్టడీని మరో నాలుగు రోజులు ఇవ్వాలని వరంగల్ పోలీసులు సోమవారం దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాగే, 'సెకండియర్స్ అనస్తీషియా స్టూడెంట్స్ లైసెన్స్‌డ్ డ్రగ్ డీలర్స్' అనే వాట్సాప్ గ్రూప్ నిర్వహిస్తున్నారు. ఈ గ్రూప్‌లో అందరూ సీనియర్స్ మమేకమై జూనియర్లను కంట్రోల్‌లోకి తీసుకునేలా మెసేజ్‌లు పోస్టు చేశారు. ఈ కేసులో ఇతర సీనియర్ల పాత్రను కూడా నిర్ధారించాల్సి ఉంది. సైఫ్ ఇప్పటి వరకు ఇచ్చిన స్టేట్‌మెంట్ ప్రకారం ఈ కేసులో మరి కొంతమంది ప్రమేయం ఉన్నట్టుగా అనుమానం వస్తోంది' అని పేర్కొన్నారు.

ఆటో దిగుతూ ఒకరు.. భోజనానికి వచ్చి మరొకరు

గుండెపోటుతో ఇద్దరు యువకుల మృతి.. మరో రెండు ఘటనల్లో మరో ఇద్దరు

రెంజల్(బోధన్)/కామారెడ్డి క్రైం/మనోహరాబాద్(తూప్రాన్)/నాగార్జునసాగర్: గుండెపోటు మరణాలు బెంబేలెత్తిస్తున్నాయి. ఆటో దిగుతూనే కుప్పకూలి డ్రైవర్.. అప్పటి వరకు కుస్తీ పోటీల రిఫరీగా పనిచేసి.. ఆకొద్దిసేపటికే మరొకరు.. ఇలా సోమవారం చోటుచేసుకున్న ఆయా ఘటనల్లో నలుగురు గుండెపోటుతో మరణించారు. నిజామాబాద్ జిల్లా రెంజల్‌కు చెందిన గైని సాయిలు(45) హోలీ సందర్భంగా సోమవారం గ్రామంలో నిర్వహించిన కుస్తీపోటీల్లో ఎంపైర్‌గా వ్యవహరించాడు. పోటీలు పూర్తయి భోజనానికి ఇంటికి చేరుకున్న కొద్దిసేపటికే కుప్పకూలిపోవడంతో బంధువులు ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు.

ఆటో దిగుతూనే..

కామారెడ్డి జిల్లా బీబీపేటకు చెందిన మహ్మద్ మదార్(40) కామారెడ్డిలోని అయ్యప్పనగర్‌లో ఉంటూ వాటర్‌ప్లాంట్‌లో పనిచేస్తున్నాడు. సోమవారం ఆటోలో వాటర్ బాటిళ్లను వేసుకుని తోటి డ్రైవర్ ప్రవీణ్‌తో కలిసి వెళ్లాడు. గంజి స్కూల్ ప్రాంతంలో వాటర్ క్యాన్లను డెలివరీ చేసిన అనంతరం ఓచోట ఆటోను ఆపి దిగుతూనే గుండెపోటుతో కుప్పకూలాడు. స్థానికులు మదార్‌కు సీపీఆర్ చేసి ఏరియా ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందాడు.

మరో రెండు ఘటనల్లో ఇద్దరు..

మెదక్ జిల్లా కాళ్లకల్ గ్రామానికి చెందిన ఉట్ల అశోక్(37) డ్రైవర్. ఆదివారం రాత్రి గుండెపోటుతో అశోక్ నిద్రలోనే హఠాన్మరణం చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. నల్లగొండ జిల్లా హిల్‌కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రం–1 టీచర్ దానమ్మ(50) ఆదివారం అస్వస్థతకు గురైంది. ఆమెను హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సోమవారం గుండెపోటు రావడంతో మృతిచెందింది.

అసలేం జరిగిందో చెప్పాలి?

- రక్తం శుద్ధి చేశాకే రక్తనమూనాలు తీసుకున్నారు
- అందుకే అందులో విషం లేదని రిపోర్టులు వస్తున్నాయి
- మా కూతురిది ముమ్మాటికీ హత్యే
- మెడికల్ కళాశాల వాళ్లు నిజాలు దాస్తున్నారు
- మీడియాతో వైద్య విద్యార్థిని ప్రీతి తల్లిదండ్రులు
- శాంతిభద్రతల అదనపు డీజీ సంజయ్ జైన్‌ను కలసి వినతిపత్రం అందజేత



అదనపు డీజీ సంజయ్ జైన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రీతి కుటుంబసభ్యులు

సాక్షి, హైదరాబాద్: తమ కూతురు మరణించి రోజులు గడుస్తున్నా ఏ కారణంతో ఆమె మృతిచెందింది? మరణానికి ముందు ఆమెకు డాక్టర్లు ఏం వైద్యం చేశారన్నది తెలియడం లేదని, అసలేం జరిగిందనేది బయటపెట్టాలని వైద్య విద్యార్థిని ప్రీతి కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. ప్రీతికి నిమ్స్‌లో వైద్యం అందించిన సమయంలో రక్త నమూనాలు సేకరించారని, అప్పటికే జరిగిన వైద్యంతో రక్తం శుద్ధి అయ్యాకే నమూనాలు సేకరించడంతో అందులో విషం లేదని రిపోర్టులు వస్తున్నాయని ప్రీతి తండ్రి నరేందర్, ఇతర కుటుంబసభ్యులు స్పష్టం చేశారు. సీనియర్ విద్యార్థి సైఫ్‌తోపాటు ఇతరుల వేధింపులతోనే తమ కూతురు మృతి చెందిందని, ప్రీతిది ముమ్మాటికీ హత్యేనని వారు ఆరోపించారు. ఈ మేరకు లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఇతర సభ్యులతో కలసి ప్రీతి కుటుంబసభ్యులు సోమవారం డీజీపీ కార్యాలయంలో శాంతిభద్రతల అదనపు డీజీ సంజయ్‌కుమార్ జైన్‌కు వినపతిపత్రం ఇచ్చారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ పలు అనుమానాలు లేవనెత్తారు.

సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించాలి...

వైద్యులు ప్రీతి శవానికి వైద్యం చేస్తున్నట్లు డ్రామాలాడారని కుటుంబసభ్యులు ఆరోపించారు. ప్రీతి చనిపోవడానికి ముందు 20 రోజులపాటు వరుసగా రోజూ 24 గంటలపాటు డ్యూటీలు వేసి వేధించారన్నారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించాలని, దోషులను కఠినంగా శిక్షించాలని శాంతిభద్రతల అదనపు డీజీని కోరినట్లు తెలిపారు. 'మా పాప అందరితో ప్రేమగా ఉంటుంది. కానీ జూనియర్ డాక్టర్లను భయపెట్టి స్టేట్‌మెంట్లు ఇప్పిస్తున్నారు. దయచేసి మా అమ్మాయికి న్యాయం చేయాలని చేతులెత్తి మొక్కుతున్నా' అని ప్రీతి తల్లి శారద కోరారు. 'మా అక్కకు న్యాయం జరిగే వరకు రోడ్డెక్కి న్యాయపోరాటం చేస్తాం. ఓ ఇంటర్ విద్యార్థి చనిపోతే తోటి విద్యార్థులు ముందుకొచ్చి అన్ని విషయాలు చెబుతున్నారు. అదే తరహాలో వైద్య విద్యార్థులు ఇప్పటికైనా ముందుకొచ్చి వాస్తవాలు బయటపెట్టాలి' అని ప్రీతి సోదరుడు వంశీనాయక్, సోదరి పూజ విజ్ఞప్తి చేశారు.

కుటుంబ సభ్యుల అనుమానాలివీ

- ఎక్కడైనా అవకతవకలు జరిగితే ముందు సంబంధిత అధికారులను సస్పెండ్ చేశాకే విచారణ చేస్తారు. కానీ మెడికల్ కాలేజీలో సంబంధిత హెచ్ఓడీని ఎందుకు సస్పెండ్ చేయలేదు?
- ప్రీతిది హత్యే అని మా నమ్మకం. ఇందులో సైఫ్‌తోపాటు మిగతావారెవరో తేల్చాలి? ఘటన జరిగింది ఆపరేషన్ థియేటర్‌లో అంటున్నారంటే అక్కడ సీనియర్లు, జూనియర్ డాక్టర్లు, సిబ్బంది ఉండాలి కదా?
- ఎంజీఎంలో బ్లడ్ శాంపిల్స్ ఎందుకు తీసుకోలేదు? ఒకవేళ తీసుకుంటే ఆ రిపోర్ట్‌లు ఏం అయ్యాయి?
- ఘటన జరిగిన రోజు తెల్లవారుజామున 3:40 గంటలకు ప్రీతి అపస్మారక స్థితిలో ఉన్నట్లు గమనిస్తే ఉదయం 8:10 గంటల వరకు మాకు ఎందుకు సమాచారం ఇవ్వలేదు? ఈలోపు ఏం జరిగింది?
- అపస్మారకస్థితిలో ఉన్న ప్రీతి ఫింగర్ ప్రింట్ వాడి తన మొబైల్‌ను ఎవరు, ఎందుకు అన్‌లాక్ చేశారు? గూగుల్ సెర్చ్, వాట్సాప్ డేటా ఎందుకు మార్చారు?
- గవర్నర్‌కు ప్రీతి చనిపోయినట్టు సమాచారం ఉంది కాబట్టే గవర్నర్ దండతో వచ్చారు. కానీ, ప్రీతికి వైద్యం అందిస్తున్నట్టు డాక్టర్లు గవర్నర్‌ను సైతం తప్పుదోవ పట్టించినట్టు అనుమానిస్తున్నాం.
- ఎంజీఎం నుంచి ప్రీతిని నిమ్స్‌కు తీసుకెళ్లినప్పుడు కళ్లకు టేప్ ఎందుకు అతికించారు?



చుట్టూ ఉన్న మనుషులను పరిశీలనగా చూడనిదే జీవితంలో అలవాటు పడలేని పరిస్థితులంటూ ఏవీ ఉండవన్న సత్యం బోధపడదు.

– లియో టాల్‌స్టాయ్

సాక్షి

మంగళవారం, మార్చి, 7

వెంటాడు... వేటాడు...

పరిశోధన, ప్రజా విధానాలకు సూచన, సలహాల్లో యాభై ఏళ్ళుగా కృషి చేస్తూ, స్వర్ణోత్సవం జరుపుకోవడమనేది ఉత్సాహంగా ముందుకు అడుగేయాల్సిన సందర్భం. కానీ, అందుకు విరుద్ధంగా అడుగులు ముందుకు పడకుండా పాలకులే అడ్డం పడితే? పౌర విధానానికి సంబంధించి దేశంలోకెల్లా అత్యంత గౌరవనీయమైన ఢిల్లీకి చెందిన మేధావుల బృందమైన 'సెంటర్ ఫర్ పాలసీ రిసెర్చ్' (సీపీఆర్) విషయంలో ఇప్పుడు జరుగుతున్నది అలానే ఉంది. ఆ సంస్థకు విదేశీ విరాళాలు, ఆర్థిక సహాయం అందే వీలు లేకుండా 'విదేశీ సహాయ (నియంత్రణ) చట్టం' (ఎఫ్‌సీఆర్‌ఏ) కింద రిజిస్ట్రేషన్‌ను ఆరు నెలల పాటు కేంద్రం రద్దు చేసింది. ఈ మేరకు కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖ ఫిబ్రవరి 27న ఉత్తర్వులివ్వడం జాతీయ, అంతర్జాతీయ మేధావులను ఉలిక్కిపడేలా చేసింది.

విద్యావిషయిక కార్యక్రమాలకే లైసెన్స్ ఇచ్చామనీ, కానీ సీపీఆర్ మాత్రం విదేశీ విరాళాలను పుస్తక ప్రచురణ లాంటి వాటికీ వినియోగిస్తోందనీ ఆ ఉత్తర్వుల ఆరోపణ. అయిదు నెలల క్రితం గత సెప్టెంబర్‌లో ఢిల్లీలోని సీపీఆర్ కార్యాలయం, అలాగే ఆక్స్‌ఫామ్ ఇండియా, పలు డిజిటల్ మీడియా సంస్థలకు నిధులిచ్చే బెంగళూరుకు చెందిన 'ఇండిపెండెంట్ అండ్ పబ్లిక్ స్పిరిటెడ్ మీడియా ఫౌండేషన్' (ఐపీఎస్ఎంఎఫ్)లపై ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ విరుచుకుపడింది. సర్వేలు నిర్వహించింది. ఆ వెంటనే సిబ్బందికి సమన్లు వెళ్ళాయి. దానికి కొనసాగింపుగా పన్ను మినహాయింపును రద్దు చేస్తామని హెచ్చరిస్తూ, షోకాజ్ నోటీసు వెళ్ళాయి. ఒక రకంగా దాని కొనసాగింపే – ఇప్పుడీ లైసెన్స్ రద్దు. నిజానికి, లాభాపేక్ష రహిత స్వచ్ఛంద సంస్థగా 1976 నుంచి సీపీఆర్‌కు పన్ను మినహాయింపు లభిస్తోంది. వచ్చే 2027 దాకా మినహాయింపు ఉన్నా, ఇప్పుడీ బెదిరింపులు గమనార్హం.

ఆదాయపు పన్ను లెక్కల్లో తేడాలుంటే విచారించడం తప్పు కాదు. చట్టం ముందు అందరూ సమానులే గనక ఏమన్నా తప్పు చేసినట్టు రుజువైతే చర్యలు తీసుకోవడమూ తప్పనిసరే. కానీ, మనసులో ఏదో పెట్టుకొని, ఏ చిన్న లోపం కనిపించినా, వెంటాడి వేధించాలని అనుకుంటేనే అది హర్షించలేని విషయం. ఆ సంస్థ బాధ్యుల్లోని పరిశోధకులు కొందరు ప్రభుత్వ విధానాల్ని తప్పుబడుతూ ఇటీవల రాసిన వ్యాసాలే దీనికి హేతువని ఓ బలమైన విమర్శ. ఎక్కడా, ఏ తప్పూ చేయలేదని తేలినప్పటికీ, సాంకేతిక కారణాలే సాకుగా సీపీఆర్ లాంటి స్వతంత్ర మేధాసంస్థను వేధిస్తున్నారన్నది స్పష్టం. కొండను తవ్వి ఎలుకను పట్టే ఈ దీర్ఘకాల ప్రక్రియతో మానసికంగా వేధించడమే పాలక వర్గాల పరమార్థంగా కనిపిస్తోంది.

నిజానికి, సీపీఆర్ అనేది దేశంలోని అగ్రేసర స్వతంత్ర పరిశోధనా సంస్థల్లో ఒకటి. విభిన్న రంగాలకు చెందిన పరిశోధకులు, వృత్తినిపుణులు, విధాన నిర్ణేతలతో కూడిన మేధావుల బృందం ఇది. ఈ లాభాపేక్ష రహిత సంస్థ 50 ఏళ్ళ క్రితం 1973లో ఏర్పాటైంది. ప్రభుత్వ విధానాల్లోని వివిధ అంశాలపై ఈ సంస్థలోని బుద్ధిజీవులు దృష్టి సారిస్తుంటారు. ఆర్థికవేత్త – మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి వై.వి. చంద్రచూడ్ సహా పలువురు మేధావులు ఈ సంస్థ కార్యవర్గంలో మాజీ సభ్యులు. అనేక కేంద్ర శాఖలతో, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాలతోనూ కలసి పనిచేసిన ఈ సంస్థను భారత ప్రభుత్వం గుర్తించింది. దశాబ్దాలుగా పన్ను మినహాయింపూ ఇస్తోంది. గత ఏడాదీ వివిధ రాష్ట్రాలు, కేంద్ర శాఖల నుంచి సీపీఆర్‌కు నిధులు వచ్చాయి.

మరి, ఉన్నట్టుండి సీపీఆర్ జీవితం మీద పాలకులకు ఎందుకు విరక్తి కలిగినట్టు? దీనికి రకరకాల కథనాలు వినిపిస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో పనిచేస్తున్న 'జన అభివ్యక్తి సామాజిక్ వికాస్ సంస్థ' (జస్వాస్) సహా దాదాపు 30 సంస్థలకు డేటా సేకరణ, పర్యావరణ చట్టం సహా పలు అంశాల్లో పరిశోధనకు సీపీఆర్ నిధులిచ్చింది. ఛత్తీస్‌గఢ్‌లో ఏనుగులు తిరిగే జీవవైవిధ్య ప్రాంతం హస్‌దేవ్‌లో బొగ్గు గనుల అక్రమ తవ్వకంపై ఆదివాసీ ఉద్యమంలో జస్వాస్ ట్రస్టీ అయిన ఒక పరిశోధకుడి భాగం కూడా ఉంది. ఆ గనులు పాలకుల ఆశీస్సులున్న వ్యాపార సంస్థవనీ, ఆ ఉద్యమానికీ – సీపీఆర్‌తో జస్వాస్ భాగస్వామ్యానికీ సంబంధం లేకున్నా పాలకులకు అది కోప కారణమైందనీ విశ్లేషకుల మాట. కారణాలు ఏమైనా, ఏలినవారికి కోపమొస్తే బండి నడవడం కష్టమనే విషయం తాజా సీపీఆర్ లైసెన్స్ రద్దుతో మరోసారి రుజువు చేస్తోంది.

గమనిస్తే – ఐటీ విభాగం తన నోటీసుల్లో పేర్కొన్న పరిశీలనలు, చేసిన ఆరోపణలు దాని పరిధిని దాటి ఉన్నాయి. ఇది పాలకులపై అనుమానాలకు ఊతమిస్తోంది. సీపీఆర్ మాత్రం తమ కార్యకలాపాలన్నీ చట్టబద్ధమైనవేననీ, ప్రభుత్వ సంస్థలు తమ ఆదాయ వ్యవహారాలను ఎప్పటికప్పుడు ఆడిట్ చేస్తూనే ఉన్నాయనీ స్పందించింది. రాజ్యాంగ విలువల స్ఫూర్తితో ఈ వివాదం వీలైనంత త్వరలో సమసిపోతుందని అభిలషించింది. ఆ అభిలాష వాస్తవరూపం ధరిస్తే సంతోషమే. అయితే, పాలకులు తమ చేతుల్లోని దర్యాప్తు సంస్థలనూ, విభాగాలనూ దుర్వినియోగం చేయడానికి ఏ మాత్రం వెనుకాడని గతం, వర్తమానమే భయపెడుతున్నాయి. నిబంధనల్లోని సాంకేతిక అంశాలను ఆయుధంగా చేసుకొని, భావప్రకటన స్వేచ్ఛకున్న అవకాశాల్ని అడ్డుకోవాలని పాలకులు చూడడం ఆందోళన రేపుతోంది. ఐటీనైనా, విదేశీ స్వార్థ ప్రయోజనాలు మన దేశ రాజకీయాలను ప్రభావితం చేయరాదని పెట్టుకున్న ఎఫ్‌సీఆర్‌ఏ లాంటి నియంత్రణ వ్యవస్థనైనా ప్రభుత్వేతర సంస్థల పీక నులమడానికి వాడితే అది అప్రజాస్వామికమే కాదు... అచ్చమైన ప్రతీకారమే!

విశాఖను వరించిన పెట్టుబడులు



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

కేవలం 1 శాతం సంపన్నవంతులను మాత్రమే పట్టించుకుంటూ, ప్రపంచంలోని మిగతా 99 శాతం భవిష్యత్తును గాలికి వదిలేయకూడదు. కొద్దిమంది చేతుల్లో ద్రవ్య అధికార కేంద్రీకరణ జరిగి అది మిగతా ప్రపంచ భవిష్యత్తును శాసించడం పచ్చి నిరంకుశత్వం. వీటిని పూర్తిగా గుర్తెరిగి, ప్రపంచ పెట్టుబడులను పూర్తిగా ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా మలుస్తూ సాగింది విశాఖపట్నంలోని గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్. విశాఖ కేంద్రాన్ని ప్రపంచ పెట్టుబడులకు కేంద్ర స్థానంగా ఎందుకు మార్చకూడదన్న ఆలోచనతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ ముందుకు సాగిన ఫలితమే – ఈ సదస్సు.

''20వ శతాబ్దపు పెట్టుబడిదారీ వ్యవస్థ 21వ శతాబ్దపు సమాజాన్ని తీర్చిదిద్దడంలో విఫలమైందా? గత 30 సంవత్సరాల వ్యవధిలో సంపన్న వర్గాలకూ, పేద వర్గాలకూ మధ్య ఆదాయ వనరులలో వ్యత్యాసం దారుణంగా పెరిగిపోయింది. ఈ పరిస్థితుల్లో మనకు నూతన వ్యవస్థ అవసరమని చెప్పినంత మాత్రాన పరిస్థితులు మారవు. ఉన్న వ్యవస్థ ఎందుకు ప్రజాబాహుళ్యం అవసరాలను తీర్చలేకపోతోంది? కొలది మందిలో పేరుకుపోయిన అవధులు లేని కోరికలు; పేద, కార్మిక వర్గాల హక్కులపై సాగుతున్న దాడులు– ఈ పరిస్థితులు వెరసి ఉత్పత్తి అవుతున్న సంపద పంపిణీలో వాటాను పేద సాదలు అనుభవించనివ్వకుండా చేస్తున్నాయి. ఇలా పేద సాదల న్యాయమైన డిమాండ్ కుంచించుకు పోతూ, వ్యాపార సరళి దెబ్బతింటూపోతే వ్యాపార వర్గాల వ్యాపారమూ బతికి బట్ట కట్టలేదని గుర్తించాలి. కనుకనే, అమెరికా అధ్యక్ష కార్యాలయ సలహాదారుగా పనిచేసిన లారీ సమ్మర్స్ 40 శాతం అమెరికన్లలో పెట్టుబడిదారీ విధానమంటే సానుకూల అభిప్రాయం లేదని బాహాటంగా చాటాడు''.

– షరాన్ బ్రూనో, అంతర్జాతీయ ట్రేడ్ యూనియన్ సమాఖ్య ప్రధాన కార్యదర్శి

''నానాటికీ పెరిగిపోతున్న సామాజిక అసమానతలు ప్రపంచ ప్రజల భావి భాగ్యోదయానికీ, భద్రతకూ కాచుకు కూర్చున్న పెద్ద ప్రమాదం''.

– ప్రపంచ ఆర్థిక, సహకారాభివృద్ధి సమాఖ్య

ప్రపంచ పెట్టుబడులకు దావోస్ కేంద్ర స్థానంగా ఉండి, వర్ధమాన బతుకుల్ని శాసిస్తూ వచ్చిన దశ నుంచి కొత్త మార్పు మొదలైంది. కేవలం 1 శాతం సంపన్నవంతుల గొంతును వినిపిస్తూ ప్రపంచంలోని మిగతా 99 శాతం ప్రజాబాహుళ్యం భవిష్యత్తును దావోస్ గాలికి వదిలేస్తూ వచ్చింది. కనుకనే స్విట్జర్లాండ్ యువజన సమాఖ్య అధిపతి డేవిడ్ రాత్, కొద్దిమంది చేతుల్లో ఈ ఆర్థిక, ద్రవ్య అధికార కేంద్రీకరణ మిగతా ప్రపంచ ప్రజాబాహుళ్యం భవిష్యత్తును శాసించడం పచ్చి నిరంకుశత్వంగా అభివర్ణించాడు. అలాంటి దావోస్ సభలలో

రెండో మాట



చర్చలను, ఫలితాలను అవగతం చేసుకొని వచ్చిన అనుభవం నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి హోదాలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం పథక రచన చేశారు.

భారతదేశంలో విశిష్ట సహజ సాగర వనరులకు కేంద్రంగా, సహజ సంపదలకు ఆలవాలంగా ఉండి, దేశీయ పారిశ్రామిక స్థావరాలలో ఆంధ్రప్రదేశ్ తూర్పు కోస్తాలో ప్రభవిల్లుతూ వచ్చిన నగరం– విశాఖపట్నం. విశాఖ కేంద్రాన్ని ప్రపంచ పెట్టుబడులకు కేంద్ర స్థానంగా ఎందుకు మార్చకూడదన్న ఆలోచనతో జగన్ ముందుకు సాగిన ఫలితమే – గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023. భారీ పారిశ్రామిక, ఉపాధి అవకాశాల కేంద్రంగా ఈ విశాఖ సదస్సును జయప్రదం చేయగలగడం అతని వయస్సుకు మించిన గౌరవాన్ని తెచ్చి పెట్టింది. ఎందుకంటే, బహు కొలది మందిగా ఉన్న సంపన్నుల చేతుల్లో ఆర్థిక, ద్రవ్య వనరుల కేంద్రీకరణ వల్ల ఆ వర్గాలే మిగతా అసంఖ్యాక ప్రజా బాహుళ్యంపై నియంతృత్వం చలాయించే ప్రమాదం ఇప్పటికే బలంగా పొంచి ఉంది. అందుకే జగన్ తన 'నవరత్నాల' పథకం ద్వారా ఆదిలోనే ప్రజా ప్రయోజనాల రక్షణకు 'ఏడుగడ'గా నిలిచారు. అందుకే విశాఖ పెట్టుబడుల సదస్సు వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలకు రాగల నష్టం ఏమీ ఉండదు. పైగా ప్రపంచ వ్యాపిత పెట్టుబడులు రాష్ట్రానికి రాగల అవకాశాలు మరింతగా పెరిగాయి.

రాష్ట్రానికి కేంద్రమూ, బీజేపీ పాలకులూ రాష్ట్ర విభజన సమయంలో హామీ పడిన ప్రత్యేక హోదా విషయంలో అనుసరిస్తున్న 'రాజకీయ తాత్సారం' వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు అపారమైన నష్టం వాటిల్లింది. దీనికితోడు క్రియాశీల పాత్ర నిర్వహించవలసిన అతుకుల బొంత 'తెలుగుదేశం', 'గాలివాటు' రాజకీయాలకు పేరుమోసిన 'సినీ వంగడం' పవన్ కల్యాణ్ 'వారాహి' అబద్ధాలకు మించి ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేని దుస్థితిలో ఉన్నారు. ఈ రాజకీయ 'విచిత్ర వేషధారణ' తంతు పసికట్టిన ప్రధాని మోదీ తన బీజేపీ (ఆరెస్సెస్)కి ఏపీలో రాజకీయ అవకాశాల్ని పెంచుకోవడం కోసం 'దేశం'తో పవన్‌కు ఉన్న చెట్టాపట్టాల్ని తెగ్గొట్టగలిగారేగానీ, వారి మధ్య అక్కరకు రాని రహస్య సమావేశాల్ని ఆపలేకపోయారు. అయితే ఏపీ సీఎం జగన్ ప్రగతి మార్గాన్నీ, 'నవరత్నాల' బలమైన ప్రభావాన్నీ వీళ్లెవరూ అడ్డుకోలేక పోయారు. పైగా ఆయనకు అవాంతరాలు కల్పిస్తూ రోజు రోజుకీ ప్రజల ముందు అభాసుపాలవుతున్నారు. ఈ దశలో రాష్ట్రానికి దూసుకువచ్చిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ శిఖరాగ్ర సమావేశం జగన్ చొరవ ఫలితంగా జయప్రదం కాగల్గింది.

అందుకే జగన్ ''మేము అమలు చేస్తున్నవి కేవలం ఉచిత పథకాలు కావు. ఇదంతా మానవ వనరుల మీద పెడుతున్న పెట్టుబడిగా మేం భావిస్తున్నాం. మానవ వనరుల నైపుణ్యాభివృద్ధిపైన పెట్టుబడిగా భావిస్తున్నాం. మా విద్యార్థులు సొంత కాళ్లపై నిలబడి, ఉన్నత స్థానాలకు ఎదగడానికి అవసరమైన వనరులను సమకూరుస్తున్నాం. అందుకోసం విద్యాప్రమాణాలు పెంపొందిస్తున్నాం. అభివృద్ధిలో వారిని భాగస్వాములు చేస్తున్నాం'' అనగలిగారు. జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు 62 శాతం పదవులు ఇచ్చి దేశ చరిత్రలో నూతన ఒరవడిని సుస్థిరపరిచి దేశ చరిత్రలోనే మొదటి స్థానంలో జగన్ నిలబడటానికి 'దమ్ము' అందించినవీ, అధికారానికి రావడానికి ముందే సుదీర్ఘమైన పాదయాత్ర ద్వారా గడించిన ప్రజాస్పర్శతో ప్రకటించినవీ అనుల్లంఘనీయమైన 'నవరత్నాల'ని మరచిపోరాదు. తద్వారా దేశంలోని రాజకీయ పార్టీలకూ, ముఖ్యమంత్రులకూ తండ్రి రాజశేఖరరెడ్డి తర్వాత అంత ఆదర్శంగా నిలిచినవాడు జగన్!

abkprasad2006@yahoo.co.in

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

తగ్గించుకోవద్దు



మన పట్ల మనం అసంతృప్తితో ఉంటాం. ఆత్మగౌరవాన్ని కలిగి ఉండం. కనుకనే మన గురించి ఇతరులు ఇచ్చే ప్రశంసలకు, వారు చేసే విమర్శలకు మనం విలువ ఇస్తాం.

– స్వామీ పరమాత్మానంద సరస్వతి

ఇద్దరూ ఇద్దరే



ట్విట్టర్‌లో ఇప్పుడు రెండు విషయాలు ట్రెండింగ్‌లో ఉన్నాయి: 1. రాహుల్ జిత్రోస్ భారత్ 2. బైడెన్ డిస్ట్రాయ్స్ అమెరికా. ఎంత నిజం!! ఇద్దరూ రాజకీయ బుద్ధిహీనులు. ఇద్దరివీ తెలివితక్కువ విధానాలు.

– లీలీ లిన్, యాక్టివిస్ట్

ఇదీ సంస్కారం



నూతన సీఎస్ఐఆర్ (కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్) భవనాన్ని 1953 జనవరి 10న అప్పటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం అజాద్ ప్రారంభిస్తుండగా ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ హాజరయ్యారు. ఇలాంటి ఆలోచన మోదీ ప్రభుత్వంలో సాధ్యమా?

– సుధీంద్ర కులకర్ణి, సోషియో పొలిటికల్ యాక్టివిస్ట్

ధైర్యమంటే ఇదేనా?



'జైళ్లను నింపండి' అని తన మద్దతుదారులకు పిలుపునిచ్చిన ఇమ్రాన్ ఖాన్... ఇస్లామాబాద్ పోలీసుల బృందం తనను అరెస్ట్ చేసేందుకు వచ్చినప్పుడు వారికి కనిపించకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఎంతటి ధైర్యవంతుడు!

– సోనమ్ మహాజన్, రాజకీయ పరిశీలకురాలు

మిత్ర ద్రోహం



ఐరాస మానవ హక్కుల మండలి సమావేశంలో టర్కీ మళ్లీ పాకిస్తాన్ వైపే నిలబడింది! 'ఆపరేషన్ దోస్త్' పేరిట భారత్ నుంచి సహాయం అందుకున్న టర్కీ... కశ్మీర్‌లో భారత్ మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతోందని తాజాగా ఆరోపించింది! తన పాత బుద్ధిని చూపించింది.

– వడిరాజ్ సీఎస్, యూట్యూబర్

తప్పు తప్పే



తప్పు ఒప్పుకోవడం మన ఘనతను తగ్గించదు. నా ట్వీట్‌లలో ఏదైనా తప్పు ఉందని తెలుసుకున్నప్పుడు వెంటనే నేను ఆ ట్వీట్‌లను తొలగిస్తాను. ట్వీట్‌లను తొలగించడంలో లేదా నా తప్పును అంగీకరించడంలో నాకు ఎలాంటి సమస్యా ఉండదు. ఎందుకంటే నేను వామపక్ష అభ్యుదయ వాద మూర్ఖుడిని కాదు.

– వరుణ్ కుమార్ రానా, రాజకీయ వ్యాఖ్యాత

నాలుగు నగరాలు



వాతావరణ మార్పు కారణంగా వరదల ముప్పు ఎక్కువగా ఉన్న నాలుగు ప్రపంచ మహా నగరాలలో గ్వాంగ్‌జౌ, మయామి, న్యూయార్క్‌లతో పాటుగా ముంబై కూడా ఉందని 'నేచర్ జర్నల్' అధ్యయనం రెండేళ్ల క్రితమే వెల్లడించింది! లేకుంటే ముంబైలో ఇప్పుడీ అకాల వర్షం ఏమిటి!! వాతావరణ మార్పు ఫలితాలు మొదలయ్యాయా?

– అభిలాష్ శుక్లా, వాతావరణ ఉద్యమకారుడు

ఎన్నికల ఏడాదిలో అబద్ధాల ప్రచారమే వారి ఎత్తుగడ!

అభిప్రాయం



కొమ్మినేని శ్రీనివాసరావు

ఆంధ్రప్రదేశ్‌లో ఇక ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం కాదు... 'ఈనాడు' మీడియానే. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు కాదు... 'ఈనాడు' అధినేత రామోజీరావే! ఈ మధ్య కాలంలో 'ఈనాడు' మీడియాలో వస్తున్న వార్తలను గమనిస్తే ఈ అభిప్రాయం కలుగుతుంది. చంద్రబాబు చేసే విమర్శలకు తన మీడియాలో అత్యధిక ప్రాముఖ్యం ఇవ్వడంతో పాటు, టీడీపీ చెప్పడానికి ఇబ్బంది పడే విషయాలను రామోజీ తన భుజాన వేసుకుని మోస్తున్నారు. కొద్ది రోజుల క్రితం తాలిబన్ల రాజ్యం అంటూ సంపాదకీయంలో విషం కక్కిన ఆయన మరో అడుగు ముందుకేసి వలంటీర్ల వ్యవస్థకు వ్యతిరేకంగా ప్రచారం ఆరంభించారు. ఏకంగా వలంటీర్లపైనే ఒక ప్రముఖ పత్రిక సంపాదకీయం రాసిందంటేనే ఆ వ్యవస్థ ఏపీలో ఎంత బలంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వారిని వైసీపీ వలంటీర్లు అని 'ఈనాడు' రామోజీ ముద్రవేసి ఇందులో రాజకీయాలను చొప్పించడానికి తీవ్రకృషి చేశారు.

ఇక్కడ ఒక విషయం గమనించాలి. చంద్రబాబు నాయుడు ఒకప్పుడు వలంటీర్లను అవమానిస్తూ మాట్లాడారు. వారిని మూటలు మోసేవారిగా అభివర్ణించడమే కాకుండా, మధ్యాహ్నపువేళ మగవాళ్లు ఇళ్లలో లేనప్పుడు వారు వెళ్లి ఆడవారిని ఇబ్బందిపెడతారంటూ అభ్యంతర వ్యాఖ్యలు చేశారు. దానిపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. దాంతో ఆయన తన స్వరం మార్చుకుని తాము కూడా వలంటీర్లను తొలగించబోమని చెప్పవలసి వచ్చింది. అయితే ఈ వ్యవస్థ వల్ల అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్‌కు జనంలో ఆదరణ పెరుగుతోందన్న భావన ఉంది. దీనిని దెబ్బకొట్టాలంటే ఏమి చేయాలన్న ఆలోచనతోనే బహుశా తమలో తాము చర్చించుకున్న తర్వాత రామోజీరావు రంగంలో దిగినట్టు అనిపిస్తుంది. అందుకే ఆయన హైకోర్టులో వలంటీర్లకు సంబంధించి ఒక పిటిషన్‌పై విచారణ జరుగుతుండగా... గౌరవ న్యాయమూర్తి వేసిన కొన్ని ప్రశ్నల ఆధారంగా సంపాదకీయం రాసేసి తన దుష్ట తలంపును బహిర్గతం చేసుకున్నారని అనుకోవచ్చు. హైకోర్టుకు కూడా తెలుగుదేశం అనుకూల వర్గాలే వెళ్లి ఉంటాయి. వలంటీర్ల వల్ల వ్యక్తిగత గోప్యతకు భంగం వాటిల్లుతుందని రామోజీ కనిపెట్టేశారు.

మూడేళ్ల క్రితం ఈ వ్యవస్థ వచ్చాక ప్రజలకు ఎంతో సదుపాయం ఏర్పడింది. ప్రజలు ప్రభుత్వ ఆఫీస్‌ల చుట్టూ తిరిగే పని లేకుండా పోయింది. వారు దరఖాస్తులు సమర్పించడంలో సైతం తోడ్పడి వాటిని గ్రామ, వార్డు సచివాలయాలకు అందచేస్తున్నారు. ఆ తర్వాత తగు ప్రాసెస్ అయిన అనంతరం ఆదేశాలు వస్తున్నాయి. వాటిని తిరిగి వలంటీర్లు సంబంధిత దరఖాస్తుదారులకు వాటిని అందచేస్తున్నారు. ఇంత సౌలభ్యం దేశంలో ఎక్కడా లేదు. ఈ వలంటీర్ల గురించి టీడీపీ మీడియా చేస్తున్న అసత్య ప్రచారం వల్ల టీడీపీకి నష్టం వస్తోందని భావించి... కొత్త రూట్‌లో న్యాయస్థానం ద్వారా ఆటంకాలు సృష్టించాలని ప్రయత్నిస్తున్నారు. సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను గుర్తించడం ప్రభుత్వ అధికారుల విధి అనీ, ప్రజల సమాచారాన్ని వలంటీర్లు ఎలా ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారనీ గౌరవ న్యాయమూర్తి ప్రశ్నించారట. వాళ్లకేమైనా సర్వీస్ నిబంధనలు ఉన్నాయా అని కూడా అడిగారట. గౌరవ న్యాయమూర్తి తన సంశయాలను తీర్చుకోవడానికి ప్రశ్నలు వేయడం సమంజసమే. కానీ, హైకోర్టులో వచ్చిన ప్రశ్నల ఆధారంగా మొదటి పేజీలో ఒక కథనాన్ని రాయడమే కాకుండా, సంపాదకీయం కూడా రాసి రామోజీ తన కడుపుమంట తీర్చుకున్నారు. ఎటువంటి కట్టుబాట్లు లేని సొంత కార్యకర్తల సైన్యానికి సేవాదళమనే ముసుగును జగన్ వేశారని రామోజీ ఆరోపించారు. మరి ఇదే రామోజీ టీడీపీ హయాంలో నోట్లో వేలు వేసుకుని కూర్చున్నారా? అప్పట్లో ఘోరంగా జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను వేధించుకు తిన్నప్పుడు రామోజీకి అంతా బ్రహ్మాండంగా కనిపించిందా? స్థానిక టీడీపీ నేతల చుట్టూ తిరగలేక, వారికి ముడుపులు చెల్లించలేక ప్రజలు నానా యాతనలు పడినప్పుడు రామోజీకి అదంతా గొప్ప విషయంగా కనిపించింది.

ఇప్పుడు అలాంటి సమస్యలేవీ లేకుండా ప్రజలకు అత్యంత ప్రయోజనకరంగా ఉన్న ఈ వ్యవస్థను ఎలా దెబ్బతీయాలా అని రామోజీ కుట్ర చేస్తున్నారు. టీడీపీకి జరిగే నష్టంతో పాటు మరో ఏడుపు కూడా ఆయనకు ఉంది. అదేమంటే వలంటీర్లద్వారా ఒక పత్రిక కొనుగోలు చేస్తున్నారట. వారు 'సాక్షి' పత్రికనే కొంటున్నారట. అది కూడా వారికి తెగ బాధగా ఉంది. దీనిపై హైకోర్టుకు కూడా వెళ్లినా 'ఈనాడు'కు సానుకూలంగా ఫలితం రాలేదు. అయినా సంపాదకీయంలో మళ్లీ రోదిస్తూ అదే విషయం రాశారు. వీరు ఐటీ, పాన్ కార్డుల వంటి సున్నిత వ్యక్తిగత విషయాలను కూడా సేకరిస్తున్నారట. అలాగే జగన్ ప్రభుత్వం స్వేచ్ఛా పావురం గొంతు నులిమేస్తున్నదనీ, నియంతృత్వంగా ఆయన వ్యవహరిస్తున్నారనీ... ఇలా ఏవేవో రాశారు. జాగ్రత్తగా ఆలోచిస్తే రామోజీనే ఆంధ్ర ప్రదేశ్ పాలిట విష సర్పంగా మారారు. రామోజీ దృష్టిలో పౌరహక్కులంటే టీడీపీ చేసే అల్లర్లకు పూర్తి లైసెన్స్ ఇవ్వాలి. తాము ఎంత చెత్త



రాసినా ఎవరూ నోరెత్తకూడదు. ఇక్కడ ఒక ఉదాహరణ చెప్పాలి. గతంలో ర్యాలీలు తీశారనో, 144 సెక్షన్ ఉల్లంఘించారనో ఆనాటి విపక్ష నేతలు కొడాలి నాని, వైఎస్ అవినాశ్ రెడ్డి వంటి అనేకమందిపై కేసులు పెడితే ఇప్పటికీ వారు కోర్టుల చుట్టూ తిరగవలసి వస్తోంది. కొందరిపై కోర్టు కేసులు కొట్టివేసింది. ఆ పరిస్థితి ఆనాడు ఉంటే అది అత్యంత ప్రజాస్వామ్యంగా రామోజీకి కనిపించింది. ఇప్పుడు రోడ్ల మీద అనుమతులు తీసుకుని రోడ్ షో, ర్యాలీలు జరుపుకోండనీ, ఇరుకు రోడ్లపై సభలు పెట్టి తొక్కిసలాటలకు కారణం కావద్దనీ ప్రభుత్వం ఆదేశం ఇస్తే... అది పౌరహక్కుల ఉల్లంఘన అని ఇదే రామోజీ ప్రచారం చేశారు. నడిరోడ్లపై సభలు పెట్టి ప్రజలకు ఇబ్బంది కలిగించడం ప్రజాస్వామ్యం అని ఈయన కొత్త నిర్వచనం ఇచ్చారు.

వలంటీర్లు అధికార పార్టీకి ఉపయోగపడతారని కొందరు వైసీపీ నాయకులు ఏవేవో వ్యాఖ్యలు చేశారట. అవన్నీ శిలాశాసనాలుగా వలంటీర్లు పాటిస్తారన్నట్లుగా 'ఈనాడు' రాసింది. ఇందులో ఎంతవరకు హేతుబద్ధత ఉందన్నది ఆలోచిస్తే చాలా తక్కువే. కాకపోతే వలంటీర్లను చూసి టీడీపీ, చంద్రబాబు, 'ఈనాడు', రామోజీరావులు బాగా భయపడుతున్నారని మాత్రం తెలిసిపోతుంది. వలంటీర్లు క్షేత్ర స్థాయిలో ఉండే వర్కర్లు. వారు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులే తప్ప వారే నిర్ణయాధికారం కలిగినవారు కారు. అయినా రామోజీ తెగ ఆడిపోసుకున్నారు. ఈ మూడేళ్లలో జనం ఎక్కడా వలంటీర్ల మీద దాదాపు ఫిర్యాదులే చేయలేదు. పైగా ఈ వ్యవస్థ ఫలితాలను ఎంజాయ్ చేస్తున్నారు. ఎక్కడైనా ఒకటీ, అరా ఫిర్యాదులు వచ్చినా ప్రభుత్వం వారిపై చర్య తీసుకుంటోంది. ఇన్ని కోట్ల మందికి సేవలందిస్తున్న వలంటీర్లు ఎక్కడా ప్రజల వ్యక్తిగత గోప్యతకు భంగం కల్గించారనో, మరొకటనో ఫిర్యాదులే చేయలేదు. అయినా ఈ రకంగా తంపులు పెట్టాలని 'ఈనాడు' రామోజీ టీడీపీ వారికి సలహా ఇస్తున్నట్లుగా ఉంది.

పౌర హక్కుల గురించి ఇంత బాధపడుతున్న రామోజీ తన వ్యాపార సంస్థలలోఎక్కడైనా, ఎప్పుడైనా ఎలాంటి హక్కులైనా అమలు చేశారా? అక్కడ జర్నలిస్టులు, ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతారన్న సంగతి తెలియనిది ఎవరికి? మరి రామోజీ దీనికేమంటారు? ఆత్మవంచన కాక మరేమిటి? కేవలం తనకు సర్క్యులేషన్ ఎక్కువగా ఉందన్న ఒకే ఒక అహంభావంతో, తాను ఏమి రాసినా ఎంతో కొంత ప్రభావం ఉంటుందన్న భ్రమతో ఇలాంటి వాస్తవ విరుద్ధ సంపాదకీయాలు రాస్తున్నారు. రాజకీయ ప్రయోజనం, వ్యాపార లక్ష్యాలతో రామోజీ ఇలాంటి చెత్త సంపాదకీయాలు రాయడం జర్నలిజం విలువలకు, ప్రమాణాలకు పాతరేయడమే అవుతుంది. అందుకే ఇకపై రామోజీనే తనకు తానే ప్రధాన ప్రత్యర్థిగా ఊహించుకుంటూ ముఖ్యమంత్రి జగన్ పై ఉన్నవీ, లేనివీ కలిపి ఈ ఎన్నికల ఏడాది పచ్చి అబద్ధాలు ప్రచారం చేయడానికి సన్నద్ధం అవుతున్నారని ఇట్టే కనిపెట్టేయవచ్చు.


వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

'హోలీ హై....'

సాధారణంగా మనం జరుపుకొనే పండగలన్నిటికీ, ఏటేటా ఋతుచక్ర భ్రమణం వల్ల ప్రకృతిలో జరిగే మార్పులతో లంకె ఉంటుంది. ఫాల్గుణ పూర్ణిమ నాటికి దక్షిణ భారతంలో చెప్పుకోదగ్గ మార్పులేమీ ప్రకృతిలో కనబడవు. కానీ ఉత్తర భారతంలో మాత్రం ఫాల్గుణమంటే, ఎముకలు కొరికే చలి పీడ దూరమై, స్తబ్దత తొలగే సమయం. వసంతం కూతవేటు దూరంలోకి వచ్చి, వసంత శోభ అంకురాలు కనిపించే సమయం. అందుకే ఉత్తర భారతంలో హోలీ పండగ దీపావళి తరవాత అంత పెద్ద పండగ.

దక్షిణ భారత సంప్రదాయంలో మనకు ఫాల్గుణ పౌర్ణమి ప్రధానంగా కామదహన పౌర్ణమి. సాగర మథన సందర్భంలో క్షీరాబ్ధి కన్యక అవతరించిన తిథి కనక మనకు ఫాల్గుణ పౌర్ణమి... మహాలక్ష్మి జయంతి పర్వదినం. మహాలక్ష్మి పుట్టిన రోజే, మధుర మీనాక్షీ సుందరేశ్వరుల పెళ్లి రోజు కావటం మరొక విశేషం.

మనం పండగలు జరుపుకొనే విధానాలలో మన పెద్దలు కర్మ, భక్తి, జ్ఞాన యోగాలకు మూడింటికి సంబంధించిన సంప్రదాయాలు ఇమిడ్చి ఉంచటం కనిపిస్తుంది. కర్మలలో అభిరుచి



జ్యోతిర్మయం

కలవారి కోసం ప్రతి పండగపూటా ఆచరించాల్సిన కొన్ని సాధారణ విధులు– తలంట్లూ, కొత్త బట్టలూ, దైవ ప్రార్థనలూ వంటివి ఉంటాయి. వాటితోపాటు, ఒక్కో పండగకు యథాశక్తి ఆచరించవలసిన కొన్ని ప్రత్యేకమైన తంతులు కూడా ఏర్పడి ఉన్నాయి. ఫాల్గుణ పూర్ణిమ నాటి సాయంత్రం హోలీ మంటలు వేయటం, వాటి చుట్టూ సామూహికంగా నృత్యగానాలు జరపటం, ఆ మర్నాడు అందుబాటులో ఉన్న బంధుమిత్రులు అందరితో ఒకరిపై ఒకరు రంగులు జల్లుకొంటూ సరసాలాడుకొంటూ పరస్పర సౌహార్దం ప్రకటించుకోవడం, వాళ్ళతో విందులూ వినోదాలూ జరుపుకోవడం వంటివి హోలీ పండగ నాటి ప్రత్యేక విధులు.

భక్తి యోగులకయితే, హోలీ నెగళ్ళు కూడా భగవల్లీలల సంస్మరణే. భక్తాగ్రణి ప్రహ్లాదుడిని చంపబోయి తన దుర్మార్గానికి తానే ఆహుతయిన హోలికా రాక్షసి పురాణ కథను ఆ మంటలు గుర్తుకు తెస్తాయి. కామదేవుడిని కంటి చూపుతో దహించిన కైలాసనాథుడి కథను స్మృతికి తెస్తాయి.

అరిషడ్వర్గంలో ప్రథమం, ప్రధానం అయిన కామాన్ని కాల్చివేసి, మనసును నియంత్రించి, ఏకాగ్రతతో సాధన సాగించమన్న సందేశానికి హోలీ నెగళ్ల ప్రతీక! జ్ఞానయోగ సాధకులకు దీనినే జ్ఞాపకం చేస్తుంది.

– ఎం. మారుతి శాస్త్రి
(నేడు హోలీ పర్వదినం)

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం, తిథి: పౌర్ణమి సా.5.51 వరకు, తదుపరి బ.పాడ్యమి, నక్షత్రం: పుబ్బ రా.2.12 వరకు, తదుపరి ఉత్తర, వర్జ్యం: ఉ.8.45 నుండి 10.28 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.38 నుండి 9.25 వరకు, తదుపరి రా.10.56 నుండి 11.45 వరకు, అమృతఘడియలు: రా.7.11 నుండి 8.55 వరకు, హోలీ పౌర్ణమి; రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు, యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు, సూర్యోదయం: 6.19, సూర్యాస్తమయం: 6.03.

క్లుప్తంగా...

భోజనం వికటించి గురుకుల విద్యార్థులకు అస్వస్థత



ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న గురుకుల పాఠశాల విద్యార్థులు

ములుగు రూరల్: భోజనం వికటించి గురుకుల పాఠశాల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన ములుగు జిల్లా ములుగు మండలం మల్లంపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం చోటు చేసుకుంది. ఏటూరునాగారం మండలకేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలను అక్కడ సరైన వసతులు లేని కారణంగా మల్లంపల్లిలోని ఓ ప్రైవేటు బిల్డింగ్‌లో కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం విద్యార్థులకు భోజనంలో పాలకూర పప్పు వడ్డించారు. భోజనం చేసిన విద్యార్థులు అభిరాం, మనోహర్, యువరాజ్, మనువర్ధన్ రెడ్డి, కార్తీక్, తరుణ్ సోమవారం ఉదయం కడుపు నొప్పితోపాటు వాంతులు, విరోచనాలు అవుతున్నాయని హెల్త్ సూపర్‌వైజర్ ఉదయకు తెలిపారు. ఆమె అందించిన మాత్రలు వేసుకున్నప్పటికీ తగ్గకపోవడంతో ఐదుగురు విద్యార్థులను ఇంటర్ చదువుతున్న విద్యార్థితో ఆస్పత్రికి పంపించారు. విద్యార్థులు ఆస్పత్రిలో అడ్మిట్ అయి చికిత్స పొందుతున్నారు. ఈ విషయం విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియడంతో హుటాహుటిన ఆస్పత్రికి చేరుకున్నారు. విద్యార్థులను ఆస్పత్రికి తరలించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉపాధ్యాయులు, హెల్త్ సూపర్‌వైజర్‌పై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పాఠశాలలో విద్యార్థులు తరచూ అనారోగ్యం పాలవుతున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై వివరణ కోరేందుకు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ అంకయ్యను ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.


కొత్తకోట సీఐపై చర్య తీసుకోండి

సాక్షి, న్యూఢిల్లీ: వనపర్తి జిల్లా కొత్తకోట సీఐ శ్రీనివాస్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ తెలంగాణ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ జాతీయ బీసీ కమిషన్‌ను కోరారు. వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మనిగిల్ల గ్రామానికి చెందిన శివకుమార్‌ను.. వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్లో సీఐ శ్రీనివాస్‌రెడ్డి అక్రమంగా బంధించి విచక్షణారహితంగా కొట్టారని తెలిపారు. ఈమేరకు సోమవారం ఢిల్లీలోని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారాంను.. బాధితుడు శివ యాదవ్‌తో కలిసి యుగంధర్‌గౌడ్ ఫిర్యాదు చేశారు. అనంతరం తెలంగాణ భవన్‌లో విలేకరులతో యుగంధర్‌గౌడ్ మాట్లాడుతూ, బాధితుడు శివ యాదవ్ ఫిబ్రవరి 22న పొలంలో ఉండగా కానిస్టేబుల్ ఫోన్‌చేసి రప్పించారని.. పెద్దమందడి పరిధి దాటి వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్లో అక్రమంగా నిర్బంధించి థర్డ్ డిగ్రీ ప్రయోగించారని వివరించారు. ఎస్పీ, డీజీపీలకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో జాతీయ బీసీ కమిషన్‌ను ఆశ్రయించినట్లు తెలిపారు.

హక్కుల సాధనకు వీఆర్‌ఏల పోరుబాట

సాక్షి, యాదాద్రి: హక్కుల సాధనకు మంగళవారం నుంచి మునుగోడు నుండి యాదాద్రి దేవాలయం వరకు పాదయాత్ర చేపడుతున్నట్లు వీఆర్‌ఏ హక్కుల సాధన సమితి రాష్ట్ర కమిటీ కన్వీనర్ నార్ల శ్రీనివాస్ ముదిరాజ్, కో చైర్మన్ నర్సింహారావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పలుమార్లు ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని వాపోయారు. అందుకే మునుగోడు నుంచి ఉద్యమ కార్యాచరణ చేస్తున్నామని తెలిపారు. ఈ నెల 9న జరిగే మంత్రివర్గ సమావేశంలో వీఆర్‌ఏల సమస్యల పరిష్కారానికి జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 12వ తేదీన యాదగిరిగుట్టలో బహిరంగ సభ నిర్వహిస్తామని తెలిపారు.

సింగిల్ పట్టి మిర్చి రికార్డు ధర రూ.48 వేలు



మార్కెట్‌కు వచ్చిన మిర్చి

వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం వచ్చిన సింగిల్ పట్టి మిర్చి రకం మార్కెట్ చరిత్రలోనే అత్యధికంగా క్వింటా రూ.48 వేల ధర పలికిందని మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి బీవీ రాహుల్ తెలిపారు. సోమవారం మార్కెట్‌కు 100 బస్తాలు వచ్చాయని, ఈ రకం మిర్చిని భూపాలపల్లి, ములుగు జిల్లాల్లోని రైతులు ఎక్కువగా పండిస్తారని తెలిపారు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 360 బస్తాలు వచ్చాయని తెలిపారు.

ఏనుమాముల మార్కెట్‌కు పోటెత్తిన మిర్చి

వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు సోమవారం మిర్చి పోటెత్తింది. 60 వేల బస్తాలకు పైగా వచ్చింది. శని, ఆదివారాలు మార్కెట్‌కు సెలవు ఉండటంతో సోమవారం ఒక్కసారిగా రైతులు మిర్చిని తీసుకొచ్చారు.

రేపటి నుంచి 'ఆరోగ్య మహిళ': హరీశ్

- కొత్త పథకానికి ప్రభుత్వం శ్రీకారం
- మహిళాదినోత్సవం రోజు ప్రారంభం
- మహిళల కోసం ప్రత్యేకంగా వంద ఆస్పత్రులు
- గాంధీ, పేట్లబురుజు, వరంగల్ ఆస్పత్రుల్లో సంతాన సాఫల్య కేంద్రాలు
- డ్వాక్రా మహిళలకు రూ.750 కోట్ల వడ్డీలేని రుణాలు



డిగ్రీ విద్యార్థి సంగమేశ్వర్‌తో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: 'ఆరోగ్య మహిళ'అనే కొత్త పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి టి.హరీశ్‌రావు ప్రకటించారు. మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం రాష్ట్రవ్యాప్తంగా వంద మహిళా ఆస్పత్రులను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది అందరూ మహిళలే పనిచేస్తారని, మహిళలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా ఇబ్బంది పడకుండా వైద్యసేవలు పొందేవిధంగా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లాలో పలు అభివృద్ధి పనులకు మంత్రి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో మహిళలనుద్దేశించి మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. ఈ ఆస్పత్రుల్లో ప్రతి మంగళవారం ప్రత్యేకంగా మహిళలకే వైద్యం అందిస్తామన్నారు. రూ.16 కోట్లతో గాంధీ, పేట్లబురుజు, వరంగల్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో మూడు సంతాన సాఫల్య కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళా దినోత్సవ కానుకగా మహిళా సంఘాలకు రూ.750 కోట్ల మేర వడ్డీలేని రుణాలు ఇవ్వాలని సీఎం కేసీఆర్ ఆదేశించారని, ఈ మొత్తాన్ని బుధవారం వారి ఖాతాల్లో జమ చేస్తామన్నారు. ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ స్కీంను అమలు చేస్తామని, ఏప్రిల్ 1 నుంచి సెర్ప్ ఉద్యోగుల వేతనాల పెంపు అమలులోకి వస్తుందని చెప్పారు.

శ్రీరామ నవమి తర్వాత న్యూట్రిషన్ కిట్లు

శ్రీరామ నవమి తర్వాత రాష్ట్రంలోని గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని హరీశ్‌రావు తెలిపారు. కిట్లలో నెయ్యి, ఖర్జూరం వంటి ఐరన్ అందించే సరుకులు ఉంటాయని, తద్వారా తల్లితోపాటు శిశువు కూడా ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. చెట్లు పెడితే ఓట్లు పడవని, అయినా భవిష్యత్ తరాల మేలు కోసం సీఎం కేసీఆర్ హరితహారం కార్యక్రమం చేపట్టారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ నేతలు ధరణిని రద్దు చేస్తామంటున్నారని, అలా చేయడమంటే పేదల ఉసురు పోసుకోవడమేనన్నారు. ధరణిని రద్దు చేస్తామంటే ప్రజలు కాంగ్రెస్ పార్టీని రద్దు చేస్తారని ఎద్దేవా చేశారు. తాము ప్రజల నీళ్ల కష్టాలు తీర్చితే.. కేంద్రంలోని బీజేపీ సర్కారు రైతుల బోర్లకు మీటర్లు పెట్టాలని చూస్తోందన్నారు. గ్యాస్ సిలిండర్ ధర పెంచి సామాన్యులకు కునుకులేకుండా చేస్తోందని విమర్శించారు. మంత్రి వెంట జెడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్,, నేతలు చింత ప్రభాకర్, ఎర్రోల్ల శ్రీనివాస్, మల్కాపురం శివకుమార్, డీఎంఈ రమేశ్‌రెడ్డి, కలెక్టర్ శరత్ ఉన్నారు.


పాలమ్మిన.. పూలమ్మిన.. కష్టపడ్డ

- బీఏ విద్యార్థితో మంత్రి మల్లారెడ్డిని అనుకరింపజేసిన హరీశ్‌రావు

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: 'పాలమ్మిన.. పూలమ్మిన.. కష్టపడ్డ.'.. అంటూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న మంత్రి మల్లారెడ్డి మాటలను ఆర్థిక, వైద్యారోగ్య శాఖమంత్రి టి.హరీశ్‌రావు ఓ డిగ్రీ విద్యార్థితో అనుకరింపజేశారు. సోమవారం సంగారెడ్డి జిల్లాలో పర్యటించిన హరీశ్ ప్రభుత్వ (తారా) డిగ్రీ కళాశాలలో నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కాసేపు సరదాగా ముచ్చటించారు. బీఏ మొదటి సంవత్సరం విద్యార్థి సంగమేశ్వర్ తాను మల్లారెడ్డి ఫ్యాన్ అని చెప్పాడు. మల్లారెడ్డిని అనుకరించాలని హరీశ్‌రావు సూచించడంతో.. సంగమేశ్వర వెంటనే మల్లారెడ్డిని అనుకరించాడు. పాలమ్మిన.. పూలమ్మిన.. కష్టపడ్డ.. పనిచేసిన.. సక్సెస్ అయిన.. అంటూ అనుకరించడంతో విద్యార్థుల్లో నవ్వులు విరిశాయి. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'మల్లన్న సోషల్ మీడియాలో బాగా ట్రెండ్ అవుతున్నారు. హిట్స్ అన్నీ మల్లన్నకే ఉన్నాయి. మాలాంటి వాళ్లకు దొరకడం లేదు' అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. మంత్రి మల్లారెడ్డి కష్టపడి పైస్థాయికి ఎదిగారని, విద్యాసంస్థలు నెలకొల్పి వేలాది మందికి ఉన్నత విద్య అందిస్తున్నారని తెలిపారు. పెద్దయ్యాక నువ్వు ఏమవుతావని సంగమేశ్వర్‌ను మంత్రి అడగ్గా.. వ్యాపారం చేసి డబ్బులు సంపాదిస్తానని బదులిచ్చాడు.

భావోద్వేగంతో మాట్లాడా..

- ఇంతటితో దీన్ని ముగిద్దాం
- వీడియోలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- లీకైన ఆడియోపై వివరణ
- నేను ముందు మాట్లాడినవి కట్ చేసి బయటపెట్టారు
- వేరేవిధంగా అర్థం చేసుకోవద్దని ప్రజలను కోరుతున్నా..



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: 'నకిరేకల్ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి కాంగ్రెస్ పార్టీలో జాయిన్ అయ్యి, మునుగోడు ఉప ఎన్నికలప్పటినుంచి నాపై వ్యక్తిగతంగా చెప్పలేని భాషలో అనరాని మాటలు అంటున్నారు. చెప్పలేని భాషలో తిడుతూ పోస్టులు పెడుతున్నారు. దాన్ని అడగడానికి ఫోన్ చేస్తే మీరు క్యాప్షన్ చూడొద్దు లోపల చూడండి అని మాట్లాడినప్పుడు భావోద్వేగానికి లోనై మాట్లాడానే తప్ప నాకు ఎవరినీ తిట్టే అలవాటు లేదు..'అని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్ కొడుకు సుహాస్‌కు ఎంపీ వెంకట్‌రెడ్డి ఫోన్ చేసి సుధాకర్‌ను చంపుతారంటూ మాట్లాడినట్లుగా ఉన్న ఆడియో ఒకటి ఆదివారం లీకై వైరల్ అయిన సంగతి తెలిసిందే. దీనిపై కోమటిరెడ్డి సోమవారం మీడియాకు విడుదల చేసిన ఒక వీడియోలో వివరణ ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి..

మూడు నెలలుగా తిడుతున్నారు..

'యూత్ కాంగ్రెస్‌లో ఉన్నప్పటి నుంచి మొదలుకుని ఎమ్మెల్యే, మంత్రి, ఎంపీ అయినా 33 ఏళ్లుగా అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నా. పేద ప్రజలే ప్రాణంగా ఉండే నాకు.. వారు కంట నీరు పెడితే నాకు కూడా కళ్లల్లో నీరు వస్తుంది. శత్రువును కూడా ప్రేమించేవాడిని. వేరే పార్టీ వాళ్లు వచ్చి అడిగినా మంత్రిగా వారి పని చేశా. అలాంటిది మూడు నెలలుగా సోషల్ మీడియా వేదికగా రోజూ తిడుతున్నారు. అయినా పట్టించుకోలే. పోస్టర్లు వేసినా ఎక్కడా రియాక్టు కాలే. వాటి వెనకాల ఇప్పుడు చెప్పిన వ్యక్తే ఉన్నాడు. నేను చెప్పకపోయినా మావాళ్లు దీనిపై కంప్లైంట్ ఇచ్చారు.

ఎవరైనా హెడ్డింగే చూస్తారు..

ఆ అబ్బాయి నాకు సన్నిహితుడు కాబట్టి అడగడానికి ఫోన్ చేస్తే హెడ్డింగ్ చూడొద్దు అనే సరికి భావోద్వేగానికి లోనయ్యా. ఆ హెడ్డింగ్ అంత నీచంగా ఉన్నది. ఎవరైనా హెడ్డింగే చూస్తరు. ప్రతి వాట్సాప్ లోపలికిపోయి చూడరు. ఇక నేను ముందు మాట్లాడిన పాయింట్స్ కట్ చేసి కేవలం నేను దూషించినట్లుగా ఆడియో బయట పెట్టారు. దీన్ని వేరేవిధంగా అర్థం చేసుకోవద్దని ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నా. నేను అన్ని కులాలను, మతాలను, పేదలను, ధనికులను సమానంగా చూసుకుంటూ నా చేతనైనంత సేవ చేస్తున్నా. వ్యక్తిగతంగా ఏ ఇంట్లో శుభం జరిగినా, అశుభం కలిగినా, ఎవరైనా చదువుకోవాలన్నా, నా కొడుకు పేరు మీద ఫౌండేషన్ పెట్టి సహాయం చేస్తున్నా.

మీ టికెట్ కోసం నన్ను తిట్టడం సరికాదు..

మీ టికెట్ కోసం, మీ రాజకీయాల కోసం, మీకు నచ్చిన నాయకుల దగ్గర వెంకట్‌రెడ్డిని తిడితే మీకు టికెట్ వస్తదని జెప్పి నన్ను వేధించడం మంచి పద్ధతి కాదని విజ్ఞప్తి చేస్తున్నా. ఇంతటితో దీన్ని ముగిద్దాం. ముఖ్యంగా ప్రజలందరికీ చెబుతున్నా.. వెంకట్‌రెడ్డి ఎప్పుడూ బదనాం కాడు. వెంకట్‌రెడ్డి ఎప్పుడూ అన్యాయం చేయలేదు. న్యాయం, సేవ తప్ప మరొకటి చేయలేదు. మేధావులు అంతా విజ్ఞతతో ఆలోచించండి. సోషల్ మీడియాలో నాపై వచ్చినవి మీరు కూడా చూడండి. నన్ను రెచ్చగొడుతున్నరు. అయినా నేను రెచ్చిపోకూడదు. ఇకముందు ఇలాంటి భాష కూడా నేను వాడను. మీకు టికెట్ కావాలంటే తెచ్చుకోండి. నేను కూడా నా చేతనైన సాయం చేసి గెలిపిస్త. కానీ మీకు నచ్చిన నాయకుని దగ్గర నన్ను దూషించడం మంచి పద్ధతి కాదు. మీరు అది మానుకోండి..'అని వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు.

'కోమటిరెడ్డి ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలి'



నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ సంఘాల నాయకులు

లింగోజిగూడ: చెరుకు సుధాకర్‌గౌడ్‌ను చంపుతానని బెదిరించిన భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఆయన ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేయాలని పలు బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. చెరుకు సుధాకర్‌పై వెంకట్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం ఎల్బీనగర్ జ్యోతిరావ్ పూలే విగ్రహం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో బీసీ నాయకులకు రక్షణ లేకుండా పోయిందని, వెంటనే సుధాకర్‌కు జెడ్ ప్లస్ సెక్యూరిటీ కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే వారికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు చామకూర రాజు, శ్రీధర్‌గౌడ్, శ్యామ్‌యాదవ్, కేవీ గౌడ్, వెంకటేశ్‌గౌడ్, శ్యాంసుందర్, కొండల్‌గౌడ్, దుర్గయ్యగౌడ్, రామ్‌కోటి ముదిరాజ్, బాలుగౌడ్, బొంగు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కోమటిరెడ్డి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి: శ్రీధర్‌గౌడ్

చెరుకు సుధాకర్‌గౌడ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ సీనియర్ నాయకుడు, బీసీ సంఘం నాయకుడు శ్రీధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. సుధాకర్‌పై కోమటిరెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా బీసీ సంఘాల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వెంటనే వెంకట్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమణగౌడ్, కందికంటి శ్రీధర్‌గౌడ్, గణేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై కేసు నమోదు చేయాలి

- 'దిశ'కేసులో అమికస్‌క్యూరీ వాదనలు

సాక్షి, హైదరాబాద్: 'దిశ'ఎన్‌కౌంటర్ కేసులో పోలీసులపై కేసు నమోదు చేయాలని, సిర్పూర్కర్ కమిషన్ కూడా ఇదే విషయాన్ని చెప్పిందని హైకోర్టుకు అమికస్‌క్యూరీ, సీనియర్ న్యాయవాది దేశాయి ప్రకాశ్‌రెడ్డి నివేదించారు. కమిషన్ నివేదికలోని పలు అంశాలను ఆయన ప్రస్తావించారు. 2019, డిసెంబర్ 6న జరిగిన 'దిశ'కేసు నిందితుల ఎన్‌కౌంటర్‌పై దాఖలైన పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. ఎన్‌కౌంటర్‌పై హైకోర్టులో పలు ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలైన విషయం తెలిసిందే. వీటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. దిశ కేసు నిందితుల ఎన్‌కౌంటర్ బూటకమని జస్టిస్ వి.ఎస్.సిర్పూర్కర్ కమిషన్ తేల్చిందని స్పష్టం చేశారు. 10 మంది పోలీసులపై హత్య కేసు పెట్టి విచారణ జరపాలని సిఫార్సు చేయడాన్ని గుర్తు చేశారు. మృతుల్లో ముగ్గురూ మైనర్లేనని వివరించారు. వాదనలు విన్న ధర్మాసనం.. తదుపరి విచారణను మార్చి 29కి వాయిదా వేసింది. పోలీస్ అధికారుల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేశారు.

నన్ను, మానాన్నను చంపేస్తానన్నారు..

- ఎంపీ కోమటిరెడ్డిపై ఎస్పీకి ఫిర్యాదు

నల్లగొండ క్రైం/సాక్షి, హైదరాబాద్: తనను.. తండ్రి డాక్టర్ చెరుకు సుధాకర్‌ను చంపుతానని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫోన్‌లో బెదిరించినట్టు డాక్టర్ చెరుకు సుహాస్ సోమవారం నల్లగొండ ఎస్పీ అపూర్వరావుకు ఫిర్యాదు చేశారు. ఫోన్‌లోనే తన తండ్రిని పరుష పదజాలంతో దూషించారని తెలిపారు. హత్య చేసేందుకు 100 వాహనాల్లో మనుషులు తిరుగుతున్నారని, నవ్య ఆస్పత్రిని కూల్చివేస్తారని ఎంపీ కోమటిరెడ్డి హెచ్చరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కోమటిరెడ్డి మాట్లాడిన ఆడియోను ఎస్పీకి అందజేశారు.

ఎంపీ కోమటిరెడ్డిపై చర్య తీసుకోండి

టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ చెరుకు సుధాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంతో పాటు.. చంపుతారంటూ బెదిరించిన ఎంపీ కోమటిరెడ్డిపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ క్రమశిక్షణ సంఘానికి సోమవారం పలువురు కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, టీపీసీసీ నేతలు బెల్లయ్య నాయక్, అద్దంకి దయాకర్, అయోధ్యరెడ్డి, గోమాస శ్రీనివాస్ తదితరులు గాంధీభవన్‌లో క్రమశిక్షణ కమిటీని కలిసి ఈ మేరకు ఫిర్యాదు చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నేత జానారెడ్డిలకు కూడా ఫిర్యాదు చేయనున్నట్టు వారు వెల్లడించారు.

బెస్ట్ ఎయిర్‌పోర్టుగా 'శంషాబాద్'

మరోసారి ఏసీఐ-ఏఎస్‌క్యూ బెస్ట్ ఎయిర్‌పోర్టు-2022 అవార్డు



శంషాబాద్ రూరల్: హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మరోసారి ఏసీఐ-ఏఎస్‌క్యూ బెస్ట్ ఎయిర్‌పోర్టు-2022 అవార్డు వరించింది. ఏటా 15–25 మిలియన్ల ప్రయాణికుల విభాగంలో ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఉత్తమ విమానాశ్రయం పురస్కారం రావడంపై సోమవారం జీహెచ్ఐఏఎల్ సీఈవో ప్రదీప్ పణికర్ హర్షం వ్యక్తం చేశారు. ఏసీఐ నిర్వహించే వార్షిక ఏఎస్‌క్యూ సర్వేలో జీఎంఆర్ హైదరాబాద్ విమానాశ్రయం ఎంపికవడం గర్వకారణమని పేర్కొన్నారు. విమానాశ్రయం విస్తరణతో ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలు, విశాలమైన స్థలం అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ఇక్కడి కార్యకలాపాల నిర్వహణకు మరింత ఎక్కువ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని పేర్కొన్నారు. విమానాశ్రయం వరసగా 9 ఏళ్ల గ్లోబల్ టాప్–3 విమానాశ్రయాల్లో ఒకటిగా నిలిచిందని వివరించారు.

రైతు చట్టాలను వెనక్కు తీసుకోవాలి

- అప్పటివరకు పోరాటం ఆపే ప్రసక్తే లేదు
- కన్యాకుమారి నుంచి ఢిల్లీ వరకు యాత్ర చేపట్టిన రైతు సంఘాలు
- తెలంగాణ రైతుబంధు సమితి అధ్యక్షుడు పల్లాను కలిసిన నేతలు



సాక్షి, హైదరాబాద్: రైతులపై విధించిన నల్ల చట్టాలను వెంటనే ఉపసంహరించుకోవాలని రైతు సంఘాల సమాఖ్య డిమాండ్ చేసింది. రైతు చట్టాల రద్దు డిమాండ్‌తో కన్యాకుమారి నుంచి ఢిల్లీ వరకు వివిధ రాష్ట్రాల రైతులతో కలిసి తలపెట్టిన రైతు సంఘం యాత్ర సోమవారం హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ క్రమంలో సీఎం కేసీఆర్‌ను కలిసి రైతు సమస్యలను వివరించాలని భావించగా... సీఎం తరఫున తెలంగాణ రైతుబంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ.. ప్రతి పంటకు మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. పంట దిగుబడులకు కనీస మద్దతు ధరపై చట్టాన్ని తీసుకువస్తామని ప్రధాని మోదీ చెప్పినా.. ఇప్పటికీ ఎంఎస్‌పీ చట్టం జాడలేదని, అందుకే ఆల్ తమిళనాడు రైతు కో ఆర్డినేషన్ ఆధ్వర్యంలో కన్యాకుమారి నుంచి ఢిల్లీ వరకు యాత్ర చేస్తున్నామని రైతు సంఘం నేత కోటపాటి నరసింహ నాయుడు తెలిపారు. ఇందులో భాగంగా బీజేపీ యేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో సీఎంలను కలిసి వినతులు సమర్పించి కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు వెల్లడించారు. పల్లాను కలిసినవారిలో తమిళనాడు కిసాన్ సంఘ్ యాత్ర చీఫ్ కో–ఆర్డినేటర్ పీఆర్ పాండియన్, పంజాబ్ రైతు సంఘం నేత బాలదేవ్ సింగ్ సిరాషా, తమిళనాడు రైతు సంఘం మహిళా నేత సుధా ధర్మలింగం ఉన్నారు.

గన్నీ బ్యాగులుండవు.. పడిగాపులు తప్పవు

- కొనుగోలు కేంద్రాల దుస్థితిపై ప్రవీణ్‌కుమార్



అలంపూర్ చౌరస్తాలో పప్పుశనగ పంటను పరిశీలిస్తున్న ప్రవీణ్‌కుమార్

అలంపూర్: రైతును రాజు చేయాల్సిన రాష్ట్ర ప్రభుత్వం వారిని బానిసలుగా మారుస్తోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. ఆయన చేపట్టిన బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న పప్పుశనగ కొనుగోళ్ల కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రానికి ధాన్యం తీసుకొచ్చిన రైతులతో ఆయన మాట్లాడగా అక్కడ రైతులు తాము పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ప్రవీణ్‌కుమార్ స్పందించి మార్క్‌ఫెడ్ ఎండీ, డీఎంలతో ఫోన్‌లో మాట్లాడారు. రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. రైతు సమస్యలను పరిష్కరించకపోతే ఇక్కడే కూర్చుంటానని హెచ్చరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చెబుతున్న అబ్‌కి బార్ కిసాన్ సర్కార్ అంటే రైతులను రోడ్డున పడేయడమా అని ప్రశ్నించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం అమ్ముకోవడానికి గన్నీ బ్యాగులు లేవని, పది రోజులుగా పడిగాపులు కాస్తున్నా ధాన్యం కొనడం లేదని, కేంద్రాల్లో కనీస వసతులు కల్పించడంలో సర్కార్ విఫలమైందని విమర్శించారు. అసలు అలంపూర్ తెలంగాణలో ఉందా? అని అనుమానం వ్యక్తం చేశారు. ఆర్డీఎస్‌కు గత 40 ఏళ్లుగా సాగునీరు అందడం లేదని, తుమ్మిళ్ల ఎత్తిపోతలు నిర్మించినా చివరి ఆయకట్టుకు నీళ్లు రావడం లేదని, సీఎం ఫాంహౌస్‌కు కాళేశ్వరం నీళ్లు మాత్రం తెచ్చుకున్నారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమృత్ కాల్, అచ్ఛేదిన్ అంటూనే రైతులకు వ్యతిరేకంగా నల్లచట్టాలు తెచ్చిందన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ దాడులకు మద్దతిస్తూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకొనేలా యువతను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజల బతుకులు మారాలంటే బహుజన రాజ్యం రావాలన్నారు.

మహిళా హక్కులు కాపాడాలంటూ దీక్ష రేపు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో మహిళా సాధికారత మాటల్లోనే తప్ప.. చేతల్లో లేదని తెలంగాణ ఆత్మగౌరవ వేదిక అధ్యక్షురాలు ఇందిరా శోభన్ ఆరోపించారు. మహిళా హక్కులు కాపాడాలంటూ ఆత్మగౌరవ వేదిక ఆధ్వర్యంలో మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజు ఉదయం 10 గంటల నుంచి ఇందిరా పార్కు వద్ద దీక్ష చేయనున్నట్టు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థికి 33 సంఘాల మద్దతు

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ సంఘం మద్దతుతో పోటీ చేస్తున్న చెన్నకేశవ రెడ్డికి సోమవారం 33 సంఘాలు మద్దతు తెలిపినట్టు పీఆర్‌టీయూటీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్ రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం నేతృత్వంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయా సంఘాల నేతలు మద్దతు ప్రకటించారని పేర్కొన్నారు.

క్లుప్తంగా...

త్రిపుర పీఠం సాహాకే!


బీజేపీ ఎల్పీ నేతగా ఎంపిక



అగర్తలా: బీజేపీ నేత, తాజా మాజీ సీఎం మాణిక్ సాహా త్రిపుర సీఎం పదవిని మరోసారి చేపట్టేందుకు మార్గం సుగమమైంది. సోమవారం త్రిపుర బీజేపీ శాసనసభా పక్ష(ఎల్పీ) సమావేశంలో నూతనంగా ఎన్నికైన మొత్తం 32 మంది బీజేపీ సభ్యులూ సాహాను తమ నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని పార్టీ అధికార ప్రతినిధి ఒకరు తెలిపారు. అనంతరం మాణిక్ సాహా రాష్ట్ర గవర్నర్ సత్యదేవ్ నారాయణ్‌ను కలిసి, నూతన ప్రభుత్వ ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. ఈ నెల 8వ తేదీన జరగనున్న ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని మోదీ, బీజేపీ చీఫ్ జేపీ నడ్డా తదితర ప్రముఖులు హాజరయ్యే అవకాశాలున్నాయి. కేబినెట్ కూర్పుపై అస్సాం సీఎం హిమాంత బిశ్వ శర్మ ఆదివారం అగర్తలా చేరుకుని మాణిక్ సాహా సహా పలువురితో మంతనాలు జరిపారు. అనంతరం ఆయన ఢిల్లీకి వెళ్లి హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు.

హెలికాప్టర్ ల్యాండింగ్‌కు 'చెత్త' సమస్య...

యడ్యూరప్పకు తప్పిన ముప్పు



యశవంతపుర: కర్ణాటక బీజేపీ అగ్రనేత, మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ల్యాండింగ్‌కు సమస్య ఎదురైంది. ప్లాస్టిక్ కవర్లు, చెత్త అడ్డుపడటంతో కొంతసేపు గాలిలోనే చక్కర్లు కొట్టాల్సివచ్చింది. ఆయన సోమవారం జీవర్గిలో జరిగిన సభలో పాల్గొని హెలికాప్టర్‌లో కలబురిగికి వచ్చారు. తాత్కాలిక హెలిప్యాడ్ వద్ద ల్యాండ్ అవుతుండగా గాలి వేగానికి ప్లాస్టిక్ కవర్లు, చిత్తు కాగితాలు తదితర చెత్త పైకి లేచింది. అవి హెలికాప్టర్ రెక్కలకు తాకితే ప్రమాదం సంభవించే అవకాశం ఉండడంతో పైలట్ ల్యాండింగ్‌ను కొద్దిసేపు నిలిపివేశారు. పోలీసులు చెత్తాచెదారం తొలగించే వరకు గాలిలోనే చక్కర్లు కొట్టింది. ఆతర్వాత హెలికాప్టర్ సురక్షితంగా ల్యాండయ్యింది. ఇది పోలీసుల నిర్లక్ష్యమేనని ఆయన అభిమానులు ఆరోపించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరలైంది.



నాగరిక ప్రపంచంలో వివక్షకు తావులేదు. ఆడ, మగ అనే తేడా చూపడం నైతిక సూత్రాల ప్రకారమే కాదు, చట్ట ప్రకారమూ ముమ్మాటికీ నేరమే. బాలికలకు విద్యను నిరాకరించడం, వారికి చదువుకొనే అవకాశాలు దూరం చేయడం రాక్షసత్వమే అనిపించుకుంటుంది. ఇస్లామిక్ దేశమైన ఇరాన్‌లో ఇప్పుడు అచ్చంగా అలాంటిదే జరుగుతోంది. కేవలం విద్యార్థినులను లక్ష్యంగా చేసుకొని విష వాయువుల ప్రయోగానికి పాల్పడుతున్నారు. ఇదంతా ఎవరు చేస్తున్నారు, దీని వెనుక ఉన్న అసలు సూత్రధారులెవరనేది అంతుచిక్కడం లేదు. మరోవైపు దుండగుల దుశ్చర్యపై బాలికల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడేం జరుగుతోందో తెలియక వణికిపోతున్నారు. సమాజంలో అశాంతి నెలకొంటోంది. విష వాయువుల ప్రయోగాల గుట్టును రట్టు చేస్తామని, దోషులను కచ్చితంగా శిక్షిస్తామని ఇరాన్ ప్రభుత్వం హామీ ఇవ్వడం కొంత ఊరట కలిగిస్తోంది.

ఇరాన్‌లో మతోన్మాదుల రాక్షసకాండ..

విద్యపై విషం..

విద్యార్థినులపై ముష్కరుల విష వాయువు ప్రయోగాలు
కఠినంగా శిక్షిస్తామన్న ఇరాన్ అధినేత అయతుల్లా అలీ ఖమేనీ



జరిగింది ఇదీ..

- ఇరాన్‌లో 30 ప్రావిన్స్‌లు ఉండగా, 21 ప్రావిన్స్‌ల్లో 50కి పైగా పాఠశాలల్లో విష వాయువుల ప్రయోగాలు జరిగాయి.
- గత ఏడాది నవంబర్ నుంచి ఇప్పటిదాకా 50కి పైగా పాఠశాలల్లో 700 మంది విద్యార్థినులు ఈ ప్రయోగాల బారినపడినట్లు ప్రభుత్వ అధికారులు నిర్ధారించారు. అయితే, ఇప్పటివరకూ ఎవరూ ప్రాణాలు కోల్పోలేదు.
- బాధితుల్లో శ్వాస సంబంధిత సమస్యలు ఉత్పన్నమయ్యాయి.
- తలనొప్పి, వికారం, వాంతులు, తల తిరగడం, అలసట వంటి లక్షణాలు కనిపించాయి. బాధితులు కాళ్లు, కడుపులో నొప్పితో విలవిల్లాడారు.
- కొందరిలో అవయవాలు తాత్కాలికంగా మొద్దుబారిపోయినట్లు వెల్లడయ్యింది.
- దుండగులు ప్రయోగించిన వాయువులు
- కుళ్లిన నారింజ పండ్ల వాసన, క్లోరిన్ వాసన, టాయ్‌లెట్లు శుభ్రం చేసుకొనే రసాయనాల వాసన వచ్చినట్లు బాధితులు చెప్పారు.
- ఫాతిమా రెజై అనే 11 బాలిక విష ప్రయోగం కారణంగా చనిపోయినట్లు వార్తలు వచ్చాయి. అయితే, ఇన్ఫెక్షన్ వల్లే మరణించిందని ఆమె కుటుంబ సభ్యులు, చికిత్స అందించిన డాక్టర్ చెప్పారు.

రగిలిన ఉద్యమం..

ఇరాన్‌లో 1979లో జరిగిన ఇస్లామిక్ విప్లవం తర్వాత మహిళలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారు. బాలికలు, యువతులపై ఆంక్షలన్నీ దాదాపుగా తొలగిపోయాయి. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లి నిర్భయంగా చదువుకుంటున్నారు. పొరుగున ఉన్న అఫ్గానిస్తాన్ తరహా పరిస్థితులు ఇరాన్‌లో లేవు. బాలికల విద్యాభ్యాసాన్ని, మహిళలు ఉద్యోగాలకు వెళ్లడాన్ని తాలిబన్ ప్రభుత్వం నిషేధించడం పట్ల ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పద్ధతి మార్చుకోవాలని, మహిళలపై ఆంక్షలు ఎత్తివేయాలని తాలిబన్ పాలకులను హెచ్చరించింది కూడా. అలాంటిది ఇరాన్‌లో పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయాయి. తలపై బురఖా సక్రమంగా ధరించనందుకు 22 ఏళ్ల మహసా అమీనీ అనే యువతిని గత ఏడాది సెప్టెంబర్‌లో ఇరాన్ నైతిక పోలీసులు నిర్బంధించారు. చిత్రహింసలు పెట్టినట్లు ఆరోపణలు వచ్చాయి. మూడు రోజులపాటు కోమాలో కొన ఊపిరితో కొట్టుమిట్టాడిన అమీనీ సెప్టెంబర్ 16న మృతి చెందింది. దీంతో దేశవ్యాప్తంగా ప్రజాగ్రహం వెల్లువెత్తింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మహిళలు, యువతులు, బాలికలు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి వచ్చారు. నైతిక



నియమావళి పేరిట తమను అణగదొక్కుతున్నారని, గొంతు నొక్కుతున్నారని, హక్కులు హరిస్తున్నారని ఆరోపిస్తూ నెలల తరబడి ఆందోళన కొనసాగించారు. నైతిక పోలీసు వ్యవస్థను రద్దు చేయాలని నినదించారు. వారి ఆందోళన మహోగ్ర ఉద్యమంగా మారింది. మహిళల ఉద్యమం పట్ల ప్రభుత్వం దిగివచ్చింది. వారి డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. మహిళలంతా శాంతించాలని కోరింది.

ముష్కరుల ఉద్దేశం అదేనా!

మహిళలు, యువతులు, బాలికలు పెద్ద ఎత్తున ఉద్యమించడం, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి, దిగివచ్చేలా చేయడం మతోన్మాదులకు, పిడివాదులకు కంటగింపుగా మారింది. బాలికలను విద్యాసంస్థలకు వెళ్లకుండా, చదువుకోకుండా చేయడమే లక్ష్యంగా కుతంత్రానికి తెరలేపారు. భయభ్రాంతులకు గురిచేసి, ఇళ్లకే పరిమితం చేయడానికి విష వాయువుల ప్రయోగం అనే దొంగదారిని ఎంచుకున్నారు. విద్యార్థినులెవరూ రాకపోతే పాఠశాలలు మూతపడతాయన్నది వారి ఉద్దేశం. ముసుగులు ధరించి, తరగతి గదుల్లోకి హఠాత్తుగా ప్రవేశించడం, విష వాయువులు వదిలి, క్షణాల్లో మాయం కావడం.. కుట్ర మొత్తం ఇలా సాగింది. **- సాక్షి, నేషనల్ డెస్క్**

క్షమించరాని నేరం



ఇరాన్ పాఠశాలల్లో విష వాయువుల ప్రయోగాలు అంతర్జాతీయంగా సంచలనాత్మకంగా మారాయి. బాలికలపై విష వాయువులు ప్రయోగించడం క్షమించరాని నేరమని ఇరాన్ అధినేత అయతుల్లా అలీ ఖమేనీ చెప్పారు. గుర్తుతెలియని ముష్కరులు ఉద్దేశపూర్వకంగానే ఈ అకృత్యాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోందని, వారిని బంధించి, చట్టం ముందు నిలబెడతామని, కఠినంగా శిక్షిస్తామని ప్రకటించారు. బాలికలపై ఇలాంటి ప్రయోగాలు చేయడం ఏకంగా మానవత్వంపై జరిగిన నేరమేనని ఇరాన్ అధ్యక్షుడు ఇబ్రహీం రైసీ తేల్చిచెప్పారు.

డ్రెస్ కోడ్ ఉల్లంఘిస్తే శిక్షించాల్సిందే



ఇరాన్ న్యాయ వ్యవస్థ అధినేత ఘోలామ్ హుస్సేన్ మొహసెనీ ఏజీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇస్లామిక్ డ్రెస్ కోడ్ ఉల్లంఘించిన మహిళలను కఠినంగా శిక్షించాలని అన్నారు. మహిళలు హిజాబ్ తొలగించడం ఇస్లామిక్ రిపబ్లిక్ పట్ల, దాని విలువల పట్ల శత్రుత్వాన్ని ప్రదర్శించడంతో సమానం అవుతుందని చెప్పారు. అలాంటి అసాధారణ చర్యలకు పాల్పడేవారు శిక్షకు గురికాక తప్పదని స్పష్టం చేశారు.

8 ఏళ్లప్పుడు మా నాన్న లైంగికంగా వేధించాడు

ఎన్‌సీడబ్ల్యూ సభ్యురాలు ఖుష్బూ సుందర్



చెన్నై/జైపూర్: నటి, జాతీయ మహిళా కమిషన్ సభ్యురాలు ఖుష్బూ సుందర్ సంచలన విషయాలు వెల్లడించారు. ఎనిమిదేళ్ల వయస్సులో తన తండ్రి తనను లైంగికంగా వేధించారని చెప్పారు! 'మోజో స్టోరీ' డిజిటల్ వార్తా చానల్ ఇటీవల జైపూర్‌లో నిర్వహించిన 'వుయ్ ది విమెన్' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 'మా నాన్న వల్ల అమ్మ జీవితాంతం ఇబ్బందులు ఎదుర్కొంది. అమ్మను, నన్ను కొట్టేవాడు. లైంగికంగా వేధించేవాడు. ఒక మగవాడిగా దాన్ని జన్మహక్కుగా భావించేవాడు. నాకు 8 ఏళ్లప్పుడే లైంగికంగా వేధించాడు. 15 ఏళ్ల వయస్సులో ఆయన్ను ఎదిరించే ధైర్యం వచ్చింది. ఆపైన ఉన్నవన్నీ తీసేసుకుని మమ్మల్ని వదిలి వెళ్లిపోయాడు' అని గుర్తు చేసుకున్నారు. బాల్యంలో లైంగిక వేధింపులకు గురైతే అది వారిని జీవితాంతం వెంటాడుతూనే ఉంటుందని ఆవేదన వెలిబుచ్చారు.

తిహార్‌కు సిసోడియా

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానంలో అవకతవకల కేసులో అరెస్టైన ఆప్ నేత మనీశ్ సిసోడియా జ్యుడీషియల్ కస్టడీని మరో 14 రోజుల పాటు సీబీఐ కోర్టు సోమవారం పొడిగించింది. దాంతో ఆయనను తిహార్ జైలుకు తరలించారు. మార్చి 20 దాకా ఆయన జైల్లోనే ఉంటారు. విపాసన ధ్యానం చేసుకునేందుకు అనుమతించాలన్న సిసోడియా విజ్ఞప్తిని పరిశీలించాల్సిందిగా జైలు వర్గాలకు కోర్టు సూచించింది. ఆయన్ను జైలు నంబర్ 1లో ఉంచారు. మనీ లాండరింగ్ కేసులో అరెస్టైన ఢిల్లీ మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ కూడా తిహార్ జైల్లోనే ఉన్న విషయం తెలిసిందే. సిసోడియా బెయిల్ పిటిషన్ మార్చి 10న విచారణకు రానుంది. ఈ కేసులో అరెస్టయిన ఆడిటర్ బుచ్చిబాబుకు ప్రత్యేక కోర్టు బెయిలు షరతులతో కూడిన బెయిలిచ్చింది.

ఆప్, కాంగ్రెస్ వాగ్యుద్ధం

మరోవైపు సిసోడియా అరెస్టుపై ఆప్, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం జరగడం విశేషం. ఢిల్లీ మద్యం విధానంపై ఆరోపణలు తీవ్రమైనవని, వాటిపై దర్యాప్తు జరిగి తీరాల్సిందేనని కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుప్రియా శ్రీనాథే అన్నారు. ఈ విషయంలో తమ పార్టీ వైఖరిలో ఎలాంటి అయోమయమూ లేదని చెప్పారు. కాంగ్రెస్‌తో పాటు ఇతర విపక్ష నేతలపై కేంద్ర దర్యాప్తు సంస్థలు దాడులకు దిగినప్పుడు ఆప్ కనీసం ఖండించను కూడా లేదని ఆక్షేపించారు. కాంగ్రెస్ ఎన్నడూ సహచర విపక్షాలకు దన్నుగా నిలవదంటూ ఆప్ ఎదురుదాడి చేసింది. కేవలం దేశాన్ని మోసగించేందుకు బీజేపీతో అది కేవలం మాటల యుద్ధం చేస్తుంటుందని ఎద్దేవా చేసింది.

భారత్ పార్లమెంట్‌లో మైకుల మూగనోము

బ్రిటిష్ ఎంపీలతో రాహుల్ గాంధీ



లండన్: భారత పార్లమెంట్ దిగువ సభ అయిన లోక్‌సభలో మైక్రోఫోన్లు ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా తరచుగా మూగబోతుంటాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ అన్నారు. బ్రిటన్‌లో భారత సంతతికి చెందిన ప్రతిపక్ష లేబర్ పార్టీ ఎంపీ వీరేంద్ర శర్మ సోమవారం లండన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రిటిష్ ఎంపీలను ఉద్దేశించి రాహుల్ మాట్లాడారు. తాను నిర్వహించిన భారత్ జోడో యాత్ర గురించి ప్రస్తావించారు. ప్రజలను కూడగట్టడానికి ఇదొక రాజకీయ కార్యాచరణగా ఉపయోగపడిందని అన్నారు. భారత లోక్‌సభలో మైకులు పని చేస్తుంటాయి గానీ తరచుగా మొరాయిస్తుంటాయని వ్యాఖ్యానించారు. మాట్లాడేటప్పుడు మధ్యలోనే ఆగిపోతుంటాయని, తనకు చాలాసార్లు ఇలాంటి అనుభవం ఎదురైందని స్పష్టం చేశారు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ గురించి పార్లమెంట్‌లో మాట్లాడేందుకు ప్రతిపక్షాలకు ప్రభుత్వం అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. చైనా సైన్యంలో భారత భూభాగంలోకి అక్రమంగా ప్రవేశించిందని, దానిపైనా ప్రశ్నించే అవకాశం ఇవ్వలేదన్నారు. పార్లమెంట్‌లో గతంలో జరిగిన అర్థవంతమైన చర్చలు, సంవాదాలు ఇప్పుడు లేకుండాపోయాయని ఆక్షేపించారు.

బీజేపీ, కాంగ్రెస్‌లకు సమదూరం

వ్యూహం మార్చుకున్న టీఎంసీ


కోల్‌కతా: ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు రాబట్టలేకపోయిన తృణమూల్ కాంగ్రెస్ రాజకీయ వ్యూహాన్ని మార్చుకుంది. ఇకపై బీజేపీ, కాంగ్రెస్‌లకు సమదూరం పాటించనుంది. అవసరమైతే గిట్టని ప్రాంతీయ పార్టీలతో మరో ఫ్రంట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. 'బీఆర్ఎస్, ఆప్ తదితర పార్టీలతో చర్చలు ప్రారంభించాం. మా వ్యూహమేంటో వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో తెలుస్తుంది' అని టీఎంసీ నేత సుదీప్ బందోపాధ్యాయ్ తెలిపారు. ఓట్లను చీల్చడం ద్వారా బీజేపీకి టీఎంసీ సాయం చేస్తోందంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, సీపీఎం నేతలు విమర్శలు గుప్పించడంతో, 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగుతామంటూ టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఇటీవల ప్రకటించడం తెలిసిందే.

2024లో అమేథీ నుంచి పోటీ చేస్తాం!

లక్నో: 2024లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ లోక్‌సభ స్థానంలో పోటీ చేస్తామని సమాజ్‌వాదీ పార్టీ ప్రకటించింది. అక్కడ పేద మహిళల పరిస్థితి దారుణంగా మారిందని పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. అక్కణ్నుంచి ఎంతోమంది ప్రముఖులు లోక్‌సభకు ఎన్నికవుతున్నప్పటికీ పేదల బతుకులు మాత్రం మారడం లేదని వాపోయారు. ఇక యూపీలోని ఇతర ప్రాంతాల్లో ప్రజల జీవితాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదన్నారు. ''అందుకే, వచ్చే ఎన్నికల్లో అమేథీలో బడా నాయకులు కాకుండా మంచి మనసున్న వ్యక్తులు గెలుస్తారు'' అంటూ సోమవారం ఆయన ట్వీట్ చేశారు. అమేథీలో పేదరికాన్ని నిర్మూలిస్తామని హామీ ఇచ్చారు. ఆ స్థానాన్ని సమాజ్‌వాదీ ప్రతిసారీ కాంగ్రెస్‌కు వదిలేస్తోంది. అక్కడ ప్రస్తుతం కేంద్ర మంత్రి స్మృతీ ఇరానీ ఎంపీగా ఉన్నారు. ఆమె 2019లో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఓడించారు.

ఉపాధి, నైపుణ్యాభివృద్ధి

ఆర్థిక వృద్ధికి అవే కీలకం: మోదీ



అహ్మదాబాద్/న్యూఢిల్లీ: భారత్ ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే యువతలో నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడం చాలా కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ నైపుణ్యాభివృద్ధి తాలూకు ఫలాలు యువత, ఆదివాసీలతో పాటు సమాజంలో అన్ని వర్గాలకూ చేరేలా చూసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. మౌలిక, అభివృద్ధి ప్రాజెక్టుల ద్వారా అపారమైన ఉపాధి అవకాశాలను కల్పించడం, ఉత్పత్తి రంగ వృద్ధికి ఊతమివ్వడం, స్వాతంత్ర్యానంతరం నిర్లక్ష్యానికి గురైన ఇతర రంగాల్లోనూ ఉపాధి సృష్టికి కృషి చేయడం తమ లక్ష్యమన్నారు. గుజరాత్ ప్రభుత్వం సోమవారం గాంధీనగర్‌లో ఏర్పాటు చేసిన రోజ్‌గార్ మేళాను ఉద్దేశించి మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. ''దేశంలో రికార్డు స్థాయిలో 90 వేలకు పైగా స్టార్టప్‌లు పని చేస్తున్నాయి. ఇవి ఉపాధి కల్పించమే గాక లక్షలాది మంది యువకులకు స్వయం ఉపాధి దిశగా స్ఫూర్తినిస్తున్నాయి. స్టార్టప్‌లకు ప్రభుత్వం ఆర్థిక సాయంతో పాటు అవసరమైన బ్యాంకు గ్యారంటీలు కూడా అందజేస్తోంది'' అని వివరించారు. ''గుజరాత్‌లో గత ఐదేళ్లలో లక్షన్నర మంది యువకులకు ప్రభుత్వోద్యోగాలు లభించాయి. 2023లో మరో పాతిక వేల ఉద్యోగాలు అందుబాటులో ఉన్నాయి'' అన్నారు.

ఆరోగ్య రంగంలో ఆత్మనిర్భరత

ఆరోగ్య రంగంలో విదేశాలపై ఆధారపడటాన్ని పూర్తిగా తగ్గించేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మోదీ తెలిపారు. ఆరోగ్య, వైద్య పరిశోధనలపై బడ్జెట్ అనంతర వెబినార్‌నుద్దేశించి ఆయన మాట్లాడారు. వైద్య రంగానికి సంబంధించిన ఎలాంటి పరికరాలనూ, టెక్నాలజీనీ దిగుమతి చేసుకోవాల్సిన అవసరం లేకుండా స్వయంసమృద్ధంగా మార్చాల్సిన బాధ్యత దేశ పారిశ్రామికవేత్తలు, శాస్త్రవేత్తలపై ఉందన్నారు. ఈ దిశగా తామిప్పటికే ఎన్నో చర్యలు తీసుకున్నామన్నారు. స్వాతంత్ర్యానంతరం చాలా ఏళ్ల పాటు సమీకృత ధోరణి, దీర్ఘకాలిక విజన్ లేమి దేశ వైద్య రంగ వృద్ధికి ముందరి కాళ్ల బంధంగా ఉండేవన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారిందని చెప్పారు. ''నేను ఫార్మా మార్కెట్ రూ.4 లక్షల కోట్లకు విస్తరించింది. ప్రైవేట్ రంగం, వైద్య విద్యా రంగం మధ్య సరైన సమన్వయముంటే ఇది రూ.10 లక్షల కోట్లకు విస్తరించగలదు. కరోనా కల్లోలం సంపన్న దేశాలను కూడా అల్లాడించింది. దాని దెబ్బకు ప్రపంచమంతా ఆరోగ్యంపై దృష్టి పెడుతున్న ఈ తరుణంలో భారత్ మాత్రం మరో అడుగు ముందుకేసి వెల్‌నెస్‌పై దృష్టి పెట్టింది. మనమిప్పుడు ప్రపంచం ముందుంచిన 'ఒక భూమి, ఒకే ఆరోగ్యం' విజన్ అందులో భాగమే. మనుషులకే గాక జంతు, వృక్షజాలాలన్నింటికీ ఒకే తరహాలో సమగ్ర ఆరోగ్య రక్షణ కల్పించడమే దీని ఉద్దేశం. అంతేగాక ఆరోగ్య సేవలు అందుబాటు ధరల్లో ఉండేలా చూడటం కూడా మా ప్రభుత్వ ప్రాథమ్యాల్లో ఒకటి. అందుకే ఆయుష్మాన్ భారత్ పథకం కింద చేపట్టిన చర్యల ద్వారా పేద రోగులకు ఇప్పటికే రూ.80,000 కోట్లు ఆదా అయ్యాయి'' అని చెప్పారు. మార్చి 7ను జన్ ఔషధీ దివస్ జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. 9,000 జన్ ఔషధీ కేంద్రాల వల్ల పేద, మధ్యతరగతి వారికి రూ.20 వేల కోట్ల దాకా ఆదా అయిందన్నారు.

రానున్న వేసవిలో తీవ్ర ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎదుర్కొనేలా ప్రజలతో పాటు వైద్య నిపుణులకు, స్థానిక సంస్థలకు సమగ్ర అవగాహన కల్పించాలని మోదీ సూచించారు.

వేసవిలో జాగ్రత్త: మోదీ

వేసవి సన్నద్ధత దిశగా చేపట్టిన చర్యలను ఆయన సారథ్యంలో ఉన్నత స్థాయి సమీక్షలో అధికారులు వివరించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులను దీటుగా ఎదుర్కొనేందుకు ఆహార ధాన్యాల నిల్వలను ఎఫ్‌సీఐ వీలైనంతగా పెంచాలని మోదీ సూచించారు. వచ్చే వర్షాకాలంలో సాధారణ వర్షపాతం నమోదవుతుందన్న అంచనాలను మోదీ దృష్టికి తెచ్చారని ప్రధాని కార్యాలయం పేర్కొంది.

పాక్‌లో ఆత్మాహుతి దాడి.. 9 మంది పోలీసులు మృతి

కరాచీ: పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్ ప్రావిన్స్‌లో సోమవారం జరిగిన ఆత్మాహుతి దాడిలో 9 మంది పోలీసులు మృతి చెందగా మరో 13 మంది గాయపడ్డారు. సిబి మేళా బందోబస్తు విధుల్లో పాల్గొని క్వెట్టాకు తిరిగి వస్తున్న పోలీస్ కానిస్టేబుళ్ల వ్యాన్‌ను బొలాన్ వద్ద ఓ ఉగ్రవాది పేలుడు పదార్థాలతో బైక్‌పై దూసుకువచ్చి ఢీకొట్టాడు. పేలుడు తీవ్రతకు వ్యాను తునాతునకలైంది. ఘటనలో వ్యానులోని 9 మంది కానిస్టేబుళ్లు మృతి చెందగా మరో 13 మంది గాయాలపాలయ్యారు. వీరిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని అధికారులు తెలిపారు. ఘటనకు తమదే బాధ్యతంటూ ఎవరూ ప్రకటించుకోలేదు. గతంలో ఘటనలకు బట్టి బలూచ్ వేర్పాటువాదులు లేక ఇస్లామిక్ తీవ్రవాదుల పని అయి ఉంటుందని అనుమానిస్తున్నారు. తీవ్రవాదులు బహుశా సిబి మేళా ఉత్సవాల భగ్నానికి యత్నించి ఉంటారని అనుమానిస్తున్నారు. ఇరాన్, అఫ్గానిస్తాన్ సరిహద్దుల్లో ఉన్న బలూచిస్తాన్‌లో తరచూ హింసాత్మక ఘటనలు చోటుచేసుకుంటున్నాయి.

'ఉమేశ్' కేసులో మరో నిందితుని ఎన్‌కౌంటర్

ప్రయాగ్‌రాజ్/లక్నో: ఉమేశ్ పాల్ హత్య కేసులో మరో నిందితుడు విజయ్ చౌదరి అలియాస్ ఉస్మాన్ పోలీసులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. కౌండియారా పోలీస్‌స్టేషన్ పరిధిలోని గోథి, బెల్వా మధ్య సోమవారం ఉదయం 5.30 గంటల సమయంలో పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో ఉస్మాన్ తీవ్రంగా గాయపడ్డారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడని ఎస్‌హెచ్‌వో రాజేశ్ కుమార్ మౌర్య చెప్పారు. 2005 నాటి బీఎస్పీ మాజీ ఎమ్మెల్యే రాజు పాల్ హత్య కేసులో ఉమేశ్ పాల్ కీలక సాక్షిగా ఉన్నాడు. ఫిబ్రవరి 24వ తేదీన దుండగులు జరిపిన కాల్పుల్లో ఉమేశ్, అతడి ఇద్దరు భద్రతా సిబ్బంది చనిపోయారు. దీని వెనుక గ్యాంగ్‌స్టర్, రాజకీయ నాయకుడు అతిక్ అహ్మదే కారణమని పోలీసులు చెప్పారు. అయితే, ఇంట్లో ఉన్న ఉస్మాన్‌ను పోలీసులు పట్టుకెళ్లి కాల్చి చంపారని అతడి భార్య సుహానీ ఆరోపించింది. మరో నిందితుడు అర్బాజ్ కూడా ఫిబ్రవరి 27న ఎన్‌కౌంటర్లో చనిపోయాడు.

బిహార్ మాజీ సీఎం రబ్రీని ప్రశ్నించిన సీబీఐ

పట్నా/న్యూఢిల్లీ: బిహార్ మాజీ సీఎం రబ్రీదేవిని పట్నాలోని ఆమె నివాసంలోనే సోమవారం సీబీఐ అధికారులు సోమవారం ఐదు గంటల పాటు ప్రశ్నించారు. ఆమె భర్త, కేంద్ర రైల్వే శాఖ మాజీ మంత్రి లాలూ ప్రసాద్ యాదవ్‌ను మంగళవారం ప్రశ్నించనున్నారు. లాలూ రైల్వే మంత్రిగా ఉండగా ఉద్యోగాలు ఇచ్చినందుకు ప్రతిఫలంగా అభ్యర్థుల నుంచి భూములు తీసుకున్నారనే ఆరోపణలపై సీబీఐ విచారణ జరుపుతోంది.

కుమారుడు, కోడలిపై కోపంతో గవర్నర్‌కు రూ.కోటి ఆస్తి రాసిచ్చిన వృద్ధుడు

ముజఫర్‌పూర్: వృద్ధాప్యంలో ఉన్న తనను కుమారుడు, కోడలు తనను సరిగ్గా పట్టించుకోకపోవడంతో ఉత్తరప్రదేశ్‌లో వ్యక్తి సంచలన నిర్ణయం తీసుకున్నాడు. రూ.కోటి విలువైన తన ఇంటిని, భూమిని రాష్ట్ర గవర్నర్‌కు రాసిచ్చాడు. తన మరణం తర్వాత ఆ భూమిలో పాఠశాల లేదా ఆసుపత్రి నిర్మించాలని కోరాడు. ముజఫర్‌నగర్ జిల్లాలోని బైరాల్ గ్రామానికి చెందిన 80 ఏళ్ల నాథూసింగ్ ఖతోలీలో వృద్ధాశ్రమంలో ఉంటున్నాడు. రూ.కోటి విలువైన ఇంటిని, 10 బిఘాల భూమిని యూపీ గవర్నర్‌కు అప్పగించాలంటూ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో అఫిడవిట్ సమర్పించాడు. విల్లును రిజిస్టర్ చేయించాడు. కోడుకు, కోడలు తనను దారుణంగా అవమానిస్తున్నందుకే వృద్ధాశ్రమంలో ఉండాల్సి వస్తోందని వాపోయాడు!

భార్యను చంపి 5 ముక్కలుగా నరికి..

బిలాస్‌పూర్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో బిలాస్‌పూర్‌కు చెందిన ఓ వ్యక్తి తన భార్యను చంపి, మృతదేహాన్ని ఐదు ముక్కలుగా నరికి, ఇంట్లోని ఖాళీ నీళ్ల ట్యాంకులో పడేశాడు. సక్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉలాస్‌పూర్ ప్రాంతంలో ఓ వ్యక్తి నకిలీ నోట్లను ముద్రిస్తున్నాడనే అనుమానంతో ఓ ఇంట్లో సోదాలు జరిపారు. బాత్‌రూం మూలన ఉన్న ట్యాంకులో టేప్ వేసి పాలిథీన్ కవర్‌లో చుట్టిన శరీర భాగాలు కనిపించడంతో షాక్‌కు గురయ్యారు. అక్రమ సంబంధం అనుమానంతో భార్యను జనవరి 6న గొంతు పిసికి చంపినట్లు విచారణలో అతడు వెల్లడించాడు. అనంతరం కట్టర్‌తో మృతదేహాన్ని ఐదు ముక్కలు కోసి, కొనుక్కొచ్చిన ట్యాంకులో పడేసినట్లు తెలిపాడు. ఇంట్లో నకిలీ నోట్లు, కలర్ ప్రింటర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

భూమిపైకి 'మేఘాట్రోఫిక్-1' పునరాగమనం!

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): నియంత్రిత పునరాగమన పద్ధతిలో సరికొత్త ప్రయోగానికి 'ఇస్రో' సిద్ధమైంది. 2011 అక్టోబర్ 12న పీఎస్ఎల్వీ–సీ18 రాకెట్ ద్వారా పంపించిన మేఘాట్రోఫిక్ ఉపగ్రహం కాలపరిమితికి మించి పనిచేసి, ప్రస్తుతం అంతరిక్షంలో నిరుపయోగంగా మారింది. దాదాపు 1,000 కిలోల బరువైన మేఘాట్రోఫిక్–1 (ఎంటీ–1) ఉపగ్రహాన్ని ఉష్ణమండలంలోని వాతావరణం, వాతావరణ పరిస్థితులపై అధ్యయనం కోసం ఇస్రో, ఫ్రాన్స్ అంతరిక్ష సంస్థ (సీఎన్ఈఎస్) సంయుక్తంగా తయారుచేసి ప్రయోగించాయి. దీని కాలపరిమితి మూడేళ్లు. కానీ, 2021 దాకా సేవలందించింది. ప్రస్తుతం వ్యర్థంగా మారిన ఈ ఉపగ్రహంలో 125 కిలోల ద్రవ ఇంధనముంది. ఇది అంతరిక్షంలో పేలిపోయి ఇతర ఉపగ్రహాలకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని ఇస్రో అంచనా వేసింది. ఈ నేపథ్యంలో దానిని సురక్షితంగా భూమిపైకి తీసుకొచ్చి, పసిఫిక్ మహాసముద్రంలో కూల్చేందుకు మంగళవారం సరికొత్త ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టనున్నారు. భూమిపైకి మేఘాట్రోఫిక్–1 రీఎంట్రీ కోసం అందులో ఉన్న ఇంధనం సరిపోతుందని ఇస్రో సైంటిస్టులు చెబుతున్నారు.



26న ఎల్వీఎం3–ఎం3 ప్రయోగం

లాంచ్ వెహికల్ మార్క్3–ఎం3 (ఎల్వీఎం3–ఎం3) ప్రయోగాన్ని ఈ నెల 26న నిర్వహించేందుకు భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది. యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన నెట్‌వర్క్ యాక్సెస్ అసోసియేట్ లిమిటెడ్, ఇండియన్ భారతి ఎంటర్‌ప్రైజెస్ సంయుక్త భాగస్వాములుగా వన్‌వెబ్ ఇండియా–2 పేరుతో 5,796 కిలోల బరువైన 36 కమ్యూనికేషన్ ఉపగ్రహాలను రెండోసారి వాణిజ్యపరంగా ప్రయోగిస్తున్నాయి. సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ 'షార్'లోని రెండో ప్రయోగ వేదిక దీనికి వేదిక కానుంది. షార్‌లోని వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో రెండు దశల రాకెట్ అనుసంధానం పూర్తి చేశారు. క్రయోజనిక్ దశ మాత్రమే పెండింగ్‌లో ఉంది. ప్రయోగించబోయే 36 ఉపగ్రహాలు ఇప్పటికే షార్‌కు చేరుకున్నాయి. వీటికి అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు. హీట్‌షీల్డ్‌లో అమర్చే పనులు జరుగుతున్నాయి.

మా నాన్న పెళ్లి ఆపండి!

రెండో పెళ్లి చేసుకుంటున్నాడంటూ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన చిన్నారి

పట్నా: 'పోలీసంకుల్.. మా నాన్న రెండో పెళ్లి చేసుకుంటున్నాడు. మీరే ఎలాగైనా ఆపాలి..' అంటూ ఓ బాలిక పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. బాలిక ధైర్యాన్ని అందరూ మెచ్చుకుంటున్నారు. బిహార్‌లోని షియోహర్‌లో ఇప్పుడు ఇదే 'టాక్ ఆఫ్ ది టౌన్'అయ్యింది. షియోహర్‌కు చెందిన మనోజ్ కుమార్ రాయ్‌కు నలుగురు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. అందరూ 12 ఏళ్లలోపు వారే. సుమారు రెండేళ్ల క్రితం భార్య చనిపోయింది. దీంతో, అతడు రెండో పెళ్లికి సిద్ధమయ్యాడు. తనకున్న సుమారు అరెకరం (ఎకరానికి 32 కతాస్ సమానం) భూమిని ఇచ్చేందుకు కాబోయే భార్యతో ఒప్పందం కుదుర్చుకున్నాడు. శనివారం సాయంత్రం స్థానిక గుడిలో పెళ్లి జరగాల్సి ఉంది. అయితే, మనోజ్ కూతుళ్లలో ఒకరైన పదేళ్ల చోటీ కుమారి కొందరు గ్రామస్తులతో కలిసి శనివారం ఉదయం పిప్రాహి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. 'మా నాన్న మళ్లీ పెళ్లి చేసుకుంటున్నాడు. ఇక మమ్మల్నెవరు చూసుకుంటారు? మా నాన్న లేకుంటే మాకు దిక్కెవ్వరు? ఉన్న భూమినంతా ఆమెకే ఇచ్చేస్తే మేమెలా బతకాలి? ఎలాగైనా, ఈ పెళ్లిని మీరే ఆపాలి'అని బిగ్గరగా ఏడ్చుకుంటూ పోలీసులకు మొరపెట్టుకుంది. చిన్నారి వినతిపై పోలీసులు మానవతా దృక్పథంతో స్పందించారు. గ్రామ సర్పంచి, ఇతర ప్రముఖులను పిలిపించారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. గుళ్లో పెళ్లి ఏర్పాట్లలో ఉన్న మనోజ్‌ను స్టేషన్‌కు పిలిపించారు. రెండో పెళ్లిని రద్దు చేసుకునేందుకు, పిల్లల్ని సరిగ్గా చూసుకునేందుకు ఒప్పించారు. ఈ మేరకు బాండ్ పేపర్‌పై అతడితో సంతకం చేయించారు. అనంతరం, తన కూతురు చోటీ కుమారిని తీసుకుని మనోజ్ కుమార్ ఇంటికి వెళ్లాడు. బాలిక ధైర్యాన్ని చూసి పట్టణవాసులంతా శెభాష్ అంటున్నారు.

సాక్షి కరీంనగర్

మంగళవారం । 7 । మార్చి । 2023



నమో రాజన్న

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్నను సోమవారం భారీగా భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసి కోడెమొక్కులు చెల్లించుకున్నారు.



వైభవంగా డోలోత్సవం

వేములవాడఅర్బన్: రాజన్న సన్నిధిలో త్రిరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం రెండో రోజు డోలోత్సవం నిర్వహించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 34.0/19.0

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చల్లగాలులు వీస్తాయి. గాలిలో తేమ అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సభ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేతలు

కరీంనగర్‌టౌన్: పీసీసీ అధ్యక్షుడు ఎనుముల రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడోయాత్ర కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని ఆరు నియోజకవర్గాలలో పూర్తిచేసుకుంటున్న సందర్భంగా 9న కరీంనగర్ అంబేద్కర్‌స్టేడియంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. బహిరంగసభ ఏర్పాట్లను ఎమ్మెల్యే సీతక్క, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి దొమ్మటి సాంబయ్య, వేం నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, సిరిసిల్ల రాజయ్య, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి సోమవారం పరిశీలించారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఈ సభకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జ్ మాణిక్‌రావు ఠాక్రే, ముఖ్యనాయకులు హాజరవుతున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, పారిజాత రెడ్డి, జ్యోత్స్నరెడ్డి, సత్తు మల్లేశం, వైద్యుల అంజన్‌కుమార్, ఎం.రోహిత్‌రావు ఉన్నారు.

జమ్మికుంటలో పత్తిధర రూ.7,600



జమ్మికుంట: జమ్మికుంట వ్యవసాయ పత్తి మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర గరిష్ఠంగా రూ.7,600 పలికింది. సోమవారం మార్కెట్‌కు 99వాహనాల్లో 1,508 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. మోడల్ ధర రూ.7,400, కనిష్ట ధర రూ.7,000కు వ్యాపారులు కొనుగోలు చేశారు. గన్నీ సంచుల్లో 17మంది రైతులు 27 క్వింటాళ్ల పత్తిని తీసుకురాగా క్వింటాల్‌కు గరిష్ఠ ధర రూ.7,100, మోడల్ ధర రూ.7,000, కనిష్ఠ ధర రూ.6,000 ఖరీదు వ్యాపారులు కొనుగోలు చేశారు. మంగళవారం హోలీ పండుగ సందర్భంగా మార్కెట్ యార్డుకు సెలవు ఉంటుందని, బుధవారం క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని కార్యదర్శి రెడ్డి నాయక్ వివరించారు.

నేడు కోర్టులకు హోలీ పండుగ సెలవు

కరీంనగర్‌క్రైం: హోలీ పండుగను పురస్కరించుకొని మంగళవారం కోర్టులకు సెలవు ప్రకటిస్తూ జిల్లా జడ్జి బి ప్రతిమ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో హోలీ పండుగ సెలవు బుధవారం ప్రకటించి ఉండగా.. మంగళవారం కేసుల వాయిదాలు వేశారు. హోలీ పండుగ సెలవు బుధవారం నుంచి మంగళవారానికి మార్చడంతో మంగళవారం రోజు కేసుల వాయిదాలు ఉన్నవారు మరుసటి రోజు బుధవారం ఆయా కేసులలో కోర్టులకు హాజరు కావాల్సి ఉంటుందని కరీంనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్రం రాజారెడ్డి తెలిపారు.

బుక్‌ఫెయిర్ వేళల్లో మార్పు

కరీంనగర్‌కల్చరల్: జ్యోతిబాపూలే మైదానంలో నిర్వహిస్తున్న కరీంనగర్ బుక్ ఫెయిర్ ప్రదర్శన వేళలు హోలీ పండుగ సందర్భంగా మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు మారినట్లు తెలంగాణ బుక్ ట్రస్ట్ కార్యదర్శి కోయ చంద్రమోహన్ తెలిపారు. మధ్యాహ్నం నుంచి కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని వివరించారు.

ఆరోగ్యమస్తు..

మహిళల కోసం ప్రత్యేక క్లినిక్‌లు

- జిల్లాలో మూడు ఆరోగ్య కేంద్రాల ఎంపిక
- ప్రతీ మంగళవారం మహిళా క్లినిక్‌ల నిర్వహణ
- ఎనిమిది రకాల వ్యాధులకు పరీక్షలు
- రేపటి నుంచి ఆస్పత్రుల్లో వైద్య సేవలు ప్రారంభం



జిల్లాలో మహిళా క్లినిక్‌లు

- బుట్టిరాజారాం కాలనీ ఆరోగ్య కేంద్రం
- చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
- చొప్పదండి ప్రాథమిక ఆర్యోగ కేంద్రం

కరీంనగర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం మరో కార్యక్రమాన్ని చేపట్టింది. మహిళల ఆరోగ్య సమస్యలపై దృష్టి సారించింది. ఆయా రుగ్మతలను గుర్తించేందుకు ప్రత్యేక మహిళా ఆస్పత్రుల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 8న రాష్ట్రవ్యాప్తంగా 100 క్లినిక్‌లు ప్రారంభించేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా జిల్లాలోని మూడు ఆస్పత్రుల్లో మహిళా క్లినిక్‌ను ప్రారంభించనున్నారు. ప్రతీ మంగళవారం ఈ క్లినిక్‌లలో మహిళలకు ప్రత్యేకంగా వైద్య సేవలందిస్తారు. భవిష్యత్‌లో జిల్లా వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో ఈ సౌకర్యాన్ని అందుబాటులోకి తేనున్నారు. ఇందుకోసం రేడియోగ్రాఫర్, స్టాఫ్ నర్సులకు, సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.

నిర్ధారణ పరీక్షలు

ప్రత్యేక ఆస్పత్రుల్లో మహిళలకు షుగర్, బీపీ వంటి పరీక్షలు నిర్వహిస్తారు. బ్రెస్ట్, సర్వైకల్, ఓరల్ కేన్సర్ల స్క్రీనింగ్ చేస్తారు. థైరాయిడ్, అయోడిన్ సమస్య, రక్తహీనత తదితర సమస్యలకు సంబంధించి నిర్ధారణ పరీక్షలు చేస్తారు. అవసరమైన వారిని ఆస్పత్రులకు రెఫర్ చేస్తారు. లేదంటే మందులు ఇస్తారు. మహిళలందరికీ యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్స్, పెల్విక్ ఇన్‌ప్లమేటరీ డిసీజెస్ టెస్టులు కూడా నిర్వహించనున్నారు. హార్మోన్ రీప్లేస్మెంట్ థెరపీ మెడికేషన్స్, కౌన్సెలింగ్ కూడా ఉంటాయి. వీటితోపాటు పీసీవోడీ, రుతుస్రావ సమస్యలు, ఇన్ఫెర్టిలిటీ మేనేజ్‌మెంట్ సమస్యలను కొన్ని పరీక్షల ద్వారా గుర్తిస్తారు. ఆ తర్వాత అవసరమైన వారికి అల్ట్రాసౌండ్ టెస్టుకు రెఫర్ చేస్తారు.

ఎనిమిది ప్యాకేజీల్లో 57 రకాల పరీక్షలు

మహిళలకు ఎనిమిది ప్యాకేజీల్లో 57రకాల వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాథమిక డయాగ్నోస్టిక్స్, కేన్సర్ స్క్రీనింగ్‌తో పాటు వెయిట్ మేనేజ్‌మెంట్, సెక్సువల్ ట్రాన్స్‌మిటెడ్ ఇన్ఫెక్షన్, పీసీవోడీ, రుతుస్రావ సమస్యలు, ఇన్ఫెర్టిలిటీ మేనేజ్‌మెంట్, మెనోపాజ్ మేనేజ్‌మెంట్, ఐవీ, యూటీఐ అండ్ పెల్విక్ ఇన్‌ప్లమేటరీ డిసీజెస్, తదితర సమస్యలతో వచ్చే మహిళలకు ఈ క్లినిక్‌లలో పరీక్షలు నిర్వహిస్తారు. ఈ మేరకు తెలంగాణ డయాగ్నోస్టిక్ పోర్టల్‌లో ప్రత్యేక లింక్‌ను రూపొందించారు.

జిల్లాలో మూడు ఆస్పత్రుల ఎంపిక

మహిళా క్లినిక్‌ల నిర్వహణ కోసం మొదటి విడతలో జిల్లాలో మూడు ఆస్పత్రులను ఎంపిక చేశారు. చల్లూరు, చొప్పదండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పాటు, జిల్లాకేంద్రంలోని బుట్టిరాజారాంకాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో మహిళా క్లినిక్‌లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మహిళా క్లినిక్‌కు వచ్చిన పేషెంట్ల వివరాలన్నీ ప్రత్యేక యాప్‌లో పొందుపరుస్తారు. పేషెంట్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయనున్నారు.

మూడు కేంద్రాల్లో ఏర్పాట్లు

రాష్ట్ర ప్రభుత్వం మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 8వ తేదీన ఏర్పాటు చేయనున్న మహిళా క్లినిక్‌లకు జిల్లాలోని మూడు ఆరోగ్య కేంద్రాలలో ఏర్పాట్లు పూర్తిచేశాం. జిల్లాలోని చల్లూరు, చొప్పదండి పీహెచ్‌సీలు, నగరంలోని బుట్టిరాజారాంకాలనీ యూపీహెచ్‌సీలో మహిళా క్లినిక్‌లను ప్రారంభించనున్నాం. వీటి పరిధిలో ప్రతి మంగళవారం మహిళల కోసం ప్రత్యేకంగా పరీక్షలు చేసి మందులు అందజేస్తాం.

– డాక్టర్ జువేరియా, జిల్లా వైద్యాధికారి

హరీశ్‌రావు చేతుల మీదుగా కరీంనగర్ నుంచే ప్రారంభం

- రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తెలంగాణలోని మహిళలకు ఉచితంగా సమగ్ర వైద్య పరీక్షలకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని, కరీంనగర్‌లోని బుట్టి రాజారాం కాలనీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మార్చి 8న ఆరోగ్య మహిళా పథకాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావు లాంఛనంగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. సోమవారం కరీంనగర్ రెస్ట్ హౌస్‌లో జిల్లా కలెక్టర్‌తో పాటు వైద్య అధికారులతో హరీశ్‌రావు పర్యటన ఏర్పాట్లపై మంత్రి సమీక్షించారు. కార్యక్రమ ప్రారంభోత్సవం అనంతరం మంత్రి హరీశ్‌రావు జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి, ఎంసీహెచ్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తారని, చైతన్య డిగ్రీ కళాశాల, శివానీ కళాశాలలోని విద్యార్థులకు ఉచితంగా వైద్య పరీక్షలు, మెడికల్ కళాశాల పనులు సందర్శిస్తారని, బస్తీ దవాఖానను పరిశీలిస్తారని తెలిపారు. కలెక్టర్ కర్ణన్, సీపీ సుబ్బారాయుడు, మేయర్ వై.సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, అదనపు కలెక్టర్లు గరిమా అగర్వాల్, జీవీ శ్యాంప్రసాద్‌లాల్, జెడ్పీ సీఈవో ప్రియాంక, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, డీఎంహెచ్‌వో జువేరియా, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రత్నమాల పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే కొండగట్టు అభివృద్ధి



కొండగట్టు అంజన్న సన్నిధిలో రేవంత్ పూజలు



గంగాధరలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

- అధికారంలోకి రాగానే మరిన్ని వసతులు కల్పిస్తాం
- బస్సు ప్రమాద బాధితులకు ఎలాంటి సాయమూ అందలేదు
- నాడు ఆ ఘటనపై సీఎం స్పందించకపోవడం సిగ్గుచేటు
- హాథ్ సే హాథ్ జోడోలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

కొండగట్టు/కొడిమ్యాల: కాంగ్రెస్ హయాంలోనే కొండగట్టు ఆలయ అభివృద్ధి జరిగిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కొండగట్టును మరింత అభివృద్ధి చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. హాథ్ సే హాథ్ జోడోయాత్రలో భాగంగా సోమవారం కొండగట్టులోని శ్రీ ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో మాట్లాడారు. ఘాట్‌రోడ్‌లో జరిగిన బస్సు ప్రమాదంలో మృతిచెందిన, క్షతగాత్రుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఎలాంటి సాయమూ అందలేదన్నారు. నాడు ఆ ఘటనపై సీఎం కేసీఆర్ స్పందించకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఇటీవల కొండకు వచ్చిన సీఎం ఆలయాన్ని అభివృద్ధి చేస్తానని వాగ్దానం చేశారని, తనకు నమ్మకం లేదన్నారు. వెంటనే రూ.500 కోట్లు విడుదల చేసి ఆలయాన్ని అభివృద్ధి చేయాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అంజన్న సన్నిధిలో భక్తులకు సకల వసతులు ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. కొండపై పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు వారి సమస్యలను రేవంత్ దృష్టికి తీసుకెళ్లారు.

పోతారం నిర్వాసితులను ఆదుకోవాలి

అనంతరం కొడిమ్యాల మండలం పోతారం పెద్ద చెరువు రిజర్వాయర్‌ను రేవంత్‌రెడ్డి సందర్శించారు. నిర్వాసితులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.స్థానికుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. రిజర్వాయర్ నిర్మాణ సమయంలో కోనాపూర్ గ్రామంలోని 135 ఇళ్లకు ఆర్‌ఆర్‌ఆర్ ప్యాకేజీ వర్తిస్తుందని ప్రభుత్వాధికారులు పేర్కొన్నారని, బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులు ఎంపీలు, ఎమ్మెల్యేలుగా ఎన్నికైనా ఈ సమస్య ఇప్పటికీ పరిష్కరించలేదని విమర్శించారు. రిజర్వాయర్ సమీపంలోని కొడిమ్యాల– కోరుట్ల రోడ్డుపై గల బుగ్గవాగుపై బ్రిడ్జి నిర్మించకపోవడంతో వర్షాకాలంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికే ఇద్దరు ప్రాణాలు కోల్పోయారన్నారు. పోతారం రిజర్వాయర్ మత్తడి ఎత్తును పెంచి, బుగ్గవాగుపై బ్రిడ్జిని నిర్మించాలని, నిర్వాసితులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కేవలం రూ.25 కోట్ల వ్యయంతో ఈ మూడు సమస్యలు పరిష్కరించడానికి అవకాశం ఉందన్నారు ఈ సమస్యల పరిష్కారానికి స్థానికుల ద్వారా ప్రజావాణిలో ఫిర్యాదు చేయించడంతోపాటు, ప్రభుత్వంపై ఒత్తిడిని తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. అంతకుముందు కొడిమ్యాలలో కాంగ్రెస్ జెండా ఆవిష్కరించారు. సాయంత్రం పాదయాత్ర పూడూరు నుంచి గంగాధర వరకు కొనసాగింది. ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ములుగు ఎమ్మెల్యే సీతక్క, పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, చొప్పదండి నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపెల్లి సత్యం, యూత్ కాంగ్రెస్ నాయకుడు నాగి శేఖర్, మండల అధ్యక్షుడు చిలువేరి నారాయణ, నాయకులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, దొంగ ఆనందరెడ్డి, ముత్యం శంకర్, చారి, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రవిశంకర్‌పై చార్జ్‌షీట్ విడుదల

కొడిమ్యాలలో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవి శంకర్‌పై కాంగ్రెస్ నాయకులు సోమవారం చార్జ్‌షీట్ విడుదల చేశారు. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, తొమ్మిదేళ్లయినా పోతారం రిజర్వాయర్ పనులు ఎమ్మెల్యే పూర్తి చేయలేకపోయారని ఆరోపించారు. రెండుసార్లు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ప్రాతినిథ్యం వహించినా నియోజకవర్గానికి చేసిందేం లేదన్నారు.

9న కరీంనగర్‌లో కాంగ్రెస్ కవాతు

గంగాధర(చొప్పదండి): ఎన్ని అడ్డంకులు సృష్టించినా కరీంనగర్‌లో ఈనెల 9న కాంగ్రెస్ కవాతు నిర్వహిస్తామని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తాకు పాదయాత్ర చేరుకుంది. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కరీంనగర్‌లో కాంగ్రెస్ సభ నిర్వహించేందుకు సీపీ అనుమతి ఇవ్వడం లేదన్నారు. సభను అడ్డుకుంటే ముఖ్యమంత్రిని ప్రగతిభవన్ నుంచి బయటకు రానివ్వమని హెచ్చరించారు. కవాతు సభకు కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి రాబోయే ఎన్నికల్లో అవకాశం ఇచ్చి రుణం తీర్చుకుందామని పిలుపునిచ్చారు. ఎంపీ బండి సంజయ్, రాజ్యసభ సభ్యుడు సంతోష్ కుమార్ చేసిందేమీ లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంతానికి చుక్క నీరు రాలేదన్నారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కమీషన్ల కోసం కేసీఆర్ కుటుంబం పనిచేస్తోందని, ప్రాజెక్టుల పేరుతో దోచుకుంటోందని అన్నారు. ఇప్పుడున్న వరదకాలువ ద్వారానే మూడు వందల టీఎంసీల నీటిని తరలించే అవకాశం ఉన్నా.. కమీషన్ల కోసమే మరో కాలువ నిర్మిస్తున్నారని అన్నారు.



కాముని దహనం

హోలీ పౌర్ణమికి ముందురోజు సోమవారం జిల్లావ్యాప్తంగా కాముని దహనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంతో పాటు పల్లెల్లోని ప్రధాన వీధుల్లో పిడకలు, కర్రలతో మంటలు వేసి కాముని దహనం నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ విలీన గ్రామం అలుగునూరులో కామదహనం నిర్వహించి చిన్నాపెద్ద ఆడిపాడారు.

హరితహారం లక్ష్యం 43.70లక్షల మొక్కలు

- కలెక్టర్ ఆర్వీ కర్ణన్

కరీంనగర్ అర్బన్: తెలంగాణకు హరితహారంలో భాగంగా నిర్దేశించిన లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకోవాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అధికారులను ఆదేశించారు. 2023–24 సంవత్సరానికి గానూ 43.70లక్షల మొక్కలను లక్ష్యంగా నిర్ణయించినట్లు వెల్లడించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌజ్‌లో హరితహారంపై సమీక్షించారు. తెలంగాణకు హరితహారం–2022లో 47.080 లక్షల లక్ష్యాన్ని నిర్దేశించగా 48.027లక్షల మొక్కలను నాటడంతో పాటు 31.484లక్షల మొక్కలను జియో ట్యాగింగ్ పూర్తిచేశారని వివరించారు. 2022–23లోనూ 43.70లక్షల మొక్కలు తప్పనిసరిగా నాటేలా కార్యాచరణతో సాగాలని ఆయా శాఖలకు సూచించారు. మియావాకి, కెనాల్, చెరువు గట్లకింద, మొదలగు చోట్ల మొక్కలు నాటాలని తెలిపారు. 2023 హరితహారం కార్యక్రమంలో ఆయిల్ పాం మొక్కలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. స్థానికసంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా అటవీ అధికారి బాలామణి, మున్సిపల్ కమీషనర్ సేవా ఇస్లావత్, ఇరిగేషన్ అధికారి శ్రీనివాస్, డీపీవో వీరబుచ్చయ్య పాల్గొన్నారు.

ఆడబిడ్డల ప్రభుత్వం బీఆర్‌ఎస్

- పోలీస్, ఇతరశాఖల్లో 33శాతం రిజర్వేషన్లు
- చట్టసభల్లోనూ 33శాతం రిజర్వేషన్ కల్పించాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మంత్రులు గంగుల, సత్యవతి రాథోడ్
- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి ఆధ్వర్యంలో..
- ఎల్ఎండీ రాంలీలా మైదానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత



భారీ ఎత్తున హాజరైన మహిళలు



భారీ ర్యాలీతో మైదానానికి చేరుకుంటున్న కవిత, తదితరులు

తిమ్మాపూర్: ఆడబిడ్డల ప్రభుత్వం బీఆర్‌ఎస్ అని, తెలంగాణలో మహిళలందరికీ భరోసా కల్పిస్తోందని నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీకాలనీలోని రాంలీలా మైదానంలో రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన నారీ ప్రభాతభేరి, స్త్రీశక్తి పురస్కారాలు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కవిత, మంత్రులు గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్ హాజరయ్యారు. మొదట ఎల్ఎండీకాలనీలోనీ అమరవీరులస్తూపం వద్ద నివాళి అర్పించారు. ర్యాలీగా రామ్‌లీలా మైదానానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో కవిత మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళా సంఘాలలోని 54 లక్షల మందికి రూ.18 వేల కోట్లను ఆర్థిక స్వావలంబన కింద అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు జాతీయస్థాయిలో అమలు చేసేందుకు టీఆర్‌ఎస్‌ను బీఆర్‌ఎస్‌గా మార్చామన్నారు. బీజేపీ పాలనలో నిత్యవసర సరుకుల ధరలు పెరిగాయన్నారు. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు తీర్మానం చేయాలని ఈనెల 10న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద నిరసన దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. తాను ఊహించని విధంగా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చేపట్టిన మహిళాదినోత్సవ కార్యక్రమం ఆనందంగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో రసమయిని 60వేల మెజారిటీతో గెలిపించాలని కోరారు. మంత్రి మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంపై ఆడబిడ్డల దీవెనలు ఉండాలన్నారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ సామాన్య గిరిజన కుటుంబంలో పుట్టిన తాను మంత్రిగా ఉండడం గర్వంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ మాట్లాడుతూ చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం మహిళా అధికారులు, కళాకారులు, ఆశా, పారిశుధ్య కార్మికులు, గ్రామ సంఘాల సభ్యులను ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, జెడ్పీచైర్‌పర్సన్ కనుమల విజయ, సుడా చైర్మన్ జీవీ.రామకృష్ణారావు, మేయర్ సునీల్‌రావు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జెడ్పీ సీఈవో ప్రియాంక, డీడబ్ల్యూవో సబిత పాల్గొన్నారు.



ఆకట్టుకున్న కళాకారుల ఆటాపాట

పుస్తకం ఒక గురువు..

కరీంనగర్‌కల్చరల్/కరీంనగర్: మనిషికి పుస్తకం గురువులాంటిదని మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. జ్యోతి బాపూలే మైదానంలో నిర్వహిస్తున్న పుస్తకప్రదర్శనను మంత్రి కమలాకర్‌తో కలిసి సందర్శించారు. అక్కడ ఉన్న మహిళలు, చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. ఏడుతరాల పుస్తకాన్ని చదివి తాను కన్నీటి పర్యంతమయ్యానని, మీరు కూడా తప్పకుండా ఈ పుస్తకాన్ని చదవాలని ఎమ్మెల్సీ కవిత మంత్రి గంగులకు పుస్తకాన్ని అందించారు. వ్యాస రచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన గురుకుల పాఠశాల చిన్నారులకు ప్రశంసాపత్రాలు, రేగులపాటి కిషన్‌రావు పేరిట రూ.10వేల నగదు పురస్కారాన్ని సాహితీవేత్త డాక్టర్ డింగరి నరహరి ఆచార్యకు అందించారు. ఇటీవల దళితబంధు పథకంపై ముద్రించిన పుస్తకాన్ని మంత్రి గంగుల కమలాకర్ ఎమ్మెల్సీ కవితకు బహూకరించారు. కలెక్టర్ కర్ణన్, సీపీ సుబ్బారాయుడు ఉన్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర అథ్లెటిక్స్ పోటీల్లో పతకాలు



కరీంనగర్‌స్పోర్ట్స్: హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పలు విభాగాల్లో రాణించి ఆరు పతకాలు సాధించినట్లు అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి తెలిపారు. దుబ్బెట భార్గవి, గైని నక్షత్రాలు సుదీక్ష, సాయి మనోజ్, ఐశ్వర్య, శివానీలు రాణించి బంగారు, రజత, కాంస్య పతకాలు సాధించారన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను సీపీ నటేష్, జిల్లా యువజన క్రీడల అభివృద్ధి అధికారి కీర్తి రాజావీరు, రాజగోపాల చారి, మర్రి చంద్రశేఖర్ అభినందించారు.

అడువాల సుజాతకు విశిష్ట మహిళా పురస్కారం



కరీంనగర్‌కల్చరల్ / కరీంనగర్‌రూరల్ : తెలంగాణ భవన్‌లో సోమవారం వివిధ రంగాల్లో కృషిచేస్తున్న మహిళలకు విశిష్ట మహిళా పురస్కారాలు అందించారు. ఇందులో భాగంగా కరీంనగర్ జిల్లాకు చెందిన కవయిత్రి డాక్టర్ అడువాల సుజాతకు విశిష్ట మహిళా పురస్కారం ఎమ్మెల్సీ వాణీదేవి, హైదారబాద్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, వరంగల్ మేయర్ గుండు సుధారెడ్డి పురస్కారం అందించారు.

'స్పేస్'లో మహిళలకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

కరీంనగర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్ మహిళలను ప్రోత్సహించేందుకు 'నేటి మహిళ డిజైనర్ 2023 శిక్షణ పథకం' ద్వారా 30 మంది ఆసక్తిగల మహిళలకు తక్కువ ఫీజుతో కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ జంజిరాల వేణు తెలిపారు. కంప్యూటర్ ఫండమెంటల్స్, లోయర్ కంప్యూటర్ టైపింగ్, పేజీమేకర్, తెలుగు టైపింగ్, ఫోటోషాప్ డిజైనింగ్‌లో శిక్షణ ఇచ్చి వారి ఆసక్తిని బట్టి ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. పదోతరగతి, ఆపై విద్యార్హతలు గలవారు అర్హులన్నారు. నగరంలోని సీపీ బంగ్లా పక్కన స్పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్‌లో ఈనెల 8వ తేదీలోగా దరఖాస్తులు అందించాలని సూచించారు. వివరాలకు సెల్ 9030124777 ను సంప్రదించాలన్నారు.

9న జిల్లాస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: జిల్లా జిమ్నాస్టిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 9న కరీంనగర్‌లోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో జిల్లాస్థాయి జిమ్నాస్టిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జిమ్నాస్టిక్స్ సంఘం అధ్యక్ష కార్యదర్శులు డీ.నిరంజనా చారి, పొన్నం అనూప్‌కుమార్ తెలిపారు. రిథమిక్ ఆక్రోబెటిక్ జిమ్నాస్టిక్స్ అంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో రాణించిన క్రీడాకారులను ఈనెల 13న హైదరాబాద్ లోని ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల బాలబాలికలు ఆధార్ కార్డుతో 9న ఉదయం 10 గంటలకు ప్రాంతీయ క్రీడా పాఠశాల జిమ్నాస్టిక్స్ కోచ్ గణేశ్, బ్రహ్మచారికి రిపోర్టు చేయాలన్నారు.

నిశ్శబ్దాన్ని ఛేదిద్దాం.. నిజాలు తెలుసుకుందాం

- మహిళల రుతు పరిశుభ్రతపై లఘుచిత్రాల పోటీలు
- ఈ నెలాఖరు వరకు గ్రామపంచాయతీలకు అవకాశం
- గ్రామాల్లో కొనసాగుతున్న అవగాహన కార్యక్రమాలు



బావుపేటలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్(ఫైల్)

కరీంనగర్‌రూరల్: మహిళలు శానిటరీ న్యాప్కిన్స్ కొనుగోలు చేసేందుకు ఇబ్బంది పడుతుంటారు. ఈ క్రమంలో రుతు పరిశుభ్రతను నిర్లక్ష్యం చేస్తూ ఆరోగ్యపరంగా సమస్యలు తెచ్చుకుంటున్నారు. మహిళల్లో నెలకొన్న ఈ భావనలో మార్పు తీసుకరావాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా జిల్లాలో రుతు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. పలు గ్రామాల్లో స్వశక్తి సంఘాల మహిళలతో సమావేశం నిర్వహిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 19లక్షల మహిళలున్నారు. ఈ నెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు రుతు పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మే 28న అంతర్జాతీయ రుతు పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన కల్పిస్తున్నారు.

గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు

గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు రుతు పరిశుభ్రతపై అవగాహన పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా లఘుచిత్రాలను రూపొందించాలని నిర్ణయించింది. 'మహిళా మేలుకో– రుతుచక్రం తెలుసుకో, నిజాలు తెలుసుకుద్దాం– నిశ్శబ్దాన్ని ఛేదిద్దాం' అనే నినాదాలతో పోటీలు నిర్వహించేందుకు స్వచ్ఛభారత్ మిషన్ అధికారులు ఏర్పాట్లు చేశారు. రుతు పరిశుభ్రతకు సంబంధించి న్యాప్కిన్లు వినియోగించక అనారోగ్య సమస్యలతో మహిళలు బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో లఘుచిత్రాల ద్వారా గ్రామీణ ప్రజల్లో చైతన్యం తీసుకరావాలనే ఆలోచనతో కేంద్ర ప్రభుత్వం లఘుచిత్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

గ్రామపంచాయతీల బాధ్యత..

కేంద్ర ప్రభుత్వం లఘుచిత్రాలను నిర్మించే బాధ్యత గ్రామపంచాయతీలకు అప్పగించింది. 15వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకుని ఎవరినైనా నియమించుకునే అవకాశం కల్పించింది. జాతీయస్థాయిలో ఎంపికైన లఘుచిత్రాలకు పురస్కారాలు అందిస్తారు. ప్రథమ బహుమతిగా రూ.5లక్షలు, ద్వితీయ రూ.3లక్షలు, తృతీయ రూ.2లక్షల చొప్పున పురస్కారాలు అందిస్తుంటారు. జిల్లాలోని 313 గ్రామపంచాయతీలు లఘుచిత్రాల పోటీల్లో పాల్గొనే అవకాశముంది. అయితే అధికారులు మండలానికో రెండు, మూడు గ్రామాలను ఎంపిక చేసి లఘుచిత్రాలను నిర్మించేలా ప్రోత్సహిస్తున్నారు. గుర్తింపు పొందిన జాతీయ భాషల్లో లఘుచిత్రాలను తీయడంతోపాటు హిందీ, ఇంగ్లిష్ భాషల్లో సబ్ టైటిల్స్ తప్పనిసరిగా ఉండాలి. ఆయా జిల్లాల నుంచి వచ్చిన లఘుచిత్రాలను రాష్ట్రస్థాయిలో పరిశీలించి జాతీయ స్థాయి పోటీలకు పంపిస్తారు. లఘుచిత్రాలను నిర్మించి పంపించడానికి ఈ నెల 31వరకు అవకాశముంది.

పోటీల్లో పాల్గొనేలా ప్రోత్సాహం

రుతు పరిశుభ్రతపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నాం. మహిళలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత గ్రామపంచాయతీలపై ఉంది. లఘుచిత్రాల పోటీల్లో అన్ని గ్రామపంచాయతీలు పాల్గొనేలా ప్రోత్సహిస్తున్నాం. లఘుచిత్రాలతో మహిళలను చైతన్యం చేసేందుకు అవకాశముంది.

– కిషన్‌స్వామి, యునిసెఫ్ ప్రాజెక్టు జిల్లా కోఆర్డినేటర్

అవే సమస్యలు.. అవే వినతులు

- ప్రజావాణికి ప్రజల బారులు
- పరిష్కరించాలని వేడుకోలు



ప్రజావాణిలో అర్జీదారులు

కరీంనగర్ అర్బన్: ప్రజాసమస్యల పరిష్కారమే పరమావధిగా నిర్వహించే ప్రజావాణి పడిగాపులకు నెలవవుతోంది. వచ్చిన అర్జీలే మళ్లీ మళ్లీ వస్తుండగా క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యం అర్జీదారులకు శాపంగా మారింది. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికి వచ్చిన అర్జీలే రావడం అధికారుల అలసత్వానికి నిదర్శనం. 177 అర్జీలు రాగా ప్రధానంగా భూ సమస్యలు, దళితబంధు, డబుల్ బెడ్ రూం, పింఛన్లకు సంబంధించినవి ఉన్నాయి. ప్రజావాణి దరఖాస్తును తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ ఆదేశించారు. ఒకవేళ పరిష్కరించలేని క్రమంలో ఎందుకు చేయలేరో రాతపూర్వకంగా అర్జీదారుకు వివరించాలని స్పష్టం చేశారు. కరీంనగర్ మున్సిపల్ కార్యాలయానికి 20, పోలీస్ కమిషనర్‌కు 5, జిల్లా పంచాయతీ అధికారి 15, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి 4, ఆర్డీవో కరీంనగర్ 7, తహసీల్దార్ గన్నేరువరం12 దరఖాస్తులు, మిగిలిన శాఖలన్నింటికి కలిపి 126 దరఖాస్తులు మొత్తం 177 స్వీకరించామని కలెక్టరేట్ ఏవో డా.కన్నం నారాయణ వివరించారు. అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్, ట్రైని కలెక్టర్ లెనిన్ ఉన్నారు.

ఫిర్యాదు చేస్తే చర్యలేవీ



గత 6 నెలల క్రితం గ్రామపంచాయతీ నిధులు రూ.60.53లక్షలు పక్కదారి పట్టాయని కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశాను. డీఎల్‌పీవో రెండుసార్లు విచారణ చేసి సర్పంచ్‌తో పాటు 2019 నుంచి 2023వరకు ఉన్న గ్రామ కార్యదర్శులు ఆరుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేవు.

– అంతం రాజిరెడ్డి, లింగాపూర్,శంకరపట్నం

నాట్ సైన్ వస్తోంది



గ్రామంలో 519/ఎ సర్వే నంబర్‌లో మా నాన్నకు 1.31 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ధరణి పోర్టల్‌లో పహాణీలో వివరాలు చూపిస్తుండగా నాట్ సైన్‌గా చూపిస్తోంది. మీ సేవలో దరఖాస్తు చేస్తే రిజెక్ట్ అని సెల్‌ఫోన్‌కు మెస్సెజ్ వచ్చింది. కలెక్టర్ గారూ సమస్యను పరిష్కరించాలి.

– సీహెచ్. శ్రీనివాస్ , సుందరగిరి, చిగురుమామిడి

ప్రజావ్యతిరేక పాలనకు చరమగీతం పాడాలి

- రేవంత్ బహిరంగ సభను విజయవంతం చేయాలి
- కరీంనగర్ బహిరంగ సభ ఇన్‌చార్జి గంద్ర సత్యనారాయణరావు



మాట్లాడుతున్న గంద్ర సత్యనారాయణరావు

హుజూరాబాద్‌రూరల్: కేంద్ర,రాష్ట్ర ప్రజావ్యతిరేక పాలనకు చరమగీతం పాడేందుకు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రారంభించిన హాత్‌సే హాత్ జోడో యాత్ర కరీంనగర్‌లో ముగిస్తున్న సందర్భంగా ఈ నెల 9న కరీంనగర్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నామనీ, సభ విజయవంతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని హాత్ సే హాత్ జోడో యాత్ర ఇన్‌చార్జి భూపాలపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి గండ్ర సత్యనారాయణరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఎన్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూర్ వెంకట్ అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కట్టబెడతారని ఇందుకు కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేయాలన్నారు. నియోజకవర్గం నుంచి భారీగా కార్యకర్తలు, నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఐదు మండలాల కార్యకర్తలు, గ్రామ అధ్యక్షుడు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


ఆర్టీసీ బస్సు ఢీకొని రైతు మృతి



మానకొండూర్: మండలంలోని చెంజర్లకు చెందిన సుధగోని శ్రీనివాస్ (48) రైతు ఆర్టీసీ బస్సు ఢీకొని సోమవారం రాత్రి మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. చెంజర్ల గ్రామానికి చెందిన శ్రీనివాస్ గతంలో ఆదర్శ రైతుగా పనిచేశాడు. కాగా శ్రీనివాస్ సోమవారం యథావిధిగా వ్యవసాయ పనులకు వెళ్లాడు. ఈక్రమంలో ఇదే గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి తన పంట పొలానికి మందులు పిచికారి చేసి శ్రీనివాస్‌ను తన బైక్‌పై ఇంటిదగ్గర దింపాడు. తిరిగి రోడ్డు దాటుతుండగా వరంగల్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై నుంచి శ్రీనివాస్ రహదారి పైపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కరీంనగర్‌కు తరలించారు. మృతుడికి భార్య రమ, కుమారుడు సిద్దు, కూతురు సంజన ఉన్నారు. గతంలో అల్గునూర్ వద్ద తన బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ప్రమాదం నుంచి బయటపడ్డాడని, మళ్లీ రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందడం గ్రామస్తులను కలచివేసింది.

పిల్లలకు వసతులు కల్పించాలి

- జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బి.సుజయ్



హుజూరాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాల పిల్లలకు అవసరమైన వసతులు కల్పించాలని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సెక్రటరీ హుజురాబాద్ సీనియర్ సివిల్ జడ్జి బి.సుజయ్ అన్నారు. సోమవారం పట్టణంలోని తెలంగాణ మహాత్మా జ్యోతిబాపూలే బాలుర పాఠశాలను లయన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్‌తో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు, వసతుల కల్పనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలుంటే 1098కి కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో లీగల్ కౌన్సెలింగ్ న్యాయవాదులు మహేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'బండి'ని కలిసిన జిల్లా ఓబీసీ అధ్యక్షుడు



సుల్తానాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్‌ను ఓబీసీ జిల్లా అధ్యక్షుడు పిడుగు కృష్ణ, ప్రధాన కార్యదర్శి చాతరాజు రమేశ్ కలిశారు. సోమవారం హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో కలిసి జిల్లా పరిస్థితిని ఆయనకు వివరించారు. స్థానికంగా పార్టీ బలోపేతం అవుతోందని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు చేరవేస్తామని వివరించారు. ముందుగా బండి చేపట్టిన దీక్షలో ఓబీసీ జిల్లా ఇన్‌చార్జి మంతెన కిరణ్, రాష్ట్ర మీడియా సెల్ కన్వీనర్ బందా రపు మల్లికార్జున్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చాతరాజు రమేశ్, మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు సమ్మయ్య యాదవ్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో మృతదేహం లభ్యం



మురారి రుషికేష్ మృతదేహం

హుజూరాబాద్‌రూరల్: బంధువుల ఇంట్లో చేస్తున్న దైవ కార్యానికి వచ్చి ఉదయం సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన యువకుడు మృత్యువు ఒడికి చేరిన ఘటన సోమవారం వెలుగుచూసింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా మానకొండూరు మండలం ఈదులగట్టెపల్లి ఎస్సారెస్పీ కాలువలో ఆదివారం ఉదయం బీటెక్ విద్యార్థి మురారి రుషికేష్ (24) తన బంధువులతో కలిసి ఈత కొట్టేందుకు ఎస్సారెస్పీ కాలువలోకి దిగారు. కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఇద్దరు కొట్టుకుపోవడం గమనించిన స్థానికులు కాపాడేందుకు యత్నించి ఒక్కరిని మాత్రమే కాపాడగలిగారు. రుషికేష్ నీటి ప్రవాహ వేగానికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న బంధువులు వెంటనే మానకొండూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు, బంధువులు కలిసి గాలింపు చేట్టారు. సోమవారం హుజురాబాద్ మండలంలోని పెద్దపాపయ్యపల్లి సమీపంలోని కాలువలో ఒక మృతదేహం కొట్టుకు పోతుండగా స్థానికుల గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, మృతుడి బంధువులతో ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

'జ్యోతిష్మతి'లో ఘనంగా ఫార్మసీ డే



గుండెపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్: మండలకేంద్రంలోని జ్యోతిష్మతి ఫార్మసీ కళాశాలలో 'జాతీయ ఫార్మసీ విద్యాదినోత్సవం' సోమవారం నిర్వహించారు. ప్రొఫెసర్ మహదేవ లాల్ గ్రాఫ్ జ్ఞాపకార్థం 'అడ్వర్స్ డ్రగ్ రియాక్షన్స్, నార్కోటిక్, సైకోట్రోపిక్ పదార్థాల దుర్వినియోగం, జీవనశైలి వ్యాధుల నివారణపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రథమ చికిత్స, పరిశుభ్రత, సంక్రమించే వ్యాధులపై బీఫార్మసీ, డిఫార్మసీ విద్యార్థులు అవగాహన కల్పించారు. డిప్లొమా విద్యార్థులకు వివిధరకాల వ్యాధులు, జీవనశైలి మార్పులను పరిగణనలోకి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్లతో అవగాహన కల్పించారు. ముఖ్యంగా ఇటీవల కాలంలో యువత గుండెపోటుతో ఎక్కువగా మరణిస్తున్నారని నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు, సెక్రెటరీ సుమిత్‌సాయి రావు ప్రిన్సిపాల్ మనోహర్, ఫార్మసీ ప్రొఫెసర్ పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'శ్రీ చైతన్య'లో ఘనంగా 'జాతీయ ఫార్మసీ విద్యాదినోత్సవం'

తిమ్మాపూర్: మండలంలోని శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాల 'జాతీయ ఫార్మసీ విద్యా దినోత్సవం' సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జాతీయ పోషకాహార సంస్థ, హైదరాబాద్ శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న, కళాశాల చైర్మన్ ముద్దసాని రమేశ్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఫార్మసీ విద్యార్థులు ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు కృషిచేయాలని మందుల వాడకంతో వస్తున్న దుష్ఫలితాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రామ నర్సింహారెడ్డి, ప్రొఫెసర్‌లు అప్పారావు, కె.రామ్‌ప్రసాద్, శ్యామ్‌కుమార్, ధనుంజయ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌సీవోపై విచారణ జరపాలి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: పట్టణ కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే ఆర్‌సీవోపై, సమయపాలన పాటించని సిబ్బందిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సంద గణేశ్ మాట్లాడుతూ.. మహాత్మ జ్యోతిరావు పూలే హాస్టల్లో అనేక సమస్యలున్నప్పటికీ ఆర్‌సీవో స్పందించడం లేదన్నారు. హాస్టల్ సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్నారు. ఆర్‌సీవో పరిధిలోని 33 గురుకులాల సీట్లపై జిల్లా కలెక్టర్ కమిటీ వేసి విచారణ జరపాలన్నారు. ప్రిన్సిపాల్ నుంచి ఆర్‌సీవో వరకు మెరిట్ ప్రకారం సీట్లు ఇవ్వకుండా డబ్బులకు సీట్లను, ఉద్యోగాలను అమ్ముకున్నట్లు ఆరోపణలున్నాయని వీటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. సమయపాలన పాటించని సిబ్బందిని విధుల నుంచి తొలగించాలని కోరారు. లేనిపక్షంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. వినతి పత్రం ఇచ్చినవారిలో నాయకులు తిరుపతి, నవీన్, రామ్, శశి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ ఢీకొని మహిళ మృతి

- మరోకరికి తీవ్ర గాయాలు



తిరుపతి (ఫైల్)



చికిత్సపొందుతున్న వెంకటేశ్

జమ్మికుంట: ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో ఓ మహిళ మృతిచెందగా మరోకరికి తీవ్రగాయలైన ఘటన మున్సిపల్ పరిధి కొత్తపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లికి చెందిన గుత్తికొండ తిరుపతి, వెంకటేశ్ అక్కా తమ్ముడు కలిసి టీవీఎస్ వాహనంపై జమ్మికుంట పట్టణం చేరుకునే క్రమంలో కొత్తపల్లిలోని శ్రీరాములపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఇసుక ట్రాక్టర్‌తో డ్రైవర్ బాపుమధు అనేవ్యక్తి అతివేగంగా అజాగ్రత్తగా నడిపి మోపెడ్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గుత్తికొండ తిరుపతి(40) మహిళకు తలకు తీవ్రగాయాలై మృతిచెందగా, వెంకటేశ్ కాలువిరిగింది. జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి విచారణ చేపట్టారు. మృతురాలి తండ్రి రాజమల్లు ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు జమ్మికుంట టౌన్ సీఐ రామచందర్‌రావు తెలిపారు.

మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించాలి



మాట్లాడుతున్న నాబార్డు ప్రతినిధులు

హుజూరాబాద్‌రూరల్: మహిళలు ఆర్థిక అక్షరాస్యత సాధించే లక్ష్యంతో ముందుకు వెళ్లాలని నాబార్డు ఏజీఎం అనంత్ పట్నాలా, లీడ్ బ్యాంక్ మేనేజర్ ఆంజనేయులు అన్నారు. సోమవారం పట్టణంలోని సిటీ సెంట్రల్‌హాల్‌లో ఎస్ఎచ్‌జీ మహిళలకి నాబార్డ్, స్పందన ఆధ్వర్యంలో మహిళలకి బుక్ కీపింగ్, క్రెడిట్ మానిటరరింగ్, పోటెన్సియల్ కార్యక్రమాలు, క్రెడిట్ లింక్డ్ స్కీమ్స్‌పై అవగాహన కల్పించి మాట్లాడారు. జీవనోపాధి అవకాశాలు పెంపొందించుకోవాలన్నారు. వృత్తి నైపుణ్యం పెంపొందిచుకోవాలని, రుణాలు పొంది యూనిట్లు స్థాపించుకోవాలన్నారు. దీంతో కుటుంబ పోషణకు ఆసరాగా నిలుస్తారని వృత్తిపరమైన శిక్షణతో నైపుణ్యం పెంపొందించుకోవాలని సూచించారు. ఏపీవోలు తిరుపతి, రాజ్ కుమార్, స్వప్న, వివిధ బ్యాంక్‌ల అధికారులు సొసైటీ సభ్యులు జ్యోతి, వాణి, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం వైపు బీసీలు అడుగులు వేయాలి

- బీసీ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గజ్వేల్లి మధుసూదన్



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్

జమ్మికుంట: దేశంలో 66శాతం ఉన్న బీసీలు ఓటును ఆయుధంగా మలుచుకుని, రాజ్యాధికారం వైపు అడుగులు వేయాలని బీసీ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గజ్వేల్లి మధుసుదన్ అన్నారు. సోమవారం పట్టణంలోని సువర్ణ ఫంక్షన్ హాల్‌లో బీసీ సంక్షేమ సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముంజాల కుమారస్వామి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు చేపట్టారు. కేంద్రంలో బీజేపీ బీసీ సంక్షేమ శాఖ ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమన్నా రు. ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ బీసీలైనప్పటికీ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావడంలేదని విమర్శించారు. ఇప్పటికైన బీసీలు హక్కుల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళావిభాగం అధ్యక్షురాలు సురేఖ సిద్దిరాం గైక్వాడ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బోడపల్లి భాగ్య నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కొల్లురి నీరజ, వీణవంక, ఇల్లందకుంట, జమ్మికుంట మండలాల అధ్యక్షులు జంగిలి తిరుపతియాదవ్, సతీశ్‌గౌడ్, పెరుగు శ్రీనివాస్ యాదవ్, జిల్లా కార్యదర్శి చుక్కల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎఫ్‌సీఎల్‌లో నిలిచిన ఉత్పత్తి..



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం ఫెర్టిలైజర్స్ కెమికల్ లిమిటెడ్ కర్మాగారంలో సాంకేతిక కారణాలతో సోమవారం యూరియా ఉత్పత్తి నిలిచిపోయింది. కర్మాగారంలో కొన్ని రోజులుగా సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. కర్మాగారంలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి గణనీయంగా తగ్గింది. ఆర్థిక సంవత్సరం మార్చి 31తో ముగిసే సమయంలో కర్మాగారంలో సాంకేతిక సమస్యతో యూరియా ఉత్పత్తి నిలిచిపోవడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు.

క్లుప్తంగా

నేడు 118వ ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్ కల్చరల్: తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 7 గంటలకు పుస్తక ప్రదర్శన జరుగుతున్న జ్యోతిబాపూలే పార్కులో 118వ ఎన్నీల ముచ్చట్లు నిర్వహిస్తున్నట్లు వేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కందుకూరి అంజయ్య, సీవీ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కవులు, రచయితలు తమ కవితలతో హాజరు కావాలని కోరారు.

అదనపు కలెక్టర్‌కు సన్మానం



అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌ను సన్మానిస్తున్న వైద్యులు

కరీంనగర్‌టౌన్: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్‌ను సోమవారం సాయంత్రం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం చదువుకున్న మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, వారికి సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, ఆడపిల్లలపై తల్లిదండ్రులు ప్రేమానురాగాలతో ఉంటూ వారిని సన్మార్గంలో నడిపించాలని సూచించారు. కార్యక్రమంలో ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ గుర్రం కిరణ్, వైద్యులు సాయి ఫణిచంద్ర, ఉపేందర్‌రెడ్డి, అక్షయ్, మార్కెంటింగ్ హెడ్ ప్రసాద్, ఈశ్వర్, చంద్రశేఖర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన భవన సముదాయానికి విరాళం



విరాళం అందిస్తున్న సత్యనారాయణ-భాగ్యలక్ష్మి

కరీంనగర్ కల్చరల్: దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న నగరంలోని సాయినగర్ శ్రీవిజయగణపతి సాయిబాబా దేవాలయంలో నిర్మిస్తున్న అన్నదాన భవన సముదాయానికి తమ్మిశెట్టి సత్యనారాయణ-భాగ్యలక్ష్మి దంపతులు సోమవారం రూ.1,00,016లను ఆలయ కమిటీ చైర్మన్ చిట్టుమల్ల కొండయ్యకు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఈవో మారుతి, సాయి భక్త భజన మండలి బాధ్యులు ఎస్.చంద్రశేఖర్, ఆర్.శ్రీధర్, సందీప్, వెంకటనరసయ్య, సత్యం, కిరణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మయ్యకు విశిష్ట సేవా నంది పురస్కారం



పురస్కారం అందుకుంటున్న లక్ష్మయ్య

సప్తగిరికాలనీ: తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన దివ్యాంగులకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వాసవి క్లబ్ సూపర్ స్టార్, విజయవాడ మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలోని కన్యకాపరమేశ్వరి హాల్‌లో పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ దివ్యాంగుల పట్టభద్రుల సంఘానికి అధ్యక్షుడిగా కొనసాగుతూ సేవలందిస్తున్న జిల్లాకు చెందిన మొగిలి లక్ష్మయ్యకు విశిష్ట సేవా నంది పురస్కారాన్ని నిర్వాహకులు అందజేశారు. పలువురు సోమవారం ఆయనను అభినందించారు.

విద్యార్థులు సామాజిక సేవలో ముందుండాలి



మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

కరీంనగర్‌రూరల్: విద్యార్థులు సామాజిక సేవలో ముందుండి, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని నిగమ విద్యాసంస్థల చైర్మన్ టీవీఆర్ గోపాల్‌రెడ్డి అన్నారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు సామాజిక సేవలో ముందుండాలని, అప్పుడే సేవాభావం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. కరీంనగర్ మండలంలోని చామనపల్లిలో వాగేశ్వరీ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా సోమవారం చామనపల్లి, చెర్లభూత్కూర్ గ్రామాల్లో సామాజిక సర్వే నిర్వహించారు. వలంటీర్లు ఇంటింటికీ తిరుగుతూ గ్రామస్తుల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల కార్యదర్శి రత్నగోపాల్, ప్రిన్సిపాళ్లు సతీశ్‌గౌడ్, లింగమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

హోలీ.. ఆనందాల కేళీ

- నేడు రంగుల పండుగ
- సింథటిక్ రసాయనాలు, ఆయిల్, గ్రీజు ఉపయోగించొద్దంటున్న వైద్యులు
- జాగ్రత్తలతో వేడుక జరుపుకోవాలని సూచన



విద్యానగర్: పండుగ ఏదైనా దానికి ఒక ప్రత్యేకత ఉంది. ఒకటి రైతులదైతే మరొకటి బంధాలను తెలిపేది. అలాగే హోలీ సామాజిక పండుగ. దీనికి పూజలు, పునస్కారాలు లేవు. పిండి వంటల ముచ్చట అసలే లేదు. గుప్పెడు రంగును చేతిలో పట్టుకొని, ఆత్మీయులు, సన్నిహితులు, స్నేహితులపై చల్లుతూ గుండెల్లో ఉండే భావాలను, సంతోషాన్ని వ్యక్తం చేసే వేడుక. అయితే సింథటిక్ రసాయనాలను రంగులుగా ఉపయోగిస్తే కళ్లకు, శరీరానికి ప్రమాదమని వైద్యులు అంటున్నారు. తగిన జాగ్రత్తలతో పండుగ జరుపుకోవాలని సూచిస్తున్నారు.

బంధాలు బలపడతాయని విశ్వాసం

శ్రీకృష్ణుడు బృందావనంలో గోపికలతో రంగులు, తీరొక్కపూలతో హోలీ జరుపుకున్నట్లు పురాణాల్లో ఉంది. హోలీ రోజు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకోవడం వల్ల సౌభాగ్యాలు, ప్రేమలు వెల్లివిరిసి అనుబంధాలు బలపడతాయని విశ్వాసం.

అందరం కలిసి ఆడుకుంటాం



నేను, మా వీధిలోని మహిళలందరం కలిసి హోళీ ఆడుకుంటాం. అందరూ మా ఇంటి వద్దకే వస్తారు. ఒకరి మీద ఒకరం రంగులు చల్లుకుంటాం. హోలీ రోజు సరదాగా, సంతోషంగా గడిచిపోతుంది.

– కె.జయసుధ, పద్మనగర్

సందడిగా ఉంటుంది..



హోలీ రోజు మా కమల అపార్ట్‌మెంట్ అంతా రంగులతో, తీన్మార్ డ్యాన్సులతో సందడిగా ఉంటుంది. చిన్నాపెద్ద అనే తేడా లేకుండా అందరం కలిసి, కేరింతలు కొడుతూ రంగులు చల్లుకుంటాం.

– తొడుపునూరి సౌమ్య, ఎంబీఏ విద్యార్థిని, జ్యోతినగర్, కరీంనగర్

హోలీ అంటే ఇష్టం..



హోలీ అంటే నాకు చిన్నప్పటి నుంచి ఇష్టం. రంగులు, రంగు కలిపిన నీళ్ల బాటిల్స్ పట్టుకొని దోస్తుల ఇళ్లకు వెళ్లి, వారి మీద పోస్తాను. ఈ సరదా వేరే పండుగల్లో కనిపించదు.

– బొశెట్టి రత్నమాల, గృహిణి, కరీంనగర్

10 నిమిషాల్లో శుభ్రం చేసుకోవాలి



శరీరంపై ముదురు రంగులను 10 నిమిషాల్లో శుభ్రం చేసుకోవాలి. లేదంటే ఎలర్జీ వచ్చే ప్రమాదం ఉంది. ద్రవరూప రసాయనాల జోలికి వెళ్లొద్దు. ఆయిల్, గ్రీజు ఉపయోగించొద్దు.

– డాక్టర్ వి.సుమన్‌చందర్‌రావు, చర్మవ్యాధుల నిపుణుడు, కరీంనగర్

కళ్లలో పడకుండా చూసుకోండి



రంగులు కళ్లలో పడకుండా చూసుకోవాలి. హానికర రసాయనాలున్న రంగుల వల్ల కంటి రెటీనా దెబ్బతింటుంది. కళ్లల్లో పడితే చల్లని నీటితో శుభ్రం చేసి, నేత్ర వైద్యున్ని సంప్రదించాలి.

– డాక్టర్ వి.రఘు, నేత్ర వైద్య నిపుణుడు, కరీంనగర్

గురుకుల డిగ్రీ విద్యార్థినుల ప్రతిభ



సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీహరి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని నగునూరు సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలకు చెందిన పలువురు విద్యార్థినులు ఇటీవల జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన యువ ఉత్సవ్ పోటీల్లో పాల్గొని, ప్రతిభ కనబరిచారు. నృత్య పోటీల్లో జి.సమత, ఎం.శృతి, ఎం.శ్రీజ, ఆర్.రక్షిత, బి.నవ్యలు ప్రథమ బహుమతి రూ.5 వేలు, కవితల పోటీల్లో ఎస్.ప్రవళిక ద్వితీయ బహుమతి గెలుపొందారు. ట్రినిటీ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన మేధా-23 పోటీల్లో మైక్రో బయాలజీ రీసెర్చ్ ప్రాజెక్టులో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్సీలో ఎస్.హేమ, కె.గాయత్రిలు మొదటి బహుమతి, మ్యాథ్స్‌లో సంగీత, ఫొటోగ్రఫీలో నిక్షిప్త మొదటి బహుమతి, అడ్వర్టైజ్‌మెంట్‌లో సాయి నిఖిత, స్పాట్ డ్యాన్స్‌లో సమత గ్రూప్ రెండో, బ్రాండ్ అంబాసిడర్‌గా లిఖిత బహుమతులు సాధించారు. విజేతలకు సోమవారం ప్రిన్సిపాల్ శ్రీహరి సర్టిఫికెట్లు, మెమెంటోలను అందించి, అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సమత, లైబ్రేరియన్ మోహన్‌రావు, స్టాఫ్ సెక్రటరీ రోజారమణి, ఏసీవో సుష్మ, ఎన్ఎస్ఎస్ పీవో లావణ్య, మైక్రోబయాలజీ హెచ్‌వోడీ గీతారాణి తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తోడుదొంగలు'

కరీంనగర్: బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు తోడుదొంగలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి ఆరోపించారు. సోమవారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం పేదల కడుపు కొడుతూ అదానీకి దోచిపెడుతోందని మండిపడ్డారు. కేంద్రం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను, రాష్ట్ర ప్రభుత్వం బస్, కరెంట్ ఛార్జీలు విపరీతంగా పెంచుతూ పేద ప్రజల నడ్డి విరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఈ రెండు పార్టీలకు ప్రజలు తమ ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రాబోయే ఎన్నికల్లో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఏఐఎఫ్‌బీ నాయకులు పాల్గొన్నారు.

డాక్టర్ రజనికి వైద్యరత్న అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న రజని

కరీంనగర్‌టౌన్: నగరంలోని రజనీ ఫెర్టిలిటీ సెంటర్ చైర్మన్ డాక్టర్ రజనీ ప్రియదర్శిని వైద్యరత్న అవార్డు అందుకున్నారు. హైదరాబాద్ తారా ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రవీంద్ర భారతిలో ఆమెకు పురస్కారం అందజేశారు. కరీంనగర్ జిల్లా నుంచి వైద్య రంగంలో విశిష్ట సేవలందించినందుకు గాను ఈ అవార్డును అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలకు అంతర్జాతీయ మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అవార్డు రావడంతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. భవిష్యత్‌లో మరింత సేవ చేసేందుకు ఇది ప్రోత్సాహకరంగా ఉంటుందని తెలిపారు.

ఆర్‌అండ్‌బీ రోడ్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ లక్ష్మయ్య

కరీంనగర్‌రూరల్: ఆర్‌అండ్‌బీ రోడ్ల సమస్యలు పరిష్కరించాలని ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య కోరారు. శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి సంబంధిత శాఖ అధికారులు గైర్హాజరవుతున్నారని ఆరోపిస్తూ సభ్యులందరూ పోడియం ఎదుట బైఠాయించి, ఆందోళన చేపట్టారు. ఎంపీపీ హామీ మేరకు వారు శాంతించగా సోమవారం ఏఈఈ లక్ష్మణ్‌రావుతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. మొగ్దుంపూర్ నుంచి నగునూరు వరకున్న రోడ్డుపై హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెర్లభూత్కూర్ సర్పంచు దబ్బెట రమణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు బుర్ర తిరుపతిగౌడ్ తెలిపారు. మొగ్దుంపూర్ చౌరస్తాలో ఏర్పడిన గుంతల్లో ద్విచక్రవాహనదారులు పడిపోతున్నారని సర్పంచు జక్కం నర్సయ్య పేర్కొన్నారు. గోపాల్‌పూర్-వల్లంపహాడ్ రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న వ్యవసాయ బావులను వెంటనే పూడ్చివేయాలని వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ కోరారు. స్పందించిన ఏఈఈ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన నిధులేవని చెప్పడంతో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా పనులకు సంబంధించి ప్రతిపాదనలు రూపొందిస్తే మంత్రి గంగుల కమలాకర్ ద్వారా నిధులు మంజూరు చేయిస్తామని చెప్పడంతో ఏఈఈ అంగీకరించారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు సాయిల్ల వినయ్‌సాగర్, ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర రాజకీయాలను శాసిస్తున్న ఎంఐఎం

- నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్



గైడ్స్ అందిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్

విద్యానగర్: రాష్ట్ర రాజకీయాలను శాసించేది ఎంఐఎం పార్టీ మాత్రమేనని, రాష్ట్రంలో తమ పార్టీ మద్దతు లేనిదే ఏ పార్టీ మనుగడ సాధించలేదని ఎంఐఎం నాంపల్లి శాసనసభ్యుడు జాఫర్ హుస్సేన్ మేరాజ్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్-2023 గైడ్స్‌ను ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులందరూ ముఖ్యంగా బాలికలు కష్టపడి చదివి, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. ఎంఐఎం నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ.. ముస్లిం యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, ఉన్నత చదువులు చదివి, రాజకీయాల్లో రాణించాలన్నారు. నగరంలో 35వ డివిజన్‌లో పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఐఎం నగర కమిటీ నాయకులు సయ్యద్ బర్కత్ అలీ, హఫీజ్ మొయినుద్దీన్ ఖాద్రీ, ఖమరుద్దీన్, ఖాజా, ఇబ్రహీం బియాబాని, అబ్బాస్ సమీ, కార్పొరేటర్లు శర్ఫుద్దీన్, అఖీల్ ఫిరోజ్, ఆతిన, అలిబాబా, అజర్ దబీర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు హోలీ



బ్లూబెల్స్ పాఠశాలలో చిన్నారుల సందడి

కరీంనగర్: పారమిత లర్నర్స్ ఉన్నత పాఠశాలలో ముందస్తు హోలీ వేడుకలను సోమవారం జరుపుకున్నారు. విద్యార్థులందరూ రంగులు చల్లుకున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. చైర్మన్ ప్రసాదరావు, డైరెక్టర్లు అనుకర్‌రావు, ప్రసాద్, వినోద్‌రావు ఉన్నారు.

బ్లూబెల్స్ స్కూల్‌లో..

హనుమాన్‌నగర్‌లో గల బ్లూబెల్స్ పాఠశాలలో హోలీ వేడుకలు నిర్వహించారు. చిన్నారులు రంగులు చల్లుకున్నారు. ప్రిన్సిపాల్ జంగ సునీత మనోహర్‌రెడ్డి, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

మానేరులో...

సప్తగిరికాలనీ: మానేరు విద్యాసంస్థల్లో హోలీ వేడుకలు నిర్వహించారు. విద్యాసంస్థల అధినేత కదారి అనంతరెడ్డి, డైరెక్టర్ కదారి సునీతారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పారమిత లర్నర్ స్కూల్‌లో..



మానేరు విద్యాసంస్థలో..





మహిళా అధికారులను సన్మానిస్తున్న, సీడీ ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే రసమయి, గంగవ్వతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

రామ్‌లీలా మైదానంలో అతివల సందడి

- హాజరైన ఎమ్మెల్సీ కవిత, మంత్రి సత్యవతి

తిమ్మాపూర్(మానకొండూర్): అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీకాలనీ రాంలీలా మైదానంలో రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన నారీ ప్రభాతభేరి, స్త్రీశక్తి పురస్కారాల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కవిత, మంత్రులు గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్ హాజరయ్యారు. మహిళా సంఘాల సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల రాకతో సందడి వాతావరణం నెలకొంది. ప్రజాప్రతినిధులు అమరవీరుల స్తూపానికి నివాళి అర్పించారు. యూట్యూబర్లు గంగవ్వ, కనకవ్వలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. మహిళా సంఘాల సభ్యులకు చెక్కులు అందించారు. ఆటపాటలతో జోష్ నెలకొంది.





అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రజాప్రతినిధులు, కనకవ్వకు సన్మానం, మహిళా సంఘాలకు చెక్కు అందజేత

నర్సరీ, ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించాలి

కరీంనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం నుంచి నర్సరీ, ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించాలని ఎస్‌జీటీయూ జిల్లా అధ్యక్షుడు ఊకంటి విజేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ క్లాసులు లేకపోవడం వల్ల పిల్లలందరూ ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే అవకాశం ఉందన్నారు. దీంతో భవిష్యత్‌లో విద్యార్థుల సంఖ్య పూర్తిగా తగ్గి, సర్కారు బడుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని తెలిపారు. ప్రాథమిక పాఠశాలల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ సెంటర్లను ఆయా స్కూళ్లకు అనుసంధానం చేయాలని కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో ఇంగ్లిష్‌లో శిక్షణ పొందిన టీచర్లు ఉన్నారని, ప్రీ ప్రైమరీ తరగతులు ప్రవేశపెడితే విజయవంతం అవుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రమేశ్, రాష్ట్ర కార్యదర్శి జలపతి రెడ్డి, సైదాపూర్ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవం



వేడుకల్లో పాల్గొన్న మహిళలు

కరీంనగర్‌కల్చరల్: బీసీ సంక్షేమ సంఘం మహిళా ఉపాధ్యక్షురాలు దేవరకొండ సంతోషిని ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విద్యానగర్‌లోని ఓ కల్యాణ మండపంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి, ఆటపాటలతో సందడి చేశారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శులు దొగ్గలి శ్రీధర్, గంగిపల్లి అరుణ, నాయకులు పాల్గొన్నారు.

కరీంనగర్‌టౌన్: అమ్మ స్వచ్ఛంద సంస్థ, బీజేపీ రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు సుజాత రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని సోమవారం స్థానిక ప్రెస్ భవన్‌లో నిర్వహించారు. వివిధ రంగాల్లో ఆదర్శంగా నిలుస్తున్న మహిళలకు సన్మానం చేశారు. ఇటీవల మృతి చెందిన మెడికో ప్రీతికి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. అడ్వకేట్ జయశ్రీ, సుంకపాక స్వప్న, మహిళా పోలీస్ స్టేషన్ కౌన్సెలింగ్ మెంబర్ స్వరూప, అరుణ తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు శిబిరం




కొత్తపల్లి: రేకుర్తిలోని 18వ డివిజన్‌లో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ సుదగోని మాధవి సోమవారం ప్రారంభించారు. ప్రజలు కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. వైద్య, మున్సిపల్ సిబ్బంది, నాయకులు కృష్ణగౌడ్ తదితరులున్నారు.

'బీజేపీ హయాంలో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తం'

కరీంనగర్: కేంద్రంలోని బీజేపీ హయాంలో దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ప్రజామిత్ర వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని అమలు చేయకుండా బహుజనుల హక్కులను కాలరాస్తూ కొంత మంది కార్పొరేట్ అధిపతులకు దేశసంపదను బీజేపీ దోచిపెడుతోందని ఆరోపించారు. తొమ్మిదేళ్లుగా దేశంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని మండిపడ్డారు. నిత్యం అనవసరపు అల్లర్లతో ప్రజల దృష్టి మళ్లిస్తూ, ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని పేర్కొన్నారు. 88 శాతం దేశ సంపద కేవలం 12 శాతం మంది చేతుల్లో ఉండటం విచారకరమన్నారు. కేంద్ర వైఫల్యాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ప్రజలను కోరారు. సమావేశంలో నాయకులు శ్రీధర్, బోయిన్‌పల్లి చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

రాష్ట్రంలో అరాచక పాలన: మహేశ్వర్‌రెడ్డి



మామడ: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అరాచక పాలన సాగిస్తోందని, రానున్న ఎన్నికల్లో పార్టీకి చరమగీతం పాడాలని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో కాంగ్రెస్ పోరు యాత్రలో భాగంగా నిర్మల్ జిల్లా మామడ మండలంలో సోమవారం పాదయాత్ర చేశారు. ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే తమ బతుకులు బాగుపడతాయని ఆశించిన ప్రజలకు బీఆర్‌ఎస్ పాలనలో ఎలాంటి ప్రయోజనం కలగలేదని విమర్శించారు. మాయమాటలు, మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన సీఎం కేసీఆర్ ప్రజావ్యతిరేక పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనలో పేదలకు భూములు, ఇందిరమ్మ ఇళ్లు ఇస్తే బీఆర్‌ఎస్ ప్రభుత్వం వాటిని లాక్కుని వ్యాపారం చేస్తోందని మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు.

జయరామ్ హత్య కేసులో దోషి రాకేష్‌రెడ్డి



బంజారాహిల్స్ (హైదరాబాద్): ప్రవాస భారతీయుడు, పారిశ్రామికవేత్త చిగురుపాటి జయరామ్ హత్య కేసులో ప్రధాన నిందితుడైన కె.రాకేష్‌రెడ్డి హంతకుడని న్యాయస్థానం నిర్ధారించింది. ఈ మేరకు నాంపల్లిలోని మొదటి అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు సోమవారం తీర్పు చెప్పింది. రాకేష్ రెడ్డికి ఈ నెల 9న శిక్షను ఖరారు చేయనుంది. ఇదే కేసులో నిందితులుగా ఉన్న ముగ్గురు పోలీసు అధికారులు సహా 11 మందిని నిర్దోషులు గా న్యాయస్థానం ప్రకటించింది. ఆర్థిక విభేదాల నేపథ్యంలో జయరామ్ హత్యకు రాకేష్ పథకం వేశాడు. హనీట్రాప్ ద్వారా 2019 జనవరి 30న జయరామ్‌ను జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10లోని తన ఇంటికి రప్పించాడు. అక్కడే ఆయన్ను నిర్బంధించి రూ.5 కోట్లు డిమాండ్ చేసి.. రూ.6 లక్షలు తీసుకున్నాడు. స్టాంపు పేపర్లు, తెల్ల కాగితాలపై జయరామ్‌తో బలవంతంగా సంతకాలు చేయించుకున్న రాకేష్.. ఆపై దారుణంగా చంపేశాడు. మృతదేహాన్ని కారులోకి వేసుకుని ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామ శివార్లలో పడేసి వచ్చాడు. దీన్ని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించడానికి ప్రయత్నించాడు. కేసు దర్యాప్తు పూర్తి చేసిన అధికారులు కోర్టులో 320 పేజీల అభియోగపత్రం దాఖలు చేశారు. ఇందులో 73 మందిని సాక్షులుగా చేర్చారు.

ఫ్యామిలీ డాక్టర్లు రెడీ

ఈనెల 15 తరువాత పూర్తిస్థాయిలో ప్రారంభం

- 1,142 పీహెచ్‌సీల్లో పూర్తి స్థాయిలో వైద్యుల భర్తీ
- రాష్ట్రవ్యాప్తంగా రిజర్వ్‌లో 175 మంది డాక్టర్లు
- 108 అంబులెన్స్‌లు కొత్తగా మరో 146
- వైద్య ఆరోగ్యశాఖలో నాడు – నేడు సహా వివిధ కార్యక్రమాలపై సీఎం ఉన్నత స్థాయి సమీక్ష



సాక్షి, అమరావతి: ఏపీ వైద్య ఆరోగ్య రంగంలో మరో కీలక ఘట్టానికి సన్నాహాలు జరుగుతున్నాయి. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సంరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతిష్టాత్మక ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ఈ నెల 15వతేదీ తరువాత పూర్తి స్థాయిలో అమలులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో వైద్య, ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్ అమలు, వైద్య ఆరోగ్యశాఖలో నాడు – నేడు సహా వివిధ కార్యక్రమాల పురోగతిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిశీలించారు. గతేడాది అక్టోబర్ 21 నుంచి ఫ్యామిలీ డాక్టర్ ట్రయల్ రన్ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటి వరకూ 45,90,086 మందికి వైద్య సేవలు అందించినట్లు సమీక్షలో అధికారులు తెలిపారు.

రిఫరల్ సేవలను భాగం చేయండి


డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ రిఫరల్ సేవలను ఫ్యామిలీ డాక్టర్ విధుల్లో భాగంగా చేయాలని ముఖ్యమంత్రి జగన్ ఆదేశించారు. ఆరోగ్యశ్రీ సేవల్లో ఎలాంటి ఇబ్బంది, సమస్యలు ఎదురైనా ఫిర్యాదు చేసేందుకు వీలుగా కార్డులపై నెంబర్ ఉంచాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని పూర్తి స్థాయిలో అమలులోకి తెచ్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా 1,142 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) పూర్తి స్థాయిలో వైద్యుల నియామకాలను భర్తీ చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రతి జిల్లాకు నలుగురు అదనపు వైద్యులను సిద్ధంగా ఉంచామన్నారు. ఇక డాక్టర్ల స్వల్పకాలిక సెలవుల సందర్భాల్లో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడకుండా ప్రతి 6–7 పీహెచ్‌సీలకు ఒక వైద్యుడిని అదనంగా నియమించామన్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 175 మందిని రిజర్వ్‌లో ఉంచినట్లు వెల్లడించారు.

మరిన్ని ఔషధాలు.. టెస్టింగ్ కిట్లు.. రిజర్వు వాహనాలు

రాష్ట్రంలో 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లకుగానూ ప్రతి చోటా ఒక కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్‌వో), ముగ్గురు నుంచి నలుగురు ఆశా కార్యకర్తలు ఉంటారని అధికారులు చెప్పారు. విలేజ్ క్లినిక్స్, 104 మొబైల్ మెడికల్ యూనిట్ల (ఎంఎంయూ)లో మందుల సంఖ్యను 67 నుంచి 105కి పెంచామన్నారు. 104 ఎంఎంయూలు ప్రస్తుతం 676 ఉండగా కొత్తగా 234 వాహనాలతో కలిపి మొత్తం 910 ఎంఎంయూలతో ఫ్యామిలీ డాక్టర్ విధానం అమలవుతుందని వివరించారు. ఫ్యామిలీ డాక్టర్ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు గ్రామంలోనే ఉంటూ ప్రజలకు వైద్య సేవలు అందిస్తారని అధికారులు తెలిపారు. కొత్తగా 108 అంబులెన్స్ వాహనాలు 146 కొనుగోలు చేస్తున్నట్లు వివరించారు.

‘స్కిల్’ కుంభకోణంపై సీఐడీ దూకుడు

దర్యాప్తు వేగవంతం.. శ్రీకాంత్ అర్జాకు నోటీసు



సాక్షి, అమరావతి: చంద్రబాబు ప్రభుత్వ హయాంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ ఎస్‌డీసీ)లో కుంభకోణంపై సీఐడీ దర్యాప్తు వేగవంతం చేసింది. సీమెన్స్ కంపెనీతో ప్రాజెక్టు పేరిట ప్రజాధనాన్ని కొల్లగొట్టిన కేసులో అప్పట్లో ఏపీ ఎస్ఎస్‌డీసీ ఎండీగా వ్యవహరించిన శ్రీకాంత్ అర్జాకు సీఐడీ సోమవారం నోటీసులు జారీ చేసింది. జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీతో రూ.3,300 కోట్ల ప్రాజెక్ట్ పేరిట టీడీపీ ప్రభుత్వ పెద్దలు నిధులు కొల్లగొట్టిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం నిధులు కేటాయిస్తే సీమెన్స్ కంపెనీ 90శాతం నిధులు వెచ్చించి రాష్ట్రంలో యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇస్తారని ఒప్పందం చేసుకున్నారు. కానీ సీమెన్స్ కంపెనీ ఒక్క రూపాయి కూడా వెచ్చించకుండానే రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.371 కోట్లు చెల్లించేశారు. వాటిలో రూ.245 కోట్లను డిజైన్ టెక్, స్కిల్లర్ అనే షెల్ కంపెనీల ద్వారా సింగపూర్‌కు మళ్లించి, వాటిని మళ్లీ టీడీపీ పెద్దల ఖాతాల్లోకి బదిలీ చేశారు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వంలో ఐటీశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ ఏపీ ఎస్ఎస్‌డీసీ వ్యవహారాలు చూడటం గమనార్హం. ఈ కేసులో సీఐడీ అధికారులు డిజైన్ టెక్, షెల్ కంపెనీలకు చెందిన పలువురిని అరెస్ట్ చేశారు. చంద్రబాబు సన్నిహితుడు, అప్పట్లో ఏపీ ఎస్ఎస్‌డీసీ డైరెక్టర్‌గా ఉన్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ, ఎండీగా ఉన్న గంటా సుబ్బారావుతో పాటు పలువురిపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో సీఐడీ అధికారులు ఇప్పటి వరకూ ఎనిమిది మందిని అరెస్టు కూడా చేశారు. అప్పట్లో ఏపీ ఎస్ఎస్‌డీసీ ఎండీగా ఉన్న శ్రీకాంత్ అర్జాకు సీఐడీ సోమవారం నోటీసు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. సీమెన్స్ కంపెనీ తన వాటా 90 శాతం నిధులు సమకూర్చకుండానే నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ వాటా నిధులను అప్పట్లో ఎండీగా ఉన్న గంటా సుబ్బారావు విడుదల చేశారు. ఆ నిధులే హవాలా మార్గంలో టీడీపీ పెద్దలకు చేరాయి. ఆ తర్వాత శ్రీకాంత్ అర్జా ఎండీగా వచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉప సంఘం ఈ వ్యవహారంలో గోల్‌మాల్ జరిగిందని నిర్ధారించిన తర్వాత కూడా ఏపీ ఎస్ఎస్‌డీసీ ఎండీగా ఉన్న శ్రీకాంత్ అర్జా సందేహాస్పదంగా వ్యవహరించడం గమనార్హం. సీమెన్స్ ప్రాజెక్టు విషయంలో అంతా సవ్యంగా జరిగిందని ఆయన నివేదిక ఇవ్వడం విస్మయ పరిచింది. ఆయన రిటైర్ అయి ఢిల్లీలో ఉంటున్నారు. ఆయన్ని ఈ నెల 9న విచారణకు రావాలని సీఐడీ అధికారులు నోటీసుల్లో పేర్కొన్నారు.

జనం మధ్యకు పెద్దపులి పిల్లలు

- నంద్యాల జిల్లా పెద్దగుమ్మడాపురంలోకి వచ్చిన నాలుగు పులిపిల్లలు
- తల్లితో కలిపేందుకు అటవీశాఖ సిబ్బంది ప్రయత్నం



మల్టీపర్పస్ గోడౌన్ వద్ద పులి పిల్లలు

సాక్షి, అమరావతి/కొత్తపల్లి: ఏపీలోని నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం పెద్దగుమ్మడాపురం గ్రామ శివారులోని ఓ గోడౌన్‌లో సోమవారం ఉదయం నాలుగు పెద్దపులి పిల్లలు కనిపించడంతో కలకలం రేగింది. ఆ నాలుగు ఆడ పులి పిల్లలను తల్లి వద్దకు చేర్చేందుకు అటవీశాఖ అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని కొత్తపల్లి మండలం పెద్దగుమ్మడాపురం గ్రామం నల్లమల అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉంటుంది. సోమవారం ఉదయం ఓ యువకుడు గ్రామానికి చివర నిర్మాణంలోని మల్టీపర్పస్ గోడౌన్ అవతలివైపునకు వెళ్లగా, నాలుగు పులి పిల్లలు కనిపించాయి. విషయం తెలుసుకున్న అటవీ సిబ్బంది వాటిని పరిశీలించారు. సుమారు 40రోజుల వయసు కలిగిన పులి పిల్లలను అడవిలోకి తీసుకువెళ్లి తల్లితో కలిపేందుకు ప్రయత్నించారు. మూడు గంటలు అడవిలో తిరిగినా తల్లి కనిపించలేదు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో పులిపిల్లలు డీలా పడిపోయాయి. దీంతో వాటికి పాలు పట్టించి బైర్లూటి రేంజ్‌లో ఉన్న జంతువైద్యశాలకు తరలించారు. అటవీ ప్రాంతంలో ఎండ పెరగడం, చెట్లకు మంట పెడుతుండటంతో వేడి తీవ్రత తట్టుకోలేక గ్రామంలోకి పెద్దపులి తన పిల్లలను తీసుకువచ్చి, ఒంటరిగా తిరిగి వెళ్లి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఒకటి, రెండు రోజులు చూసిన తర్వాత కూడా తల్లి రాకపోతే వాటిని తిరుపతి జూకు తరలించి సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

తెలియదు.. గుర్తు లేదు.. మర్చిపోయా

- సీఐడీ విచారణకు ఏమాత్రం సహకరించని టీడీపీ మాజీ మంత్రి నారాయణ
- ఆయన భార్య, ‘నారాయణ’కీలక ఉద్యోగిని ప్రమీల తీరు కూడా అంతే..



సాక్షి, అమరావతి: గత ప్రభుత్వం హయాంలో జరిగిన అమరావతి భూముల కుంభకోణం కేసులో టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పొంగూరు నారాయణ సీఐడీ విచారణకు ఏమాత్రం సహకరించలేదని తెలిసింది. అసైన్డ్ భూములు, బినామీ పేర్లతో భూములు కొనుగోలు, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ రూపొందించడంలో అక్రమాలపై సీఐడీ అధికారులు ఎంత గుచ్చి గుచ్చి అడిగినా నారాయణ ఒక్క ప్రశ్నకు కూడా సమాధానం ఇవ్వలేదని తెలిసింది. తెలియదు.. గుర్తు లేదు.. మర్చిపోయా అనే రీతిలో నారాయణ వ్యవహరించారని సమాచారం. ఈ మేరకు సీఐడీ అధికారులు నారాయణ, ఆయన భార్య పి.రమాదేవి, నారాయణ విద్యా సంస్థల ఆర్థిక వ్యవహారాల కోసం ఏర్పాటు చేసిన ఎన్ స్పైరా సంస్థలో కీలక స్థానంలో ఉన్న పొత్తూరి ప్రమీల అనే ఉద్యోగిని హైదరాబాద్‌లో సోమవారం వేర్వేరుగా విచారించారు. నారాయణ విద్యా సంస్థలు, ఎన్ స్పైరా సంస్థల బ్యాంకు ఖాతాల నుంచి రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యాంకు ఖాతాలకు నిధుల బదలాయింపుపై సీఐడీ అధికారులు నారాయణను ప్రశ్నించారు. ఇక ఆ నిధులతో బినామీల పేరిట అమరావతిలో అసైన్డ్ భూములు కొనుగోలు చేసిన రికార్డులు చూపిస్తూ పలు ప్రశ్నలు వేశారని తెలుస్తోంది. అలాగే నారాయణ బినామీల పేరిట కొనుగోలు చేసిన భూముల సమీపంలోనే స్టార్టప్ సిటీ వచ్చేలా సీఆర్డీఏ అమరావతి మాస్టర్ ప్లాన్ రూపొందించిన ఉదంతంపైన కూడా వివరాలు అడిగారు. నారాయణ విద్యా సంస్థలు, చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ ఫుడ్స్, వారి సన్నిహితుడు లింగమనేని కుటుంబానికి చెందిన సంస్థల భూముల విలువ అమాంతం పెరిగేలా ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చేలా నారాయణ అధికార దుర్వినియోగానికి పాల్పడటంపై కూడా సీఐడీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. కానీ నారాయణ ఒక్క ప్రశ్నకు కూడా సూటిగా సమాధానం చెప్పలేదని తెలుస్తోంది. నారాయణ భార్య రమాదేవి, పొత్తూరి ప్రమీల కూడా విచారణకు ఏమాత్రం సహకరించ లేదు.

నారాయణ కుమార్తెను ఇంటి వద్దే విచారించండి

అమరావతి మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ డిజైన్ల ముసుగులో సాగిన భూ దోపిడీపై నమోదు చేసిన కేసులో విచారణ నిమిత్తం తమ ముందు హాజరు కావాలంటూ సీఐడీ జారీ చేసిన నోటీసులను సవాల్ చేస్తూ నారాయణ కుమార్తె సింధూర, ఆమె భర్త పునీత్, అతడి సోదరుడు వరుణ్ కుమార్, రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ అంజనీ కుమార్ బాబీలు హైకోర్టును ఆశ్రయించారు. వీరి పిటిషన్లపై న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి సోమవారం విచారణ జరిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి, సింధూరను ఆమె ఇంటి వద్దే ఈ నెల 20న విచారించాలని సీఐడీని ఆదేశించారు. అలాగే అదే రోజున సీఐడీ ముందు హాజరు కావాలని పునీత్, వరుణ్‌లకు సైతం ఆదేశాలు జారీ చేశారు. ఇక అంజనీ కుమార్‌ను అదే రోజున న్యాయవాది సమక్షంలో విచారించాలని సీఐడీకి సూచించారు.

తెరుచుకున్న ఎస్సార్పీ 3 గని



విధులకు వెళ్తున్న కార్మికులు

- రెండో షిఫ్ట్ నుంచి పనులు ప్రారంభం

శ్రీరాంపూర్(మంచిర్యాల): మంచిర్యాల జిల్లా ఎస్సార్పీ 3గనిలో గ్యాస్ ప్రమాదంతో 11రోజులపాటు మూసి వేయగా.. సోమవారం తెరుచుకుంది. గనిలో సీవో గ్యాస్ రావడం వల్ల ఫిబ్రవరి 25న రెండో షిఫ్ట్ నుంచి మూసి వేశారు. అప్పటి నుంచి కార్మికులకు లే ఆఫ్ ప్రకటించారు. ప్రతీరోజు గనిలో గ్యాస్ కట్టడికి రక్షణ చర్యలు చేపట్టారు. ముందుగా 72 గంటల్లో గనిని తిరిగి ప్రారంభిస్తారని అనుకున్న డీఎంఎస్, డీడీఎంఎస్ అధికారులు సేఫ్టీపై కంపెనీ అధికారులకు ప్రత్యేక సూచనలు చేసి పనులు నిలిపివేశారు. డీఎంఎస్ సుప్రియో చక్రవర్తి, డీడీఎంఎస్‌లు వెంకన్న, ప్రేంకుమార్‌లు గనిని పలుమార్లు సందర్శించి రక్షణపై పలు సూచనలు చేశారు. గనిలో గ్యాస్ వెలువడ్డ ప్రాంతాన్ని ఐదు వైపులకు గోడలు కట్టి గ్యాస్‌ను పూర్తిగా దిగ్బంధం చేశారు. ముందుగా మామూలు మందంలో గోడలు కట్టగా తరువాత మీటర్ మందంతో తిరిగి గోడలు నిర్మించారు. డైరెక్టర్(పీపీ) జీ.వెంకటేశ్వర్‌రెడ్డి, జీఎం(సేఫ్టీ, కార్పొరేట్) కే.గురువయ్య, రీజియన్ సేఫ్టీ జీఎం జాన్‌ఆనంద్, ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి ఎప్పటికప్పుడు గనిలో గ్యాస్ పరిస్థితిని సమీక్షించారు. పూర్తిగా గ్యాస్ అదుపులోకి వచ్చిందని డీఎంఎస్ భావించిన తర్వాత పనులు చేసుకోవడానికి ఆదేశాలిచ్చారు. దీంతో సోమవారం ఉదయం షిఫ్ట్ లే ఆఫ్ కొనసాగిన కూడా మధ్యాహ్నం రెండో షిఫ్ట్ నుంచి గనిని తెరిపించారు. దీంతో 11 రోజులు విరామం తర్వాత కార్మికులు ఉత్సాహంగా గని బాట పట్టారు. గనిలో పని స్థలాలు బంద్ పెట్టడం వల్ల రోజుకు 900 టన్నుల చొప్పున బొగ్గు ఉత్పత్తికి విఘాతం కలిగింది.



మాట్లాడుతున్న జీఎం బీ.సంజీవరెడ్డి

అన్ని చర్యలు తీసుకున్నాం..

గనిలో అన్ని రకాల రక్షణ చర్యలు తీసుకున్న తర్వాతనే గనిని తెరిచామని జీఎం సంజీవరెడ్డి తెలిపారు. రెండోషిఫ్ట్‌లో ఆయన గని వద్దకు వచ్చి కార్మికులతో మాట్లాడారు. గ్యాస్ ప్రమాదం జరిగినప్పటి నుంచి తీసుకున్న రక్షణ చర్యలను ఉద్యోగులకు వివరించారు. బొగ్గు ఉత్పత్తి కంటే కార్మికుల ప్రాణాలు తమకు ముఖ్యమని, అందుకే అన్ని జాగ్రత్తలు తీసుకొన్నాకే పనులు ప్రారంభించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏజెంట్ గోపాల్ సింగ్, మేనేజర్ సంతోశ్‌కుమార్ పాల్గొన్నారు.

– జీఎం బీ సంజీవరెడ్డి

ఇచ్చోడ సంతకు హోలీ ఎఫెక్ట్

- రూ.కోటి వరకు మేకల విక్రయాలు



ఇచ్చోడ సంతలో మేకల కొనుగోళ్లు

ఇచ్చోడ: ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో సోమవారం నిర్వహించిన మేకల సంతలో భారీగా విక్రయాలు సాగాయి. సుమారు రూ.కోటి వరకు కొనుగోళ్లు జరిగినట్లు వ్యాపారులు ద్వారా తెలిసింది. ప్రతీ సోమవారం ఈ సంతలో రూ.30లక్షల నుంచి 50 లక్షల వరకు క్రయ విక్రయాలు ఉంటాయి. హోలీ పండగ నేపథ్యంలో ఈ వారం భారీగా కొనుగోళ్లు అయినట్లు తెలుస్తోంది. ఇక్కడ ఎక్కువగా లోకల్ మేకలు లభిస్తుండడంతో నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, కోరుట్ల, కరీంనగర్‌తో పాటు హైదరాబాద్ నుంచి కూడా తరలివస్తారని స్థానిక వ్యాపారులు తెలిపారు.

కార్పొరేట్ సంస్థల కోసమే చట్టాలు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్

- ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్

ఎదులాపురం: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ కార్పొరేట్ సంస్థలకు అనుగుణంగా చట్టాలు రూపొందిస్తోందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక సంఘాలు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రం యథావిధిగా కొనసాగించేలా కార్మిక సంఘాలు ఉద్యమించాలన్నారు. అనంతరం ప్రభుత్వాలు కార్మికుల పట్ల అవలంబిస్తున్న విధానాలు, సమస్యలపై చర్చించారు. జిల్లా పర్యటనకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కేంద్ర పరిధిలో ఉన్న సీసీఐ పరిశ్రమ పునరుద్ధణపై ప్రకటన చేస్తారని ఎంతో ఆశతో చూశామన్నారు. కాని ఎలాంటి ప్రకటన చేయలేదన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గాజంగుల రాజు, ఉపాధ్యక్షుడు కాంతరావ్, గంగయ్య, ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో ముందుండాలి

- చైల్డ్‌రైట్స్ కమిషన్ మెంబర్ శోభారాణి



సమావేశంలో మాట్లాడుతున్న శోభారాణి

హుజూరాబాద్: నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని స్టేట్ చైల్డ్ రైట్స్ కమిషన్‌మెంబర్ అనుమాండ్ల శోభారాణి, డీఎల్ఎస్ఏ సెక్రటరీ సుజయ్ అన్నారు. హుజూరాబాద్ పట్టణంలోని సీటీ సెంట్రల్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ‘స్పందన సేవా సొసైటీ’ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగ అవకాశాల కోసం ఎదురు చూడకుండా వృత్తిపరమైన శిక్షణ పొంది ఉపాధి అవకాశాలు పెంచుకోవాలన్నారు. మహిళల రక్షణకు ఉన్న చట్టాలను తెలుసుకోవాలని, 181 టోల్ ఫ్రీ నంబర్ ఉపయోగించుకోవాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో వరంగల్ సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ, మెంబర్లు రామలీల, రాధ , పుష్పలత, సంపత్, సుజాత , బ్రహ్మకుమారీలు, జ్యోతి, వాణి, గౌతమి, సులోచన, సాధన, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలకు రూ.2,758 కోట్ల ఆర్డర్లు

- బతుకమ్మ చీరలను సకాలంలో అందించాలి
- టీపీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్
- వస్త్రోత్పత్తిదారులకు బతుకమ్మ చీరల ఆర్డర్లు



సిరిసిల్ల జౌళిశాఖ ఆఫీస్‌లో బతుకమ్మ చీరల ఆర్డర్లు అందిస్తున్న గూడూరి ప్రవీణ్

సిరిసిల్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదేళ్లలో సిరిసిల్ల నేతన్నలకు రూ.2,758 కోట్ల వస్త్రోత్పత్తి ఆర్డర్లు ఇచ్చిందని తెలంగాణ పవర్‌లూమ్, టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ పేర్కొన్నారు సిరిసిల్ల బీవై నగర్‌లోని జౌళిశాఖ ఆఫీస్‌లో సోమవారం 2023 బతుకమ్మ చీరల ఆర్డర్లను వస్త్రోత్పత్తి దారులకు అందించారు. ప్రవీణ్ మాట్లాడుతూ సిరిసిల్ల నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపేందుకు 2016లో బతుకమ్మ చీరల ఆర్డర్లకు శ్రీకారం చుట్టారని, ఉమ్మడి రాష్ట్రంలో సంక్షోభంలో సిరిసిల్ల వస్త్రపరిశ్రమ స్వరాష్ట్రంలో ఎంతో మెరుగు పడిందన్నారు. నాణ్యమైన వస్త్రాన్ని ఉత్పత్తి చేసి సకాలంలో అందించాలని కోరారు. మగ్గాల మధ్య శ్రమించే కార్మికులకు ప్రభుత్వం కూలీ గిట్టుబాటులో భాగంగా యారన్ సబ్సిడీని అందిస్తుందని వివరించారు. 2018, 2019 సంవత్సరాలకు సంబంధించిన యారన్ సబ్సిడీని రూ.15.12కోట్లు కార్మికులకు చెల్లించామన్నారు. బతుకమ్మ చీరలతోపాటు రంజాన్, క్రిస్మస్, స్కూల్ యూనిఫామ్స్, వెల్ఫేర్ శాఖల వస్త్రోత్పత్తి ఆర్డర్లు కూడా కేటీఆర్ అందిస్తున్నామని వివరించారు. సిరిసిల్లలోని 139 మ్యాక్స్ సంఘాలు, 126 ఎస్ఎస్ఐ యూనిట్స్ నిర్వాహకులు వస్త్రోత్పత్తి చేపట్టాలని సూచించారు. ఈ ఏడాది బతుకమ్మ చీరలకు రూ.330 కోట్లు కేటాయించారని వివరించి, చీరల ఉత్పత్తి ఆర్డర్లను అందించారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, జౌళిశాఖ ఏడీ సాగర్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు మండల సత్యం, కార్యదర్శి యెల్లండి దేవదాస్, వస్త్రోత్పత్తిదారులు గోవింద్ రవి, దూస భూమయ్య, దూడం శంకర్, బూట్ల నవీన్‌కుమార్, బూర కనకరాజేశం, మ్యాక్స్ సంఘాల ప్రతినిధులు యెల్లండి శంకర్, చిమ్మని ప్రకాశ్, పోలు శంకర్, బీమని రామచంద్రం, వేముల దామోదర్, బొద్దు శ్రీధర్, మండల బాలరాజు పాల్గొన్నారు.

కార్పొరేట్ కళాశాలలను నిషేధించాలి



మాట్లాడుతున్న ఆది మల్లేశం

కరీంనగర్: కార్పొరేట్ కళాశాలలను తక్షణమే నిషేధించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం డిమాండ్ చేశారు. సంఘ కార్యాలయంలో సోమవారం బీసీ యువజన సంఘం జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జి జి.మారుతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కొన్ని కార్పొరేట్ కాలేజీల ఒత్తిడితో విద్యార్థులు మానసిక వేదనకు గురై బలవన్మరణానికి పాల్పడుతున్నారని అన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలు ధనార్జనే ధ్యేయంగా అధిక ఫీజులు దండుకుంటూ, విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని మండిపడారు. ఇలాంటి కాలేజీలను గుర్తించి లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నర్సింగోజు శ్రీనివాస్, చిగుర్ల శ్రీనివాస్, లింగంపల్లి శ్రీనివాస్, మర్సుకోల మారుతి, సదాల చంద్రశేఖర్ ఉన్నారు.

సీపీఐ మావోయిస్టు నేతపై పీడీ యాక్ట్ అమలు



పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందిస్తున్న పోలీసులు

కరీంనగర్‌క్రైం: ప్రశాంతంగా ఉన్న కరీంనగర్ జిల్లాలో తిరిగి నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ కార్యకలాపాలు చేస్తూ, యువకులను, సాధారణ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన నిందితుడు అనేం చంద్రరావు అలియాస్ ఆమన్ చందర్‌రావుపై సోమవారం కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు పీడీ యాక్టు అమలుచేశారు. ఈ మేరకు నిందితుడికి నిర్బంధ ఉత్తర్వులు అందించి, చెర్లపల్లి సెంట్రల్ జైలుకు తరలించారు. పీడీ యాక్టును అమలు చేయడంలో కీలకపాత్ర పోషించిన చొప్పదండి సీఐ జి.రవీందర్, పీడీ సెల్ ఇన్‌చార్జి టి.పండారీని పోలీస్ కమిషనర్ అభినందించినారు.

సేవాపథం



● స్టూడెంట్స్‌కు అండగా: రాధిక భరత్ రామ్

కర్మ్ ఫలం... ఎంతో ఉన్నతం!

దయాగుణం అనేది బ్యాంకులో భద్రంగా దాచుకునే డబ్బు కాదు. అది కష్టం ఉన్న చోట కనిపించాలి. ధైర్యం ఇవ్వాలి. ముందుకు నడిపించాలి. 'కర్మ్' ఫౌండేషన్ ద్వారా ఎంతోమంది అమ్మాయిలు ఉన్నత చదువులు చదువుకోవడానికి సహకారం అందిస్తోంది 48 సంవత్సరాల రాధిక భరత్ రామ్...

ఢిల్లీలోని ప్రసిద్ధి చెందిన 'ది శ్రీ రామ్ స్కూల్స్' వైస్-చైర్‌పర్సన్ హోదాలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ సామాజిక సేవా కార్యక్రమాలకు ఎప్పుడూ దూరంగా లేదు రాధిక.

మనదేశంలో ఎంతోమంది అమ్మాయిలు రకరకాల కారణాలతో హైస్కూల్ స్థాయిలోనే చదువు ఆపేయడానికి సంబంధించి రాధికకు బాధగా ఉండేది. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'కర్మ్' ఫౌండేషన్ ఫెలోషిప్‌లకు శ్రీకారం చుట్టింది. ఫెలోషిప్‌కు ఎంపికైన వారికి మూడు సంవత్సరాల పాటు అకాడమిక్, ఎగ్జామ్ ఫీజులు కట్టడం, వసతి సౌకర్యం ఏర్పాటు చేయడం, లోకల్ ట్రావెల్ అలవెన్స్‌లు ఇవ్వడం, లాప్‌టాప్, పుస్తకాలు కొనివ్వడం... మొదలైనవి ట్రస్ట్ ద్వారా జరుగుతాయి. దీంతోపాటు కెరీర్ కౌన్సెలింగ్, సెల్ఫ్-ఇంప్రూవ్‌మెంట్ వర్క్ షాప్... మొదలైన వాటిని విస్తృతంగా నిర్వహిస్తోంది కర్మ్ ఫౌండేషన్.

'కర్మ్ ఫౌండేషన్ ద్వారా ఆర్థిక అవసరాలు తీరడమే కాదు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. మనం ఏర్పర్చుకునే లక్ష్యాల విషయంలో స్పష్టత వస్తుంది. వాటిని ముందుకు తీసుకువెళ్లడానికి నిర్మాణాత్మకమైన సలహాలు లభిస్తాయి' అంటుంది సచిత అనే విద్యార్థిని.

విద్యారంగానికి సంబంధించి దాతలు ఎక్కువగా ఉన్నప్పటికీ, ఉన్నత విద్య విషయంలో మాత్రం తక్కువగా ఉన్నారు. ఆ లోటును 'కర్మ్' పూరిస్తోంది.

'అమ్మాయికి హైస్కూల్ చదువు సరిపోతుంది' అనుకునే తల్లిదండ్రుల ఆలోచన విధానంలో మార్పు తీసుకువస్తోంది కర్మ్.

'దాతృత్వం అంటే సహాయపడడం మాత్రమే కాదు మన టైమ్‌ను కూడా వెచ్చించాలి. వారితో మాట్లాడాలి. వారికి ఎప్పుడూ అందుబాటులో ఉండాలి' అంటున్న రాధిక ఫెలోషిప్‌కు ఎంపికైన స్టూడెంట్స్‌ను పేర్లతో సహా గుర్తుపెట్టుకొని ఆత్మీయంగా పలకరిస్తుంది.

ఇంటిప్

పొట్ట మీద చారలా?

డెలివరీ తర్వాత చాలామందికి పొట్ట మీద చర్మం ముడతలు పడి చారలు వస్తాయి. ఈ చారల సమస్య కొందరిలో చాలా తీవ్రంగా ఉంటుంది. వీటిని కొన్ని చిట్కాలతో పరిష్కరించుకోవచ్చు. అవేమిటంటే..

● స్నానం చేయడానికి ముందు కాస్త ఆముదాన్ని గోరువెచ్చగా చేసుకుని చారలు ఉన్న చోట సున్నితంగా మర్దన చేయాలి. గంట సేపటి తర్వాత స్నానం చేయాలి. ఇలా ప్రతిరోజు చేస్తూ ఉంటే నెల తిరిగేసరికి మంచి ఫలితం కనిపిస్తుంది.

లేదంటే... ప్రతిరోజు రాత్రి నిద్రపోయే ముందు బాదం నూనెతో చారలపై మర్దన చేసుకోవాలి. మరునాడు ఉదయాన్నే వేడి నీటితో స్నానం చేసి, చారలపై కలబంద గుజ్జు రాసుకోవాలి. ప్రతి రోజూ ఇలా చేస్తే నాలుగైదు వారాల్లోనే మంచి ఫలితం ఉంటుందని పెద్దలు చెబుతున్నారు.

బ్యూటిప్స్

ఆరోగ్యానికే కాదు... అందానికి కూడా!



- ఉల్లిపాయలోని యాంటీసెప్టిక్ గుణాలు చర్మ సమస్యలకు చెక్ పెడతాయి. మచ్చలను తొలగిస్తాయి.
- టేబుల్ స్పూన్ ఉల్లి రసంలో టేబుల్ స్పూన్ ఆలివ్ ఆయిల్ కలిపి ఫేస్‌ప్యాక్ లా వేయాలి. ఆరిన తర్వాత గోరు వెచ్చటి నీటితో కడిగేయాలి. మీ ముఖంలో నిగారింపు మీకే తెలుస్తుంది.
- టీ స్పూన్ పసుపులో సరిపడా ఉల్లిపాయ రసాన్ని కలిపి పేస్ట్‌లా చేయాలి. దీనిని ముఖానికి ప్యాక్ లా వేసుకోవాలి. ఆరిన తర్వాత చల్లటి నీటితో కడిగేయాలి. ఇన్‌స్టంట్‌గా చర్మం మెరిసిపోతుంది.
- శనగపిండి, ఉల్లిరసం, పాలు .. మూడూ సమపాళ్లలో తీసుకొని పేస్ట్‌లా ముఖానికి రాసుకుని.. కాసేపటి తర్వాత కడిగితే మొహం చంద్రబింబమే.
- అతినీల లోహిత కిరణాల వల్ల చర్మం దెబ్బతినే ప్రమాదాన్ని ఉల్లి తగ్గిస్తుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు యూవీ కిరణాల వల్ల కలిగే హానిని అడ్డుకుంటాయి.
- చివరగా ఒక మాట.., ఉల్లిపాయను తరిగేటప్పుడు కళ్లు మంటపుట్టి, నీళ్లు కారతాయి. అయితే అది కూడా మంచిదే. అలా నీరు కారడం వల్ల కళ్లలోని మలినాలు తొలగిపోతాయి, అంతేకాదు, కంటి సమస్యలను నివారించడంలో ఉల్లికి సాటి మరేదీ లేదు. నేత్ర సమస్యలకు చెక్ పెట్టాలంటే మీ డైట్‌లో ఉల్లి ఉండేలా చూసుకోవాల్సిందే.



రేపు విమెన్స్ డే





మేమే మా ధైర్యం!

ముంబై జూహూ గ్రౌండ్స్‌లో విమెన్స్ డే సందర్భంగా 1500 మంది ఆడపిల్లలు కరాటేలో తమ విన్యాసాలను ప్రదర్శించనున్నారు. వీళ్లంతా ఎవరో చదవండి...

'మన దేశంలో 11 నుంచి 14 ఏళ్ల లోపు ఆడపిల్లలు రెండున్నర కోట్ల మంది ఉన్నారు. వీరు స్కూల్లో సైన్సు నేర్చుకున్నట్టు లెక్కలు నేర్చుకున్నట్టు ఆత్మరక్షణ ఎందుకు నేర్చుకోరు? ఎందుకు నేర్పించరు?' అని అడుగుతుంది ఇషితా శర్మ.

ముంబైలో డాన్స్ స్కూల్‌ను నడిపే ఇషితా శర్మ ఐదేళ్ల క్రితం ఒకరోజు రాత్రి కారులో వెళుతుంటే కొంతమంది పోకిరి కుర్రాళ్లు ఆమెను ఫాలో అయ్యారు. ముందామెకు ఏం చేయాలో తోచలేదు. భయపడింది. కాని చివరకు ధైర్యం కూడగట్టుకుని అద్దం దించి పెద్దగా అరిచింది. అంతే. వాళ్లు పారిపోయారు. 'ఇంత వయసు వచ్చిన నేనే ఇలా భయపడ్డాను. చిన్నపిల్లలు ఎంత భయపడిపోతారో అనే ఆలోచన నాకు వచ్చింది' అంటుందామె. ఈ ఆలోచన నుంచే 'ముక్కా మార్' ఆవిర్భవించింది.

11 నుంచి 14 ఏళ్ల లోపు ఆడపిల్లలకు కరాటే, కుంగ్ ఫూ వంటి ఆత్మరక్షణ విద్యలు నేర్పాలని అనుకుంది ఇషిత. తనకు తెలిసిన ఒక కరాటే మాస్టర్‌ని సహాయం అడిగింది. అతను అంగీకరించాడు. ముంబైలోని వెర్సోవా బీచ్‌లో ఐదుమంది ఆడపిల్లలతో 2018లో 'ముక్కా మార్' (దెబ్బ కొట్టు) కార్యక్రమం మొదలైంది.

అయిదు పది, పది వంద అవడానికి ఎంతో సమయం పట్టలేదు.



దేహం, గళం, బుద్ధి

'ఆడపిల్లలు మగవాళ్ల కంటే బలహీనులు అనే భావనతోనే పెంచుతారు. అబ్బాయిలను మగాడిలా పోరాడు అంటారు. మేము- ఆడపిల్లను ఆడపిల్లలా పోరాడు అని చెబుతాం. ఆడపిల్ల ఎందులోనూ తక్కువ కాదు అని చెబుతాం. మన పెంపకంలో ఆడపిల్లకు ఏ అన్యాయం జరిగినా ఊరికే ఉండు, సహించు అనే బోధిస్తారు. మేము ఎదిరించు, నీ గళం వినిపించు, బుద్ధిని ఉపయోగించు అని చెబుతాం. ముఖ్యంగా హింసను ఎదిరించాలంటే ఈ మూడు తప్పవు' అంటుంది ఇషిత.

'ముక్కా మార్ శిక్షణలో చేరాక ఏదైనా ప్రమాదం వస్తే పెద్దగా అరిచి ప్రతిఘటించాలని, తర్వాత బుద్ధిని ఉపయోగించి అక్కడి నుంచి బయటపడాలని ఆ రెండూ సాధ్యం కాకపోతే శారీరకంగా తలపడి పోరాడాలని మాకు తెలిసొచ్చింది' అని ఒక అమ్మాయి అంది.

1100 స్కూళ్లలో

'ముక్కా మార్' శిక్షణ అవసరం మహారాష్ట్ర ప్రభుత్వం కూడా గుర్తించింది. ఎం.సి.జి.ఎం (మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ గ్రేటర్ ముంబై) పరిధిలోని 1100 పైగా స్కూళ్లలో 'ముక్కా మార్' కార్యకర్తలను వారానికి రెండు రోజులు ఆత్మరక్షణ విద్యలు నేర్పేందుకు ప్రోత్సహించింది. 6,7,8 తరగతుల విద్యార్థినులకు స్కూళ్లలో వారానికి రెండు రోజులు కరాటే, కుంగ్ ఫు, కుస్తీ క్లాసులు నేర్పిస్తున్నారు. లాక్‌డౌన్ సమయంలో ఆన్‌లైన్ ద్వారా అంటే వాట్సప్ చాట్‌బోట్ ద్వారా క్లాసులు కొనసాగాయి. ఈ క్లాసులు దేశంలోని ఏ ప్రాంతం ఆడపిల్లలైనా నేర్చుకోవచ్చు. ఇప్పటికి 'ముక్కా మార్' ద్వారా 5 వేల మంది ఆడపిల్లలు నేరుగా ఆత్మరక్షణ విద్యలు నేర్చుకున్నారు. ఆన్‌లైన్ ద్వారా 16 వేల మంది అమ్మాయిలు నేర్చుకున్నారు. దాదాపు 300 మంది మహిళా టీచర్లకు శిక్షణ ఇవ్వడం వల్ల ఆ టీచర్ల ద్వారా 50 వేల మంది ఆడపిల్లల వరకూ నేర్చుకుంటున్నారు.

మన సమాజంలో రోజురోజుకూ ఆడపిల్లల మీద హింస, లైంగిక దాడులు పెరిగిపోతున్నాయి. అయితే వాటికి భయపడి ఆడపిల్లను ఇంట దాచడం అంటే వారి భవిష్యత్తును నాశనం చేయడమేనని అంటుంది ఇషితా శర్మ. 'వారు ధైర్యంగా సమాజంలో తిరగాలి. ప్రమాదం ఎదురైతే ఎదిరించేలా ఉండాలి. ఆత్మరక్షణ విద్యలు నేర్పడం ద్వారా మాత్రమే వారిలో ఆత్మవిశ్వాసం పెరిగి భయం పోతుంది' అంటుందామె.

నిజంగానే ప్రతి స్కూల్లో మేథ్స్ టీచర్, సైన్స్ టీచర్ ఉన్నట్టుగా ఆడపిల్లల కోసం ఒక కరాటే టీచర్ ఉండాలని ఈ విమెన్స్ డే సందర్భంగా ప్రభుత్వాలు ఆలోచిస్తే తప్పకుండా మేలు జరుగుతుంది.

రైతమ్మలకు జేజేలు!

సాగుబడి
పూర్వాభాద్ర కార్తె: మార్చి 5 నుంచి

రసాయనిక అవశేషాల్లేని ఆహారమే ఆరోగ్యానికి, పర్యావరణానికి మూలమని గుర్తించి అమృతాహారాన్ని పండిస్తున్న ఇద్దరు రైతమ్మల విశేష కృషి గురించి ముచ్చటించుకుందాం. గుంటూరు నగరంలో తమ ఇంటిపైనే సేంద్రియ కూరగాయలు పండించుకుంటూ పనిలో పనిగా మరో 650 మందికి సాయం చేస్తున్న అర్బన్ ఫార్మర్ ఒకరైతే.. చిత్తూరు జిల్లాలోని తమ సొంతూళ్లో ప్రజలకు, స్కూల్లో మధ్యాహ్న భోజనానికి ఏడాది పొడవునా అమృతాహారాన్ని పండించి ఇస్తున్న విద్యాధిక మహిళా కౌలు రైతు మరొకరు. ఇద్దరూ ఇద్దరే! 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం' సందర్భంగా ఈ చల్లని తల్లులకు మనసారా వందనాలు చెబుదాం...



ఆరోగ్యం మన మిద్దె తోటలోనే ఉంది

- గుంటూరులో విస్తరిస్తున్న మిద్దె తోటల సంస్కృతి
- కృష్ణకుమారి నేతృత్వంలో మిద్దెతోట పెంపకందారుల సంఘం రిజిస్ట్రేషన్
- వాట్సాప్ గ్రూప్‌లు, యూట్యూబ్ ఛానల్ ద్వారా సేవలు
- అధిక దిగుబడినిచ్చే అంటు మొక్కలు చౌకగానే అందుబాటులోకి...

ఆరోగ్యం ఆసుపత్రిలో లేదు. మన మిద్దె తోటలోనే ఉంది. మన తినే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లను రసాయనాల్లేకుండా మనమే ఇంటిపైన పండించుకుందాం. నలుగురం చేయీ చేయీ కలిపి మిద్దె తోటలు సాగు చేసుకుంటూ ఆరోగ్యంగా జీవిద్దాం.. అని చెప్పటమే కాదు.. మనసా వాచా కర్మణా ఆచరిస్తున్నారు కొల్లి కృష్ణకుమారి. గుంటూరు ఎన్జీవో కాలనీకి చెందిన బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగిని అయిన ఆమె 2020 జనవరి నుంచి 1400 చ.అ.ల మిద్దె తోట సాగు చేస్తున్నారు. ఉల్లి, వెల్లుల్లి, క్యారెట్ తప్ప మిగతావన్నీ దాదాపు రోజూ తమ ఇంటిపైన పండించుకున్నవే తింటున్నారు. కేన్సర్‌ను జయించిన ఆమె ఉద్యోగవిరమణ తర్వాత ఉద్యమ స్ఫూర్తితో సేంద్రియ మిద్దెతోటలను విస్తరింపజేస్తున్నారు.



● సంఘ సభ్యుల గుర్తింపు కార్డు

సంఘ బలం.. ఉత్సాహం..

రిటైరైన ఉద్యోగులు, పెద్దవాళ్లు (సెకండ్ యూత్) కూరగాయలు, పండ్ల మొక్కలను పెంచడం హాబీగా మార్చుకుంటున్నారు. సేంద్రియ ఇంటిపంటలు/ మిద్దె తోటల సంస్కృతిని వ్యాప్తిలోకి తెచ్చే లక్ష్యంతో సంఘాలు కూడా ఏర్పాటవుతున్నాయి. మిద్దెతోటల నిపుణులు తుమ్మేటి రఘోత్తమరెడ్డి ఆధ్వర్యంలో గుంటూరు సహా రెండు రాష్ట్రాల్లోని అన్ని జిల్లాల్లోనూ మిద్దెతోటల పెంపకందారుల సంఘాలు ఏర్పాటయ్యాయి. 'గుంటూరు మిద్దెతోటలు' పేరుతో ఏర్పాటు చేసిన రెండు వాట్సప్ గ్రూప్‌లలో 659 మందికి పైగా ఉన్నారు. 2021 నుంచి గుంటూరులో మిద్దె తోటల కార్యకలాపాలను కృష్ణకుమారి నేతృత్వంలో వలంటీర్ల బృందం అత్యంత క్రియాశీలంగా నిర్వహిస్తుండటం విశేషం. ఉద్యానవన శాఖ అధికారుల సహకారంతో ప్రతి నెలా అవగాహన కల్పిస్తున్నారు. గుంటూరు మిద్దె తోటలు పేరిట యూట్యూబ్ ఛానల్‌ను ఏర్పాటు చేశారు.

'గుంటూరు మిద్దె తోటల పెంపకందారుల సంక్షేమ సంఘం (జి.ఎం.ఎస్.ఎస్.)' లాభాపేక్షలేని సంస్థగా రిజిస్టర్ అయ్యింది. కృష్ణకుమారి ఆమె అధ్యక్షురాలిగా, మరికొందరు ఉత్సాహవంతులైన విశ్రాంత బ్యాంకు అధికారులు, వైద్యులతో కూడిన కార్యవర్గం ఏర్పాటైంది. సంఘ వార్షిక సభ్యత్వ రుసుము రూ. 500. నెలవారీగా సమావేశమవుతూ వారికి కావాల్సిన మొక్కలను కడియం, కుప్పం నర్సరీల నుంచి తెప్పించి సభ్యులకు అందిస్తున్నారు. సంఘం జమాఖర్చులపై ఆడిటింగ్ నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తుండటం ప్రశంసనీయం.



● మిద్దె తోటలో కృష్ణకుమారి

ఉత్సాహంగా వాలంటీర్ల సేవలు

సాధారణ మొక్కలతో పోల్చితే ఎన్నో రెట్లు ఎక్కువ దిగుబడినిచ్చే గ్రాఫ్టెడ్ మొక్కల అవసరం మేడపైన కుండీలు, మడుల్లో తక్కువ స్థలాల్లో కూరగాయలు పెంచుకునే వారికి ఎంతో ఉందంటారు కృష్ణకుమారి. అడవి వంగతో అంటుకట్టిన(గ్రాఫ్ట్ చేసిన) వంగ, టమాటో, మిరప, సొర మొక్కలతో పాటు పర్పుల్ క్యాబేజి, ఎర్రబెండ, ఎల్లో/పర్పుల్ కాలిఫ్లవర్ వంటి అరుదైన, నాణ్యమైన మొక్కలను నర్సరీల నుంచి తెప్పించి మిద్దెతోట పెంపకందారులకు మూడింట ఒక వంతు ధరకే అందిస్తున్నారు. కృష్ణకుమారి, వలంటీర్ల బృందం సఫలీకృతమయ్యారు. గూగుల్ ఫామ్స్, ఎక్సెల్ షీట్ ద్వారా సభ్యులకు కావాల్సిన మొక్కల ఆర్డర్ తీసుకొని మొక్కలను తెప్పిస్తున్నారు. సభ్యులందరికీ ముద్రిత ఫొటో గుర్తింపు కార్డులు ఇచ్చారు. 50 మంది వాలంటీర్లు ఉత్సాహంగా సేవలందిస్తుండటం వల్ల సంఘాన్ని చురుగ్గా నిర్వహించ గలుగుతూ ఉన్నామని కృష్ణకుమారి చెప్పారు. గత రెండేళ్లలో మిరప రైతులు పురుగుమందులను చాలా ఎక్కువగా వాడాల్సి వస్తోందని అంటూ.. రైతులను తప్పుపట్టలేమని, వినియోగదారులుగా మన జాగ్రత్తలో మనం ఉండాలని, వీలైనన్ని కూరగాయలను మనమే పండించుకోవాలని కృష్ణకుమారి(94906 02366) అంటున్నారు.

– దాళా రమేష్‌బాబు, సాక్షి ప్రతినిధి, గుంటూరు
ఫొటోలు: గజ్జల రామగోపాలరెడ్డి



ఊరంతా బాగుండాలి.. అందులో నేనుండాలి!

- ఎమ్మే బీఈడీ చదివినా ప్రకృతి వ్యవసాయంపై మక్కువ
- ఎకరం కౌలు పొలంలో 20 రకాలకుపైగా కూరగాయల సాగు
- గ్రామస్తులకు, స్కూలు పిల్లల మధ్యాహ్న భోజనానికి కూరగాయలు సరఫరా
- తిరుపతి జిల్లా ఎస్‌బీఆర్ పురం వాసి కోనేటి శైలజ ఆదర్శ సేద్యం

ఎమ్మే బీఈడీ చదివినా ఉద్యోగం కోసం ఎదురు చూడలేదు. తన కుటుంబంతో పాటు... గ్రామంలో ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రకృతి వ్యవసాయాన్ని ఎంచుకున్నారు. ఎకరం భూమిని లీజుకు తీసుకొని అందులో 20 రకాలకుపైగా కూరగాయలు, ఆకుకూరలు సాగుచేస్తున్నారు. పండించిన పంటను మార్కెట్‌లో విక్రయించకుండా... తన ఊర్లో వారికి, అంగన్‌వాడీ, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు కోనేటి శైలజ.



● ప్రతి రోజూ ఆదాయమే

శైలజ స్వస్థలం తిరుపతి జిల్లా వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురం గ్రామం. పుట్టినిల్లు.. మెట్టినిల్లు కూడా అదే ఊరు. అందరూ వ్యవసాయంపై ఆధారపడ్డవారే. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఎంఏ, ప్రైవేటు కాలేజీలో బీఈడీ పూర్తి చేశారు. వ్యవసాయదారుడు మాధవ వర్మను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. సొంత భూమిలో మామిడి తోట సాగులో ఉంది. ఏపీ రైతు సాధికార సంస్థ ప్రోత్సాహంతో శైలజ ప్రకృతి సేద్యంలో కూరగాయల సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. గ్రామంలోనే ఎకరం భూమిని లీజుకు తీసుకున్నారు. గత ఏడాది నవంబర్‌లో 20 రకాల కూరగాయల సాగు ప్రారంభించారు. ఇప్పటి వరకు పెట్టిన ఖర్చు రూ.13,500 చేశారు. శైలజ తోటలో కిలో పచ్చిమిర్చి రూ. 60, క్యారెట్, బీట్రూట్ రూ. 50, టొమాటో, వంగ, బెండ, గోరుచిక్కుడు, కాకర, అలసంద రూ. 40, ముల్లంగి (కట్ట) రూ.15, గోంగూర(కట్ట) రూ. 10 చొప్పున అమ్ముతున్నారు. మొన్నటి వరకు రూ.17,500 ఆదాయం వచ్చింది. ఏడాది పొడవునా రోజూ కూరగాయలను ప్రజలకు అందించాలన్నదే తన లక్ష్యమని శైలజ వివరించారు.



● కూరగాయల తోటలో శైలజ

గ్రామస్తులు, స్కూలు పిల్లల కోసమే!

ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో నేను పండించే కూరగాయలు తిని మా ఊరివాళ్లంతా ఆరోగ్యంగా ఉంటే అంతే చాలు. ప్రస్తుతం నేను పండించే కూరగాయలు మా ఊరి వాళ్లకే సరిపోతున్నాయి. గ్రామస్తులు, స్కూలు పిల్లల తరువాతే ఎవరికైనా. ఏడాది పొడవునా కూరగాయలు పండించి ఇవ్వాలన్నదే నా తపన.

– కోనేటి శైలజ, (9912197746), ఎస్‌బీఆర్ పురం, వడమాలపేట మం.., తిరుపతి జిల్లా

మధ్యాహ్న భోజనంలో ఇవే కూరలు

శైలజ పండించే కూరగాయలను గ్రామస్తులకే విక్రయిస్తున్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ, ప్రాథమిక, జిల్లా పరిషత్ హైస్కూళ్లలో మధ్యాహ్న భోజన పథకానికి సరఫరా చేస్తున్నారు. ఘనజీవామృతం, ఆవు పేడ, పంచితం, మజ్జిగతో కషాయాలను తయారు చేసి పంటలకు ఉపయోగిస్తుండటాన్ని గ్రామస్తులు ఆసక్తిగా చూస్తుంటారు. ప్రకృతి సాగు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే ప్రయోజనాలను రైతు సాధికర సంస్థ సిబ్బంది, శైలజ, ఆమె భర్త మాధవ వర్మ గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది కూరగాయలు కొంటున్నారు. అంగన్‌వాడీ పిల్లలు, స్కూల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో వడ్డించే కూరగాయలు కూడా శైలజ పండిస్తున్నవే. 'శైలజ పండించిన కూరగాయలను ధర కాస్త ఎక్కువైనా కొని వాడుతున్నా. పిల్లలు కూరలు రుచిగా ఉన్నాయని చెబుతుంటే సంతోషంగా ఉంద'ంటున్నారు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలు పూర్ణ.

కొసమెరుపు: గ్రామానికి చెందిన వెంకట్రామరాజు శైలజ పండించే కూరగాయలను కొనుగోలు చేసి చెన్నైలో ఉంటున్న తన కుమారుడు డాక్టర్ రామకృష్ణంరాజుకు వారానికి ఒక రోజు పంపుతుండటం మరో విశేషం.

– తిరుమల రవిరెడ్డి, సాక్షి ప్రతినిధి, తిరుపతి.
ఫొటోలు: కేతారి మోహన్‌కృష్ణ

12న వైరాలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

ఖమ్మం జిల్లా వైరాలోని శ్రీసత్యసాయి వేద పాఠశాలలో ఈ నెల 12 (ఆదివారం)న ఉ. 10 గం, నుంచి రైతులకు గోఆధారిత ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన ప్రకృతి సేద్య నిపుణులు టి. నాగరాజు శిక్షణ ఇస్తారు. వివరాలకు.. 94410 34138.

18న ఔషధ, సుగంధ మొక్కల సాగుపై బోడుప్పల్ 'సీమాప్'లో రైతు సదస్సు

కేంద్ర ప్రభుత్వ సంస్థ కేంద్రీయ ఔషధ, సుగంధ మొక్కల పరిశోధనా కేంద్రం (సీమాప్) ఆధ్వర్యంలో మార్చి 18 (శనివారం) ఉ. 10 గం.-సా. 5 గం. వరకు సికింద్రాబాద్ సమీపంలోని బోడుప్పల్‌లో సంస్థ కార్యాలయ ఆవరణలో రైతు సదస్సు జరగనుంది. అధిక దిగుబడినిచ్చే ఔషధ, సుగంధ మొక్కల సాగు పద్ధతులు, మొక్కలు, విత్తనాలు, సుగంధ నూనెలను వెలికితీసే డిస్టిలేషన్ యంత్రాల ప్రదర్శనతో పాటు మార్కెటింగ్ అవకాశాలపై అవగాహన కల్పిస్తారు. శాస్త్రవేత్తలతో ముఖాముఖి చర్చించి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.

సుగంధ తైలాలకు దేశవిదేశాల్లో గిరాకీ

నిమ్మగడ్డి, కాశగడ్డి వంటి అనేక సుగంధ పంటల నుంచి తీసిన తైలాలకు దేశవిదేశాల్లో ఎంతో గిరాకీ ఉంది. ఈ రెండు పంటల మొక్కలు/విత్తనాలను రైతుకు అర ఎకరం వరకు ఉచితంగా ఇవ్వటంతోపాటు పంట కొనుగోలు దారులతో అనుసంధానం చేస్తామని సీమాప్ ఇన్‌చార్జ్ శాస్త్రవేత్త జి.డి. కృష్ణబాబు 'సాక్షి సాగుబడి'కి తెలిపారు. అశ్వగంధ, నేల తంగేడు వంటి ఔషధ మొక్కలకు సైతం మార్కెటింగ్ సమస్య లేదన్నారు. నీరు నిల్వ/నీడ ఉండని ఏపీ/తెలంగాణలోని అన్ని నేలల్లో ఈ పంటలను ఆరుతడి/డ్రిప్ పద్ధతిలో సాగు చేయవచ్చన్నారు. ఔషధ, సుగంధ పంటలపై ఆసక్తి గల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు పొరుగు రాష్ట్రాల రైతులు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ కిసాన్ మేళాలో పాల్గొనవచ్చన్నారు. ప్రవేశం ఉచితం. మధ్యాహ్న భోజన సదుపాయం ఉంది. అయితే, పాల్గొనదలచిన వారు తప్పనిసరిగా ఈ నెల 15లోగా పేరు నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. నమోదు పత్రంపై మీ వివరాలు, ఫొటో జతపరచి, సంతకం చేసి కింది మెయిల్‌కు పంపాలి.

crchyd@cimap.res.in
www.cimap.res.in 040-29201131

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్



నాలుగో టెస్టుకూ కెప్టెన్‌గా స్మిత్

బోర్డర్–గావస్కర్ ట్రోఫీ మూడో టెస్టులో ఆస్ట్రేలియాను విజయపథంలో నడిపించిన స్టీవ్ స్మిత్ సారథ్య బాధ్యతలు కొనసాగనున్నాయి. తన తల్లి అనారోగ్యం కారణంగా ఆస్ట్రేలియాకు తిరిగి వెళ్లిన రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ చివరి టెస్టు సమయానికి కూడా తిరిగి రాలేకపోతున్నాడు. దాంతో అహ్మదాబాద్‌లో గురువారంనుంచి జరిగే నాలుగో టెస్టులోనూ స్మిత్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. ఇండోర్ టెస్టులో విజయం తర్వాత కంగారూ జట్టులో ఆత్మవిశ్వాసం మరింత పెరిగింది. వన్డే సిరీస్‌కైనా కమిన్స్ తిరిగి వస్తాడా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు.

దక్షిణాఫ్రికా టి20 కెప్టెన్‌గా మార్క్‌రమ్



దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టుకు టి20 ఫార్మాట్‌లో ఎయిడెన్ మార్క్‌రమ్‌ను కొత్త సారథిగా నియమిస్తున్నట్లు బోర్డు ప్రకటించింది. ఇప్పటి వరకు టి20ల్లో కెప్టెన్‌గా వ్యవహరించిన తెంబా బవుమా ఘోరంగా విఫలమయ్యాడు. 2014లో అండర్–19 వరల్డ్ కప్ గెలిపించిన మార్క్‌రమ్, ఇటీవల తొలి దక్షిణాఫ్రికా టి20 లీగ్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ టీమ్‌ను చాంపియన్‌గా నిలిపాడు. దాంతో ఐపీఎల్ టీమ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ కూడా అతడినే సారథిగా ఎంపిక చేసింది.

జ్యోతికశ్రీకి స్వర్ణం



తిరువనంతపురం: జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి దండి జ్యోతికశ్రీ స్వర్ణంతో మెరిసింది. సీనియర్ మహిళల 400 మీటర్ల పరుగులతో జ్యోతిక శ్రీ మొదటి స్థానంలో నిలిచింది. 53.26 సెకన్ల టైమింగ్‌తో రేస్ పూర్తి చేసి ఆమె విజేతగా నిలిచింది. ఈ ఈవెంట్‌లో ఐశ్వర్య (మహారాష్ట్ర – 53.49 సె.), కిరణ్ పహల్ (హరియాణా – 54.29 సె.) రజత, కాంస్యాలు దక్కించుకున్నారు. అండర్–20 విభాగంలో ప్రియా మోహన్ (కర్నాటక – 53.55 సె.) పసిడి పతకాన్ని గెలుచుకుంది.

జాతీయ రికార్డు నమోదు...

ఇదే చాంపియన్‌షిప్ అండర్–16 బాలికల విభాగం 400 మీటర్ల పరుగులో కొత్త జాతీయ రికార్డు నమోదైంది. బెంగాల్‌కు చెందిన రెజోనా మలిక్ హీనా 53.22 సెకన్లలో రేస్ పూర్తి చేసి స్వర్ణం సాధించడంతో పాటు కొత్త జాతీయ రికార్డు నెలకొల్పింది. గతంలో అంజనా థమ్కే (54.57 సె.) పేరిట ఉన్న రికార్డును హీనా బద్దలు కొట్టింది. ఈ ఈవెంట్‌లో మాన్సి భరేకర్ (మహారాష్ట్ర), నేత్ర (తమిళనాడు) తర్వాతి రెండు స్థానాల్లో నిలిచారు.

బంగ్లాను గెలిపించిన షకీబ్



చిట్టోగ్రామ్: ఇంగ్లండ్ చేతిలో ఇప్పటికే వన్డే సిరీస్ ఓడిన బంగ్లాదేశ్‌కు ఓదార్పు విజయం దక్కింది. సోమవారం జరిగిన మూడో వన్డేలో బంగ్లా 50 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబ్ అల్ హసన్ (71 బంతుల్లో 75; 7 ఫోర్లు – 4/35) ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టును గెలిపించాడు. ముందుగా బంగ్లాదేశ్ 48.5 ఓవర్లలో 246 పరుగులకు ఆలౌటైంది. ముష్ఫికర్ రహీమ్ (93 బంతుల్లో 70; 6 ఫోర్లు), నజ్ముల్ హొస్సేన్ (71 బంతుల్లో 53; 5 ఫోర్లు) కూడా అర్ధ సెంచరీలు చేశారు. అనంతరం ఇంగ్లండ్ 43.1 ఓవర్లలో 196 పరుగులకే ఆలౌటైంది. జేమ్స్ విన్స్ (38), ఫిల్ సాల్ట్ (35), క్రిస్ వోక్స్ (34) ఫర్వాలేదనిపించారు. సిరీస్‌ను ఇంగ్లండ్ 2–1తో సొంతం చేసుకోగా...8 వికెట్లు తీసిన ఆదిల్ రషీద్ 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచాడు. ఈ మ్యాచ్‌లో వన్డేల్లో షకీబ్ 300 వికెట్లు మైలురాయిని అందుకున్నాడు. జయసూర్య, షాహిది అఫ్రిది తర్వాత వన్డేల్లో 300 వికెట్లు తీసి, 6 వేల పరుగులు చేసిన మూడో ఆల్‌రౌండర్‌గా అతను గుర్తింపు పొందాడు.

సహజ యమ్లపల్లికి చోటు

ఫెడ్ కప్ కోసం భారత జట్టు ప్రకటన



న్యూఢిల్లీ: ఆసియా ఓషియానియా గ్రూప్ 1 ఫెడరేషన్ కప్ (బిల్లీ జీన్ కింగ్ కప్)లో పాల్గొనే ఐదుగురు సభ్యుల భారత జట్టును అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) ప్రకటించింది. ఈ టీమ్‌లో అంకితా రైనా (ప్రపంచ 241వ ర్యాంకర్), కర్మన్ కౌర్ తాండి (268), రుతుజా భోస్లే (419), వైదేహి చౌదరి (492)తో పాటు హైదరాబాద్‌కు చెందిన సహజ యమ్లపల్లి (454)కి స్థానం లభించింది. నగరానికి చెందిన సహజ అమెరికాలోనే చదువుకుంటూ అక్కడే శిక్షణ తీసుకుంటోంది. హైదరాబాద్‌కే చెందిన భమిడిపాటి శ్రీవల్లి రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపికైంది. వైదేహి ఇటీవలే తన రెండో ఐటీఎఫ్ టైటిల్ గెలుచుకోగా, భారత క్రీడాకారిణుల్లో నాలుగో ర్యాంక్‌లో ఉన్న సహజకు కూడా తొలి సారి అవకాశం లభించింది. 'నిలకడగా రాణిస్తున్న యువ ప్లేయర్లకు మరిన్ని అవకాశాలు ఇవ్వాలని మేం భావించాం. అందుకే వైదేహి, సహజలను ఎంపిక చేశాం. వీరిద్దరు కొంత అనుభవం సాధిస్తే మున్ముందు తమ సీనియర్లను దాటి మంచి ఫలితాలు సాధించగలరనే నమ్మకం ఉంది' అని ఏఐటీఏ ప్రతినిధి నందన్ బల్ వెల్లడించారు. మరో వైపు ఇతర సహాయక సిబ్బందిని కూడా కొత్తగా ఎంపిక చేశారు. ఇప్పటి వరకు కోచ్‌గా ఉన్న విశాల్ ఉప్పల్‌ను తప్పించి అతని స్థానంలో షాలిని ఠాకూర్ చావ్లాను ఎంపిక చేయగా...కోచ్‌గా రాధిక కనిత్కర్ వ్యవహరిస్తుంది. ఉజ్బెకిస్తాన్‌లోని తాష్కెంట్‌లో ఏప్రిల్ 10నుంచి ఈ టోర్నమెంట్ జరుగుతుంది.

వ్యాక్సిన్ వేసుకోలేదని...



ఇండియన్‌వెల్స్: వరల్డ్ నంబర్‌వన్ టెన్నిస్ స్టార్ నొవాక్ జొకోవిచ్‌ను ఇంకా కరోనా వ్యాక్సిన్ కష్టాలు వీడటం లేదు. అతను వ్యాక్సిన్ వేసుకోలేదనే కారణంతో అమెరికా ప్రభుత్వం తమ దేశంలోకి అడుగు పెట్టేందుకు అతడిని అనుమతించలేదు. దాంతో ప్రతిష్టాత్మక ఇండియన్ వెల్స్ టోర్నమెంట్‌నుంచి అతను తప్పుకున్నాడు. తనకు మినహాయింపు ఇవ్వాలంటూ జొకోవిచ్ చేసిన దరఖాస్తును అక్కడి అధికారులు తిరస్కరించారు. ఇండియన్‌వెల్స్‌తో పాటు మరో పెద్ద టోర్నీ మయామీ ఓపెన్‌కు కూడా జొకోవిచ్ దూరం కానున్నాడు. ఈ రెండు టోర్నీలు మార్చి 19 – ఏప్రిల్ 2 మధ్య జరుగుతాయి.

నేటినుంచి జర్మన్ ఓపెన్

ముల్హీమ్: భారత యువ షట్లర్, గత ఏడాది రన్నరప్ లక్ష్య సేన్ ఈ సారి జర్మన్ ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. నేటినుంచి జరిగే ఈ టోర్నీలో అతను ఆరో సీడ్‌గా బరిలోకి దిగుతున్నాడు. తొలి రౌండ్‌లో లక్ష్య ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టో పొపోవ్‌తో తలపడతాడు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యతో పాటు మిథున్ మంజునాథ్ బరిలో ఉన్నాడు. అయితే మరో భారత టాప్ ఆటగాడు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కిడాంబి శ్రీకాంత్ అనూహ్యంగా ఈ టోర్నీకి దూరమయ్యాడు. సరైన సమయంలో అతనికి వీసా లభించకపోవడంతో శ్రీకాంత్ తప్పుకోవాల్సి వచ్చింది. మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్, మాళవిక బన్సోద్, తస్నీమ్ మీర్ బరిలో నిలిచారు. పురుషుల డబుల్స్, మహిళల డబుల్స్‌లలో భారత్‌నుంచి ఒక్క ఎంట్రీ కూడా లేకపోగా...మిక్స్‌డ్ డబుల్స్‌లో సుమీత్ రెడ్డి – అశ్విని పొన్నప్ప ద్వయం పోటీ పడుతోంది.



ప్రైమ్ వాలీబాల్ లీగ్ రెండో సీజన్‌లో విజేతగా నిలిచిన అహ్మదాబాద్ డిఫెండర్స్ జట్టు. కొచ్చిలో జరిగిన ఫైనల్లో అహ్మదాబాద్ 15-7, 15-10, 18-20, 13-15, 15-10 స్కోరుతో బెంగళూరు టార్పెడోస్ జట్టును ఓడించింది.

ముంబై సూపర్ షో

- 9 వికెట్లతో బెంగళూరుపై ఘన విజయం
- హేలీ మాథ్యూస్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- నట్ సీవర్ అర్ధ సెంచరీ
- మహిళల ప్రీమియర్ లీగ్



నట్ సీవర్



హేలీ మాథ్యూస్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో ముంబై ఇండియన్స్ ధనాధన్ ఆల్‌రౌండ్ షోతో వరుసగా రెండో విజయం సాధించింది. సోమవారం జరిగిన పోరులో 9 వికెట్ల తేడాతో బెంగళూరు రాయల్ చాలెంజర్స్‌ను చిత్తు చేసింది. బౌలింగ్‌లో 3 వికెట్లు పడగొట్టిన హేలీ మాథ్యూస్ బ్యాటింగ్‌లో (38 బంతుల్లో 77 నాటౌట్; 13 ఫోర్లు, 1 సిక్స్) ఆకాశమే హద్దుగా చెలరేగింది. టాపార్డర్ బ్యాటర్ నట్ సీవర్ బ్రంట్ (29 బంతుల్లో 55 నాటౌట్; 9 ఫోర్లు, 1 సిక్స్) కూడా మెరుపు అర్ధ సెంచరీ సాధించడంతో ఛేదన సులువైంది. మొదట బ్యాటింగ్‌కు దిగిన బెంగళూరు 18.4 ఓవర్లలో 155 పరుగులకు ఆలౌటైంది. రిచా ఘోష్ (26 బంతుల్లో 28; 3 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా, సయిక ఇషాక్, అమెలియా కెర్ తలా 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ముంబై ఇండియన్స్ హేలీ, బ్రంట్‌ల అజేయ అర్ధ సెంచరీలతో 14.2 ఓవర్లలో ఒక వికెట్ మాత్రమే కోల్పోయి 159 పరుగులు చేసింది.

అందరూ అంతంతే!

బెంగళూరు స్కోరైతే 150 దాటింది కానీ... ఏ ఒక్క బ్యాటర్‌ది చెప్పుకోదగ్గ స్కోరుగానీ, ఇన్నింగ్స్‌ను కుదుటపర్చిన భాగస్వామ్యంగానీ లేవు. అదే బెంగళూరు పాలిట శాపమైంది. కెప్టెన్, ఓపెనర్ స్మృతి మంధాన (17 బంతుల్లో 23; 5 ఫోర్లు) మొదలు మేగన్ షట్ (14 బంతుల్లో 20; 3 ఫోర్లు) దాకా ఐదుగురు బ్యాటర్లు రిచా, కనిక ఆహుజా (13 బంతుల్లో 22; 3 ఫోర్లు, 1 సిక్స్), శ్రేయాంక పాటిల్ (15 బంతుల్లో 23; 4 ఫోర్లు) 20 పైచిలుకు పరుగులు చేశారు. అందరు ఇలా వచ్చి అలా షాట్లు బాదేసి పెవిలియన్‌కు వెళ్లినవారే! ఇందులో ఏ ఒక్కరు నిలబడినా, మెరుపుల భాగస్వామ్యం నమోదైనా పరిస్థితి మరోలా ఉండేది. అయితే ముంబై బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు పడగొట్టడంలో సమష్టిగా సఫలమయ్యారు.

హేలీ, బ్రంట్ ఫిఫ్టీ–ఫిఫ్టీ

ముంబై ముందున్న లక్ష్యం 156 పరుగులు. అంత సులభమైందేమీ కాదు. కానీ యస్తిక భాటియా (19 బంతుల్లో 23; 4 ఫోర్లు)తో కలిసి ఇన్నింగ్స్ ఆరంభించిన హేలీ మాథ్యూస్ తొలి ఓవర్ నుంచే ఎదురుదాడికి దిగింది. స్కోరు జోరందుకున్న సమయంలో యస్తికను ప్రీతి బోస్ వికెట్ ముందు దొరకబుచ్చుకుంది. 45 పరుగుల వద్ద తొలి వికెట్ కూలగా, బెంగళూరుకు అదే ఆఖరి ఆనందం అయ్యింది. తర్వాత నట్ సీవర్ వచ్చాక హేలీ వేగం మరో దశకు చేరింది. బెంగళూరు కెప్టెన్ బౌలర్లను మార్చి మార్చి ప్రయోగించినా ఫలితం లేకపోయింది. అటు బ్రంట్, ఇటు హేలీ బౌండరీలను అవలీలగా బాదేస్తుంటే ఆద్యంతం 'పవర్ ప్లే'నే కనిపించింది. పదో ఓవర్లోనే హేలీ 26 బంతుల్లో (8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ పూర్తి చేసుకుంది. 10.2 ఓవర్లోనే జట్టు స్కోరు 100 దాటింది. మేగన్ షట్ వేసిన 12, శ్రేయాంక పాటిల్ వేసిన 13వ ఓవర్లలో బ్రంట్, హేలీలు ఫోర్లతో చెలరేగిపోయారు. దీంతో ఈ రెండు ఓవర్లలోనే ముంబై 40 పరుగులు చేయడంతో లక్ష్యాన్ని 5.4 ఓవర్ల ముందే ఛేదించింది.

స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: స్మృతి మంధాన (సి) వాంగ్ (బి) హేలీ 23; సోఫీ (సి) అమన్‌జోత్ (బి) సయిక 16; దిశ (బి) సయిక 0; ఎలైస్ పెర్రీ రనౌట్ 13; హీథెర్‌నైట్ (బి) హేలీ 0; రిచాఘోష్ (సి) నట్ సీవర్ (బి) హేలీ 28; కనిక (సి) యస్తిక (బి) పూజ 22; శ్రేయాంక (ఎల్బీ) (బి) నట్ సీవర్ 23; మేగన్ (స్టంప్డ్) యస్తిక (బి) అమెలియా 20; రేణుక (బి) అమెలియా 2; ప్రీతి నాటౌట్ 1; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (18.4 ఓవర్లలో ఆలౌట్) 155. వికెట్ల పతనం:** 1–39, 2–39, 3–43, 4–43, 5–71, 6–105, 7–112, 8–146, 9–154, 10–155. **బౌలింగ్:** హేలీ 4–0–28–3, నట్ సీవర్ 3–0–34–1, సయిక ఇషాక్ 4–0–26–2, ఇసి వాంగ్ 2–0–18–0, అమెలియా కెర్ 3.4–0–30–2, కలిత 1–0–10–0, పూజ 1–0–8–1.

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: హేలీ మాథ్యూస్ నాటౌట్ 77; యస్తిక (ఎల్బీ) (బి) ప్రీతి 23; నట్ సీవర్ నాటౌట్ 55; ఎక్స్‌ట్రాలు 4; **మొత్తం (14.2 ఓవర్లలో వికెట్ నష్టానికి) 159. వికెట్ల పతనం:** 1–45. **బౌలింగ్:** రేణుక 3–0–28–0, ప్రీతి బోస్ 4–0–34–1, మేగన్ షట్ 3–0–32–0, ఎలైస్ పెర్రీ 1.2–0–18–0, శ్రేయాంక 2–0–32–0, సోఫీ డివైన్ 1–0–11–0.

డబ్ల్యూపీఎల్‌లో నేడు

ఢిల్లీ క్యాపిటల్స్ X లక్నో విజార్డ్స్
రాత్రి గం. 7:30 నుంచి

స్పోర్ట్స్ 18 చానెల్‌లో, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

సినిమా

అమితాబ్‌కి గాయం


● కొన్ని వారాలు విశ్రాంతి



● అమితాబ్

''ఇవాళ జల్సా (అమితాబ్ నివాసం పేరు) కి ఎవరూ రావద్దు. నా శ్రేయోభిలాషులను కలవడానికి కుదరదని చెప్పడానికి నాకు కష్టంగానే ఉంది'' అని అమితాబ్ బచ్చన్ ఆదివారం తన బ్లాగ్‌లో పేర్కొన్నారు. మామూలుగా వారంలో ఓసారి.. ఎక్కువగా ఆదివారం తన అభిమానులను కలుస్తుంటారు ఆయన. అయితే ఈసారి అనుకోకుండా అమితాబ్ ప్రమాదానికి గురికావడంతో కలవలేకపోయారు. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న 'ప్రాజెక్ట్ కె' చిత్రంలో అమితాబ్ బచ్చన్ కీలక పాత్ర చేస్తున్న విషయం తెలిసిందే. కొన్ని రోజులుగా హైదరాబాద్‌లో ఈ చిత్రానికి సంబంధించిన షెడ్యూల్ జరుగుతోంది. అమితాబ్ కూడా పాల్గొంటున్నారు. ఓ యాక్షన్ సీన్ చిత్రీకరిస్తున్న సమయంలో అనుకోకుండా జరిగిన ప్రమాదం వల్ల అమితాబ్ పక్కటెముకలకు గాయం అయింది. దీంతో ఆయన కొన్ని వారాలపాటు విశ్రాంతి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ''శనివారం షూటింగ్ అంతా సజావుగా జరుగుతున్న సమయంలో ప్రమాదం జరిగింది. అయితే అప్పుడు ఏమీ అనిపించలేదు. అమితాబ్ షూటింగ్ ముగించి తన రూమ్‌కి వెళ్లారు. రాత్రి 'రైట్ రిబ్స్' (కుడి పక్కటెముకలు) బాగా నొప్పి అనిపించాయని మర్నాడు మాతో అంటే, డాక్టర్లను పిలిపించాం. సీటీ స్కాన్ తీయాలన్నారు. దాంతో ఆస్పత్రికి తీసుకెళ్లాం. పరీక్షలు చేసి, విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ నెలాఖరున అమితాబ్ షూటింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంది. లేకపోతే ఆయన పూర్తిగా కోలుకున్నాకే షూటింగ్‌కి వస్తారు'' అని చిత్రనిర్మాత అశ్వనీదత్ తెలిపారు. ఇక అమితాబ్ తన బ్లాగ్‌లో రాసుకున్న విషయాల్లో ''నొప్పి బాగానే ఉంది. పెయిన్ కిల్లర్స్ ఇచ్చారు. ప్రస్తుతానికి ఊపిరి తీసుకోవడం కాస్త కష్టంగా ఉంది. ఇప్పుడు ముంబైలో నా జల్సాలో విశ్రాంతి తీసుకోవడం తప్ప ఏమీ చేయలేను. ఇది మినహా అంతా బాగానే ఉంది'' అని పేర్కొన్నారు.

ఈ రావణాసురుణ్ణి దాటి వెళ్లాలి!



● రవితేజ

'సీతని తీసుకెళ్లాలంటే సముద్రం దాటితే సరిపోదు... ఈ రావణాసురుణ్ణి దాటి వెళ్లాలి' అని వార్నింగ్ ఇస్తున్నారు రవితేజ. సుధీర్ వర్మ దర్శకత్వంలో రవితేజ హీరోగా నటించిన చిత్రం 'రావణాసుర'. అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాష్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజిత పొన్నాడ హీరోయిన్లుగా నటించిన ఈ చిత్రంలో సుశాంత్ కీలక పాత్ర చేశారు. అభిషేక్ నామా, రవితేజ నిర్మించారు. ఏప్రిల్ 7న విడుదలకానున్న ఈ చిత్రం టీజర్‌ని విడుదల చేసింది యూనిట్. 'ప్రతి క్రిమినల్ వాడు చేసిన క్రైమ్ మీద వాడి సంతకం వదిలేసి వెళ్లిపోతాడు.. ఆ సంతకం కోసం వెతకండి..' అంటూ ఇన్వెస్టిగేటివ్ ఆఫీసర్‌గా నటుడు జయరామ్ చెప్పే డైలాగ్‌తో టీజర్ ప్రారంభమై, 'సీతని తీసుకెళ్లాలంటే సముద్రం దాటితే సరిపోదు... ఈ రావణాసురుణ్ణి దాటి వెళ్లాలి' అంటూ రవితేజ చెప్పే డైలాగ్‌తో ముగుస్తుంది. ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, భీమ్స్ సిసిరోలియో, కెమెరా: విజయ్ కార్తీక్ కన్నన్, సీఈఓ: పోతిని వాసు.

ఎన్టీఆర్‌కి జోడీగా జాన్వీ



● జాన్వీ కపూర్

తెలుగు చిత్ర పరిశ్రమలో స్టార్ హీరోలందరితో నటించి ఓ వెలుగు వెలిగారు శ్రీదేవి. ఆమె పెద్ద కుమార్తె జాన్వీ కపూర్ టాలీవుడ్ ఎంట్రీ షురూ అయింది. ఎన్టీఆర్ సినిమాతో జాన్వీ కపూర్ తెలుగులో ఎంట్రీ ఇస్తున్నారు. సోమవారం (మార్చి 6) జాన్వీ కపూర్ పుట్టినరోజుని పురస్కరించుకుని ఈ విషయాన్ని చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'ఎన్టీఆర్ 30' (వర్కింగ్ టైటిల్). నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధా ఆర్ట్స్ పతాకంపై సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. ఈ మూవీలో ఎన్టీఆర్ సరసన జాన్వీ కపూర్ నటిస్తారని ప్రకటించి, ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ని విడుదల చేసింది చిత్రయూనిట్.

శర్వా 35 షురూ



● శర్వానంద్

హీరో శర్వానంద్ పుట్టినరోజు (మార్చి 6) సందర్భంగా తన 35వ చిత్రంపై అధికారిక ప్రకటన వచ్చింది. శ్రీరామ్ ఆదిత్య దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. మార్చి 6న శర్వానంద్ బర్త్ డే సందర్భంగా 'శర్వా 35'(వర్కింగ్ టైటిల్)లోని ఫస్ట్ లుక్స్‌ని చిత్రయూనిట్ విడుదల చేసింది. ఈ సందర్భంగా టీజీ విశ్వ ప్రసాద్ మాట్లాడుతూ– ''ఒక యూనిక్ పాయింట్‌తో ఫ్యూచరిస్టిక్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుంది. శర్వానంద్‌ను స్టైలిష్ లుక్‌లో చూపిస్తున్నారు శ్రీరామ్ ఆదిత్య. ఈ మూవీ చిత్రీకరణ ప్రారంభమైంది. ఇతర వివరాలు త్వరలోనే తెలియజేస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, సంగీతం: హేషమ్ అబ్దుల్ వహాబ్, కెమెరా: విష్ణు శర్మ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కృతి ప్రసాద్, ఫణి కె. వర్మ.

ఇవాళే కలిశారు తొలిసారిగా..



● నాగశౌర్య, మాళవిక

నాగశౌర్య, మాళవికా నాయర్ జంటగా శ్రీనివాస్ అవసరాల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఫలానా అబ్బాయి ఫలానా అమ్మాయి'. టీజీ విశ్వ ప్రసాద్, పద్మజ దాసరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న రిలీజ్ కానుంది. కళ్యాణీ మాలిక్ సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'ఫలానా అబ్బాయ్ ఫలానా అమ్మాయ్.. ఫలానా అబ్బాయ్ ఫలానా అమ్మాయ్.. ఇవాళే కలిశారు తొలిసారిగా..' అంటూ సాగే రెండో పాటని సోమవారం విడుదల చేశారు. గాయని నూతన మోహన్, కళ్యాణీ మాలిక్ పాడిన ఈ పాటకి భాస్కరభట్ల రవికుమార్ సాహిత్యం అందించారు. ''హీరో, హీరోయిన్ల పరిచయ గీతం ఇది. ఈ చిత్రంలో మూడు పాటలు రాశాను'' అన్నారు భాస్కరభట్ల రవికుమార్. ఈ చిత్రానికి సహనిర్మాత: వివేక్ కూచిభొట్ల, కెమెరా: సునీల్ కుమార్ నామ, సంగీతం: కళ్యాణీ మాలిక్, వివేక్ సాగర్ (కాఫీపై సాంగ్).


ప్రేక్షకులు థ్రిల్ అవుతారు

– అజయ్ శ్రీనివాస్



''మా 'సీఎస్ఐ సనాతన్' ట్రైలర్ చూసిన పెద్ద దర్శకులు థ్రిల్లింగ్‌గా ఉందని ప్రశంసించడంతో మా నమ్మకం మరింత పెరిగింది. ప్రేక్షకులు కూడా థ్రిల్ అవుతారు'' అని నిర్మాత అజయ్ శ్రీనివాస్ అన్నారు. ఆది సాయికుమార్, మిషా నారంగ్ జంటగా శివశంకర్ దేవ్ దర్శకత్వం వహించిన చిత్రం 'సీఎస్ఐ సనాతన్'. అజయ్ శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా అజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ– ''సీఎస్ఐ అంటే 'క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్' అని అర్థం. ఫోరెన్సిక్ డిపార్ట్‌మెంట్ వాళ్లు నేర నిర్ధారణ ఎలా చేస్తారు? వారి ఇన్వెస్టిగేషన్ ఎంత క్షుణ్ణంగా ఉంటుంది? అనే పాయింట్‌ను దర్శకుడు చక్కగా చెప్పాడు. ఈ చిత్రానికి సీక్వెల్‌కి కథ రెడీ అయింది. 'వేదాంత్' అనే టైటిల్‌తో మరో థ్రిల్లర్ సినిమా ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు.

మంచి లక్ష్యంతో...




● యోగేశ్వర్, అతిథి

యోగేశ్వర్, అతిథి జంటగా సాయి శివాజీ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'పరారీ'. గాలి ప్రత్యూష సమర్పణలో జీవీవీ గిరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 30న విడుదలకానుంది. ఈ మూవీ పోస్టర్‌ను ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు బసిరెడ్డి, టీజర్‌ను ప్రొడ్యూసర్ కౌన్సిల్ అధ్యక్షుడు దామోదర్ ప్రసాద్ విడుదల చేశారు. ''మంచి సినిమా తీయాలనే లక్ష్యంతో 'పరారీ' నిర్మించాను. సుమన్‌గారి వందో సినిమా నేను నిర్మించాల్సి ఉన్నా కుదరలేదు.. ఈ మూవీలో సుమన్‌గారు మంచి పాత్ర చేశారు'' అన్నారు జీవీవీ గిరి. ''పరారీ'లో అన్ని పాటలు బాగా వచ్చాయి'' అన్నారు సంగీత దర్శకుడు మహిత్ నారాయణ్.

పులి విజువల్స్ బాగున్నాయి

– కేఎల్ దామోదర్ ప్రసాద్



● సుధాకర్, దామోదర్

''పులి' సినిమా ట్రైలర్‌లో విజువల్స్ బాగున్నాయి'' అన్నారు నిర్మాతల మండలి అధ్యక్షుడు కేఎల్ దామోదర్ ప్రసాద్ అన్నారు. సిజు విల్సన్, కాయాదు లోహర్ జంటగా వినయన్ దర్శకత్వం వహించిన మలయాళ హిట్ 'పాథోన్ పథం నూట్టాండు' తెలుగులో 'పులి– 19వ శతాబ్దం' టైటిల్‌తో రిలీజ్ కానుంది. నిర్మాత సీహెచ్ సుధాకర్ బాబు ఈ నెల 10న విడుదల చేస్తున్నారు. ఈ చిత్రం ట్రైలర్‌ని దామోదర్ ప్రసాద్ రిలీజ్ చేశారు. సుధాకర్‌బాబు మాట్లాడుతూ– ''పాతికేళ్లుగా ఇండస్ట్రీలో ఉన్నాను. అయితే 'అమ్మ దొంగ' తర్వాత నాకు మళ్లీ అంత పెద్ద సక్సెస్ రాలేదు. 'పులి'తో ఆ సక్సెస్ వస్తుందని ఆశిస్తున్నా'' అన్నారు.

కెమెరామేన్ ప్రవీణ్ కన్నుమూత



కెమెరామేన్ ప్రవీణ్ అనుమోలు ఆదివారం రాత్రి గుండెపోటుతో కన్నుమూశారు. అసిస్టెంట్ కెమెరామేన్‌గా కెరీర్‌ను మొదలుపెట్టారు ప్రవీణ్. పవన్ కల్యాణ్ 'పంజా', ఎన్టీఆర్ 'యమదొంగ' చిత్రాలతో పాటు హిందీలో 'బేబీ', 'ధూమ్ 3', 'బాజీరావ్ మస్తానీ' వంటి చిత్రాలకు అసిస్టెంట్ కెమెరామేన్‌గా చేశారు. 2017లో వచ్చిన 'దర్శకుడు' చిత్రంతో కెమెరామేన్‌గా మారారు. ఈ చిత్రాన్ని డైరెక్టర్ సుకుమార్ నిర్మించారు. 'దర్శకుడు' తర్వాత ప్రవీణ్ మరికొన్ని సినిమాలకు కెమెరామేన్‌గా చేశారు. అయితే అవి ఇంకా రిలీజ్ కాలేదు. ఈలోపు ఇలా జరగడం పట్ల పలువురు చిత్రరంగ ప్రముఖుల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	415	60,224
నిఫ్టీ ▲	117	17,711

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	11,780	▲ 93
డోజోన్స్	33,512	▲ 121
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,930	▼ 17
డాక్స్	15,654	▲ 75
షాంఘై	3,322	▼ 6
నికాయ్	28,927	▲ 310

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	56,089
బంగారం (22 క్యారెట్)	55,865
వెండి (కేజీ)	64,266

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	81.45	83.12
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	95.78	100.31
€	యూరో	ఎస్‌బీఐ	84.86	87.81
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	58.75	60.17
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.33	57.17
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	59.21	61.15
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	20.11	22.21
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.23	23.91
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.65	12.44

మహిళల హైరింగ్‌కు పెరుగుతున్న ప్రాధాన్యం

ఫౌండిట్ సర్వేలో వెల్లడి

ముంబై: దేశీయంగా ఉద్యోగ నియామకాల్లో మహిళలకు ప్రాధాన్యమిచ్చే ధోరణి పెరుగుతోంది. కంపెనీల్లో వైట్ కాలర్ ఉద్యోగాల్లో (ఆఫీసుల్లో చేసే) మహిళల రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి గతేడాది ఫిబ్రవరితో పోలిస్తే ఈ ఏడాది ఫిబ్రవరిలో డిమాండ్ 35 శాతం పెరిగింది. జాబ్ ప్లాట్‌ఫామ్ ఫౌండిట్ (గతంలో మాన్‌స్టర్ ఏపీఏసీ, ఎంఈ) తమ పోర్టల్‌లో నమోదైన హైరింగ్ గణాంకాల ఆధారంగా రూపొందించిన నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. మహిళా ఉద్యోగుల సంఖ్యను పెంచుకునే దిశగా.. నెలసరి, శిశు సంరక్షణ తదితర సందర్భాల కోసం ప్రత్యేకంగా సెలవులు ఇవ్వడం, కార్యాలయాల్లో పక్షపాత ధోరణులను నిరోధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంలాంటి అంశాలపై కంపెనీలు దృష్టి పెడుతున్నాయి. అలాగే పని విషయంలో వెసులుబాటు కల్పించడం వంటివి చేస్తున్నాయి. మహిళా ఉద్యోగులకు డిమాండ్‌పరంగా చూస్తే ఐటీఈఎస్/బీపీవో రంగంలో అత్యధికంగా 36 శాతం, ఐటీ/కంప్యూటర్స్–సాఫ్ట్‌వేర్ (35%), బ్యాంకింగ్/అకౌంటింగ్/ఆర్థిక సర్వీసులు (22%)గా ఉంది.

అవగాహన ఉన్నా వినియోగం కొంతే..

- మహిళలకు ఆర్థిక సేవలపై ఆర్‌బీఐ అధ్యయనం
- పిల్లల చదువుల కోసం పొదుపునకు ప్రాధాన్యం

ముంబై: ఆర్థిక సేవలపై మహిళలకు అవగాహన పెరుగుతున్నప్పటికీ వారు వాటిని వినియోగించుకోవడం తక్కువగానే ఉంటోంది. బీమా తదితర సాధనాల గురించి మూడో వంతు మందికి తెలిసినా కూడా డిజిటల్ విధానంలో కొనుగోలు చేసే వారి సంఖ్య ఒక్క శాతం కూడా ఉండటం లేదు. రిజర్వ్ బ్యాంక్‌లో భాగమైన రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్, డిజిటల్ చెల్లింపుల నెట్‌వర్క్ పేనియర్‌బై నిర్వహించిన సర్వేలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం మహిళల్లో .. ముఖ్యంగా 18–35 ఏళ్ల వారిలో బీమాపై అవగాహన గతేడాది 29 శాతం మేర పెరిగింది. కానీ పాలసీల వినియోగం 1 శాతానికి లోపే ఉంది. మహిళలు ఎక్కువగా జీవిత బీమా, ఆరోగ్య బీమా వైపు మొగ్గు చూపుతున్నారు. 5,000 రిటైల్ స్టోర్స్‌లో ఆర్థిక సేవలను వినియోగించుకున్న ఈ వయస్సు గ్రూప్ మహిళలపై నిర్వహించిన సర్వే ద్వారా అధ్యయన నివేదిక రూపొందింది. దీనికి సంబంధించిన మరిన్ని విశేషాలు..

- రిటైల్ స్టోర్స్‌లో మహిళలు ఎక్కువగా నగదు విత్‌డ్రాయల్, మొబైల్ రీచార్జీలు, బిల్లుల చెల్లింపుల సర్వీసులను వినియోగించుకుంటున్నారు. ఇతరత్రా పాన్ కార్డు దరఖాస్తులు, వినోదం, ప్రయాణాలు, ఈ–కామర్స్ మొదలైన వాటి సంబంధిత లావాదేవీలూ చేస్తున్నారు.
- తమ పిల్లలకు మంచి చదువు ఇవ్వడానికి అత్యధిక శాతం మహిళలు ప్రాధాన్యమిస్తున్నారు. ఇందుకు పొదుపే లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు 68% మంది తెలిపారు. ఇక అత్యవసర వైద్యం, ఎలక్ట్రానిక్ గృహోపకరణాల కొనుగోలు కోసం పొదుపు చేసుకోవడమూ యవారికి ప్రాధాన్యతాంశాలు.
- నగదు లావాదేవీలను తగ్గించడానికి ప్రభుత్వం, ఆర్‌బీఐ ఎన్ని చర్యలు తీసుకుంటున్నా కూడా చాలా మంది మహిళలు నగదు రూపంలో లావాదేవీలు జరపడానికే ప్రాధాన్యమిస్తున్నారు. సర్వేలో పాల్గొన్న వారిలో సుమారు 48 శాతం మంది నగదువైపే మొగ్గు చూపారు. నగదు విత్‌డ్రాయల్ సర్వీసుల కోసమే రిటైల్ స్టోర్‌ను సందర్శిస్తామంటూ 78 శాతం మంది తెలిపారు.
- అయితే, అదే సమయంలో డిజిటల్ చెల్లింపుల కోసం యూపీఐ వినియోగమూ పెరుగుతోంది. 5–20% మంది మహిళలు దీనిని ఎంచుకుంటున్నారు. క్రెడిట్ కార్డుల వినియోగం దాదాపు శూన్యమే.
- డిజిటల్ మాధ్యమం వినియోగం.. 18–40 ఏళ్ల గ్రూప్ మహిళల్లో ఎక్కువగా ఉంటోంది. వారిలో 60%మందికి పైగా మహిళలకు స్మార్ట్‌ఫోన్లు, వాటి ద్వారా డిజిటల్ కంటెంట్ అందుబాటులో ఉంటోంది.

లాభాల హోలీ

- రెండోరోజూ మార్కెట్ ర్యాలీ
- 60వేల స్థాయి పైకి సెన్సెక్స్
- 17,700 ఎగువకు నిఫ్టీ
- ఐటీ, ఫైనాన్స్, ఆటో షేర్లకు డిమాండ్
- నేడు మార్కెట్లకు హోలీ సెలవు



ముంబై: ఐటీ, ఫైనాన్స్, ఇంధన, ఆటో షేర్ల ర్యాలీకి తోడు ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడంతో స్టాక్ మార్కెట్ సోమవారమూ లాభపడింది. అదానీ గ్రూప్‌లోకి జీక్యూజీ పార్ట్‌నర్స్ ద్వారా పెట్టుబడులు రావడం, విదేశీ ఇన్వెస్టర్ల షార్ట్ కవరింగ్ కొనుగోళ్లు, అమెరికా బాండ్లపై ఈల్డ్ తగ్గడం తదితర అంశాలు కలిసొచ్చాయి. ఫలితంగా సెన్సెక్స్ 415 పాయింట్లు బలపడి 60 వేల స్థాయిపైనా 60,224 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 117 పాయింట్లు పెరిగి 17,711 వద్ద నిలిచింది. కాగా, డాలర్ మారకంలో రూపాయి విలువ ఐదు పైసలు బలపడి 81.92 వద్ద స్థిరపడ్డాయి.

ఇంట్రాడేలో 18వేల స్థాయికి నిఫ్టీ

గతవారం లాభాలకు కొనసాగింపుగా సూచీలు ఈ వారాన్ని గ్యాప్ అప్‌తో మొదలయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 689 పాయింట్లు దూసుకెళ్లి 60,498 వద్ద, నిఫ్టీ 406 పాయింట్లు ఎగసి 18,000 వద్ద ఇంట్రాడే గరిష్టాను అందుకున్నాయి.

నేడు మార్కెట్‌కు సెలవు

హోలీ సందర్భంగా మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు సెలవు. కమోడిటీ మార్కెట్ తొలి సెషన్‌లో మాత్రమే పనిచేయదు. సాయంత్రం సెషన్ (సాయంత్రం 5గంటల నుంచి 11:55 గంటకు వరకు)లో ట్రేడింగ్ జరుగుతుంది.

హీరో ప్రీమియం ఎలక్ట్రిక్ బైక్స్!

జీరో మోటార్‌సైకిల్స్‌తో జోడీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రీమియం ఎలక్ట్రిక్ బైక్స్ తయారీలోకి హీరో మోటోకార్ప్ ఎంట్రీ ఇవ్వనుంది. ఇందుకోసం యూఎస్‌కు చెందిన జీరో మోటార్‌సైకిల్స్‌తో చేతులు కలిపింది. పవర్‌ట్రెయిన్స్, ఎలక్ట్రిక్ మోటార్‌సైకిల్స్ తయారీలో జీరో మోటార్‌సైకిల్స్‌కు పేరుంది. ఈ కంపెనీలో సుమారు రూ.490 కోట్లు ఈక్విటీ రూపంలో పెట్టుబడి చేసేందుకు 2022 సెప్టెంబర్‌లో హీరో మోటోకార్ప్ బోర్డ్ ఆమోదం తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

7-3-2023	
విశాఖ	420–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	417–00
విజయవాడ	417–00
రిటైల్ ధర (డజను)	66.00
6-3-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	395–00
వరంగల్	397–00
రిటైల్ ధర	4.55

నగదు రహిత వ్యవస్థ బాటలో భారత్!

- 'హర్ పేమెంట్ డిజిటల్' మిషన్‌ను ఆవిష్కరించిన ఆర్‌బీఐ గవర్నర్
- యూపీఐ ఆధారిత పేమెంట్ వ్యవస్థపై పలు దేశాల ఆసక్తి
- ఆయా దేశాల చెల్లింపు ప్లాట్‌ఫారమ్‌లతో యూపీఐ లింక్‌కు ఏర్పాట్లు



హర్ పేమెంట్ డిజిటల్ లోగోను ఆవిష్కరిస్తున్న ఆర్‌బీఐ గవర్నర్ తదితర అధికారులు

ముంబై: నగదు రహిత వ్యవస్థ ఆవిష్కరణ దిశలో భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రధాన కార్యాలయంలో డిజిటల్ చెల్లింపుల అవగాహన వారోత్సవాన్ని (డీపీఏడబ్ల్యూ) 2023 గవర్నర్ శక్తికాంతదాస్ సోమవారం ప్రారంభించారు. 'హర్ పేమెంట్ డిజిటల్' (డిజిటల్‌లోనే ప్రతి చెల్లింపు) పేరుతో కీలక చొరవకు శక్తికాంతదాస్ శ్రీకారం చుట్టారు. బ్యాంకులు, సంబంధిత అన్ని వర్గాలూ ఆన్‌లైన్ చెల్లింపులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, వాటి ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాలని అభ్యర్థించారు. యూపీఐ (యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్) పేమెంట్ వ్యవస్థ పట్ల ప్రస్తుతం జరుగుతున్న జీ20 దేశాల సమావేశాల్లోసహా పలు దేశాలు ఎంతో ఆసక్తి ప్రదర్శిస్తున్నాయన్నారు. ఈ వ్యవస్థతో సహకారానికి ప్రత్యేకించి ఆయా దేశాల చెల్లింపు ప్లాట్‌ఫారమ్‌లతో యూపీఐను అనుసంధానం చేయడానికి ముందడుగులు వేస్తున్నట్లు వెల్లడించారు.

ప్రస్తుతం ఈ దేశాలతో..: యూపీఐ వ్యవస్థ ప్రస్తుతం సింగపూర్, యూఏఈ, ఒమన్, సౌదీ అరేబియా, మలేషియా, ఫ్రాన్స్, బెల్జియం, నెదర్లాండ్స్, లక్సెంబర్గ్, స్విట్జర్లాండ్‌లలో అందుబాటులో ఉంది. యూపీఐ స్వీకరించాలనుకునే 13 దేశాలతో భారత్ అవగాహన ఒప్పందాలపై సంతకం చేశాయని సమాచారం. 'యూపీఐ' – సింగపూర్ భాగస్వామి 'పేనౌ' మధ్య లింకేజీలు యాక్టివేట్ అయినప్పటి నుండి, చెల్లింపుల విషయంలో చాలా దేశాలు అటువంటి సహకారంలోకి ప్రవేశించడానికి ఆసక్తిని వ్యక్తం చేశాయని దాస్ తెలిపారు.

విస్తరణ వేగం..

యూపీఐ ద్వారా చెల్లింపులు గత 12 నెలల్లో విపరీతంగా పెరిగాయని గవర్నర్ శక్తికాంతదాస్ పేర్కొన్నారు. రోజువారీ లావాదేవీలు 36 కోట్లు దాటాయని అన్నారు. ఫిబ్రవరి 2022లో 24 కోట్లతో పోలిస్తే 50 శాతం పెరిగినట్లు పేర్కొన్నారు. విలువ పరంగా చూస్తే, యూపీఐ లావాదేవీల విలువ 2022 ఫిబ్రవరిలో రూ.5.36 లక్షల కోట్లయితే, 2023 ఫిబ్రవరిలో ఈ విలువ రూ. 6.27 లక్షల కోట్లకు పెరిగినట్లు తెలిపారు. ఫిబ్రవరి 2022లో రూ. 5.36 లక్షల కోట్ల నుండి 17 శాతం వృద్ధిని నమోదు చేశాయని చెప్పారు. గత మూడు నెలల్లో మొత్తం నెలవారీ డిజిటల్ చెల్లింపు లావాదేవీలు ప్రతి నెలా రూ. 1,000 కోట్ల మార్కును దాటాయని కూడా ఆయన చెప్పారు.

సోలిస్ ట్రాక్టర్స్ చేతికి జర్మనీ కంపెనీ థాలర్

న్యూఢిల్లీ: ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ గ్రూప్ అనుబంధ సంస్థ సోలిస్ ట్రాక్టర్స్ అగ్రికల్చరల్ మిషనరీ జర్మనీకు చెందిన థాలర్ జీఎంబీహెచ్ అండ్ కో.కేజీ ని కొనుగోలు చేసింది. ఈ వ్యూహాత్మక విలీనంతో సోలిస్ ట్రాక్టర్స్ యూరప్ మార్కెట్లోకి ప్రవేశించనుంది. అలాగే 19–75 హెచ్‌పీ శ్రేణికి చెందిన నాణ్యమైన జేసీబీలను తన పోర్ట్ ఫోలియోలోకి చేర్చుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. రూ.200 కోట్ల ముందస్తు పెట్టుబడులతో ఈ డీల్‌ను ప్రారంభిస్తున్నట్లు ఇంటర్నేషనల్ ట్రాక్టర్స్ లిమిటెడ్ ఎండీ దీపక్ మిట్టల్ తెలిపారు. జర్మనీలోని థాలర్ ఫ్యాక్టరీ కార్యాలయంలో జరిగిన టేకోవర్ కార్యక్రమంలో ఐటీఎల్ గ్రూప్ ఎండీ దీపక్ మిట్టల్, థాలర్ జీఎంబీహెచ్ అండ్ కో.కేజీ కంపెనీ అధినేత మ్యాన్‌ఫ్రెడ్ థాలర్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ పాలీసెట్-2023

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు ఏపీ పాలీసెట్-2023 నోటిఫికేషన్ విడుదలైంది. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లోని డిప్లొమా(ఇంజనీరింగ్, నాన్-ఇంజనీరింగ్/టెక్నాలజీ) సీట్లను పాలీసెట్ ర్యాంకు ఆధారంగా భర్తీచేస్తారు.

» **అర్హత:** పదో తరగతి లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులవ్వాలి. ఏప్రిల్ /మే–2023లో జరిగే పదో తరగతి లేదా తత్సమాన పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.04.2023.
» **ఏపీ పాలీసెట్ పరీక్ష తేది:** 10.05.2023.
» **వెబ్‌సైట్:** polycetap.nic.in

టీఎస్‌పీజీఈసెట్-2023

తెలంగాణ స్టేట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీజీఈసెట్)-2023 నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. పరీక్షను జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (జేఎన్‌టీయూహెచ్) నిర్వహించనుంది. ఈ నోటిఫికేషన్ ద్వారా 2023 విద్యా సంవత్సరానికి తెలంగాణ రాష్ట్రంలో విశ్వవిద్యాలయాలు, అఫిలియేటెడ్ ఇంజనీరింగ్, ఫార్మసీ, ఆర్కిటెక్చర్ కళాశాలల్లో ఫుల్‌టైం ఎంఈ/ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

» **పరీక్ష వివరాలు:** తెలంగాణ స్టేట్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీజీఈసెట్)-2023
» **కోర్సులు:** ఫుల్‌టైం ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ, ఎంఆర్క్.
» **అర్హత:** కోర్సును అనుసరించి బీఈ, బీటెక్, బీఫార్మసీ ఉత్తీర్ణులై ఉండాలి.

విభాగాలు

ఏరోస్పేస్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, మెటలర్జికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, జియో ఇంజనీరింగ్ అండ్ జియో ఇన్ఫర్మాటిక్స్, ఫుడ్ టెక్నాలజీ, ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్, ఎన్విరాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్, నానో టెక్నాలజీ, ఫార్మసీ.

ముఖ్యసమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తులకు చివరి తేది:** 30.04.2023
» **ఎడిట్ ఆప్షన్:** 2023, మే 2–4 తేదీ వరకు
» **హాల్‌టికెట్ల డౌన్‌లోడ్:** 2023, మే 21 నుంచి
» **పరీక్ష తేదీలు:** 2023 మే 29 నుంచి జూన్ 01 తేదీ వరకు
» **వెబ్‌సైట్:** https://pgecet.tsche.ac.in

టీఎస్ ఎంసెట్ 2023

తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ మెడికల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్–2023(ఎంసెట్) ప్రకటనను రాష్ట్ర ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. ఈ పరీక్షను జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ, హైదరాబాద్ (జేఎన్‌టీయూఎహెచ్) నిర్వహించనుంది. అర్హులైన అభ్యర్థులు మార్చి 03 నుంచి ఏప్రిల్ 10 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మే 7 నుంచి 11 వరకు పరీక్ష జరగనుంది.

పరీక్ష వివరాలు

తెలంగాణ స్టేట్ ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ మెడికల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ –2023(ఎంసెట్).

కోర్సుల వివరాలు

బీఈ, బీటెక్/బీటెక్(బయోటెక్నాలజీ)/ బీటెక్ (డెయిరీ టెక్నాలజీ)/బీటెక్ (అగ్రికల్చర్ ఇంజనీరింగ్)/ బీఫార్మసీ/ బీటెక్(ఫుడ్‌టెక్నాలజీ)/బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్/ బీఎస్సీ(ఆనర్స్) హార్టికల్చర్/ బీఎస్సీ(ఫారెస్ట్రీ)/ బీవీఎస్సీ అండ్ ఏహెచ్ /బీఎఫ్ఎస్సీ. వీటితోపాటు ఫార్మ్–డి, బీఎస్సీ నర్సింగ్‌కు కూడా ఎంసెట్ ద్వారానే అడ్మిషన్ కల్పిస్తారు.

అర్హత: ఇంటర్మీడియట్(ఎంపీసీ/బైపీసీ)లో ఎస్సీ, ఎస్టీలకు 40శాతం, ఇతరులకు 45 శాతం మార్కులు తప్పనిసరి. బీఎస్సీ నర్సింగ్‌లో చేరాలనుకున్న విద్యార్థులు ఎంసెట్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగం పరీక్ష రాయాల్సి ఉంటుంది.

పరీక్ష కేంద్రాలు

ఎంసెట్ నిర్వహణ తెలంగాణలో 16 పరీక్ష జోన్లు ఏర్పాటు చేశారు. ఏపీలో విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కర్నూలు నగరాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తారు.

ముఖ్యసమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **దరఖాస్తులకు చివరి తేదీ:** 10.04.2023
» **ఎడిట్ ఆప్షన్:** 2023 ఏప్రిల్ 12 –14 తేదీవరకు
» **రూ.250–5వేల ఫైన్‌తో దరఖాస్తుకు చివరి తేదీ:** 2023 ఏప్రిల్ 15 నుంచి మే 02 తేదీ వరకు
» **హాల్‌టికెట్ల డౌన్‌లోడ్:** 2023 ఏప్రిల్ 30 నుంచి
» **ఎంసెట్ ఇంజనీరింగ్ పరీక్ష:** 2023 మే 7,8,9 తేదీల్లో »**ఎంసెట్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్ష:** 2023 మే 10, 11 తేదీల్లో
» **వెబ్‌సైట్:** https://eamcet.tsche.ac.in



స్కిల్ డెవలప్‌మెంట్

సరికొత్తగా.. అప్రెంటీస్‌షిప్ స్కీమ్!

» ఇండస్ట్రీ 4.0 అంశాల్లోనూ అప్రెంటీస్ అవకాశాలు
» స్కిల్ ఇండియా ప్రోగ్రామ్ పరిధిలోకే ఎన్ఏపీఎస్
» అప్రెంటీస్ ట్రైనీల అకౌంట్లలోకే నేరుగా స్టయిఫండ్ బదిలీ
» వచ్చే మూడేళ్లలో 47 లక్షల మందికి శిక్షణ లక్ష్యం
» తాజా బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం వెల్లడి

అప్రెంటీస్‌షిప్..అకడమిక్‌గా నేర్చుకున్న అంశాలపై క్షేత్ర స్థాయిలో శిక్షణ పొందే మార్గం! ఇది స్కిల్ గ్యాప్ సమస్యకు పరిష్కారంతోపాటు భవిష్యత్తులో ఉద్యోగ వేటలో ముందంజలో నిలిచేందుకు దోహదపడుతుంది. ముఖ్యంగా ఐటీఐ, డిప్లొమా, ఇతర టెక్నికల్ కోర్సుల విద్యార్థులకు అప్రెంటీస్‌షిప్ శిక్షణ చాలా అవసరం! అందుకే అప్రెంటీస్‌షిప్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం.. గతంలో నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్(ఎన్ఏపీఎస్)ను తెచ్చింది. మారుతున్న టెక్నాలజీ, పరిశ్రమల అవసరాలను పరిగణనలోకి తీసుకుంటూ.. తాజాగా ఈ ఎన్ఏపీఎస్‌లో కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. కేంద్ర బడ్జెట్ 2023-24లో ఈ అంశాన్ని ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో.. అప్రెంటీస్‌షిప్ స్కీమ్‌లో తలపెట్టిన మార్పులు, అప్రెంటీస్ ట్రైనీలకు కలిగే ప్రయోజనాలపై ప్రత్యేక కథనం..

అప్రెంటీస్‌షిప్ ట్రైనింగ్‌లో.. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నిరంతరం మార్పులు జరుగుతుండాలి. అప్పుడే విద్యార్థులు క్షేత్ర నైపుణ్యాల సాధనలో.. ఎంప్లాయబిలిటీ స్కిల్స్‌ను మెరుగుపరచుకోవడంలో ముందంజలో నిలుస్తారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన మార్పులు అప్రెంటీస్ ట్రైనీలకు ఎంతో ఉపకరిస్తాయి అంటున్నారు నిపుణులు.

స్కిల్ ఇండియా పరిధిలోకి

నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్(ఎన్ఏపీఎస్)ను స్కిల్ ఇండియా ప్రోగ్రామ్ పరిధిలోకి తీసుకురావాలని తాజాగా నిర్ణయించారు. ఇప్పటి వరకు ప్రత్యేక విభాగంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న స్కీమ్‌ను.. ఇక నుంచి స్కిల్ ఇండియా ప్రోగ్రామ్‌లలో ఒకటిగా పరిగణిస్తారు. ప్రస్తుతం స్కిల్ ఇండియా పరిధిలో.. ప్రధానమంత్రి కౌశల్ వికాశ్ యోజన, జన్ శిక్షణ్ సంస్థాన్‌లు ఉన్నాయి. తాజా నిర్ణయంతో ఎన్ఏపీఎస్ కూడా స్కిల్ ఇండియా ప్రోగ్రామ్ జాబితాలో చేరనుంది. అంతేకాకుండా.. దాదాపు ఏడేళ్ల నుంచి అమలవుతున్న ఎన్ఏపీఎస్‌ను ఇకపై ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్‌గా పిలవనున్నారు.

ఇండస్ట్రీ 4.0 స్కిల్స్ కూడా

ఎన్ఏపీఎస్ ద్వారా ఇండస్ట్రీ 4.0 స్కిల్స్‌లోనూ అప్రెంటీస్ శిక్షణ లభించేలా చూడాలని కూడా నిర్ణయించారు. ఇండస్ట్రీ 4.0 స్కిల్స్‌గా పేర్కొనే ఐఓటీ, ఆటోమేషన్, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీలకు ఇటీవల కాలంలో ప్రాధాన్యత పెరుగుతోంది. దీంతో ఈ టెక్ స్కిల్స్‌లోనూ అప్రెంటీస్ ట్రైనింగ్ అవకాశాలు కల్పించనున్నారు. ఫలితంగా ఇంతకాలం కోర్ అంశాల్లోనే శిక్షణ పొందుతున్న విద్యార్థులకు.. ఇకపై లేటెస్ట్ టెక్నాలజీస్‌పైనా శిక్షణ, నైపుణ్యం లభించనున్నాయి.

బ్యాంక్ అకౌంట్లోకి స్టయిఫండ్

ఎన్ఏపీఎస్ స్కీమ్ ప్రకారం–ఒక అప్రెంటీస్ ట్రైనీకి ప్రతి నెల ఇచ్చే స్టయిఫండ్‌లో 75 శాతాన్ని సదరు శిక్షణ కల్పిస్తున్న సంస్థ, మరో 25 శాతం లేదా రూ.1500ను ప్రభుత్వం చెల్లిస్తోంది. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ఈ స్టయిఫండ్ చెల్లింపును డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) విధానంలో అందిస్తారు. అంటే.. అప్రెంటీస్ ట్రైనీల బ్యాంక్ అకౌంట్లలోకే నేరుగా స్టయిఫండ్ జమ చేస్తారు. ముందుగా సదరు ట్రైనింగ్ అవకాశం కల్పించిన సంస్థ తాను ఇవ్వాల్సిన 75 శాతం మొత్తాన్ని అప్రెంటీస్ ట్రైనీ ఖాతాలో జమ చేసినట్లు ఆధారాలు చూపిన తర్వాతే కేంద్ర ప్రభుత్వ వాటా జమ కానుంది. ఇప్పటికే అప్రెంటీస్ ట్రైనీలుగా పని చేస్తూ స్టయిఫండ్ పొందుతున్న వారు, స్టయిఫండ్ అందిస్తున్న సంస్థలు.. డీబీటీ విధానంలోకి మారడానికి ఈ–కేవైసీ, ఆధార్ ధ్రువీకరణలతో అప్‌డేట్ చేయాల్సి ఉంటుంది.

పైలట్ ప్రాజెక్ట్‌గా

అప్రెంటీస్ ట్రైనీలకు డీబీటీ విధానంలో స్టయిఫండ్ చెల్లింపుపై ఇప్పటికే పైలట్ ప్రాజెక్ట్‌ను అమలు చేశారు. గతేడాది జూలైలో ఈ పైలట్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించి..1,544 సంస్థల పరిధిలో పని చేస్తున్న 1,55,000 మంది అప్రెంటీస్ ట్రైనీలకు రూ.22.29 కోట్ల మొత్తాన్ని డీబీటీ విధానంలో చెల్లించారు. డీబీటీ విధానం వల్ల స్టయిఫండ్ చెల్లింపుల్లో పారదర్శకత వస్తుందని భావిస్తున్నారు. అంతేకాకుండా ట్రైనీలకు సంస్థలు ఇచ్చే స్టయిఫండ్ విషయంలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా నియంత్రించొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మూడేళ్లలో 47 లక్షల ట్రైనీలు

ఎన్ఏపీఎస్‌లో భాగంగా రానున్న మూడేళ్లలో 47 లక్షల మందికి అప్రెంటీస్ ట్రైనీ అవకాశాలకు కల్పించడం లక్ష్యంగా చేసుకున్నట్లు కేంద్ర బడ్జెట్ సందర్భంగా పేర్కొన్నారు. పదో తరగతి నుంచి ప్రొఫెషనల్ డిగ్రీ వరకు.. ట్రెడిషనల్, టెక్నికల్ కోర్సుల అభ్యర్థులందరికీ వారి అర్హతలకు సరితూగే సంస్థలు లేదా విభాగాల్లో అప్రెంటీస్ శిక్షణ లభించేలా చర్యలు తీసుకుంటారు. ఇప్పటికే ఈ స్కీమ్ ద్వారా 2016–17 ఆర్థిక సంవత్సరం నుంచి 2022–23 ఆర్థిక సంవత్సరం.. డిసెంబర్ 2022 నాటికి 35,229 సంస్థలు నమోదు చేసుకోగా.. 21,71,431 మంది అభ్యర్థులు అప్రెంటీస్ ట్రైనీలుగా నమోదు చేసుకున్నారు. ఈ గణాంకాలను పరిగణనలోకి తీసుకుంటే.. అప్రెంటీస్ ట్రైనింగ్‌కు ఆదరణ పెరుగుతుందని చెప్పొచ్చు.

ఎన్ఏపీఎస్.. లక్ష్యం

- కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో 2016లో.. ఎంఎస్ఎంఈ సెక్టార్‌లో అప్రెంటీస్ అవకాశాలను పెంచే ఉద్దేశంతో సంస్థలను భాగస్వాములను చేస్తూ ఎన్ఏపీఎస్‌ను ప్రారంభించారు.
- అప్రెంటీస్ ట్రైనీలను.. ట్రేడ్ అప్రెంటీసెస్, గ్రాడ్యుయేట్ అప్రెంటీసెస్, టెక్నీషియన్ అప్రెంటీసెస్, టెక్నీషియన్(ఒకేషనల్) అప్రెంటీస్, ఇతర ఆప్షనల్ ట్రేడ్ అప్రెంటీసెస్‌గా వర్గీకరించారు.
- ఎన్ఏపీఎస్ పరిధిలోని సంస్థలు, అదే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని ప్రభుత్వ రంగ సంస్థలు అప్రెంటీస్ ట్రైనీ అవకాశాలను కల్పించాలి. సంస్థ మొత్తం సిబ్బందిలో 2.5 శాతం నుంచి 10 శాతానికి సమానమైన సంఖ్యలో అభ్యర్థులను అప్రెంటీస్ ట్రైనీలుగా నియమించాలి.
- నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్‌లో సంస్థలు పాల్పంచుకునేలా పలు ఆర్థిక ప్రోత్సాహకాలను ప్రకటించారు.

పరీక్షలు.. సర్టిఫికెట్లు

ఎన్ఏపీఎస్ ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్ పేరుతో పరీక్ష నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే సర్టిఫికెట్ కూడా అందిస్తారు. ఈ పరీక్షకు హాజరు కావాలంటే.. సదరు అభ్యర్థులు అప్రెంటీస్ ట్రైనింగ్ సమయంలో కనీసం 80 శాతం హాజరు కలిగుండాలి. అదే విధంగా.. ఫార్మేటివ్ అసెస్‌మెంట్‌లో ట్రేడ్ ప్రాక్టికల్స్‌లో 60 శాతం, ట్రేడ్ థియరీలో 40 శాతం మార్కులు పొందాలి.

ప్రత్యేక వెబ్‌సైట్

ఎన్ఏపీఎస్‌లో భాగంగా సంస్థలు, అప్రెంటీస్ ట్రైనీ అభ్యర్థులు తమ వివరాలను నమోదు చేసుకోవడానికి వీలుగా ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించారు. సంస్థలు తమకు అవసరమైన అర్హతలతో కూడిన ట్రైనీ నియామక వివరాలను పొందుపర్చాల్సి ఉంటుంది. అదే విధంగా అభ్యర్థులు తమ అర్హతలు, తమకు ఆసక్తి ఉన్న విభాగాల వివరాలతో ప్రొఫైల్ క్రియేట్ చేసుకోవాలి. ఇలా అభ్యర్థుల వివరాలను పరిశీలించి సంస్థలు నియామకాలు చేపట్టే అవకాశం ఉంటుంది. శిక్షణ సమయంలో అభ్యర్థుల, సంస్థల పనితీరును పరిశీలించేందుకు రీజనల్ డైరెక్టరేట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్‌కు సంబంధించిన అధికారులు ప్రత్యక్ష తనిఖీలు చేస్తారు.

ఎన్ఏటీఎస్‌లోనూ మార్పులు!

- గ్రాడ్యుయేట్, డిప్లొమా విద్యార్థులకు ఉద్దేశించిన నేషనల్ అప్రెంటీస్ ట్రైనింగ్ స్కీమ్‌లోనూ మార్పులు చేసే అవకాశం ఉందనే వార్తలు వినిపిస్తున్నాయి.
- ప్రస్తుతం ఎన్ఏటీఎస్ ప్రకారం–ఆర్ట్స్, హ్యూమానిటీస్, కామర్స్, ఇంజనీరింగ్, డిప్లొమా విద్యార్థులను ఎన్ఏటీఎస్ పరిధిలోకి తీసుకొచ్చారు.
- డిప్లొమా ఉత్తీర్ణులకు నెలకు రూ.8 వేలు, ఇతర కోర్సుల వారికి నెలకు రూ.9వేల స్టయిఫండ్‌ను అందిస్తున్నారు.
- శాశ్వత ఉద్యోగులు 30 మంది ఉన్న సంస్థలు ఎన్ఏటీఎస్ విధానంలో అప్రెంటీస్ ట్రైనీలను నియమించుకోవచ్చు.
- ప్రతి సంస్థ కనిష్టంగా నలుగురిని అప్రెంటీస్ ట్రైనీలుగా నియమించుకోవచ్చు.
- అప్రెంటీస్ ట్రైనీలకు నిర్దేశించిన స్టయిఫండ్ మొత్తంలో 50 శాతాన్ని సంస్థలు చెల్లిస్తే సరిపోతుంది. మిగతా 50 శాతాన్ని కేంద్ర ప్రభుత్వమే చెల్లిస్తుంది.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 2,77, 140 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా.. 1,77, 606 మందికి అప్రెంటీస్ ట్రైనీలుగా నియామకాలు ఖరారు.

ఎన్ఏపీఎస్ స్కీమ్.. మార్పులు

- స్టయిఫండ్ చెల్లింపులో డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానం అమలు.
- ఇండస్ట్రీ 4.0 టెక్నాలజీస్‌లోనూ అప్రెంటీస్ ట్రైనింగ్ అవకాశం.
- రానున్న మూడేళ్లలో 47 లక్షల మందికి శిక్షణ లక్ష్యం.
- స్కిల్ ఇండియా స్కీమ్స్‌లో భాగంగా అమలు కానున్న ఎన్ఏపీఎస్.
- ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్‌షిప్ ప్రమోషన్ స్కీమ్‌గా పేరు మార్పు.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.apprenticeshipindia.gov.in

క్లుప్తంగా...

ప్రకృతి కాలచక్రానికి హోలీతో స్వాగతం: సీఎం



సాక్షి, హైదరాబాద్: వసంత రుతువుకు నాందీ ప్రస్తావనగా, పచ్చని చిగురులతో కొత్తదనం సంతరించుకుని, వినూత్నంగా పున:ప్రారంభమయ్యే ప్రకృతి కాలచక్రానికి హోలీ పండుగ స్వాగతం పలుకుతుందని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. చిగురించే ఆశలతో తమ జీవితాల్లోకి నూతనత్వాన్ని హోలీ రూపంలో స్వాగతం పలికే భారతీయ సంప్రదాయం రమణీయమైనదన్నారు. రాష్ట్ర, దేశ ప్రజలందరికీ ఆయన హోలీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగ నేపథ్యంలో పల్లెలన్నీ వెన్నెల నవరాత్రుల్లో సాగే చిన్నారుల జాజిరి ఆటపాటలతో, కోలాటాల చప్పుళ్లతో ఉత్తేజం వెల్లివిరుస్తుందని సీఎం తెలిపారు. పిల్లా పెద్దా తేడాలేకుండా సింగిడి రంగుల నడుమ కేరింతలతో సాగే హోలీ, మానవ జీవితమే ఒక వేడుక అనే భావనను, ప్రకృతితో మమేకమై జీవించాలనే తత్వాన్ని మనకం దిస్తుందని వివరించారు.

నేడు హైకోర్టుకు సెలవు

సాక్షి, హైదరాబాద్: హోలీ పండుగ సందర్భంగా మంగళవారం హైకోర్టుకు సెలవు ప్రకటించినట్టు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైకోర్టుతో పాటు తెలంగాణ జ్యుడీషియల్ అకాడమీ, న్యాయసేవాధికార సంస్థలు, లీగల్ సర్వీసెస్ కమిటీకి కూడా సెలవు ఇచ్చినట్లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం 8వ తేదీన కూడా సెలవు కావడంతో.. హైకోర్టు కార్యకలాపాలు 9వ తేదీన తిరిగి ప్రారంభం కానున్నాయి. సెప్టెంబర్ 2న (శనివారం) హైకోర్టు పని చేస్తుందని రిజిస్ట్రార్ వెల్లడించారు.

మహిళా భద్రతలో తెలంగాణ దేశానికే ఆదర్శం

డీజీపీ అంజనీకుమార్



సాక్షి, హైదరాబాద్: మహిళల భద్రతకు తెలంగాణ పోలీస్‌శాఖ చేపట్టిన వినూత్న కార్యక్రమాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని డీజీపీ అంజనీకుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ పోలీస్ అకాడమీలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ, మహిళల భద్రత కోసం అమలవుతున్న కార్యక్రమాలతో రాష్ట్రంలోని మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు. రాష్ట్ర మహిళా భద్రతా విభాగం అడిషనల్ డీజీ శిఖా గోయల్ మాట్లాడుతూ మరే రాష్ట్రంలో లేనివిధంగా పోలీసు నియామకాల్లో 33 శాతం పోస్టులు మహిళలకు కేటాయించిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని గుర్తుచేశారు. అడిషనల్ డీజీలు అభిలాష బిష్త్, స్వాతి లక్రా, డీఐజీ సుమతి పాల్గొన్నారు.

పిల్లలను పెంచినట్లే మొక్కలను పెంచాలి

మహిళా భద్రత విభాగం డీఐజీ సుమతి



సాక్షి, హైదరాబాద్: మహిళలు తమ పిల్లలని ఏవిధంగా అయితే పెంచి పెద్దచేస్తారో అంతే జాగ్రత్తగా మొక్కల్ని సంరక్షించాలని రాష్ట్ర మహిళా భద్రత విభాగం డీఐజీ సుమతి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎంపీ సంతోష్‌కుమార్ పిలుపు మేరకు గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటాలని కోరుతూ సోమవారం వీడియో సందేశం విడుదల చేశారు. ఆ వీడియోలో డీఐజీ సుమతి మాట్లాడుతూ, మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలంతా గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో పాల్గొని మొక్కలు నాటాలని కోరారు.

8న ఉద్యోగినులకు ప్రత్యేక సెలవు

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8న రాష్ట్ర ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సాధారణ సెలవును మంజూరు చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 7న హోలీ సెలవు కాగా.. 8న ప్రత్యేక సెలవు ఇవ్వడంతో మహిళా ఉద్యోగులకు వరుసగా రెండ్రోజులు సెలవులు లభించనున్నాయి.

సీఆర్‌పీఎఫ్ డీఐజీగా ఉదయభాస్కర్



సాక్షి, హైదరాబాద్: సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్ చాంద్రాయణగుట్ట డీఐజీగా 2008 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి ఉదయ భాస్కర్ బిల్లా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఉదయ భాస్కర్ జమ్మూ కేడర్ ఐపీఎస్ అధికారి. జమ్మూ సిటీ ట్రాఫిక్ ఎస్పీగా, లేహ్ జిల్లా ఎస్పీగా, వైజాగ్ డీసీపీగా సైతం విధులు నిర్వర్తించారు. ప్రస్తుతం బారాముల్లాలో డీఐజీగా పనిచేస్తున్న ఉదయ భాస్కర్ సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్ డీఐజీగా బదిలీపై నియమితులయ్యారు.

గోగుపూల హోలీ!

సహజ సిద్ధంగా రంగుల తయారీ.. నిర్మల్ గ్రామీణాభివృద్ధిశాఖ శ్రీకారం



పూల కాడలను వేరు చేస్తున్న సిబ్బంది





సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ప్రతీ పండుగ ప్రకృతితో మమేకమే. కాలక్రమేణా ప్రకృతిని వీడి ఆధునికత వైపు పరుగులు తీస్తూ.. పండుగల్లోని సహజ వేడుకలకు కృత్రిమ రంగులను అద్దుతున్నాం. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నేటికీ కొన్ని సంప్రదాయ అలవాట్లు అలాగే సజీవంగా కొనసాగుతున్నాయి. అలాంటి వాటిలో హోలీ పండుగ కూడా ఒకటి. ఈ పండుగకు కొంతమంది నేటికీ రంగుల కోసం మోదుగు పూలనే వాడుతున్నారు. ఈ పూలు హోలీ పండుగకు ముందే అడవుల్లో చెట్ల నిండా పూలతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఈ పూలు తెచ్చుకునే రంగులు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో గోగుపూల రంగులు ఎక్కువ మందికి చేరేలా నిర్మల్ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి విజయలక్ష్మి ఓ యత్నం చేశారు.

మోదుగు పూలను సేకరించి..

పదిహేను రోజుల క్రితం ఉపాధి కూలీలతో స్థానిక అడవిలో మోదుగు పూలను సేకరించారు. వాటి పూల కాడలను తీసి శుభ్రపరిచారు. తేమ పోయేలా ఎండలో ఆరబెట్టారు. ఆ తర్వాత గిర్నీలో మర పట్టించి, పొడిలా మార్చారు. ఆ పొడిలో కొద్దిగా పచ్చకర్పూరం కలిపి, ప్యాకెట్లలో నింపారు. ఇప్పటికి పదిహేను కిలోల మోతాదులో సేకరించారు. ఆ పొడిని కొద్దిగా నీటిలో వేసుకుని మరిగిస్తే ఆరెంజ్ కలర్ రంగు వస్తుంది. ఈ రంగును నీటిలో కావాల్సినంత మేర కలుపుకొని హోలీ వేడుకల్లో చల్లుకునేందుకు వాడుకోవచ్చు. జిల్లాలోని ప్రభుత్వశాఖల అధికారులకు ఉచితంగా అందజేశారు. రసాయనాలు లేని ఈ సహజ రంగులతో ఎలాంటి చర్మ, అనారోగ్య సమస్యలు తలెత్తవు. చిన్నా, పెద్దా అందరూ ఈ సహజ రంగులను వాడుకోవచ్చని చెబుతున్నారు.

వచ్చే ఏడాది మార్కెట్‌లోకి..

గతంలో చాలామంది ఈ మోదుగు పూలను హోలీ రంగుల్లో వాడేవారు. ప్రస్తుతం తగ్గిపోయింది. మళ్లీ అందరికీ సహజ సిద్ధ రంగును వాడేలా చేసేందుకు ఈ పొడిని తయారు చేశాం. వచ్చే ఏడాదికి మార్కెట్‌లో అందుబాటులో ఉండేలా చేస్తాం. దీని ద్వారా మహిళా సంఘాలకు ఆదాయం కల్పించవచ్చు.
– విజయలక్ష్మి, జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారిణి.

ఆర్టీసీలో 550

ఎలక్ట్రిక్ బస్సులకు లైన్‌క్లియర్

- ఒలెక్ట్రాకు వర్క్ ఆర్డర్.. 500 నాన్ ఏసీ బస్సులు సిటీలో సేవలు
- 50 ఏసీ బస్సులు విజయవాడ మార్గంలో..
- రెండు నెలల్లో తొలివిడత బస్సుల సరఫరా



సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ త్వరలో కొత్తగా 550 ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చుకోబోతోంది. రెండు నెలల్లో కొన్ని బస్సులు, ఆ తర్వాత మూడు నెలల్లో మిగతా బస్సులు.. వెరసి వచ్చే ఐదునెలల్లో ఈ మొత్తం బస్సులు రోడ్డెక్కనున్నాయి. వీటిల్లో 500 బస్సులు నాన్ ఏసీగా ఉంటాయి. వీటిని సిటీబస్సులుగా హైదరాబాద్ నగరంలో తిప్పుతారు. మిగిలిన 50 ఏసీ బస్సులను హైదరాబాద్–విజయవాడ మధ్య తిప్పనున్నారు. ఆర్టీసీ పిలిచిన టెండర్లలో తక్కువ మొత్తం కోట్ చేసిన ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్‌కు వీటికి సంబంధించిన ఆర్డర్ దక్కింది. ప్రస్తుతం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి విమానాశ్రయానికి తిరుగుతున్న 40 ఏసీ ఎలక్ట్రిక్ బస్సులను 2019లో ఈ సంస్థ ఆర్టీసీకి సరఫరా చేసింది.

జీసీసీ మోడల్‌తో..: ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఎలక్ట్రిక్ బస్సులను సొంతంగా కొనే పరిస్థితి లేదు. దీంతో గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు(జీసీసీ) పద్ధతిలో అద్దె ప్రాతిపదికన ఈ బస్సులను తీసుకుంటోంది. ఒలెక్ట్రా సంస్థకు ప్రతి కిలోమీటరుకు రూ.57.90 చొప్పున అద్దెను ఆర్టీసీ చెల్లిస్తుంది. 500 బస్సులు సిటీ బస్సులుగానే తిరగనున్నందున వాటి నిర్వహణ బాధ్యతను సిటీలోని దిల్‌సుఖ్‌నగర్, హయత్‌నగర్, జీడిమెట్ల, మియాపూర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లకు కేటాయించారు. ఈ ఐదు డిపోల్లో చార్జింగ్ పాయింట్లను త్వరలో ఏర్పాటు చేయనున్నారు. వాటి ఏర్పాటు వ్యయాన్ని ఒలెక్ట్రా సంస్థనే భరిస్తుందని ఆర్టీసీ పేర్కొంటోంది. ఈ బస్సుల్లో డ్రైవర్లను కూడా ఆ సంస్థనే ఏర్పాటు చేసుకుంటుంది. కండక్టర్లు మాత్రం ఆర్టీసీ వైపు నుంచి ఉంటారు.

విజయవాడకు ఏసీ బస్సులు..: నగరంలో తిరిగే నాన్ ఏసీ బస్సులు ఒకసారి చార్జ్ చేస్తే 225 కి.మీ. మించి తిరుగుతాయి. అదే ఏసీ బస్సులు ఫుల్‌చార్జ్ చేస్తే 325 కి.మీ. వరకు తిరుగుతాయి. దీంతో ఏసీ బస్సులను హైదరాబాద్–విజయవాడ మధ్య తిప్పాలని నిర్ణయించారు. వీటికి గరుడ కేటగిరీ స్థాయిలో టికెట్ ధరలను నిర్ధారించాలని భావిస్తున్నారు. 12 మీటర్ల పొడవు ఉండే ఈ ఏసీ ఎలక్ట్రిక్ బస్సుల్లో 40 సీట్లు మాత్రమే ఉంటాయి. ప్రస్తుతం కిలోమీటరుకు నిర్ధారించిన రూ.57.90 ప్రకారం బ్రేక్ ఈవెన్‌కు రావాలంటే ఆక్యుపెన్సీ రేషియో 60 శాతంగా ఉండాలని నిర్ధారించారు. టికెట్ చార్జీని గరుడ ప్లస్ కంటే తక్కువగా, గరుడ కేటగిరీలో ఉంటేనే మంచిదని అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో 3,400 ఎలక్ట్రిక్ బస్సులు సమకూర్చుకోనున్నట్టు ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. జీసీసీ పద్ధతిలో తీసుకునే ఈ 550 ఎలక్ట్రిక్ బస్సులు దశలవారీగా 2025 మార్చి నాటికి సిటీ అంతటా తిరుగుతాయని ఎండీ సజ్జనార్ పేర్కొన్నారు.

త్వరలో మహిళా వర్సిటీ నిర్మాణ పనులు

తొలి వీసీగా బాధ్యతలు స్వీకరించిన విజ్జులత వెల్లడి



బాధ్యతలు స్వీకరిస్తున్న విజ్జులత

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోనే తొలి మహిళా విశ్వవిద్యాలయం ఉప కులపతిగా ప్రొఫెసర్ విజ్జులత సోమవారం కోఠి మహిళా వర్సిటీ ప్రాంగణంలో బాధ్యతలను స్వీకరించారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్. లింబాద్రి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ వెంకటరమణ, ఉస్మానియా వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ డీ రవీందర్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. బాధ్యతలు చేపట్టిన విజ్జులత మీడియాతో మాట్లాడుతూ, మహిళా విశ్వవిద్యాలయం కొత్త భవన నిర్మాణ పనులను మరో పది రోజుల్లో చేపడతామని తెలిపారు. జీ ప్లస్ 9 అంతస్తుల్లో తరగతి గదులు, మరో జీ ప్లస్ 9 అంతస్తుల్లో హాస్టల్ భవన కాంప్లెక్స్‌ను నిర్మించనున్నట్టు వెల్లడించారు. ఇందు కోసం రూ.వంద కోట్ల వరకూ వెచ్చించనున్నామని అన్నారు. రాష్ట్రంలోని మహిళా డిగ్రీ, పీజీ కాలేజీలు త్వరలోనే మహిళా యూనివర్సిటీ పరిధిలోకి తెస్తామని విజ్జులత తెలిపారు. రెగ్యులర్ వర్సిటీల్లో ఉన్నట్లుగానే అనుబంధ ప్రైవేట్ కాలేజీలకు ఇంజనీరింగ్, వృత్తి విద్యా కాలేజీలకు సైతం అనుమతులిస్తామన్నారు.

మహిళలకు రూ.750 కోట్ల వడ్డీ లేని రుణాలు

మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ కానుక

- తొలి విడతగా పురపాలికల్లోని మహిళా గ్రూపులకు రూ.250 కోట్లు
- త్వరలో గ్రామీణ మహిళా సంఘాలకు రూ.500 కోట్లు

సాక్షి, హైదరాబాద్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రంలోని మహిళలకు ప్రభుత్వం తీపికబురు చెప్పింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా స్వయంసహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాల నిమిత్తం రూ. 750 కోట్లు ఇవ్వాలని నిర్ణయించింది. తొలివిడతగా సోమవారం రూ.250 కోట్లను పట్టణాల్లోని మహిళాసంఘాలకు విడుదల చేసింది. ఈ మేరకు ప్రభుత్వం తరఫున పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలోని 23 జిల్లాల పరిధిలో ఉన్న మున్సిపాలిటీల్లోని స్వయం సహాయక సంఘాలకు ఈ నిధులు అందుతాయని కేటీఆర్ తెలిపారు. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న వడ్డీ లేని రుణాల బకాయిలను మహిళా దినోత్సవం సందర్భంగా సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు విడుదల చేయడంపట్ల మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. మహిళా సంఘాల్లోని సభ్యులు ఆర్థిక క్రమశిక్షణతో బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని తిరిగి చెల్లిస్తున్నారని, రుణాల చెల్లింపులో దేశంలోనే అగ్రస్థానంలో మన మహిళలు ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని పురపాలికల్లో లక్షా 77 వేలకుపైగా స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని, ఇందులో దాదాపు 18 లక్షల మంది సభ్యులుగా కొనసాగుతున్నారని కేటీఆర్ తెలిపారు. ఇప్పటిదాకా ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు సుమారు 15,895 కోట్ల రూపాయలను రుణాల లింకేజీ రూపంలో అందించిందని పేర్కొన్నారు. ఇంత భారీ రుణాలపైన వడ్డీ భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం రూపొందించిన వడ్డీలేని రుణాల కార్యక్రమంలో భాగంగా రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 370 కోట్ల రూపాయలను, దాదాపు 90,325 స్వయం సహాయక సంఘాలకు అందించినట్లు తెలిపారు. మహిళా సంఘాల తరఫున ప్రభుత్వానికి మంత్రి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు.

సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు

ఆడబిడ్డల కోసం రూ.750 కోట్లు విడుదల చేసిన సీఎం కేసీఆర్‌కు మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వాలు స్వయం సహాయక సంఘాలకు పదేళ్లలో రూ.21,978 కోట్ల రుణాలిస్తే, తెలంగాణ ఏర్పడ్డాక 8 ఏళ్లలో వివిధ బ్యాంకుల ద్వారా రూ.66,624 కోట్లు అందజేశామని ఎర్రబెల్లి వెల్లడించారు.

ముందు మా ప్రాజెక్టులకు అనుమతివ్వండి..!



సమావేశంలో రజత్‌కుమార్, శ్రీరామ్

ఆ తర్వాతే గోదావరి–కావేరి అనుసంధానం టాస్క్‌ఫోర్స్ సమావేశంలో తెలంగాణ విజ్ఞప్తి

- 968 టీఎంసీల తెలంగాణ వాటాకు నష్టం కలిగించరాదు
- ఇచ్చంపల్లి నుంచి జలాల తరలింపునకు అంగీకరించం
- సమ్మక్క బ్యారేజీ నుంచి తరలిస్తే తెలంగాణకు ప్రాధాన్యత ఇవ్వాలన్న రాష్ట్రం
- ఇచ్చంపల్లి నుంచే తరలిస్తామన్న టాస్క్‌ఫోర్స్ చైర్మన్ వెదిరే శ్రీరామ్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో నిర్మిస్తున్న పెండింగ్ ప్రాజెక్టులకు ముందుగా అనుమతులు జారీ చేయాలని, ఆ తర్వాత మిగులు జలాల ఆధారంగా గోదావరి–కావేరి నదుల అనుసంధాన ప్రాజెక్టును చేపట్టాలని కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్రం కోరింది. ఇచ్చంపల్లి వద్ద బ్యారేజీ నిర్మించి అక్కడినుంచి గోదావరి జలాలు తరలిస్తామంటూ నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (ఎన్‌డబ్ల్యూడీఏ) చేసిన ప్రతిపాదనలను అంగీకరించబోమని స్పష్టం చేసింది. ఇచ్చంపల్లికి కేవలం 24 కి.మీల దిగువన సమ్మక్క బ్యారేజీ ఉండడంతో వరద నిర్వహణ సాధ్యం కాదని పేర్కొంది. ఈ ప్రాజెక్టు వల్ల గోదావరి జలాల్లో 968 టీఎంసీల తెలంగాణ వాటాకు నష్టం కలగకుండా రక్షణ కల్పించాలని కోరింది. నదుల అనుసంధానంపై కేంద్రం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ సోమవారం హైదరాబాద్‌లోని జలసౌధలో సమావేశమైంది. గోదావరి–కావేరి, కెన్–బెట్వా, పర్బతి–కాలిసింధ్–చంబల్ తదితర నదుల అనుసంధానంపై చర్చించింది. టాస్క్‌ఫోర్స్ చైర్మన్ వెదిరే శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ తరఫున నీటిపారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ మాట్లాడారు.

తెలంగాణ ప్రాజెక్టులకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలి

'ఒక వేళ సమ్మక్క బ్యారేజీ నుంచి గోదావరి జలాలను తరలిస్తే బ్యారేజీలో కనీసం 83 మీటర్ల నీటిమట్టాన్ని నిర్వహించడంతో పాటు దేవాదుల, సమ్మక్క బ్యారేజీ, సీతారామ తదితర తెలంగాణ ప్రాజెక్టుల అవసరాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. గోదావరి–కావేరి అనుసంధానంలో భాగంగా గోదావరి జలాల్లో ఛత్తీస్‌గఢ్ వాడుకోని 141 టీఎంసీల కోటాను తరలించాలని ప్రతిపాదించినందున.. ఆ రాష్ట్రం నుంచి రాతపూర్వక సమ్మతి తీసుకోవాలి. ఛత్తీస్‌గఢ్ సమ్మతి తెలపని పక్షంలో మహానది–గోదావరి అనుసంధానం పూర్తైన తర్వాతే గోదావరి–కావేరి అనుసంధానం చేపట్టాలి. ఒక వేళ పోలవరం నుంచి గోదావరి జలాలను తరలిస్తే ఏపీలోని కృష్ణా బేసిన్ వెలుపలి ప్రాజెక్టులకు కృష్ణా జలాల కేటాయింపులను రద్దు చేసి తెలంగాణలో బేసిన్ లోపల ఉన్న ప్రాజెక్టులకు కేటాయించాలి. భారీ విస్తీర్ణంలో కరువు ప్రభావిత ప్రాంతాలున్న నేపథ్యంలో 141 టీఎంసీల్లో 50 శాతాన్ని తెలంగాణకు కేటాయించాలి'అని రజత్ కోరారు.

మిగులు జలాల లభ్యత లేదనడం సరికాదు: వెదిరే శ్రీరామ్

గోదావరిలో మిగులు జలాల లభ్యత లేదనడం సరికాదని టాస్క్‌ఫోర్స్ చైర్మన్ వెదిరే శ్రీరామ్ పేర్కొన్నారు. ఏటా 3 వేల టీఎంసీలు సముద్రంలో కలవడాన్ని చూస్తున్నామని ఆయన అన్నారు. అయితే 75 శాతం డిపెండబిలిటీ ఆధారంగా మిగులు జలాలను నిర్ధారించి ప్రాజెక్టులకు అనుమతులు జారీ చేస్తామని, ఈ లెక్కన మిగులు జలాల లభ్యత ఉండదని సీడబ్ల్యూసీ హైడ్రాలజీ విభాగం డైరెక్టర్ నిత్యానంద రాయ్ చెప్పారు. పోలవరం నుంచి గోదావరి జలాలు తరలించాలని ఏపీ జలవనరుల శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కోరగా శ్రీరామ్ తోసిపుచ్చారు.

ఇచ్చంపల్లికి అటు ఇటుగా ఆనకట్ట

సాంకేతిక అంశాలను పరిశీలించి ఇచ్చంపల్లికి అటు ఇటుగా ఆనకట్ట నిర్మిస్తామని వెదిరే శ్రీరామ్ తెలిపారు. ఆయా రాష్ట్రాల వాటాలు పోగా మిగులు జలాలనే తరలిస్తామన్నారు. సమావేశం అనంతరం తెలంగాణ ఈఎన్‌సీ సి.మురళీధర్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రాజెక్టుకు అన్ని రాష్ట్రాలు సూత్రప్రాయంగా సమ్మతి తెలిపాయన్నారు.

మహిళలకు ప్రతిరోజూ.. గౌరవం దక్కాలి

మార్చి 8 మాత్రమే మహిళా దినోత్సవం కాదు: గవర్నర్ తమిళిసై

- మహిళల పట్ల పరుషంగా వ్యవహరించిన వారికి అందలం
- వారికే అవార్డులు ప్రకటించి సన్మానిస్తుండటం బాధాకరం
- ఇలాంటి చర్యలతో తెలంగాణ మహిళలకు ఏమని సందేశాన్ని ఇస్తున్నారని ప్రశ్న
- రాజ్‌భవన్‌లో జరిగిన మహిళా దినోత్సవంలో గవర్నర్ ఆవేదన



బాలికకు పురస్కారం అందజేస్తున్న గవర్నర్ తమిళిసై

సాక్షి, హైదరాబాద్: మార్చి ఎనిమిదో తేదీ మాత్రమే మహిళా దినోత్సవంగా ఉండకూడదని.. ప్రతిరోజూ మహిళలకు గౌరవం దక్కాలని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ పేర్కొన్నారు. అన్నిచోట్లా సరైన ఆదరణ ఉంటేనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఏదో ఒక్క రోజే మహిళలను గౌరవిస్తూ.. మిగతా రోజుల్లో హేళన చేయడం, అవమానించడం జరిగితే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో సోమవారం రాజ్‌భవన్‌లో వేడుకలను గవర్నర్ ప్రారంభించారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన మహిళలు, విద్యార్థులకు పురస్కారాలు అందించారు. తర్వాత మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే.. ''మహిళల అభ్యున్నతి, సాధికారత కోసం రాజ్‌భవన్ ద్వారా ఎన్నో రకాల కార్యక్రమాలు చేపడుతున్నాం.

ఎన్ని విమర్శలు వచ్చినా..

మహిళల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు మహిళా దర్బార్ కార్యక్రమాన్ని చేపట్టాం. రాజ్‌భవన్ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై ఎన్నిరకాల విమర్శలు వచ్చినా నేను మహిళా పక్షపాతిగా నా సంకల్పంతో ముందుకు వెళ్తున్నా. సంస్కృతి, సాంప్రదాయాలకు కేంద్రమైన తెలంగాణలో ఎవరినైనా ఆహ్వానిస్తే హాజరవడం పరిపాటి. కానీ ఇప్పుడు పరిస్థితి మారినట్టుంది. ఆహ్వానాలకు విలువ ఉండటం లేదు.

మహిళలను అవమానిస్తే.. అవార్డులా?

మెడికల్ పీజీ విద్యార్థి ప్రీతి మరణం వైద్య సమాజానికి తీరని లోటు. ఆమెను పరామర్శించేందుకు వెళ్లిన నాకు అవమానాలు ఎదురయ్యాయి. రాష్ట్రంలో అత్యున్నత స్థాయిలో ఉన్న ఒక మహిళ పట్ల కొందరు అసభ్యకరంగా, అవమానకరంగా మాట్లాడుతుంటే.. వారిపై ఎలాంటి చర్యలు లేవు. పైగా వారిని అందలమెక్కించి అవార్డులు, రివార్డులు ప్రకటిస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. సామాజిక మాధ్యమాల్లో కూడా విమర్శిస్తున్నారు. ఇలాంటి చర్యలతో తెలంగాణ మహిళా సమాజానికి ఎలాంటి సందేశాన్ని ఇస్తున్నారు. ఇలాంటి వాటికి భయపడి వెనుదిరగను. నా పట్ల చూపుతున్న వైఖరిని తెలంగాణ మహిళలు వ్యతిరేకిస్తున్నారు. ఎవరెన్ని రకాలుగా విమర్శించినా, ఎంతగా వ్యతిరేకించినా నా పని నేను చేసుకుంటూ ముందుకు వెళ్తాను. ఎవరికోసం నేను రాజీపడే ప్రసక్తేలేదు''అని గవర్నర్ పేర్కొన్నారు.

సోదరభావాన్ని పెంపొందించే హోలీ

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. రంగుల పండుగైన హోలీ మనుషుల మధ్య సోదరభావం, సమైక్యతను, సమాజంలో శాంతి సౌభ్రాతృత్వాలను పెంపొందిస్తుందన్నారు. ఆనందోత్సాహాల నడుమ రంగులను చల్లుకోవడాన్ని ఉత్సవంగా జరుపుకోవడం ద్వారా జాతీయ సమగ్రతపై మన నమ్మకం, విశ్వాసం బలోపేతం అవుతుందని గవర్నర్ పేర్కొన్నారు.


మహిళలకు ప్రభుత్వం భరోసా

మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్సీ కవిత



తిమ్మాపూర్‌లో ఎమ్మెల్సీ కవిత, మంత్రి సత్యవతి రాథోడ్‌కు ఘన సన్మానం

తిమ్మాపూర్: తెలంగాణలో ప్రతీ మహిళకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మహిళా సంఘాల్లోని 54 లక్షల మందికి రూ.18 వేల కోట్లను ఆర్థిక స్వావలంబన కింద అందిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్‌ఎండీ కాలనీలోని రామ్‌లీలా మైదానంలో రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్, మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన నారీ ప్రభాతభేరి, స్త్రీశక్తి పురస్కారాల కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ కవిత, మంత్రులు గంగుల కమలాకర్, సత్యవతి రాథోడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ మహిళలకు అసెంబ్లీ, పార్లమెంట్‌లో 33 శాతం రిజర్వేషన్లు తీర్మానం చేయాలని సూచించారు. ఈ మేరకు ఈనెల 10న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన దీక్ష చేపడుతున్నట్లు కవిత వెల్లడించారు. మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ బతుకమ్మను విశ్వవ్యాప్తం చేసిన ఘనత కవితకు దక్కిందని కొనియాడారు.



బీఆర్‌కేఆర్ భవన్‌లో జరిగిన మహిళా దినోత్సవంలో పాల్గొన్న సీఎస్ శాంతికుమారి తదితరులు

ప్రతీ రంగంలో మహిళలను ప్రోత్సహిస్తాం

సీఎస్ శాంతికుమారి

బీఆర్‌కేఆర్ భవన్‌లో ఘనంగా మహిళా దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: ప్రతీ రంగంలో మహిళల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) శాంతికుమారి ఉద్ఘాటించారు. సోమవారం బీఆర్‌కేఆర్ భవన్‌లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారతకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణీకుముదిని, ఆర్థిక శాఖ కార్యదర్శి టీకే శ్రీదేవి, ప్రశాంతి, సచివాలయ మహిళా ఉద్యోగ సంఘం నాయకురాలు చిట్టి రాణి, ఎం.మంగమ్మ, ఉమా నాగలక్ష్మి, షైక్ మాలిక, కరుణరెడ్డి, చంద్రకళ, సింధూరి, శైలజ, విజయ నళిని, విజయలక్ష్మి, చందన, అలేఖ్య, స్ఫూర్తి పెద్దఎత్తున మహిళా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



తెలంగాణ భవన్‌లో మహిళలను సత్కరిస్తున్న గుండు సుధారాణి, విజయలక్ష్మి తదిరులు

మహిళా అభ్యున్నతికి సీఎం కృషి

- వరంగల్ మేయర్ గుండు సుధారాణి
- తెలంగాణ భవన్‌లో మహిళా దినోత్సవ వేడుకలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ భవన్‌లో వరంగల్ మేయర్, బీఆర్‌ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు గుండు సుధారాణి నేతృత్వంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళా అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. మహిళలకు అండగా నిలిచేందుకే కల్యాణలక్ష్మి, కేసీఆర్ కిట్, గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్, ఒంటరి మహిళలకు పెన్షన్లు వంటి పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. మహిళల భద్రత కోసం 2014లోనే షీటీమ్స్ ఏర్పాటు చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. ఎమ్మెల్సీ వాణీదేవి మాట్లాడుతూ మహిళలు సవాళ్లను ఎదుర్కొని అన్ని రంగాల్లో రాణించినప్పుడే గుర్తింపు ఉంటుందన్నారు. హైదరాబాద్ నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ పురుషులతో సమానంగా పోటీ పడుతున్న మహిళలు ఎన్ని ఆటంకాలు ఎదురైనా ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో విశేష సేవలందించిన మహిళలను సత్కరించారు. కేంద్ర ప్రభుత్వం 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని కోరుతూ తీర్మానించారు. కార్యక్రమంలో హైదరాబాద్ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, వరంగల్ జిల్లా పరిషత్ చైర్మన్ గండ్ర జ్యోతి, జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.